
25 నయాపై
16-2-'6
వర్ణాంతర వివాహాలు



ఊ హా శా లి

వి. తీతు (కర్నూలు)

తెలుగు పత్రికలన్నిటిలోనూ ఆంధ్రసచిత్ర వారపత్రిక
సర్క్యులేషన్ అత్యధికమైనది!

ఉత్తరాలు

ముఖచిత్రం

9—2—62 ఆంధ్రపత్రిక ముఖచిత్రంలో తలుపుకు రెండు తాళపుచెవులున్నాయి. సామాన్యంగా ఒక తాళంబుర్రకు రెండే చెవులుంటాయి. అందువల్ల తలుపు, వెలుపలినుంచి వచ్చినవారే తీసిఉండవలెను. ఎందుకనగా అంతకు మునుపే తాళము తీసియున్నఎడల తాళపుచెవులు అచటనే ఉంచరు. కావున వెలుపలినుంచి వచ్చిన అతను లోపల తనభార్య ఉండునేమో అని భయపడనవసరములేదు. అందుచే నాకు కల్గిన సందేహము సబబేనేమో తెలుసుకొనగోరుచున్నాను.

దుర్భా సుబ్రహ్మణ్యం (పాదిరి)

బయటనుంచీ లోపల నుంచీ కూడా తెరిచేందుకు వీలైన తాళాలు ఉన్నాయి.

* * *

9—2—62 సంచికలో 'ముఖచిత్రం' కింద 'సత్యమూర్తి' అని వ్రాశారు ! అంటే ఆ బొమ్మలో (పురుష) వ్యక్తి ఎవరైనట్లు?

ఏమో !

ఇ. వి. రామస్వామి (మద్రాసు)

హమేషా-తమాషా

దేశమనగా మట్టి కాకపోయినా మానవులు మట్టిమీదనే నివసింతురు. కాని రెడ్డిగారు వ్రాసిన పద్యము ప్రకారము మానవులు జలములో లేక అంతరిక్షంలో వ్యవహరించాలన్నమాట ! అంతేగాక చైనావారు దేశము నాక్రమిస్తున్నా మనము మాట్లాడకుండా నోరు మూసుకోవాలన్నమాట ! అదే ఆయన పద్యార్థము.

సి. ఎస్. గోపాలకృష్ణ (రాజమండ్రి)

* * *

26—1—1962 పత్రికలో శ్యామ్‌గారు 'మా' తథాకా చూపడం కోసం అల్లసాని పెద్దనను మల్లసాని పెద్దనను చేసి చాల శ్రమపడ్డట్టుంది. కవిత్వము చేయుటకు కవులకు అన్ని సదుపాయములు ఉండవలెనన్నది వాస్తవమయితే కలవారందరూ కలము పట్టరా ? ఆధునిక కవు లందరూ పై చెప్పిన సదుపాయాలన్నీ ఉండియే వ్రాస్తున్నారా ?

కె. మారుతిప్రసాద్ (అనంతపుం)

* * *

మల్లసాని పెద్దన 'ఎవరండోయ్' కాస్త తెలియజేద్దురూ ! పుణ్య ముంటుంది ! పాపం ప్రాస కుదరక అల్లసాని పెద్దనకు బదులు మల్లసాని పెద్దన అని వ్రాసినట్టున్నారు అవునా ?

వై. వెంకటరామశాస్త్రి (భీమవరం)

చదువ్రులావు

రోజురోజుకు మీ చదువ్రులావు బాగ నవ్విస్తున్నాడండి.

— షేక్‌మస్తాన్‌వలి (విజయవాడ)

* * *

ఢిల్లీ లేఖ

19—1—62 తేదీ పత్రికయందలి శ్రీ కృష్ణగారి విమర్శ చదివాను. ఏదో ఒక నెపముపైన బ్రాహ్మణులను అసందర్భవిషయములలో రచ్చకీడ్చుట ఆయనకు పరిపాటి అయిపోయినది. ఒక పత్రికయొక్క స్థాయి, అది అవలంబించు నిష్పక్షపాత విమర్శనాపద్ధతిపై విశేషముగ ఆధారపడి యుండునని గమనించ ప్రార్థన.

శ్రీ కృష్ణగారి అసూయాపూరితములైన విమర్శలు శిరోవేదనను కలిగించుచున్నవి.

టి. కె. సంతానం (అనంతపురం)

సందేహం

మీరు చాలామంది పాఠకుల సందేహాలకు 'మీరే ఆలోచించిచూడండి' అని సమాధాన మిస్తున్నారు. దీనినిబట్టి మీ పాఠకులు అజ్ఞులనీ, ఆలోచించకుండా సందేహాలు వెలిబుచ్చేవారనీ మీ నిశ్చితాభిప్రాయమని అభిప్రాయపడుతున్నాను. ఇది సరియైనదేనేమో !

మీరే ఆలోచించి చూడండి.

'నరకేసరి' (వాల్తేరు)

మీ సలహాకు కృతజ్ఞులము!

* * *

ఆంధ్రపత్రిక ప్రచురించినవాటిలో కొన్నిటిని గురించిన సంపాదకుల పరిచయవాక్యాలు మాకు తెలిసినంతవరకూ ఈవిధంగా ఉన్నాయి :

.... మాకు తెలిసినంతవరకు ఒక యావజ్జీవిత ఖైదీ నాటకం రాయటమూ, దానిని ప్రచురించటమూ ఇదే మొదటిసారి.

మాకు తెలిసినంతవరకు ముగ్గురు రచయితలు కలిసి ఒక కథ రచించి పంపటం ఇదే మొదటిసారి.

మాకు తెలిసినంతవరకూ ఒక గ్రంథంపైనఇంత తీవ్రంగా చర్చజరగటం ఇదే మొదటిసారి.

మాకు తెలిసినంతవరకూ ఒక నటి ఇంకొక నటిని గురించి వ్యాసం రాయటం ఇదే మొదటిసారి.....,

ఇక మా మాట—

.... మాకు తెలిసినంతవరకూ 'ఆంధ్ర సచిత్ర వారపత్రిక' ఇంతగా బహుళజనాదరణ పొందటమూ, దానిస్థాయిఇంత తగ్గటమూఇదేమొదటిసారి.

పార్థసారథి, సోమసుందరం (వాల్తేరు)

కాంగోనుంచి సమాధానం

"పాఠకుల, విమర్శలకు సదుద్దేశముతో ప్రత్యుత్తరములిచ్చుట రచయితల విధిగా భావించుతూ ఈ ఉత్తరము వ్రాస్తున్నాను. 19–1–62 పత్రికలో ఉత్తరాలశీర్షికలో "ఎవరి భయము వారిది" అను కథకానికథపై, ఎం. ఎస్. కిని (మద్రాసు) గారు సూచించిన బెంగుళూరు మెయిల్ కాలము వాస్తవమై యుండవచ్చు. కారణమేమనగా అది మెయిలో, ప్యాసింజరో నాకు అంతగా గుర్తులేదు. పైగా 11 సంవత్సరముల నాటి సంఘటన కాబట్టి, ఒకవేళ నేనే పొరబడి ఉండవచ్చును. ఎం. ఎస్. కినిగారికి నా కృతజ్ఞత తెల్పుతూ, పాఠకులు సదభిప్రాయముతో నన్ను మన్నింతురని కోరుతున్నాను.

డి. వెంకటేశ్వరులు (కాంగో)

సినిమా

రామారావుగారి చొక్కామీద "కత్తి డాలు" గుర్తు వేయటం ఆయన జానపదచిత్రాలలో కూడ 'హీరో' అని తెలియజేయడం బాపుగారి ఉద్దేశ్యమేమో. మొత్తానికి 'కార్టూన్' చాల బాగున్నది.

గొల్లపూడి రాజేశ్వరి (తెనాలి)

* * *

మనవాళ్ళలో సినిమావెర్రి వెయ్యితలలు వేస్తున్నది. గుంతకల్లులో టెన్నిసుకోర్ట్ ప్రారంభోత్సవం రేలంగి, గిరిజ చేశారు. టెన్నిసుకోర్ట్ పొడుగు వెడల్పు తెలియనివాళ్ళను తీసుకురావటం శోచనీయం. ఇటువంటి పనులవల్ల తెలుగువాళ్ళు విచక్షణాజ్ఞానం కోలుపోతున్నారేమో అనిపిస్తున్నది.

ఆర్కే (హైదరాబాదు)

కథలు

శ్రీ ఆర్. ఎం. చిదంబరంగారు వ్రాసిన కథని చదువుచున్నంతసేపు నిజంగా జరుగుతున్నట్లుగా అనుభూతిపొందిన నాకు కథ అయిన తరువాత కాని కథ అని తెలియలేదు. హృదయాన్ని కదిలించివేసింది రుక్కు పాత్ర. కథ పూర్తి అయ్యేవరకూ కండ్లవెంట నీళ్ళు కారుతూనే ఉన్నాయి.

అయ్యగారి కనకవల్లి (ఏలూరు)

* * *

శ్రీ చిదంబరంగారు వ్రాసిన రాగద్వేషాలు ఈ వారము అన్ని కథలకన్నను చాల బాగుంది.

భట్లపెనుమర్తి శర్మ (విజయవాడ)

'మామి' అనే కథ బాగానేఉంది. కాని రచయితగారికి సంగీతం గురించి అట్టే తెలియదనుకుంటా. ఎందుకంటే నీలకంఠం భజేహంయొక్క రాగము కేదారగౌళ. అంతే కాని ఆనందభైరవికాదు. ఇంకా ఒక తప్పు కూడ వ్రాశారు. అదేమంటే దక్షాధ్వరమీశ్వరం కేదారగౌళ ప్రియకరం అనే పదజాలం చరణంలో వస్తుంది. దాని తరువాత చిట్టస్వరం వస్తుంది.కాని తిరిగి చరణం రాదు.

కుమారి వి. రమాదేవి (హైద్రాబాదు)

కవిసార్వభౌముడు

బహు గ్రంథకర్తలు, కవి పండితశ్రేష్ఠులు నగు బ్రహ్మశ్రీ నోరి నరసింహశాస్త్రిగారు రచించిన కవిసార్వభౌముడు "ఆంధ్రపత్రిక"కే గాక ఆంధ్రజాతికే శోభాయమానంగా నొప్పుచు 12—1—62 తేదీని నడపిన గ్రంథము యావత్తు రచనకే శోభగూర్చి పరిషత్తులో కవిసార్వభౌముని గంభీరోక్తుల నెప్పుడు విందుమా యని ఉవ్విళ్ళూరించుచున్నది.

తెలుగుజాతి ప్రశస్తిచాటు ఇట్టి పటిష్ఠమగు రచనలు సంపాదించగలిగిన మీకు మనఃపూర్వక అభివందనములు.

శిరంచంద్రగుప్త (కొల్నూరు) ★

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

విషయానుక్రమణిక

శుక్రవారం : *16-2-62*
ప్లవసం॥మాఘమాసం శు॥ద్వాదశి
సంపుటము : 54 సంచిక : 24

స్థాపితము:
1908

*

ముఖ్య సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

విడిప్రతి : 25 న. పై
సంవత్సర చందా : 13-0-0 రు.

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టివీధి, మద్రాసు-1




ముఖచిత్రం : సావిత్రి

★


లోకంపోకడ



"ఎన్నికల్లో గెలవటమేమీ కష్టంకాదు! అందుకు కావలసిన డబ్బు, పలుకుబడి మనకు పుష్కలంగా ఉన్నాయి. కాని తీరా పార్లమెంటుకు వెళ్లింతరువాత– ఇంగ్లీషులో మాట్లాడటం ఎలాగా అనే నా దిగులు."



ఎంత ఘోరం! శ్రీ నెహ్రూ బలప్రయోగం చేయటమా!!
అమెరికాలోని విమర్శకులు
సిక్కుల పట్ల వివక్షత
కుట్ర
కుమ్ములాటకు అవకాశం
భారత కమ్యూనిస్టుపార్టీలో జాతీయవాదులు
భారత కమ్యూనిస్టుపార్టీలో చైనాభక్తులు
కార్యదర్శిపదవి



ఆరబ్‌రిపబ్లిక్ ఉపాధ్యక్షుడు ఫీల్డ్‌మార్షల్ అబ్దుల్ హకీమ్ అమర్ ఇటీవల న్యూఢిల్లీ వచ్చినప్పుడు రక్షణశాఖమంత్రి శ్రీ కృష్ణమీనన్, ఉపమంత్రి శ్రీ రఘురామయ్యగార్లతో.

ప్రభుత్వ కార్యాలయాల్లో "షవర్ బాత్" సదుపాయాలు:

పాకిస్తాన్ దుస్తంత్రానికి భారత్ ప్రతిఘటన

శ్రీ కృష్ణ

సూయజ్ కాలువకు ఈవల ఉన్న జనాభా తాలూకు మడ్డి మనుష్యులలో భారతీయులది అగ్రతాంబూలం అని శ్రీ జయప్రకాష్ నారాయణ్ ఇటీవల అన్నారు. ఇండియా మార్కు ప్రజాస్వామ్యం పుణ్యమా అని అపరిశుభ్రతకు తోడు మాంద్యం కూడా ప్రజలను ఆవహించింది. ఉదాహరణకు ప్రభుత్వ భవనాలనే తీసుకోండి. వీటి నిర్వహణకు ఏటా సుమారు రు. 2 కోట్లు ఖర్చు అవుతున్నది. చీఫ్ ఇంజనీర్ ఆధ్వర్యాన ఉద్యోగుల సైన్యం ఇందు నిమిత్తం ఏర్పడింది. మరి ఈ ధనమంతా ఎందుకు వృథా అవుతున్నట్టు ? వాణిజ్యశాఖ భవనంలోని స్నానాల గదులలో "షవర్లు" నెలకొల్పారు. "బాబు" తెగవారు ఇంతవరకు ఆఫీసు వేళలలో భోజనాలు చేస్తూ, భోజన వేళలలో వాలీబాల్ ఆడుతున్నారు. ఇప్పుడు "షవర్‌బాత్" కూడా ఆఫీసులోనే పూర్తి చేసుకోవచ్చు. ఇక పాకీ దొడ్ల సంగతి చెప్ప నవసరమే లేదు. నడవాలలోంచి వెళ్ళేవారిని సుగంధం ముంచెత్తుతుంది. పరిస్థితులు ఇలా దిగజారిపోతున్నా చూస్తూ ఊరుకోవలసిందే. కాంగ్రెసు పార్టీకి వచ్చే వోట్లు తగ్గిపోయే ప్రమాదం కల ఏ పనీ చేయరాదని పైనుంచి ఉత్తరువు వచ్చినప్పుడు ఎవరు మాత్రం చేయ కలిగింది ఏముంటుంది చెప్పండి !

బ్రిటన్‌లో రాజకీయ, ఆర్థిక ప్రణాళికా సంస్థ అంటూ ఒకటి ఉన్నది. ఈ సంస్థ బ్రిటన్‌లో ఉన్న భారతీయ విశ్వవిద్యాలయాల విద్యార్థులను గూర్చి దర్యాప్తు జరిపి, వారి స్థితిగతులను వివరించింది. ఈ దర్యాప్తువల్ల తెలియవచ్చిన విషయాలలో దిగువ అంశం ఒకటి.

"బ్రిటిష్‌వారు సమర్థతకు, కర్తవ్య పాలనాభిలాషకు, శ్రమించి పనిచేసేందుకు, నిజాయితీకీ మన్ననలు పొందారు. భారతీయులు వీటికి పూర్తిగా భిన్నమైన లక్షణాలు కలవారుగా ప్రసిద్ధులయ్యారు. చేయవలసిన పని సకాలంలో చేయకపోవటం, అసమర్థత, బంధుప్రీతి, దురభిమానం, అవినీతి, నిజాయితీ లేకపోవటం వీరిలో విస్తృతంగా కనిపిస్తాయి."

ఒక విద్యార్థి ఈ విషయాల నన్నిటినీ ఉదాహరణపూర్వకంగా వివరించాడు.

"ఈ దేశంలో అన్నీ సాఫీగా జరిగిపోతాయి. ఇక్కడి ప్రజలు సమర్థులు. తాము చేసే పనులకు ప్రతిఫలం లభిస్తున్నదని జ్ఞాపకం ఉంచుకొని ఆ పనులు పూర్తి చేస్తారు. భారతదేశంలో తమ పని తాము చేయవలసి వచ్చినా ఇతరులను ఉద్ధరిస్తున్నట్లు భావిస్తారు. ఇక్కడ ఒక సంస్థకు గాని, వ్యక్తికి గాని ఉత్తరం వ్రాస్తే వెంటనే సమాధానం వస్తుంది. అదే భారతదేశంలో నైతే (లండన్‌లో ఉన్న ఇండియా హౌస్ సహా) ఎన్ని "రిమైండర్లు" వ్రాసినా సమాధానమే ఉండదు. మీ వ్యవహారం మామూలుగా జరిగిపోవలసినదే అయినా "బడాబాబు" (పై అధికారి) మొదలుకొని బంట్రోతు వరకు అందరినీ మంచి చేసుకుంటేనే సానుకూల మవుతుంది. ఇక్కడ గ్రంథాలయాలలో ఏదైనా పుస్తకం కావలసి వస్తే మీకు సహాయపడి వెతికిస్తారు. ఆ పుస్తకం ఆ గ్రంథాలయంలో లేకపోతే మరొక గ్రంథాలయం నుంచి తెప్పించి ఇస్తారు. అక్కడా లేకపోతె కొని యిస్తారు. భారతదేశంలో నైతే పుస్తకం షెల్ఫ్‌లో లేకపోయిందా, ఇక మీరు దాన్ని మర్చిపోవల్సిందే.

మరొక విద్యార్థి ఏమంటున్నాడో వినండి:

"ఇక్కడ బహిరంగ సభలలో ప్రసంగాలు నాకు నచ్చుతాయి. సభలు సకాలంలో ప్రారంభ మవుతాయి. కొద్దిపాటి ఉపోద్ఘాతంతో వక్తను సభికులకు పరిచయం చేస్తారు. అతడు తాను చెప్పదలచిన విషయాలు నాలుగూ సుమారు ఒక గంటలో చెప్పేస్తాడు. నాలుగు ముక్కలతో అతనిని అభినందించి వందన సమర్పణం చేస్తారు. ఇక భారతం దేశంలో సంగతి. అసలక్కడ సభలు వేళకు ప్రారభం కావు. వక్త ఒక్కొక్కప్పుడు దాదాపు గంట ఆలస్యంగా కూడా వస్తాడు. వచ్చిన తరువాత ఆయనకు పూలహారాలు వేసి స్వాగతం చెప్పి, సుదీర్ఘోపన్యాసాలతో ఒకరో ఇద్దరో సభికులకు పరిచయం చేస్తారు. అటుతరువాత ఆ వక్త తనకూ సభికులకూ ఆయాసం కలిగే వరకూ ఆశువుగా అర్థం పర్థం లేని ఉపన్యాసం దంచుతాడు. ఆపిదట ఆయనను అభినందిస్తూ మరొకరు దాదాపు అంత ఉపన్యాసం చేస్తారు. ప్రతివారూ వేదిక

—62వ పేజీ చూడండి



తెర వెనుక రంగభాష్

"ఉద్యోగం ఎలా సంపాదించాలి ? అన్న ప్రశ్న అప్పటికీ ఇప్పటికీ—ఎప్పటికీ కూడా, జీవితంలో అడుగుపెట్టబోయే యువకుల్ని పెనుభూతంలా ఎదుర్కొంటుంది" అన్నాడు ప్లీడరు కైలాసరావు.

"అయితే యువతుల మాటో ?" అని అడ్డు ప్రశ్న వేశాడు కైలాసరావు మేనల్లుడు శ్యామలరావు.

"ఆ సందేహం నీకు వస్తుందని నాకు ముందే తెలుసు. అసలు నీ మనస్సులో వారికే ప్రాముఖ్యత. కానీ, కాస్సేపు వాళ్ల మానాన వాళ్లని వదిలెయ్యి. ఆడవాళ్ల సంగతి నీకు తెలియదు. పైకి మగవాళ్లతో 'సమానహక్కులు కావాలి' అని అన్నా, మగవాళ్ల కన్నా వాళ్లకే హక్కులు ఎక్కువ ఉన్నాయనీ, ఎక్కడికి ఏ పనిమీద వెళ్లినా ముందు వారికే ప్రత్యేక గౌరవం లభిస్తుందనీ వాళ్లకి తెలుసు. కాబట్టి ఆ ప్రశ్న వాళ్లని, అంతగా బాధించదు. అసలు ఆమాటకొస్తే, నువ్వు నా మేనల్లుడివి కాక — మేనకోడలువి అయిఉంటే ఈపాటికి అరడజను ఉద్యోగాలు వేయించేసి ఉందును."

"సారీ మామయ్యా! ఇన్నాళ్లూ నే ననుకున్నది ఒక్కటీ జరగకపోవడానికి కారణ మేమిటా ? అని తెలుసుకోలేక బాధపడుతూ ఉండేవాడిని. ఇప్పుడు తెలిసింది. అసలు నా పుట్టుకలోనే లోపం ఉందన్నమాట !" అన్నాడు, శ్యామలరావు తను మగాడిగా పుట్టినందుకు ఎంతో పశ్చాత్తాప పడుతూ.

"అదొక్కటే కాదురా, అసలు ఉద్యోగం సంపాదించాలంటే, తెర వెనుక ప్రయత్నాలు చాలా ఉండాలి."

"అంటే ?" అని మళ్లీ ఇంకో ప్రశ్న వేశాడు శ్యామలరావు.

కైలాసరావు సిగరెట్టు వెలిగించి రెండు దమ్ములు లాగాడు. శ్యామలరావు వైపు ఒకసారి చూసి చిన్న చిరునవ్వు నవ్వి "అంటే — సినిమాలో బొమ్మ పడాలంటే, ఆ బొమ్మకి, తెర మీద కన్పించే ముందు ఎంత మేకప్, ఎంత డైరక్షన్, ఎన్ని రిహార్సల్సూ కావాలో అలాగే ఉద్యోగ రంగంపై ప్రవేశించేముందు, అనేక రకాల ప్రయత్నాలు చేసి, మనం తప్పకుండా ఇంటర్వ్యూలో సెలక్టు అవుతామూ అని తెలిశాకే ఇంటర్వ్యూకి వెళ్లాలి."

"ఆ ప్రయత్నా లేమిటో చెప్పు మామయ్యా, నేనూ చేస్తాను" అన్నాడు శ్యామలరావు, చాలా ఆతృతతో.

కైలాసరావు ఒక్కనిముషం మాట్లాడకుండా, శ్యామలరావు వైపు తీక్షణంగా చూసి, "నీకు తెలివి అనేది కొంచెం కూడా లేదురా. ప్రయత్నా లనేవి, ఫలానా పద్ధతిలో చెయ్యాలి— అని ఎక్కడైనా ఉంటుందా ? ఆయా పరిస్థితుల్ని బట్టి, మనం ఎటువంటి ప్రయత్నాలు చెయ్యాలో ఆలోచించి చెయ్యాలి" అన్నాడు.

"నిజమే మామయ్యా. పోనీ ఏదైనా ఒక ఉదాహరణ చెప్పు. అది నా దృష్టిలో ఉంచుకొని, అటువంటి ప్రయత్న మేదైనా చెయ్యడానికి ప్రయత్నిస్తాను."

కైలాసరావు ఒక గట్టి దమ్ము లాగి, సిగరెట్టు నగం కాలి పోయేట్లు చేశాడు. సాధారణంగా, పెద్ద కేసులో ఏదైనా చక్కని లాపాయింటు కోసం ఆలోచించినప్పుడు—అంత గట్టి దమ్ము లాగడం అతని కలవాటు. దమ్ము లాగగానే "మధ్యవర్తి !" అన్నాడు కొంచెం పెద్ద గొంతుకతో. శ్యామలరావు తెల్లబోయాడు. కైలాసరావు మళ్లీ "మధ్యవర్తిరా, మధ్యవర్తి ! అంటే ఆ ఉద్యోగం ఎవడిస్తాడో, వాడిని ఒక మధ్యవర్తి ద్వారా పట్టుకోవాలి. దానికోసం, ముందర ఆ మధ్యవర్తిని పట్టుకోవాలి."

"ఎలా పట్టుకోవడం ?" అన్నాడు శ్యామలరావు ఆలోచిస్తూ, తనలో తను ప్రశ్న వేసుకుంటున్నట్లు.

"నాస్సెన్సు ! డబ్బురా, డబ్బు ! అది పారేసి మధ్యవర్తి ద్వారా వ్యవహారం నడిపించాలి" అని కైలాసరావు అన్నాక అసలు విషయం బోధపడింది, శ్యామలరావుకి.

"అయితే మధ్యవర్తి ద్వారా లంచమిచ్చి ఉద్యోగం సంపాదించా లంటావు" అన్నాడు శ్యామలరావు, "ఇంతేనా !" అన్నట్లు.

"అదే నబ్బాయి. అది ఎంత విలువైన సలహాయో, ఆచరించాక గాని తెలియదు" అన్నాడు, ఫీజేమీ లేకుండానే సలహా నిచ్చేస్తున్నానే—అని విచారిస్తూ, కైలాసరావు.

శ్యామలరావు కొంచెం ఆలోచించాడు. కైలాసరావు, చనువు కొద్దీ మేనల్లుడ్ని, తెలివితక్కువ వాడిగా జమ కట్టేసి మాట్లాడినా, శ్యామలరావు మరీ అంత బొత్తిగా తెలివిలేనివాడు కాదు. ఇరవై రెండేళ్ల గ్రాడ్యుయేట్ అయిన అయిన శ్యామలరావు, సుమారు రెండు సంవత్సరాలనుంచీ, విశాఖపట్నం మహానగరంలో ఉద్యోగాన్వేషణకై నానా తిప్పలూ పడి కొంత ప్రపంచజ్ఞానం సంపాదించాడు. ప్రస్తుతంలో, మద్రాసులో జరుగబోతున్న ఒక ఇంటర్వ్యూకి వెళ్తూ, రాజమండ్రిలో నున్న మేనమామ కైలాసరావు ఇంట ఎద్దు ఒకరోజు గడుపుటకు, రాజమండ్రిలో దిగాడు. తను ఉద్యోగం గురించి ఎన్ని విధాలుగా అవస్థ పడుతున్నదీ, మేనమామకు చెప్పాడు.

ఉద్యోగం అనేది ఎలా సంపాదించాలో, దానికి కావలసిన లక్షణాలేమిటో, కొంతవరకు అల్లుడికి బోధపరుద్దామనే ఉద్దేశంతో ఈ సంభాషణ ప్రారంభించాడు. ఎనభై ఏళ్ళ పైబడ్డ ప్లీడరు కైలాసరావు. అతని ఉద్దేశంలో మనం సాధించవలసిన పని మంచిదైనప్పుడు, దానిని సాధించడం కోసం ఎటువంటి మార్గ మవలంభించినా తప్పులేదు. అది వ్యవహార ధర్మమంటాడు. తను పట్టిన కేసును గెల్పించటానికి ఎటువంటి అబద్ధాలాడడానికైనా వెనుదియ్యడు. ఉద్యోగం సంపాదించటానికి, కేవలం ప్రతిభే ప్రధానం కాదనీ, కొన్ని తతంగాలు జరిపితే కాని ఉద్యోగం లభించదనీ, అతని వాదం. శ్యామలరావు, కైలాసరావు చెప్పిన మాటలన్నీ విన్నాడు.

"నే నొక సంగతి చెప్పనా, మామయ్యా !" అని శ్యామలరావు అడిగాడు. కైలాసరావు చెప్పమన్నాడు.

"మా వూళ్లో, నేను ఏడాది క్రిందట ఒక ఉద్యోగానికి ప్రయత్నం చేశాను. అది కాస్త మంచి ఉద్యోగమే. దానికి కావలసిన మనిషిని నియమించే అధికారి కూడా ఆ వూళ్లోనే ఉన్నాడు, అదే అతని హెడ్ క్వార్టర్సవటం మూలాన. ఆ అధికారి, వట్టి లంచగొండి అని పుకారు."

"నేనా ఉద్యోగానికి దరఖాస్తు పడేశాను. నాతో పాటు సుమారు పాతికమందికి ఇంటర్వ్యూకి పిలుపు వచ్చింది. ఆ ఉద్యోగా న్నెలాగైనా సంపాదించాలని నాకు అభిప్రాయం కలిగింది. మా అమ్మకి నచ్చజెప్పి, నాలు గొందల రూపాయలు, లంచమివ్వటానికి సిద్ధం చేశాను. అయితే, లంచ మివ్వట మెలా ? — అన్నదే సమస్య. అప్పటికి ఇంటర్వ్యూ ఇంకా వారం రోజులు వ్యవధిలో ఉంది. ఆ ఆఫీసరుతో సన్నిహితంగా తిరిగేవా ళ్లెవరా ? అని వాకబు చేశాను. మా ఊళ్లో సీతాపతి గారని ఒక ప్లీడరుగా రున్నారు. ఆయనకూ, ఆ ఆఫీసరుకీ చాలా స్నేహం అని విన్నాను. నేను రెండు, మూడు సార్లు ఆఫీసరు గారితో సీతాపతిగారు, కారులో తిరగడం కూడా చూశాను. అందువల్ల సీతాపతి గార్ని పట్టుకుంటే తప్పకుండా పని అవుతుందనే నమ్మకం నాకు కలిగింది."

"ఒకనాడు ప్రొద్దున్న, పని గట్టుకుని సీతాపతిగా రింటికి వెళ్లాను. ఆయన నన్ను చూసి 'ఏం' పనిమీద వచ్చా ?' వని అడిగారు. నేను ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాననీ, నాకు ఆ వూళ్లో ఒక ఉద్యోగానికి ఇంటర్వ్యూకి రమ్మని వచ్చిందనీ, కాని సుమారు పాతికమంది ఆ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నారనీ విన్నాననీ, ఉన్న దొక్కటే ఖాళీ అవటంవల్ల నాకు వస్తుందో, రాదో అని బెంగగా ఉందని చెప్పాను. ఈ విషయంలో ఆయన సహకారం కావాలని, అర్థించాను. ఆ యనకీ ఆఫీసరుకీ స్నేహం ఒట్టే ఆయన తల్చుకుంటే అయి

—56 వ పేజీ చూడండి

కథ కాని కథ

తగిన శాస్తి
(మొదటి బహుమతి)

నేను, మా తమ్ముడు కలిసి ఒకరోజు సాయంత్రం బజారుకు వెళ్ళాము. అన్ని కొట్లు చూచినతర్వాత ఒక పెన్నులషాపు వద్దకు వచ్చాము. మా తమ్ముడు పెన్ను కొనియ్యమని మారాముచేయగా ఒక మంచి పెన్ను కొని, వాడిజేబులో పెట్టి జాగ్రత్త అని చెప్పాను. ఇంటికి వెళ్ళేటప్పుడు సిటీ బస్సులో ఎక్కాము. జనం చాలా కిక్కిరిసి ఉన్నారు. మా తమ్ముడిని పెన్ను జాగ్రత్తగా ఉంచమని చెప్పాను. కాని వాడు నా మాట వినిపించుకోలేదు. వాడు ఎంత మెలకువతో ఉన్నాడో తెలుసుకోడానికి, మెల్లగా వాడి జేబులోనుంచి పెన్నుతీసి నా జేబులో పెట్టుకొన్నాను. మేము బస్సు దిగేచోటు వచ్చింది. బస్సు దిగాక వాడిని పెన్ను ఉన్నదా లేదా చూసుకోమన్నాను. వాడు జేబులు తడుముకొని బిక్కమొహం వేసాడు. వాడ్ని చూసి నేను నవ్వుతూ నా జేబులో చెయ్యిపెట్టి చూశాను. ఇంకేముంది! నా జేబులోకూడా పెన్ను లేదు. నా అశ్రద్ధకు నేను సిగ్గుపడ్డాను. నా స్థితి చూసి మా తమ్ముడుకూడా నవ్వసాగాడు.

టి. యస్. రామచంద్రరావు,
(సికింద్రాబాదు)

* * *

తెల్లబోయిన బావ
(రెండవ బహుమతి)

మా యింట్లో ఐదుగురే మెంబర్లు. మా నాన్నగారు, అమ్మ, అక్కయ్య, నేను, మా చెల్లెలు. అక్కయ్యకు పెళ్ళైంది. కాని ఇంకా కాపురానికి వెళ్ళలేదు. బావగారు హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నారు. ఆయన నాన్నగారికి, అక్కయ్యకు ఇద్దరికీ ఉత్తరాలు వ్రాస్తూవుండేవారు. నాన్నగారికి వ్రాసిన ఉత్తరాలన్నీ చదివేది మా చెల్లెలు. ప్రతి ఉత్తరంలో మా బావగారు చివర వగయిరా ఖులాసా అనుకుంటాను అని వ్రాసేవారు. మా చెల్లెలు ఆ వగయిరాలకు అర్థం ఏమిటని అడిగేది నాన్నగారిని. ఆయన రేపు పండుగకు మీ బావ వస్తారుగా ఆయన్నే అడగమనేవారు. సంక్రాంతిపండుగ రానే వచ్చింది. బావగారు వచ్చారు. భోగిపండుగనాడు తలంట్లు, భోజనాలు అన్నీ అయినాయి. సావిట్లో నాన్నగారు, బావగారు, నేను కూర్చుని సరదాగా కబుర్లాడుకొంటున్నాము. మా చెల్లెలు ఒక ఉత్తరం తీసుకొని వచ్చి "బావా! బావా! ఈ ఉత్తరములో "మీరు, అత్తగారు, కమలం, రామం వగైరా కులాసాగా వున్నారనుకుంటాను" అని వ్రాశారుగదా మా యింట్లో ఉన్న అందరూ తెలిశారుగాని ఆ మిష్టరో, ఆ మిసెసో వగయిరా గారెవరండీ తెల్పుతారా" అంది. మా నాన్నగారు ఫక్కున నవ్వారు. నాకు ఆపుకుందామన్నా ఆగలేదు నవ్వు. బావగారు చప్పున సమాధానం ఇవ్వలేక పోయారు. సిగ్గువేసినట్లుంది ఆయనకు. పచ్చి వెలక్కాయ గొంతునపడినవాడికిమల్లే ఆయన కేమీ పాలుపోక తెల్లముఖం వేశారు. కమల ఒకటే నవ్వటం.

ఆనాటి మా బావగారి పరిస్థితి చూస్తే ఈనాటికిగూడా నవ్వు వస్తూనే వుంటుంది. ఆయన ఎప్పుడు మా ఇంటికి వచ్చినా మా అక్కయ్యను మిసెస్ వగైరాగారూ మీవారు వచ్చారు అంటుంది మా చెల్లెలు. అందరూ నవ్వుకుంటూ వుంటాము. మా అక్కయ్యకు మాత్రం కోపం వస్తూంటుంది.

రామకృష్ణ, (బందరు)

* * *

పానిపట్టు యుద్ధం
(రెండవ బహుమతి)

అవి నేను రెండవఫారమ్ చదివేరోజులు. అథము, శుభము తెలియనికాలం. మరునాడు డి. ఇ. ఒ. గారి ఇన్స్పెక్షను కావటంవల్ల ఆరోజు తను చెప్పే పాఠము శ్రద్ధగా వినవలసినదని, దానిలోనే మరునాడు ప్రశ్నలు వేస్తానని పంతులుగారు 'పానిపట్టుయుద్ధము' గురించి మొదలెట్టారు. ఇంతలో నా ప్రక్కనున్న రాము, కుడిచేతి చిటికినవేలెత్తి నిలుచున్నాడు. 'పోరా, వెధవా!' అని కసిరారు పంతులుగారు.

ఇన్స్పెక్టరుగారు మా క్లాసుకొచ్చేరు. ముందురోజు జరిగిన పాఠములోనే ప్రశ్నలు వేస్తున్నారు. "పానిపట్టు యుద్ధ మెప్పుడు జరిగింది? అబ్బాయీ నువ్వు చెప్పు" అని రామునే అడిగారు. వెంటనే వాడు సంకోచించకుండా "నిన్న నేను ఒంటివేలు చూపి బయటకు వెళ్ళినప్పుడు" అన్నాడు. అంతా గొల్లుమన్నాము—మా పంతులుగారు తప్ప.

టి. వెంకటరావు, (మద్రాసు)

* * *

చెల్లాయి భక్తి
(రెండవ బహుమతి)

ఒకరోజున మా యింట్లోవాళ్ళందరూ మాట్లాడుకుంటూ తిరుపతి వెంకటేశ్వర స్వామివారి మహోత్సవమునుగురించి ఎవరికి తోచినవిధంగా వారు చెప్పుకుంటూన్నారు. మా చిన్న చెల్లెలు (7 సంవత్సరములు) మా అమ్మప్రక్కను కూర్చొని అందరి మాటలు శ్రద్ధగా వింటోంది. నేను ప్రక్కగదిలో కూర్చుని చదువుకుంటూ వారి మాటలు వింటున్నాను. మర్నాడు మా చెల్లెలు దేవుడిదగ్గర భక్తిగా కూర్చొని "దేముడా" మా స్కూలులో వున్న వాళ్ళందరూ నాది జానెడుపిలక అని వెక్కిరిస్తున్నారు. నువ్వు నా జెడ పెద్దదయ్యేట్లు చేస్తే నా తలనీలాలు నీకు యిస్తాను" అని మొక్కుకుంటోంది. ఇది విన్న నాకు నవ్వు ఆగింది కాదు.

"కామేశ్వరి" (ఏలూరు)

★

రాష్ట్రంలో రాజకీయ వేత్తల హోరు: ప్రజల నిర్లిప్తత


కౌండిన్య

ఆంధ్రలో ఎన్నికలు ప్రారంభమవడానికి ఇక నాలుగైదు రోజులకన్నా వ్యవధి లేదు. రాష్ట్రం నుంచి లోక్‌సభకు 145 మంది, రాష్ట్ర శాసన సభకు 979 మంది పోటీలో నిలబడ్డారు. ఈ 979 మందిలోనూ 300 మంది అనగా దాదాపు మూడో వంతు స్వతంత్రులు. గత రెండు ఎన్నికల్లో కన్నా, ఎన్నికల ఖర్చు లెక్కువే అయినా అభ్యర్థుల సంఖ్య తగ్గకపోగా ఎక్కువ కావడం విచిత్రంగా ఉంది. రాజకీయచైతన్యం ప్రజాసేవాభిలాష పెరగటమే ఇందుకు కారణమని తృప్తిపడవచ్చు. కాని దానికి తగ్గట్లు, తమ సేవ కోసం ముందుకు వస్తున్న ఈ అభ్యర్థి సమూహాల పట్ల ప్రజల ఆదరాభిమానాలు పెరిగిన జాడ లేదు. అసలు ఎన్నికలంటేనే ప్రజలలో మునుపటి మోజు, ఉత్సాహం లేవు. ఇది ఒక్క మన రాష్ట్రంలోనే కాదు, అన్ని రాష్ట్రాలలోనూ ఇలాగే ఉంది. ఎన్నికలంటే కొత్తదనం పోవడం, పార్టీలను, ప్రజలను ఆకర్షించగల పెద్ద సమస్యలు లేకపోవడం ముఖ్యంగా విద్యావంతులైన వారిలో అశ్రద్ధ అనాసక్తి ప్రబలడం ఇందుకు కారణం.

ఈ అనాసక్తిని పోగొట్టి ఓటర్లను తమవైపు త్రిప్పుకోవడానికి అన్ని పార్టీలు ఉవ్వెత్తున ప్రచారం ప్రారంభించాయి. కమ్యూనిస్టుపార్టీ తరఫున అగ్ర నాయకులైన జోషి, నంబూద్రిపాద్, భూపేశ్ గుప్తాలు, స్వతంత్రపార్టీ తరపున ఆ పార్టీ వ్యవస్థాపకుడు శ్రీమాన్ రాజాజీ, కాంగ్రెస్ తరపున శ్రీమతి ఇందిరాగాంధి, శ్రీ దేబర్, మొరార్జీ, జగ్జీవన్‌రాం, నెహ్రూలు రాష్ట్రంలో పర్యటించి వెళ్లారు. వీరి ప్రసంగాలలో ప్రజలు అదివరకు వినని కొత్త అంశాలేవీ లేవు.

ప్రతిపక్ష నాయకుల ప్రసంగాలను రెండు భాగాలుగా విభజించవచ్చు. మొదటిది — కాంగ్రెసును, కాంగ్రెసువారిని తిట్టడం. ప్రసంగాలలో ఎక్కువ మేర ఇదే.

ఎన్నికల ప్రచారాన్ని మర్యాదగా సాగించాలని, వివిధ పార్టీలు ఒక దశసూత్ర ఒప్పందం చేసుకునిఉన్నా ఆ ఒప్పందాన్ని అట్టే పాటిస్తున్నట్లు లేదు. ఈ నిందా ప్రచారంలో మిగతా అన్ని పార్టీల కన్నా స్వతంత్రపార్టీదే పైచేయి. నిన్న మొన్నటి దాకా కాంగ్రెస్‌లో ఉండి అసంతృప్తితో బయటికి వచ్చినవారు కావడంచేత, కాంగ్రెస్‌ను, కాంగ్రెసు



ఇటీవల విజయవాడలో ఏర్పాటైన బహిరంగసభలో ప్రసంగిస్తున్న ప్రధాని శ్రీ నెహ్రూ.

వారిని ఇష్టం వచ్చినట్లు తిట్టే చనువు, హక్కు తమకున్నదని వారి ధీమా. వారి దృష్టితో కాంగ్రెస్ వాళ్లు బందిపోట్లు, బకాసురులు, మిడుతలదండ్లు. నెహ్రూ ఒక నియంత. లోకంటిపోటలా చేసే ఈ నిందాప్రచారం ఎంతమటుకు ఓటర్లు హర్షించగలరో తెలియదు. ప్రతిపక్ష నాయకుల ప్రసంగాలలో రెండవ భాగం — కాంగ్రెస్ చెప్పే సోషలిజం సోషలిజం కాదని, ధనికులు మరీ ధనవంతులుగాను, పేదలు మరీ నిరుపేదలుగానూ మారే పెట్టుబడిదారీ ప్రాబల్యం గల వ్యవస్థ అని కమ్యూనిస్టులు అంటుంటే, స్వతంత్రపార్టీవార్కు కాంగ్రెస్ సోషలిజంఅంటే కమ్యూనిజానికిమారుపేరని, ధనికుల ఆస్తిపాస్తులు, స్వాతంత్ర్యాన్ని హరించి బానిసలుగా చేసే నియంతృత్వ స్థాపనకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని నిందిస్తున్నారు. అటు అతివాదులు, ఇటు మితవాదులు పరస్పర విరుద్ధమైన విమర్శలు చేయుడంవల్ల కాంగ్రెస్ అనుసరిస్తున్నది మద్యేమార్గమని అర్థమవుతోంది గదా.

ప్రతిపక్షాల ప్రచారాన్ని ఎదుర్కోడంలో కాంగ్రెస్ నాయకులు కూడా నిందాపూరిత ప్రసంగాలకు దిగుతున్నారని ఒప్పుకోక తప్పదు. ప్రతిపక్షాలకుచెప్పుకోదగ్గ ప్రణాళికలు, కార్యక్రమాలు లేకపోవడం వల్ల, ఉన్నా తాము అధికారంలోకి వచ్చి, వాటిని అమలు జరుపుకో గలగడం అసంభవమని వారే అంగీకరిస్తున్నందువల్ల, నిరాశా నిస్పృహలతో, కాంగ్రెసుపై తిట్టుకవిత్వానికి దిగుతున్నారనేది అర్థం చేసుకోవచ్చు. కాని కాంగ్రెస్‌వారికి ఆ ఖర్మ పట్ట నవసరంలేదు. 75 ఏళ్ల కాంగ్రెస్ చరిత్ర, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ 14 ఏళ్లలో సాధించిన ఘనకార్యాలుఉన్నవి. అవన్నీ ఓటర్లకు వివరించి, ఎదుటిపార్టీలఆదర్శాలు, ఆశయాలు ఏమిటని నిగ్గదీసి అడగవచ్చు. మద్రాసు మహాసభలో ప్రధానమంత్రి శ్రీ నెహ్రూ చేసిన పని యిదే. దాంతో రాజాజీ గారు తమ రంగు బయటపెట్టక తప్పలే. తాము ఎటువంటి సామాజిక వ్యవస్థ కోరుతున్నదీ 19 అంశాలతో శ్రీ రాజాజీ ఒక ప్రకటన చేశారు. ఆ ప్రకటన మొహం చూస్తేనే, అది ధనికుల ఇష్టారాజ్యమైన సామాజిక వ్యవస్థ తప్ప మరొకటి కాదని విస్పష్టమవుతుంది.

ఇంతకూ ఈ ప్రచారం, ప్రసంగాలు ఎంత మటుకు ఓటర్లచెవి కెక్కుతున్నాయి అనే సంశయం లేకపోలేదు. ఓటర్లలో నిర్లిప్తత ఎక్కువైనట్లు కన్పిస్తోందని పైనే మనవిచేశాను. ఏదో కొందరు అగ్రనాయకుల సభలకు తప్ప, చోటా నాయకుల సభలకు జనం అట్టే రాకపోవడం ఇందుకు నిదర్శనం. ఇది పసిగట్టే ఈసారి అన్ని పక్షాలు, లక్షలాది కార్యకర్తలను తర్ఫీదుచేసి ఇంటింటికి పంపి ఓటర్లను లాలిస్తున్నాయి. ఇది కొత్త

60—వ పేజీ చూడండి

ఈవారం సినీవిహారం

మధుమూర్తి



"ఇద్దరు కొడుకులు చిత్రం"లో బి. సరోజాదేవి, ఎం. జి. ఆర్.

కనకం విజయం

ద్వితీయ చిత్రనిర్మాణకార్యక్రమాన్ని జయంతీ వారు కొనసాగిస్తున్నారనే వార్త వినగానే విశేషాలు తెలుసుకోవాలని జయంతీ స్టూడియోకి వెళ్లాను. ఆ సంస్థ అధినేత పి. ఎస్. నన్ను చూడగానే 'సరిగ్గా వేళకే వచ్చారే' అని పలకరిస్తూ "ఇదిగో చూడండి" అంటూ ఒక ముక్కాలి పీటవైపు దృష్టిని మరల్చారు. ఆ పీటమీద దేవుళ్ల పటాలు, పూలహారాలు, కుంకుమ, పువ్వులు కనిపించాయి. సరిగ్గా ఆరోజునే జయంతివారు తమ రెండవచిత్రం నిర్మాణసన్నాహాలకు పూజ జరిపించారు. అది జనవరి 31 వ తేదీ.

పి. ఎస్. రెడ్డి (బార్ ఎట్ లా) ఆ సంస్థకు అధినేత. ఆయన్ని అందరూ పొడి అక్షరాల్తోనే పిలుస్తూంటారు. ఈ సంస్థ తొలిచిత్రం మీకందరకూ తెలిసిన వార్తే, "పెళ్లినాటి ప్రమాణాలు". ఆ చిత్రానికి దర్శకుడు కె. వి. రెడ్డి. ఆయన్నికూడా తెలుగుచిత్ర పరిశ్రమలోనివారంతా పొడి అక్షరాలైన "కె.వి" గానే వ్యవహరిస్తూంటారు.

తెలుగు చలనచిత్రనిర్మాతలకు కే. వి అనుసరించే సంప్రదాయాలు ఒక లక్ష్యంగా, ధ్యేయంగా కనబడుతూంటాయి. ఆయన ప్రతి చిత్రాన్ని పండితపామరులకు సమానంగా రుచించేవిధంగా, కథను కమనీయంగాను, రమణీయంగాను, సులభగ్రాహ్యంగాను వెండితెరకు అందిస్తూండడంలో ఆయనకు ఆయనే సాటి అని ప్రతిచిత్రం ఋజువుచేస్తూ తద్వారా విజయం సాధిస్తూంది. అంచేతనే కే అంటే కనకం, వి అంటే విజయం అనే నిర్వచనం తెలుగు చిత్రసీమలో రూఢీ అయిపోయింది.

శ్రీ కృష్ణార్జున యుద్ధంలో మేటి నటులు

పి. ఎస్. నేనూ ఛలోక్తులు విసురుకుంటూండగానే కే. వి, పింగళి నాగేంద్రరావు వచ్చారు. "గుణసుందరి కథ" నుంచి కవి దర్శకుల జంట వారిద్దరూ. కె. వి దర్శకత్వంవహించే ప్రతి చిత్రానికీ పింగళి నాగేంద్రరావే మాటలు, పాటలు వ్రాయటం మరొక ఆచారం. ఆయన వ్రాసిన పాటలకు సంగీతదర్శకుడు పెండ్యాల నాగేశ్వరరావు బాణీలు కూరుస్తూ మ్యూజిక్ రిహార్సల్స్ ప్రారంభించారు. మరొకవైపున కళాదర్శకులు మాధవపెద్ది గోఖలే, తోట వెంకటేశ్వరరావులు ఆ పౌరాణికచిత్ర గాధలోని పాత్రలకు, వారు మెట్టే ప్రదేశాలకు రూపాలు, అలంకారాలు నిర్ణయిస్తున్నారు. చిత్రనిర్మాణంలో అన్ని శాఖలూ "బిజీబీ" లాగ పనిచేస్తున్నాయి.

మీ చిత్రంలోని పాత్రధారులు ఎవరని కె. వి. ని ప్రశ్నించాను. "తెలుగు చిత్రసీమలోని ప్రముఖులందరూ ఈచిత్రంలో నటించేటట్లు పథకం తయారుచేస్తున్నాను. ఇప్పటికి శ్రీకృష్ణుడుగా ఎన్. టి. రామారావును, అర్జునుడుగా నాగేశ్వరరావును, సుభద్రగా బి. సరోజాదేవిని, సత్యభామగా ఎస్. వరలక్ష్మిని, నారదుడుగా కాంతారావును నిర్ణయించాము. మిగిలిన పాత్రలన్నిటికీ మేటి నటవర్గాన్ని ఎన్నుకోదలచాము. మార్చి మొదటివారంలో షూటింగు ప్రారంభిస్తున్నాము. ఈలోగా ఇతర పాత్రధారులనిర్ణయం జరుగుతుంది." అని కె. వి. విశదీకరించారు. ఈ చిత్రానికి కామెరామన్‌గా కమల్ ఘోష్, నృత్యదర్శకుడుగా పసుమర్తి నియమింపబడినవార్తను కూడా ఆయన అందజేశారు.

అష్టగ్రహకూటమికి నదురూ బెదురూ లేదు

ఫిబ్రవరి 3, 4, 5 తేదీలలో అష్టగ్రహకూటమి ఏర్పడుతుందని, ఏదో విపత్తు లోకానికి కలుగవచ్చునని జ్యోతిషశాస్త్రజ్ఞులు అంచనాలు వేశారు. ఆ తేదీలకు ముందు చలనచిత్ర పరిశ్రమలోని అల్పసంఖ్యాకులు ఆందోళన చెంది తగు శాంతులు, పూజలు ఇళ్లల్లో చేసుకుని ఉన్నప్పటికీ ఆ మూడురోజులు మాత్రం మదరాసులోని స్టూడియోలలో షూటింగు కార్యక్రమాలు ఏవిధంగా జరుగుతున్నవో పరిశీలించటానికి బయల్దేరాను.

వాహినీ, విజయా స్టూడియోలలో విజయా సంస్థ చిత్రం షూటింగ్ యధాప్రకారం నిర్విరామంగా సాగింది. పద్మశ్రీ లలితాసంస్థల చిత్రాల షూటింగ్ నడిచింది. మూడవతేదీ సాయంకాలమే మదరాసునుంచి బాబూ మూవీస్ చిత్రం ఔట్ డోర్ షూటింగులో పాల్గొనేనిమిత్తం నాగేశ్వరరావు, సావిత్రులు బయలుదేరి హంపీ వెళ్లారు.

మెజెస్టిక్ స్టూడియోలో "టైగర్ రాముడు" చివరిరంగులు పులుముకుంటున్నాడు. న్యూటోన్‌స్టూడియోలో శుభోదయావారు ఎన్. టి. ఆర్, అంజలీదేవి, రేలంగి ప్రభృతులతో "పారసత్వం" షూటింగును కొనసాగించారు. ఇటు నీనస్‌లోనూ, నరసూ స్టూడియోలోనూ కడారు నాగభూషణం "దక్షయజ్ఞం" చిత్రం షూటింగ్ ఆ రోజుల్లోనే నిర్భయంగా జరిపించారు.

పద్మినికి పుత్రుడు

మూడవ తేదీ తెల్లవారు జాము గం. 5—15 లకు ప్రఖ్యాత తార తిరువాన్కూర్

"సిరిసంపదలు"లో

వాసంతి, సావిత్రి, గిరిజ.

సోదరీమణులలో ఒక మణి అయిన పద్మినికి పుత్రుడు ఉదయించాడు. అంటే సప్తగ్రహ కూటమి ఏర్పడిన కాలంలో ఆమె ఒడిలో కొడుకు "క్యార్" అన్నాడు.

గరటయ్య గాభరా

వియ్యంకుడు పానకాలరావుకి విచిత్రమైన వార్త అందినట్లుంది—పడకకుర్చీలో విస్తుపోతూ కూర్చున్నాడు. ఆతని ప్రక్కన ఆతని ముద్దులకూతురు కొండమ్మ బిక్కుబిక్కుమంటూ నిలబడి ఉంది. వారికి ముందొక ఉయ్యాలబల్ల ఉంది. దానిమీద మొహం చాటేసుకుని గరటయ్య కూచున్నాడు దారీ తెన్నూ తోచనివానిలాగ. ఉయ్యాల గొలుసులు పట్టుకుని భీకరంగా నిలబడింది మిసెస్ గరటయ్య భద్రమ్మ.

"అంతా తమాషాగా ఉందే! అల్లుడు కండ పుష్టిగల మనిషి! దొంగచేతుల్లో పడ్డాడా అని" అని అమాయకుడు పానకాలు ఆశ్చర్యపడుతూంటే కూతురు కొండమ్మ అందుకుని "చీకట్లో మోసుకుపోయారు నాన్నా! అత్తయ్య దీపం తెచ్చేసరికి హారంకూడా లేదు" అని విషాద వదనారవిందయై వక్కాణించెను.

"దిక్కుమాలినహారం" అని తిట్టింది హారాన్ని భద్రమ్మ.

"అంతా నువ్వు చేసిందేగా!" అని విమర్శించాడు భార్యను గరటయ్య.

"నువ్వు తెచ్చిందేగా!" అని ఎత్తిపొడిచింది మొగుణ్ణి భద్రమ్మ—తానేం తక్కువ తినలే దన్నట్లు.

"మీరు తగూలాడుతూ కూచుంటే హారంతో బాటు అల్లుడుకూడా గల్లంతవుతాడు. బయల్దేరండి బావగారూ!" అంటూ కూతుర్నిచ్చిన వ్యధను వెళ్లడిచేశాడు వియ్యంకుడు పానకాలు. అంతేకాదు ధైర్యంగా లేచి నిలబడ్డాడు. ఈ అల్లుణ్ణికన్న తండ్రి గరటయ్యకు గాభరా పెరిగింది. "ఎక్కడికండీ?" అని వెర్రివాడిలా ప్రశ్నించాడు గరటయ్య.

"తమాషాగా ఉందే! పోలీస్ స్టేషన్‌కి" అని స్పష్టీకరించాడు పానకాలరావు. గరటయ్య గొంతులో ఏదో అడ్డుపడినట్లయింది.

ఈలోగానే ఆనంద్‌కుమార్, గరటయ్య భద్రమ్మల ఆనందాల బిడ్డ ప్రసాద్‌తో సహా వచ్చి వాలాడు అక్కడే.

"ఎక్కడికీ వెళ్ల నక్కర్లేదు" అన్నాడు ప్రసాద్!

"వీరమాతా! హారం దొరికింది" అంటూ ఆనంద్‌కుమార్ హీరో పోజులో తల్లికి సువార్త అందించాడు.

ఈ రసవత్తర సన్నివేశం పద్మశ్రీ పిక్చర్స్ వారు త్వరలో అందించే "సిరిసంపదలు" కు చెందినది. పానకాలరావుగా డాక్టర్ శివరామకృష్ణయ్య, కొండమ్మగా సురభి బాలసరస్వతి, గరటయ్య దంపతులుగా రమణారెడ్డి సూర్యకాంతం, వారి నోములపంటగా రేలంగి, ప్రసాద్‌గా నాగేశ్వరరావు, చక్కగా నటించారు. ఈ చిత్రానికి దర్శకుడు పి. పుల్లయ్య బి. ఏ., రచన: పినిశెట్టి, కామెరా : మాధవ్ బుల్‌బులే, సౌండ్ కృష్ణారెడ్డి, నిర్మాత : వి. వెంకటేశ్వర్లు బి. ఏ.

వేణురాధల పొత్తు

అది వేణు ఇల్లు. పెరటి భాగం. మంచినీళ్ల బావి ఒకమూల.

నూతిదగ్గరకు వచ్చింది రాధ. ఆమెకు కళ్లు కనిపించవు. భర్తకు సేవచేయాలనే ఆకాంక్ష ఆమెలో ఎక్కువ. అంచేత బావిలో చేదవేసి నీళ్లు తోడాలని ఆమె చేసే ప్రయత్నం ప్రమాదకరం కాబోతూండగా వేణు చూసి ఆమె వద్దకు వచ్చి; ఆమెను నివారించాడు.

"నీళ్లు కాదు .... నిప్పులు తోడు .... ఇంకా నుంటే బావిలో పడేదానివి. పడుండకూడదూ? నా ప్రాణాలు ఇలా తియ్యకపోతే— లోపలికి పో" అని వేణు ఆమెను కసిరాడు; విసుక్కున్నాడు.

ఈ సన్నివేశం బాబూ మువీస్ తొలి తెలుగు చిత్రంలోనిది. వేణుగా నాగేశ్వరరావు, రాధగా జానకి నటించారు. ఈ చిత్రానికి దర్శకుడు: ఆదుర్తి సుబ్బారావు; రచన : ఆత్రేయ; కామెరా : పి. ఎల్. రాయ్; సౌండ్ : నరసింహమూర్తి; నిర్మాత : సుందరం. విజయవంతంగా ప్రదర్శింపబడుతున్న తమిళచిత్రం "కుముదం" కథ ఆధారంగా తయారవుతున్న ఈ తెలుగుచిత్రానికి ఇంకా నామకరణం చేయలేదు. ★



హరి వంశము

హారిత శివశర్మ

సాందీపనిపర్వం - 48

సుదక్షిణ కర్తవ్యబోధితయైనది. కాశీరాజు వటువులకు ఉచిత ఆస్తరణములను వేయించి కూర్చుండ నియమించినాడు. భగవంతుడు మందహాసము చేసి "గృహస్థ! మేము బ్రహ్మచారులము. వ్రతదీక్షితులము. కూర్చుందుమా! నీ చేయు మరియాదల ననుభవింతుమా?" అనినాడు.

సుదక్షిణను చూచి "భగిని! కర్తవ్యమును పాలించు" అని హెచ్చరించినాడు.

మహారాజున కేమి యనుటకును తోచలేదు. సుదక్షిణ మహానసములోనికి పోయినది. అంతలో పౌండ్రకుని రథము వాకిటిలో నాగినది. శ్రీకృష్ణదేవుడు బలరామదేవుని చూచి మందహాసము చేసినాడు. మహారాజున కదియు నర్థముకాలేదు. వాకిటిలోనుండి పౌండ్రకుడు లోపలకు వచ్చునరికి, అతనికి పరిస్థితి యేమో అర్థమైనది. అతడు శ్రీకృష్ణుని తిలకించినాడు.

బలరామదేవుని చూచి మెల్లన హసించినాడు. శ్రీకృష్ణదేవునితో ఇట్లు లనినాడు:

"వల్లవ! తిరిపెమున కంతటి కాశి యుండగా నిచ్చటకే రావలయునా! వచ్చితివి పో! వాసుదేవ నామమును ఆశ్రమములో దిగవిడిచితివా? వెంట బెట్టుకొని వచ్చితివా?"

"పౌండ్రక! నేను వాసుదేవుడను కాకపోవుటెట్లు! నీకైనచో నది ఎవ్వరో పెట్టిన పేరు. మరి నాకో అట్టుల కాదు. నా తండ్రి వసుదేవుడు. నేను వాసుదేవుడనుకాక మరి యేమి యగుదును."

అంతలో మహారాజు తనలో తా నిట్లనుకొనగా, నది ప్రకాశమైగూడా విన్పించినది:

'వాసనాత్ వాసుదేవస్య
వాసితంతే జగత్రయం.'—

పౌండ్ర : మాతులా!

రాజు : పౌండ్రక! ఏమి!

పౌండ్ర : తమరేమియో యనుచున్నారు.

రాజు : అవును. అనుచున్నాను.

పౌండ్ర : ఈ వల్లవప్రవరుని, ఈ ఆభీరుని, ఈ అక్షత్రియుని, వాసుదేవు డనుచున్నారు.

రాజు : అవును! అనుచున్నాను.

పౌండ్ర : నేను వాసుదేవుడను. ఇత డెట్లగును.

శ్రీకృష్ణదేవుడు మందహాసము చేసినాడు. బలరామదేవుడు గల్లున నవ్వినాడు. "పౌండ్రక! కృష్ణుడు చెప్పిన ప్రత్యుత్తరము వినలేదా! లేక విన్పించలేదా?" అనినాడు.

శ్రీకృష్ణదేవుడును గల్లున నవ్వినాడు: "రామ! అతడు విన్పించుకొనలేదు. అంతియేనా! పౌండ్రక!'

పౌండ్రకునకు కోపమో, తాపమో, ఏమో కల్గినది. అతనిలో అతనికే తెలియని విచిత్రమైన మార్పులును కల్గినవి. అతడు నవ్వగా నది అట్టహాసమువలె నున్నది. "యాదవ! నిన్ను ఇచ్చటి కెవరు రమ్మన్నారు.! నీ విచ్చట కేల వచ్చితివి? నిన్ను సుదక్షిణ చూచినదా? అది నీవు అందగాడ వనుకొనుచున్నది. దాని లేతమనస్సు, నిన్ను చూడకనే నీపైపున కాకర్షింపబడుచున్నది. నీ విచ్చట కేలవచ్చితివి? కాశికలో నుంటివి పో! ఈ మందిరముల కేలరావలయును!"

మహారాజు అప్రతిభుడైపోయెను. "పౌండ్రక! ఒడలు తెలిసి మాటలాడుచున్నావా? శ్రీకృష్ణుడును, బలరాముడును వటువులు; క్షత్రియులు. క్షత్రియుల ఇండ్లకు క్షత్రియబ్రహ్మచారులు భిక్షకు వచ్చుట యున్నది. అది దోషమనుచున్నావా! సాక్షాత్ వసుదేవుని బిడ్డలు నా యింటికి బిక్షకొరకు రాగా, అందువలన నాకు కల్గెడి పుణ్యమును కాలదన్న చూచుచున్నావా? నీవు ఇట్టిడ వనుకొనలేదు. పామ్మావల" అనినాడు.

పౌండ్రకుడు మాతులునిదిక్కై కొరకొరగా చూచినాడు. చూచి మరల నవ్వినాడు. ఆ నవ్వులో అందములేదు. స్నేహము లేదు. గౌరవము లేదు. "రాజన్! నీవు ముదుసలివి. నీకు యువకుల వర్తనము తెలియదు. నీవు నీ కూతురను చూచితివా! అది శ్రీకృష్ణుని మన్నన చేయుచున్నది. మనస్సులో ఈ అందగానిని ఎప్పుడు చూతునా అని ఉవ్విళ్ళూరుచున్నది. మరి ఆ అందము ఎట్టులున్నది. తుమ్మలలో ప్రొద్దు కూకినంతటి నల్లగానున్నది. ఆకసమున మేఘములుపట్టిన, ఆగామి దుర్దినసూచకములైనట్లు ఈ ఆభరమేఘము కాశికను పట్టి, వర్తమానముననే దుర్దినములను తెచ్చిపెట్టెను. కాశికలో ఎప్పుడు ఇంత వర్షము కురిసినది. కాశిక ఎప్పుడు ఇంతగా నష్టపడినది. ధనములేని నిరుపేదల యిండ్లన్నియు ఈ జడివానలకు కొట్టుకొనిపోయినవి. కొన్ని చోటులలో తల్లి గంగానది కట్టుతెగి యూళ్ళపై బడినది. విరిగిన చెట్లతో, చెడిన రాజపథములతో, తడిసిన అదృష్టముతో నగరమంతయు దైన్యముగ నున్నది. ఇది యంతయు నెట్లు జరిగినది? ఎందుకు జరిగినది! నీవు ఈ కృష్ణునిచరిత్ర పూర్తిగా వినియుండవు. ఇతడు నందగోపుని యింటనుండగా, నతని ప్రేపల్లెకు రారాని ఇడుములు వచ్చినవి. అతడు బృందావనమునకు కదిలిపోగా, అక్కడ నంతియే యైనది. మధురకు రాగా, మహారాజు కంసుడు మడసినాడు. ఇక ఇతనికి చుట్టములు, పక్కములను వున్నారుగదా! ఎవరు సుఖపడుచున్నారు. తల్లియు, తండ్రియు, దేవకియు, వసుదేవుడును అనుకొందము. వారికి ఇతడు కడుపున పడుననగా యేమియైనది? చచ్చినచావైనది. ఇతని ప్రాణములకోసము, ఆతల్లి తన ఆర్గురు బిడ్డలను బలి చేసినది. మాతుల! ఆలోచించినావా! నీకేమో ఒక్క కూతురు. ఆ కూతురన్నచో పడిచచ్చెదవు. మరి ఆతల్లి దేవకిహృదయమును అర్థముచేసుకొనగలవా! ఈపుత్రుడు పుట్టి తన్ను ఉద్ధరించునని ఆ వెర్రిబాగులతల్లి యనుకొన్నది. అనుకొనగా నేమి యైనది? ఏమి అనుభవమునకువచ్చినది. నిరంతరదుఃఖము. నిరంతరవేదన. కన్నకడుపు ఆత్మసోదరహంత యగునని యామె అనుకొన్నదా! మరి ఆ తండ్రి! నిత్యసత్యవాక్కు! జీవితమున నధఃపతితముచేయు నసత్యవాక్కైనాడు. యశోదయు, నందుడును ఇతనిని పెంచిరి. పెద్దవానిని చేసిరి. వారికి ఏమి ఒరిగినది! వారికిని నిరంతరదుఃఖము మాత్రము ఒనగూడినది. ఈ దామోదరునియందు ప్రేమచేత, అతడు మరల తమకు కనిపించడని యెరిగి, తమవద్ద ఉనికిగా ఉండడని తెలిసి, పేదలై, దుఃఖమును పొందుచున్నారు. ఇది ఇతని చరిత్రము. ఇతడు కాలుపెట్టినచోట దుఃఖము. ఇతడు మన్ననచేసినచోట ప్రమాదము. ఇతని గాలి సోకినచోట ప్రకృతిగూడా ప్రళయమును భజించుచున్నది. ఇట్టిడు కాశికలో ఉండ తగునా! కాశికకు వచ్చినవాడు వచ్చినపని యేమో చూచుకొనక, ఈ మందిరములకు వచ్చుట యెందుకు! ఇప్పటగూడా నా దుఃఖమును రగుల్చుటకా! నీవు ఇతనిని వాసుదేవు డనుచున్నావు. మరియు నేమియో శ్లోకములను చదువుచున్నావు. జగత్తంతయు నితనిచే నిండియున్నదనుచున్నావు. అగుచో నా జగముగూడా అదృష్టములేని దగుచున్నది. జగత్తులో దుఃఖమే ఇతడు. ఇతడు వాసుదేవు డెట్లగును. నేను వాసుదేవుడను ......

"పౌండ్రక! పౌండ్రక! ...." మహారాజు మరి మాటలాడలేకపోయెను. శిరస్సును ఎత్తనులేకపోయెను. శ్రీకృష్ణ బలరాములను చూడను లేకపోయెను. పౌండ్రకుడు మరల నేదియో ఉపక్రమించుటకు సిద్ధమగునంతలో సుదక్షిణ అన్నపూర్ణవలె వచ్చెను. ఆమెను అప్పుడు చూడగా పౌండ్రకుడుగూడ అప్రతిభుడైపోయెను. నిరలంకార, నిరస్తభూషణ, ఆమె సహజమైనసౌందర్యము అంతయు మూర్తికట్టినట్లుండెను. ఆమె ముఖము ఆనందముచేత, నిండుగా స్నేహమును అవలంబించిన ప్రమిదయందలి వత్తివలె పవిత్రమైన కాంతిని విరజిమ్ముచుండెను. ఆమె కోకను కట్టినది. స్తనవల్కలము ధరించినది. పైన ఉత్తరీయము లేదు. మేలిముసుగు లేదు. ఒక పళ్లెమున పాయసాన్నములు, మరియొక పళ్లెరమున పిండిపంటకములు పెట్టుకొని, ముఖమున మందహాసములు విరియగా, వికసించిన మెట్ట తామరపూవువలె ఆమె కన్పించినది. పౌండ్రకుడు ఆమెను చూచి తనలో అనుకొనినాడు! ఈ సుద

60—వ పేజీ చూడండి

చదువుల్రావు



వాడేనాండీ మొన్న బస్సులో మిమ్మల్ని చూసి ఏదో వెకిలి వేషాలు వేసింది?
ఔనండీ
ఈసారి ఎప్పుడేనా అలా చేసేడంటే వాణ్ణి ఏంచేస్తానో చూడండి...
చేస్తాను.. ఏంచేస్తావోయ్
ఏంచేస్తానా..... ఏంచేస్తానా?
దాటేన్రా.. ఏంచేస్తావ్
వెధవ దాటేస్తున్నాడు
వెధవ దాటేస్తున్నాడు ఏంచెయ్యడం... మళ్ళీ
దాటేన్రా ఏంచేస్తావ్?
సత్యమూర్తి

వర్ణాంతర వివాహాలు

ఈ ఆధునిక ప్రపంచములో జరుగుతున్న అనేక మార్పులతో సమస్యలుకూడా ఎక్కువవుతున్నాయి. ఈకాలపు యువతీయువకులను అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయి; కారణం—'అభిరుచులలోని' మార్పులు. అందులో వర్ణాంతరవివాహాలు ఒక రకం మార్పు. ఇది ఈకాలం జబ్బు అని కొందరనే మాటలు అంత నిజంకావేమో! కోటి కొకటిగా వున్న ఈ వివాహాలు వందకొకటిగా అయిన మాట నిజమే అవవచ్చు. అంతమాత్రాన 'ఇది ఎక్కడ కని విని ఎరుగని చోద్యము' మాత్రము కాదు. పూర్వం నుండి వున్న గాంధర్వాన్ని మామూలువిషయంగా ఎంచి, దానిని ఎక్కువగా పట్టించుకోనివారు ఇప్పటి ఈ విషయాన్ని అంత నీచంగా చూడటం కొంచెము తప్పే అనిపిస్తుంది.

ఈ వివాహాలనుగురించి తరచుగా వినడం ఎక్కువయినమాట నిజమే. అయితే యిది కాలక్రమేణా వచ్చిన కొన్ని మార్పులలో ఒకటి. ముందు చాలా అరుదుగా వుండి, క్రమంగా ఈ వివాహాలు ఎక్కువవుతున్నాయి. 30, 40 ఏళ్ళనుండి అక్కడక్కడ సంఘసంస్కర్తలు ముందుకొచ్చి ఈ వివాహాలను ప్రోత్సహించినప్పుడు పడ్డ బాధకన్నా యిప్పుడువున్న బాధ తక్కువకాదు. కాని సంఘసంస్కర్తల సంఖ్య కొంచెము ఎక్కువయింది. అప్పుడు కథలక్రింద కట్టి రోజులతరబడి మాట్లాడుకొంటున్న విషయం యిప్పుడు ఫలానా ఫలానావారి వర్ణాంతరవివాహాన్ని గురించి అనుకొని మరవడంతో పోతూంది.

పూర్వంనుండికూడా ఈ తాలూకు వివాహాలు జరగడం కద్దు. స్వయంవరమునకు వచ్చిన రాకుమారులందరు రాకుమారిశాఖకు చెందినవారే కావలసిన అవసరంలేదు. పరిస్థితులకొద్దీ వాతావరణముకొద్దీ వారు నడుచుకొనేవారు. క్రమేణా పలువిధములయిన వృత్తుల కారణంగా వేరు వేరు జాతులు వారి ధర్మాలంటూ వేరే వచ్చాయి. వారి వారి అలవాట్లు, పద్ధతులంటూ వుండగా దానిని ధిక్కరించిన వేరే జాతివారిని పెండ్లిచేసుకొని ఆ పద్ధతుల నవలంబించినవారిని కులంనుండి వెలివేయడంలాంటి పద్ధతులుండేవి. వృత్తిధర్మాలకొద్దీ ఆహారపదార్థాల వాడుకలు మారాయి. ఇలాంటి పరిస్థితులలో సహజంగా వచ్చిన కొన్ని అలవాట్లను తప్పు క్రింద జమకట్టి జాతులమధ్య ఏకత్వం లేకుండా చేసారు. దీనిమూలాన ఒకజాతి అమ్మాయి మరోజాతి వరుని చేసుకోకుండానూ, ఇక చేసుకున్నవారిని తప్పుచేసినవారి క్రింద జమకట్టి వారి జీవితాంతము కష్టపెట్టడం చాలా ఘోరమయిన విషయం. అసలు వర్ణాంతర వివాహాలకు అడ్డుచెప్పడానికి కారణం జాతులలోని ఆచారవ్యవహారాలలోని తేడా, సంస్కృతుల, మనస్తత్వాల, నడవడులయందు తేడా మాత్రమే. కులం చెడినవారని సంస్కృతిగల జాతినుండి తక్కువవారిని చేసుకున్నవారికీ వచ్చును. ఈ తేడా రావడానికి కారణా లెన్నో విషయాలమీద ఆధారపడి వుంది. ఎవరికి వారిజాతి ఎక్కువయినకాలంలో ఈ వర్ణాంతర వివాహాలకు చోటుండలేదు.

కాని నాగరికత ఎక్కువయినకొద్దీ అన్ని జాతులవారికి అన్ని హక్కులు వచ్చాక, అందరు సమానంగా చదువుకుంటున్నారు. అన్ని విషయాలలోను హక్కులు సమంగానే వున్నాయి. సంఘపరిస్థితులను మంచికి మార్చడానికి ప్రయత్నిస్తున్నారు. మనిషి, ఇంకో మనిషిని ఇప్పుడు అర్థంచేసుకోవడంతో, అనుకూలంగా నడుచుకోవడంతో ఈ వివాహాలకు ఏ చేటూ లేదు.

దంపతులమధ్య ఐకమత్యము లేనప్పుడు ఒకరి నడవడి యింకొకరికి నచ్చదు. వారివారి మాటలు నెగ్గాలని యిద్దరినడుమ వచ్చే కలహాలకు గురిఅయి వారిద్దరు దూరం అవవచ్చు. ఇది ఎవరికైనా జరుగవచ్చు. ఇద్దరికి స్వతహాగా వచ్చిన అలవాట్లు పోవడం కష్టమే. దానితో అలా జీవితాంతము గడపడం ఎవరికయినా కష్టమే. కొంతవరకు ఇద్దరు తమ పెళ్ళిని నెగ్గించడానికి కొంతదాకా కొన్ని త్యాగాలు చెయ్యాలి. ఈవిషయం ఈ కాలంలో కొంతదాకా వుంది. దీనికి కారణం భార్యా భర్తల విద్య, సంస్కృతి. ఇవన్నీ వుండికూడా ఇద్దరిమధ్య పొత్తుకుదరకపోతే వారి కర్మక్రింద జమకట్టి దయదలచడం మంచిది. కాని వారిని ఎగతాళిచేయడం పాపం వడికట్టుకోవడమే. 'అయ్యో చదువుకున్నవారికున్న తెగులే' అని అనేవారిది తప్పులేదు. జ్ఞానము ఎక్కువయినకొద్దీ, విషయాలలోని మంచిచెడ్డలు తెలిసినవారు చేసేపనులు, అంత ప్రపంచజ్ఞానం లేనివారికి తప్పుగానే వుంటాయి. దేశకాలపరిస్థితుల మీరేవారు చాలా కొద్దిమంది. వారే అన్ని బాణాలకు గురి అవుతారు. వారిని చెడ్డ అని మాత్రము చులకన చేయరాదు. వారి వారి మనస్తత్వాలు వారి నమ్మకాలు అలవాట్లపై ఆధారపడివుంటై. ఇలాంటి మార్పులు సహజం అనిపించడానికి చాలా పరిస్థితులు మారాలి. అవి మారనప్పుడు ఎవరినేమన్నా తప్పే. కొంతవరకు ఈ వివాహాలను ప్రోత్సహించవచ్చనేవారికి సంఘం యొక్క భయం చాలా వుంది. పదిమందిలో ఒకరు యిలాంటి విషయానికి పూనుకొని, చాలాదూరం పోవడం కష్టమే—సంఘాన్ని ధిక్కరించి బతకగలమనే ధైర్యము తప్పుచేయకపోయినా వుండడం అరుదు.

ఇలాటి వివాహాలవల్ల చాలావరకు జాతి బాగుపడటం నిజమే. రక్తంలోని తేడాలవల్ల ఒక నూతన జాతి బయల్పడటం అనేది శాస్త్రము నిర్ణయించి చెప్పగలదు. పూర్వం గ్రీకులు హిందువులమధ్య, హిందువులు ముస్లింలమధ్య వివాహాలవల్ల దేశంలో ఎన్నో శాఖలలో విజ్ఞానం, సంస్కృతి ఎక్కువయ్యాయి. ఇది మనచరిత్ర చాటుతున్న విషయమే. ఒకే అంతస్తునవున్న సంస్కృతుల కలయికవల్ల వచ్చేమార్పులు చాలా గొప్పవి.

ఈ వివాహాల మంచిచెడ్డ లెన్నివున్నా వీటి దెబ్బ బలంగా వనితలమీదే పడుతుంది. సంఘం పురుషులనని బతకలేక కాబోలు వనితలమీద విరుచకుపడుతుంది. పుట్టినింట సమ్మతములేని పెళ్ళి చేసుకొని అటు అత్తగారింటికికూడా దూరమైనవారు కొందరి ననుకుంటే, మనుష్యులలోని మానవత్వం ఏమయిందా అనిపిస్తుంది. తమసమ్మతి లేకుండా చేసుకొన్నదని భీకరించిన కన్నతల్లి ఒకవంక, కోడలిగా వద్దని మాతివిరచిన కొడుకును దూరంచేసుకొన్న తల్లి యింకో వంక!! అందుకున్నామనుకున్న స్వర్గం అందక బాధపడేది ఇద్దరూ. ఇలాంటివి జరగటంతో ప్రపంచము ఈ వివాహాల ఏడుపింతే అంటారు. మామూలుగా జరిగే వివాహాలకు వ్యతిరేకంగా జరిగే వాటిలో ముందు ముందు వచ్చే కష్టాలను ఎదుర్కొనే ధైర్యము వుండాలి. అదే వుంటే వారి జీవితం కలకలలాడుతుంది.

పిల్లల సుఖంకోరే తల్లితండ్రులకు వారి పిల్లలలో ఒకరు యిలాంటి పెళ్ళికి పూనుకున్నారని తెలిస్తే కష్టంగానే వుంటుంది. కాని వారి సుఖంకోరి వారి కండగా నిలిచి, ఏలాంటి ముప్పు రాకుండా చూస్తే ఎంతబాగుంటుంది. మా స్నేహితురాలు రాధ విషయంలో అదే అయింది. ఒక మహారాష్ట్ర యువకునితో పొత్తు కుదిరింది. రాధ యింట్లో ఈ విషయం చెప్పగా ఆమెతల్లి ముందు బాధపడ్డా, కాదు కూడదన్నా పిల్ల సుఖపడాలని ఆ పెళ్ళి జరిపించి వారి కండగా నిలిచి వారికి మంచి చెడ్డలు చెప్పి, యిప్పుడు ఇద్దరు మనుమలతో మురిసిపోతూంది. తల్లి తండ్రుల సహాయంతో భర్త మంచితనముతో మా రాధ చల్లగా వుంది.

కానీ ఈ అదృష్టం అందరికీ కలగదు. అయినా హాయిగానేవుంది మరో స్నేహితురాలు. చేసుకున్నవాడు చాలా బాగా చూసుకుంటాడు. ఎలాటిలోపము రానీయకుండా ఇద్దరి ఆశయాలు ఒకటిగావున్న విషయాలను సులభంగా నెగ్గి, వారి ఆశయాలయందు మార్పున్న యిద్దరూ కొంతవరకు తగ్గి ఒక నిర్ణయానికొచ్చి సులభంగా శాంతివంతంగా గడుపుతున్నారు. కాని కులంకానివాడిని చేసుకుందని మండిపడ్డ తల్లితండ్రులు యింకా వేళ్ళు విరుస్తూనే వున్నారు. శుభమా అంటూ యింటికి వెడితే మంత్రార్చన తప్పదాయె! అయినా అందరిని కాదని వెళ్ళి కాపురం హాయిగా గడుపుతున్నందుకు దేవునికి దండం పెట్టి కాలంపుచ్చుతోంది.

ఈమధ్య వో మళయాళీ అమ్మాయి ముస్లింని చేసుకుంది. వారు హాయిగా వున్నారు. మరి లోకం ఊరికే వుండడాని కెలా కుదురుతుంది? ఇప్పుడు వారికి పుట్టబోయే పిల్లల జాతులను నిర్ణయించడానికి పూనుకుంది!! ఈ సమస్యను అనుకోవడంలో అర్థం లేదంటాను. ఎప్పుడో పుట్టబోయే పసికందుల జాతులను నిర్ణయించకపోతే ఏమిలోటో మరి! ఏ జాతని అనుకునేబదులు ఈ పిల్లలు రెండు

జాతులకు చేరినవారే అని తెంచితే తీరిపోయింది? పిల్లలు పెద్దవారయేటప్పటికి ప్రపంచములో ఇంకా ఎన్ని మార్పులు వస్తాయో! మునుండి ముద్దూ ముచ్చటలు ఆశించే తాతలు అవ్వలు వారివారి పద్ధతుల ప్రకారం అన్నీ చేయవచ్చుగా? తప్పేమీ లేదుగా? పదిమంది సంతోషించే విషయమేగా?

ఇలాంటి విషయాలలో అమ్మలకు పట్టింపు ఎక్కువ. కాని, వారి సుఖశ్రేయస్సుకోరడం వారిని దీవించడం పెద్దమనిషితరహాగాను మాతృప్రేమకు ఒక వుదాహరణంగానూ వుంటుంది. పిల్లల సుఖం కోరే పెద్దల మాటలు వినలేదని పట్టింపుతో పిల్లల జీవితంలోని మొదటిమెట్టుమీదే శపించడం చాలా అసమంజసం. కని పెంచినవారు మాటవినలేదని బాధపడటం సమంజసమే. పిల్లలు అదేపనిగా బాధ పెట్టడానికి పూనుకొని ఈ పనులు చేయటంలేదుగా? వారి రాతకొద్దీ ఇలా జరుగుతుందంతే. అమ్మా నాన్నా బాధపడుతారనే భయంతో ప్రేమకు స్వస్తిచెప్పి జీవితాంతం మనస్సులో ఈ బాధ దాచుకోవడంకన్నా కని పెంచి పెద్దచేసిన వారికి ఈ విషయంచెప్పి, తన సుఖమును చూడమని అడిగిన ఓ అమ్మాయి విషయం ఏమయిందంటారు? కాదంటే కాదన్నారు. యిక చేసేదిలేక అందరిని వదిలి వెళ్ళిపోయింది. పెళ్ళయింది. బంగారులాంటి భర్త సుఖంగా వున్నారు. కానీ అహం అడ్డు వస్తున్నా, నాన్నా అమ్మ కూడా దాని కాపురం వచ్చిచూడలేదు. ఇదేపరిస్థితులలో మా బంధువులలో అమ్మాయి ప్రేమకు స్వస్తిచెప్పింది. మరచిపోవాలని చాలా ప్రయత్నించింది. ఆ అబ్బాయి పెళ్ళి చేసుకొందే చేసుకోకూడదని కాచుక కూచుంది. ఏమి ప్రయోజనం? ప్రేమే గొప్పదయితే నెగ్గుతాము, జాతులు అడ్డురావు అని కూర్చున్నా డా అబ్బాయి. ఇంట్లో పోరు పడలేకపోతోం దా అమ్మాయి. ఇప్పటికి 'సరే' అనలేదు, కన్నవాండ్లు. సినిమాలలోవున్న తల్లి, తండ్రులను తిట్టుకునే పెద్దవారు నిజంగా రోజూ వుండేది చాలా కఠినంగానే, చాలా ఆశ్చర్యకరమయిన విషయం!

రెండేళ్ళముందు ఇంకో దగ్గర చుట్టం అమ్మాయి తాను చేసుకుంటానన్న అబ్బాయిని సమ్మతించనందున రిజిస్టరుపెళ్లి చేసుకుని కట్టు గుడ్డలతో అత్త వారింటికి వెళ్ళింది. నా అనేవారు లే రా దంపతులకు. ఆ కోడలిని కూతురిగా చూసుకుంటున్న అత్త మామల గొప్పగుణాన్ని ఏమనాలి? మానవత్వమున్నవారు, మంచివారు ఏ లోటూ లేకుండా చూచుకుంటున్నారు. పెళ్ళివిషయం విని నోరు నొక్కుకున్న సంఘం యిప్పుడు వారిని వేనోళ్ళ పొగడటం దేనికి? పెద్దవారి అండవున్నందుకేనా? ఇది లేనివారికి చాలా కష్టాలున్నాయి. పెద్దవారు లోకం పోకడతెలిసినవారు యిలాంటిపెళ్ళిళ్ళకుఅండగానిలిస్తే పది కాలాలపాటు అందరిలాగా వచ్చిన చిక్కులను తమలోతాము లేక పెద్దల సహాయంతో సద్దుకొని విడాకుల కోర్టుదాకా పోకుండా చల్లగా వుంటారుకదా?

స్త్రీలకు సమాన హక్కులను ఇస్తున్న ఈ ప్రభుత్వం, స్త్రీల కనుకూలంగా ముఖ్యంగా ఇలాంటి విషయాలలో మను శాస్త్రాన్ని మారుస్తున్నదని ఆడిపోసుకుంటున్నారు. కన్నపిల్లలమీద జాలిలేనివారికి ప్రభుత్వమన్నా అండగా లేకపోతే ఎలా? కాలంకొద్దీ చేయబడ్డ ఈ శాస్త్రాలు మారడం సంఘంలోని మంచిని పెంపొందిస్తుంది.

మా పక్కయింటి అబ్బాయి తన కోరిన అమ్మాయిని చేసుకోవాలనుకొని వారి పెద్దల నడిగితే కాదన్నారని, ఇద్దరు బావిలో దూకి చనిపోయారు. ఇల్లాంటి ఘోరాలు జరక్కుండా కాపాడటం అందరిమీద వుంది.

వీలయినంతవరకు పిల్లలు పెద్దలమాట ప్రకారం చేసుకోవడం మంచిది. అన్ని విధాల మంచిది. పిల్లల సుఖం తప్పకుండా వారు గమనించి చేస్తారు. కానిపిల్లల ఇష్టాయిష్టాలనుకూడా గమనించాలి. ఒక్క రోజువిషయంకాదు, జీవితాంతం ఉండాల్సిన బంధం. దానిని పునీతంగావుంచాలని అందరు శ్రమపడాలి. తల్లి తండ్రులు పిల్లలు ఒక్కమాటగా వుండి బయటివారు తమనుగూర్చి మాట్లాడేందుకు అవకాశం యివ్వకూడదు. కొందరి రాత వేరుగా వుంటుంది. ఇంతసృష్టిలో కొందరు తమ తమ వరులను, వధువులను తామే చూచుకుంటారు. అటాంటప్పుడు వారికి కావలసినంత సహాయం అన్నీ తెలిసిన పెద్దలు చేస్తే వారు జీవితాంతం హాయిగా అందరివలే గడుపుకుంటారు. పిల్లలు మాట వినడం లేదని బాధపడి వారిని పెళ్ళిచేసు కోనివ్వకుండా వుండటం మంచిపనికాదు. వారివారి కర్మకింద జమకట్టి అయినా, అశాంతి తొలగించడానికి ప్రయత్నించడం పెద్దలకున్న అన్ని విధములయిన కర్తవ్యాలలో ఒకటి.

ఇంత ముందుపడ్డ సంఘం యిప్పటికీ ఒక కన్య మనస్సులో వేరేజాతి అబ్బాయిని చేసుకుంటే ముప్పులకు భయపడి, పెండ్లి మానుకోవడం ఏమయినా బాగుందా? మన మెక్కడి కెళ్తున్నాము?

★

ఎప్పుడూ ఇంతే—117

శంకర్





వనితా వాణి

పిల్లలూ - ఆటవస్తువులూ

ఏ ఒక్కరిద్దరు పిల్లలున్నవారో అయితే పిల్లల యిష్ట ప్రకారం ఆటవస్తువులు కొనిపెట్టగలరు. కాని సమష్టి కుటుంబంలో వున్నవాళ్ళు పైగా గంపెడు పిల్లలున్నవాళ్ళు తమ బిడ్డల కనీసపు కోర్కెను కూడా తీర్చలేని వారు వున్నారు నేడు. ఏదైనా కొనిపెట్టే అందరికీ కొనియ్యాలి. అలా కొనియ్యడానికి ఆర్థిక యిబ్బందులేకాక, యింట్లో కొన్ని "లోకల్" పార్టీలుంటాయి. ఒక వేళ కొనిస్తే యింట్లో పెద్దలు "పిల్లలు అడిగిందంతా కొనిచ్చి వాళ్ళను పాడుచేస్తున్నారు, వాళ్ళను యెక్కడుంచాలో అక్కడుంచడం మంచి"దని నానా మాట లంటారు. పిల్లవాళ్ళకు ఏది అడగడం, ఏది అడగకూడదో అనే జ్ఞానంవుంటే వారు పెద్ద వాళ్ళ కన్నా మిన్నగావుండేవాళ్ళు కదూ!

సరోజా నాగలక్ష్మి (అనంతపురం)

* * *

"మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారు తమ పిల్లలకు ఎటువంటి ఆటవస్తువులు కొనాలో, వాళ్ళకి యెటువంటివి యిష్టమో ఆలోచించకుండా, యేదో వాళ్ళకి కనిపించింది, తోచింది తీసుకొచ్చిస్తారు. కాని అవి పిల్లలకు నచ్చకపోవచ్చు, దానికి పెట్టిన డబ్బు దండగైపోతుంది. ఇంకో రకంవాళ్ళు యింట్లో వాళ్ళ భార్యలు యేదైనా కొంటే "డబ్బు అంతా దండగ చేశావు" అని వాళ్ళని దుయ్యబడ్తారు. కొంత మందికి వాళ్ళ పిల్లలకి ఆట వస్తువులు కొనాలని అసలు తోచనే తోచదు. ఇటువంటి రకాల కుటుంబాలవారికి కోమలాదేవిగారి వ్యాసం యెంతైనా పనికివస్తుంది. డబ్బున్నవాళ్ళ సరేసరి, వాళ్ళ పిల్లలు యేది అడిగితే అది వెంటనే తెచ్చిస్తారు. ఇక ఆట వస్తువులు కొనడానికి స్తోమత లేనివారు, కోమలాదేవిగారు వ్రాసినట్లు చెంచాలు, చిన్న పాత్ర సామానులు పనికిరాని పుస్తకాలు వాళ్ళ పిల్లలకిచ్చి సంతోషపడ్తారు.

రంగ (విశాఖపట్నము)

మీరేం చేస్తున్నారు

అసలే ఉద్యోగాలు దొరక్క నానా అవస్థలు పడుతున్న ఈ రోజుల్లో ఆడా, మగా, బీదవారు, ధనవంతులు అంతా ఉద్యోగాలకని ఎగబడితే ఎక్కడ ఉద్యోగాలు దొరుకుతాయని. పోతే బాగా ధనవంతులు ఉద్యోగం చెయ్యటం అనవసరమని నా ఉద్దేశ్యం. ఏమలంటే ఆ ఖాళీఉంటే ఇంకొక బీదవానికి జీవనాధారం కల్పించినవారు అవుతారు. చదుకొన్నంత మాత్రాన ఉద్యోగం చెయ్యాలనేఉందా? విజ్ఞానాభివృద్ధికి చదువుకోవచ్చు. అట్లాగని ఉద్యోగం చెయ్యటం తప్పని నే నన్ను. అవసరముంటే తప్పక చెయ్యవచ్చు.

ఓ. ఇందిరాకళ్యాణి (పాలకొండ)

మధ్యతరగతి మహిళలు

ఈ రోజుల్లో కాలేజీల్లో చదివే ఆడపిల్లల పరిస్థితి చాలా విషాదంగా వున్నది. ఇందులో విద్యార్థినులు కూడ విద్యార్థులవలె ప్రవర్తిస్తున్నారు. తమ తోటి విద్యార్థినిపై ఈర్ష్యచెంది, వున్నవి లేనివి కల్పించి తమ స్నేహితులకు లేక సోదరులకు (విద్యార్థులకు) చెప్పి బాధపెట్టుచున్నారు. ఇదే మంచి సమయమని విద్యార్థులు నానా హంగామా స్తూంటారు. ఇటువంటివి ఎన్ని ప్రచురించినా బుద్ధిరాదు!

వి. శాంత (కడప)

స్త్రీలు—ఉద్యోగ సమస్య

"వాణి" గారు వ్రాసిన "స్త్రీలు—ఉద్యోగ సమస్య" అన్న వ్యాసం చదివిన మీదట నాకు తోచిన నాలుగు ముక్కలు వ్రాస్తున్నాను. స్త్రీ పురుషులతో సమానంగా ప్రతి ఉద్యోగానికి సిద్ధం కావటం అంత బాగుండదని నా అభిప్రాయం. వారు తమ ప్రకృతికి సరిపడే ఉద్యోగాలు ఎన్నుకుంటే అన్నీ సవ్యంగానే జరిగిపోతాయి. నా ఉద్దేశంలో మహిళలకు తగిన వృత్తులు మూడే—ఉపాధ్యాయినీ వృత్తి, వైద్యవృత్తి, న్యాయవాద వృత్తి. ఇతర వృత్తులు, ఉద్యోగాలు వారికి అంత అనుకూలమైనవి కావు. ప్రభుత్వం కూడా ఈ విషయం గుర్తించి పై మూడు వృత్తులలో స్త్రీలకే ప్రాముఖ్యం ఇవ్వాలని నా కోరిక.

టి. ప్రసూన (కలకత్తా)

* * *

పెళ్లికాని స్త్రీ ఉద్యోగ రంగంలో ప్రవేశించుటవలన ఆమెకు ఎదురగు సమస్యలను వాణిగారు విపులంగా వివరించారు. ఆ సమస్యలకు భయపడి ఉద్యోగావసరము, అవకాశాన్ని కూడ విడిచిపెట్టి పెళ్లికాని స్త్రీలు ఇండ్లలో కూపస్థ మండూకములవలె కూర్చొనవలసి వస్తున్నది. అందువలన మన దేశపు స్త్రీలు అన్ని రంగాలలోను వెనుకబడి ఉంటున్నారు. వాణిగారి వ్యాసము చదివైనా ఉద్యోగరంగములో ఉన్న స్త్రీలను (అవివాహితలను, వివాహితలను) కష్టపెట్టే మాటలు, నిందలు మోపకుండా ఉంటారని తలంచుచున్నాను. ఈ వ్యాసము చదివిన తరువాత ఈ సమస్యలను ఎదుర్కొనే ధైర్యంతో అవివాహితలైన స్త్రీలు ఉద్యోగాలలో ప్రవేశిస్తారని ఆశిస్తున్నాను.

కె. ప్రమీల (దుగ్గిరాల)

* * *

స్త్రీ పురుష అనే తారతమ్యం లేకుండా ఈ రోజులలో ప్రతివారు ఎంతో కొంత సంపాదించి కుటుంబానికి సహాయపడటం అవసరం. మగవాడే సంపాదించాలని భీష్మించుకుని కూర్చుంటే సంసారం బోల్తాకొట్టక ఏమవుతుంది? అయితే స్త్రీలు ఉద్యోగాలు చేసి సహాయపడటానికి తగిన పరిస్థితులు ఏర్పడాలి. ఉద్యోగాలు చేసే మగువలంటే సమాజంలో చులకన భావం పోవాలి. బూజుపట్టిన భావాలకు స్వస్తి చెప్పి, విశాల దృక్పథం అలవరచుకోవాలి.

ఎం. సుశీల (విజయవాడ)

* * *

ఒక గ్రామంలో ఒక స్త్రీ ఉద్యోగం చేస్తుందంటే ఆ గ్రామంలోని మగవారు ఆమెను అల్లరి చేసి పరాభవించుటకు చూస్తారు. సాటి స్త్రీ అనే జ్ఞానం లేకుండా ఆడవారు కూడా ఆక్షేపణలు, హేళనలు చేస్తారు. ఇటువంటి హేళనలు, ఆక్షేపణలు చేస్తుంటే ఏ స్త్రీ కూడ ఉద్యోగం చేయుటకు ముందుకు రాదు.

జె. సుజాత (మోరి)

* * *

స్త్రీల ఉద్యోగాలు గురించి చాల బాగా రాశారు. సామాన్య గృహిణి పడే బాధలు, బాధ్యతలు పూర్తిగా వివరించి రాశారు.

ఆర్. వి. జి. కృష్ణవేణి (సుబ్బమ్మపేట)

* * *

మగవారికే ఉద్యోగాలు దొరకటం గగనంగా ఉన్న యీ కాలంలో స్త్రీలు కూడా ఉద్యోగాల కోసం ఎగబడటం దేనికో అర్థంకాదు. ఇల్లూ, వాకిలి వదిలి ఉద్యోగాలంటూ తిరిగితే సమస్యలు ఎదురవుతాయంటే వింత ఏముంది! మీరు ఏమైనా అనండి మన సోదరీమణులు పాశ్చాత్యులను అనుకరించటం ఈమధ్య మరీ ఎక్కువయింది. దీనివల్ల కలిగే అనర్థాలు ఎవరికి వారు తెలుసుకోవలసిందే గాని, విడమరచి చెప్పవలసిన పనిలేదు.

డి. రత్నమ్మ (విశాఖపట్నం)

* * *

ఉద్యోగావసరం లేకపోయినప్పటికీ, కాలమును వృథా చేయక గ్రంథాలయమునకు వెళ్లి చదువుకొనే స్త్రీలు గూడ చాలా యిబ్బందులు పడుతున్నారు. అటు వెళ్లె, ఇటు బస్తీ గాని వూళ్లలో ఉత్తమ సాహిత్య పఠనం చేయాలనే సదుద్దేశంతో వస్తున్నవారిని సంఘపు చీడపురుగులు కన్పించి ఎక్కడకు వెళ్తున్నావు? ఎప్పుడూ తిరగడమేనా? అనే ప్రశ్న పరంపరలతో చికాకు, భయము కల్గిస్తారు. ఆ అమ్మాయి అటు పోగానే ఫలానావారి అమ్మాయి ఎప్పుడూ ఆ లైబ్రరీ చుట్టూ తిరుగుతూ, మగవాళ్లతో కలసి ఉంటుందట అని కల్పనచేసి చాటింపు వేస్తారు.

కె. లక్ష్మి వెంకటేశ్వర్ (దుగ్గిరాల)

★

ఆంధ్రసచిత్రవారపత్రిక

నవలా రచన పోటీ

బహుమతి రు. 1000

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో సాంఘిక నవలా రచనకు మరొక పోటీ నిర్వహించదలచామని తెలుపటానికి సంతసిస్తున్నాము.

[15-12-1961 గడువుగా పెట్టిన నవలలపోటీ ఫలితాలు త్వరలో తెలుపుతాము. ఇది మరొక పోటీ.]


ఈ పోటీకి పంపే నవలలు మా కార్యాలయానికి 1-5-1962 లోగా చేరాలి.

నిబంధనలు

- రచనలు కాగితానికి ఒక వైపునే వ్రాసి ఉండాలి.
- 250 అరఠావు (ఫుల్‌స్కేప్) పేజీలు మించి ఉండరాదు.
- కథా వస్తువు నేటి ఆంధ్రదేశం సాంఘిక జీవితానికి సంబంధించి ఉండాలి.
- రచనలు స్వంతమయినవిగా ఉండాలి. అనువాదాలు పంపకూడదు.
- పోటీలో తుది నిర్ణయం సంపాదకులదే. ఈ విషయంపైన ఉత్తరప్రత్యుత్తరాలు జరుపబడవు.
- రచనలు త్రిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజి జతపరచి పంపాలి.
- పోటీలో బహుమతి పొందని నవలలు యోగ్యములయితే విడిగా ప్రచురిస్తాము.
- బహుమతి నవలకు సంబంధించిన అన్ని హక్కులూ ఆంధ్ర సచిత్ర వారపత్రికకే చెంది ఉంటాయి.

రచయితలు ఎప్పటివలె మాతో సహకరించి ఈ పోటీ జయప్రదం చేయగోరుతాము.

ఇంతకుముందు పోటీకి నవలలు పంపినవారందరికీ కృతజ్ఞులము.



జరిగినకథ

రామవరం ఆంధ్ర - ఒరిస్సా రాష్ట్రాల పరిహద్దు ప్రాంతంలో ఒక గ్రామం. శ్యామబాబు అక్కడ దిగి, ఆ ఊరి లోనే వైద్యవృత్తి చేసుకుంటున్న రాధా శాధమిశ్రా గారిని కలుసుకుని ఆయన సహాయంతో ఉద్యోగం సంపాదించుకుంటాడు. రామవరంలోని మిల్లు యజమాని సత్యనారాయణరావుగారు తన పిల్లలకు శ్యామబాబు ట్యూషన్ చెప్పే ఏర్పాటు చేయిస్తాడు. నారాయణి మిశ్రాగారి పనిమనిషి. మిశ్రాగారు త్రాగుబోతు అయినా చాలా మంచివాడు. ఒకరోజున పోలీసులు ఆయనను పట్టుకుంటే శ్యామబాబు జరిమానా చెల్లించి విడిపిస్తాడు. మిశ్రా కొదుర్వ్యసనం పోగొట్టేందుకు శాయశక్తుల ప్రయత్నిస్తాడు. మిశ్రాను విడిపించుటకు హామీ ఇచ్చిన సూర్యప్రకాశరావు పేకాటలో ధనం పోగొట్టుకొని ఆత్మహత్యకు పూనుకొనగా శ్యామబాబు రక్షిస్తాడు. మిల్లు గుమాస్తా ధర్మనూరి కుమార్తె లలితను చూసి శ్యామబాబుకు పూర్వస్మృతులు వస్తాయి. లలితను వివాహం చేసుకోవాలని, ధర్మనూరి మేనల్లుడు శంకర్ ధర్మనూరిగారింటికి వస్తాడు.

“బాబావేమో........పాము........” అని శీను అంటుంటే లలిత, “అమ్మో!” అంది. బావ కేమి చ్చిందో అని ఆమె గజగజ వణికిపోయింది. లేచి నుల్చుంది. శీను, “ఏం జరిగిందంటే కాస్తుంటే పాము కరచేసును” అనగానే లలితకు పెద్ద దుఃఖం వచ్చింది. కాళ్ళు చచ్చుబడిపోయాయి. ఇంతట్లో వీధుల్లోంచి శంకర్, రామూ నవ్వుకుంటూ రావడం చూసింది.

అమితవేగంగా కొట్టుకుంటున్న ఆమె గుండెలు కుదుటబడ్డాయి.

జగదాంబ, “అస లేం జరిగిందిరా?” అని అడిగింది.

“అదికాదే. నేనూ, అన్నయ్యా, బావా తోట్లో కెళ్ళామే. అక్కడ కొన్ని మామిడికాయలు కోసామే. ఇంతలో ఇంకోచెట్టు దగ్గరకెళ్ళి ఇంకా కొన్ని కాయలు కోద్దామనుకున్నాం. ఇంతలో బావ—ఇలా—కాలు ఎత్తి వెయ్యబోతూంటే రామూ ‘పాము’ అని అరిచాడు. బావ వెంటనే వెనక్కి ఒక అడుగు వేశాడు. తీరా చూస్తే, పెద్ద తాచుపాము అలా పాకి వెళ్ళిపోయింది.”

లలితకు మొహం తిరిగినట్లైంది. ‘తాచుపామే?’ అంది. వీధిలో కన్పిస్తున్న బావని చూస్తున్నా ఆమెకు భయం తగ్గలేదు. పాము! అది కాటేస్తే ఇంకేమన్నా వుందా? బావ......! లలిత కళ్ళమ్మట నీళ్ళు కూడా వచ్చాయి. ఎంతపని జరిగింది.

“నయం. ఇవాళ లేచినవేళ మంచిది. వెంకటరమణ మూర్తి దయవల్ల అపాయం తప్పిపోయింది” అంది జగదాంబ ‘అమ్మయ్యా’ అనుకుంటూ, లేక పోతే ఇంకేమన్నా వుందా? ఊళ్ళో పాముల మంత్రగ డున్నాడనుకో. అయితేనేం? ఎంత ప్రమాదం?

ఇంతట్లో శంకర్ లోపలికి వచ్చాడు. “ఏ బావా! ఎందు కూరికే వాళ్ళని ఖంగారు పెట్టేను స్నావ్?” అన్నాడు.

జగదాంబ, “తాచుపాము నీకాళ్ళక్రింద పడ బోయిందటకదా ? ఎంత ప్రమాదం తప్పింది లేచినవేళ మంచిది” అంది శంకర్‌తో.

“లేవగానే నేను లలితమొహం చూశాను” అన్నాడు శంకర్.

లలిత ఏదో అనబోయి, సిగ్గుపడిపోయింది. నిజమే అవాళ ప్రొద్దున్నే, తనే కచ్చికా, పొటాకూ, చెంబుత నీళ్ళు పట్టుకొని, “లేచి మొహం కడుక్కో బావా అమ్మ కాఫీ కలిపేస్తోంది” అని బావను లేపింది బావ లేస్తూనే, “ముందర కాఫీ యియ్యి. తరువాత మొహం కడుక్కుంటాను” అన్నాడు నవ్వుతూ ప్రక్కనున్న నాన్నగారుకూడా నవ్వారు. తను నీళ్ళూ అవీ అక్కడ పెట్టేసి లోపలి కొచ్చేసింది.

జగదాంబ శంకర్‌తో, “పోనీ మంచిదే నాయనా లలితను పెళ్ళి చేసుకున్నావంటే రోజూ లేచేటప్పుడ దాని మొహం చూడచ్చు” అంది నవ్వుతూ, మెల్లిగ తన మనస్సులో వున్నమాటను బయటపెట్టూ లలిత, తల్లివేపు కోపంగా చూసింది. కాని, ఆవె చెవులుకూడా జగదాంబ చెవుల్లాగే శంకర్ ఏమం టాడా? అని ఎదురు చూస్తున్నాయి.

“అదెలాగా తప్పదుకదా! అత్తా” అన్నాడు శంకర లలితవేపు చూస్తూ. సిగ్గుముంచుకువస్తోంటే, లలి అక్కడనుంచి లేచి పెరట్లోకి వెళ్ళిపోయింది.

"ఓసేయ్! ఎక్కడికి పోతావే? ఈ బూంది అంతా వుండలుకట్టు. అసలే వంటాలస్యమై పోతోంది" అని జగదాంబ కేక లేసింది. రాముా, శీనూ నవ్వారు. జగదాంబ శంకర్‌వేపు తిరిగి, "నీ తల్లికడుపు చల్లగా వుండాలి. మా కెంతో సంతోషంకలిగించే మాటన్నావు నాయనా. అది పుట్టిన దగ్గర్నుంచి నీ భార్య అనుకొన్నాము. మా కే చికాకు లొచ్చినదగ్గర్నుంచి......" అని ఏదో చెప్పబోతూంటే, పెరట్లోంచి లలితవచ్చి, "నువ్వూరు కుంటావా? వూరుకోవా?" అంది తల్లివేపు కోపంగా చూస్తూ.

"అదికాదే......" అని జగదాంబ ఏదో అన బోతూంటే,

"బావ కన్నీ తెలుసునులే. నువ్వు ఏమీ చెప్ప నక్కరలేదు. నాన్నొచ్చే వేళయింది. తొందరగా వంటకానియ్యి" అంది లలిత.

జగదాంబ వంట పూర్తికావచ్చింది. ఆమె మనస్సు ఆనందంతో తేలిపోతోంది. శంకర్‌కు లలితను చేసుకోవాలని వున్నట్లు స్పష్టమైంది. ఇహ పెద్ద వాళ్ళను కదిపి కార్యం జరిగేటట్లు చూడాలి. భగ వంతుడు దయదలిస్తే వాళ్ళు కూడా శంకర్ యొక్క ఇష్టానికి వ్యతిరేకంగా వెళ్ళలేరు అనుకొంది.

ధర్మసూరిగారుకూడా వచ్చేశారు. అందరూ భోజనాలకు కూచున్నప్పుడు, రాముా, శీనూ తోటలో జరిగిన సంగతి చెప్పారు. ఆయనకూడా పెద్ద ప్రమాదం తప్పిందని సంతోషించారు. జగదాంబ భర్తతో లలిత పెళ్ళి గురించి వీలైనంత త్వరగా శంకర్ తలితండ్రులతో మాట్లాడమంది. ధర్మ సూరిగారు శంకర్ వైపు చూసి, "నువ్వేమంటావు?" అని అడిగారు. అతను, "మీ అందరి యిష్టము ఏదో నేనూ అదే అంటాను" అన్నాడు.

"అయితే ఇంతకీ మీనాన్న ఒప్పుకుంటాడా ?" అని అడిగారు ధర్మసూరిగారు. జగదాంబ, ఆ విషయం శంకర్ నడిగితే లాభమేముంది, వెళ్ళి వాళ్ళ నాన్ననే అడగమంది. శంకర్ ఏమీ అనలేదు. ధర్మసూరిగారు తాను పది పదిహేను రోజుల లోపల విశాఖపట్నంవచ్చి వాళ్లతో మాట్లాడతా నన్నారు.

శంకర్‌కు తన తలిదండ్రులు ఇచ్చే జవాబేమిటో తెలుసు. తనకిమాత్రం వాళ్లొప్పుకోకపోయినా లలి తను చేసుకోవాలని వుంది. ఒకవేళ ధర్మసూరిగారి మొహంచూసి ఒప్పుకుంటారేమో? ముందుగానే తను ఏ విషయమైనా పైకనడమెందుకు?

ఆరోజు మధ్యాహ్నం శంకర్ శ్యాంబాబువద్దకు వెళ్లాడు. శ్యాంబాబు అతని చదువు గురించి, కాలేజీ గురించి, భవిష్యత్తుగురించి అడిగాడు. శంకర్ ఎమ్. ఎస్ సీ. చదవాలనుకుంటున్నాడు. పరిశ్రమ లకు సంబంధించిన కోర్సు ఎదైనా చదవాలనుంది అతనికి. పెద్దపెద్ద పరిశ్రమలను ప్రారంభించా లని అతని ఆశయం.

శ్యాంబాబు అతనితో దేశంలో పరిశ్రమల యొక్క స్థితిని చర్చించాడు. ఒక్కొక్క పరి శ్రమ గురించి శ్యాంబాబు మాట్లాడుతూంటే శంకర్‌కు చాలా ఆశ్చర్యం కలిగింది. సాంకేతిక, నిర్వహణల విషయాలన్నీ శ్యాంబాబు విపులంగా శంకర్‌కు చెప్పుకువచ్చాడు. ఏ యే పరిశ్రమలకు దేశంలో భవిష్యత్తువుందో, అవి యేవిధంగా ప్రారం భించాలో అన్నీ శంకర్‌కు చెప్పాడు. వాటికి కావలసిన ముడిపదార్థాలూ, అవి పనిచేసే పద్ధతులూ, వాటిని ఏవిధంగా నిర్వహించాలో అన్నీ చెప్పాడు. శంకర్‌ను వీలైతే ఒకసారి విదేశాలు వెళ్ళి అన్నీ చూసిరమ్మన్నాడు. విదేశాలలోకూడా కొన్ని కొన్ని సంస్థలు పనిచేసే తీరు వర్ణించాడు.

ఈ విషయాలన్నీ వింటూంటే శంకర్‌కు

—50వ పేజీ చూడండి

భవానీ స్తుతి

శొంఠి సీతారామయ్య

భైరవిరాగం త్రిపుటతాళం: క్రియకు ఒక అక్షరము - చౌకకాలము | అక్షరం జాగా. 20-వ మేళకర్త - నటభైరవి జన్యం
భాషాంగ రాగము సంపూర్ణ సర్వగమకవరిక రాగం.
షడ్జమం: చతుశ్రుతిరిషభం - సాధారణ గాంధారము. శుద్ధ మధ్యమం - పంచమం.
ఆరోహణలో చతుశ్రుతిదైవతము అవరోహణలో శుద్ధ దైవతము కైశికీ నిషాదము పల్కును.

రి గ రీ సా - స ని ధా పా - మ ప దా - ప ద నీ - ద ని సా రీ - ని స ని గ రి సా, రి స రి గ మా
ప మ గా రీ - రి స రి గ మ పా - రి గ మా - ప ద మా పా - ద ప మా - ప ద నీ - ద ని సా
ని స ని రి స ని ద ప - ద ని సా రీ - రి గ గ రి సా - ని స ని రి స రి - ని స ప ద మ ప
గా రి స - రి గ మ ప దా - మ ప ద ని సా - ప ద ని స రీ, ద ని స రి గా - ని స
రి గా రి - స రి ని స ప ద - మ ప స ని ద ప - మ ప గా రి స - స రి నీ ద ప - ద ని సా - ని స రీ సా.

పల్లవి: భైరవీప్రియే - భవాని - పరదేవతే - పాహిమాం పార్వతే ||
పరాత్పరి - పరమేష్టి - పీఠికా పురాధీశ్వరీ || ||భైరవీ||

అనుపల్లవి: శ్రీ రాజ - రాజేశ్వరీ - శ్రీ కుక్కుటేశ్వర - హృదయేశ్వరీ |
సర్వశాస్త్ర - కోవిద సంసేవితే - శార్వాణి - సకలాగమ సన్నుతే || ||భైరవీ||

చరణము: పాద గయ క్షేత్ర తీర - నివసితే - సదాశివ సహితే - శివే - మహితే
సదానంద - విలాసితే సలలిత లావణ్య లతాంగే |
మృగుతర - సుధా మాధుర్య - మోద హృదయే - సదయే - స్కాంద జననీ
ఆద్యంత రహితే - అన్నపూర్ణె, సతీనతే - సీతారామ బుధవినుతే || ||భైరవీ||

పల్లవి:

| , - మ ప | ద ని | సా | రి సా | నీ | దా | ప మ ప | ప మ గా | రీ సా | రి గ మ ప ద ని | స రి స ని | స ని దా
| , భై - | ర - | వీ | ప్రియే | భ | వా | నీ - పర | దే - - | వ తే | పా - హి - | మాం | పార్వ
| పా - మ ప | ద ని | ద ని సా | ని స రీ సా | సా రీ | స రి స ని | ద ప - మ ప ద ప | ప మ గా | రీ సా | రి గ మ ప ద ని |
స రి గ రి | స ని దా
| తే - భై - | ర - | వీ - - | ప్రి - యే | భ - | వా - - | - ని - ప - ర | దే - | వ - తే | పా హి
మాం - | పా ర్వ -

భవానీస్తుతి

పా - మా పా | మ ప ద ని | ద ని స రి | ని స రి గ స రి | రి గ గ రి | స రి స ని | ద ప మ ప ద ప | ప మ గా | గ రి సా
రి గ మ ప ద ని | స రి గ రి | స ని దా

| శే - ల - | ఠ - - | ఠి - - - | శ్రీ — చక్ర | భ — | వా — | ని - వ - ర - | దే - | వ - తే |
పా — హి | మా — ం | పార్వ

| పా - మా పా | మ ప ద ని | ధ ని స రి | రి గ మ గ గ రి | రి గ రి స | స రి స ని | ద ప - మ ప ద ప | స ని ద ప | మ గ రి స
రి గ మ ప ద ని | స రి గ రి | స ని ని ద

| శే - ల - | ఠ - - | ఠి - - | శ్రీ — చక్ర | భ — | వా — | - ని - వ - ర - | దే — | వ - తే |
పా — హి | మా - ం | పా - ర్వ -

| ద ప - మా | ప ని | ద ప | మ ప గా | రీ | సా | , - రి స | పా | రీ | రి గ మ ప ద ప | ప మ గా | రీ |
| తే - వ | రా | త్రి | ప - ర | మే | శ్వ | , - శి | వ | కా | పు - రా - - | ధీ - - | శ్వ |
| సా -
| రీ - ॥భైరవి॥

అనుపల్లవి :

| , - నీ | దా | పా | ద ప మా | ప ద | నీ | , ద ని | స స | సా | స సా | ని ద | ప ద
| , - శ్రీ | రా | జ | రా - జే | శ్వ | రీ | , శ్రీ - | కుకు | టే | శ్వర | హృద | యేశ్వ
| ని - నీదా | ద ని స ని | దా పా | ద ప మా; | పా దా | ప ద ని ద | నీ - ద ని | స రి | సా | స సా | స ని ద ప | మ ప ద ని
| రీ - శ్రీ | రా - - | - జ | రా - జే | శ్వ - | రీ - - | - శ్రీ - | కుకు | టే | శ్వర | హృద - | యే - శ్వ -
| సా - రీ | స రి గ రి | స ని ద ప | ని ద ద ప మా | ప ద నీ | ద ని సా | సా - ని స | రి గ | స రి | రి గ గ రి సా | స ని ద ప | మ ప ద
| రీ - శ్రీ | రా - - | - - జ | రా - జే | శ్వ | రీ - | - - శ్రీ - | కుకు | టే | శ్వ - ర | హృద - | యే శ్వ
| సా - ని స రీ | రి గ రి స | స ని ద ప | ని ద ద ప మా | ప ద నీ | ద ని సా | సా - నీ సా | నీ స రీ | స రి గా | రి గ మా గా
గ మ గ రి | మ గ గ రి

| రీ - శ్రీ - రా - - - జ | రా - జే శ్వ - | రీ - - శ్రీ కుకు | టే - | శ్వ - ర |
హృ - ద | యే - శ్వ -
| సా - నీ సా | నీ గా | రీ గా | స రి గ రి సా | స ని ద ప | మ ప మ గ | రి స - ని స రి గ | మ ప ద ని | స రి గ రి |
స రి స ప ద | మ ప మ గ | రి స రి గ.

రీ - సర్వ | శా - | స్త్ర - | కో వి - దా | పం - - | డి - వి - | తె - శా - | ర్వ - | జి - |
వ - శీలా | గ — మ | వన్న |

| మ ప
| తే - ॥భైరవి॥

చరణము :

| , ద ద | ప ద | ప మ | ప ద నీ - స ని - ద ని | స - స ని | గ రి | స రి | స ని దా పా | మ ప ద ప | మ గ రీ సా
| , పాద | గయ | క్షేత్ర | తీ - ర - నిజ - అసి | కా - శ | దా - | శివ | సహి తే | శి - వే | మ - హి
| సా - ని స | రి గ | రి స | గ రి స - రీ గా - రి గ మా | మా - పా దా | నీ నీ | దా పా | ద ని సా సా - ని స రీ - స ని దా
| తే - సదా | నం | - ద | విలా - సి - - తే - - | - స - | ల - | లిత | లా వణ్య - ల - తాం
| పా - నీ దా | ద ని స ని | దా పా | దపమా; | పా దా | ప ద ని ద | నీ ని స | రి గ | స రి | రి గ గ రి సా | స ని ద ప | మపదని
| గే - మ్బుదు | త - | ర - | సు - ధా | మా | ధు - | ర్య - మోద | హృ ద | యె | స - ద - యె | సా - ంద | జ - న
| సా - నీ సా | నీ గా | రీ గా | స రి గ రి సా | స ని ద ప | మ ప మ గ | రి స - నీ సా | రీ గా | మా పా | ద ని స రి గ రి
స ని ద ప | మ గ రి గ |

| నీ - ఆ - | ద్యం | త - ర - హి తే | అ - న్న | పూ — | ర్ణ - సి — | త్సే - | తె — | సీ - తా —
రా — మ | బుధవిను |

మ ప
| తే - ॥భైరవి॥

కవి సార్వభౌముడు

నోరి నరసింహ శాస్త్రి

జరిగిన కథ

పెదకోమటి వేమారెడ్డి శ్రీనాథభట్టును శ్రీ విద్యానగరమునకు విద్యావిజయప్రస్థానము చేయవలసిందని అర్థిస్తాడు. శ్రీనాథుడు విద్యానగరం చేర్తాడు. తనను జయించేందుకే శ్రీనాథుడు వచ్చాడన్న వార్త డిండిమునకు తెలుస్తుంది. శ్రీనాథుడు మానసోల్లాస కావ్యాన్ని అభిప్రాయార్థం అరుణగిరినాథులకు పంపుతాడు. డిండిముడా కావ్యాన్ని అవహేళన చేస్తాడు. శ్రీనాథుడు డిండిమునకు మానసోల్లాస కావ్యావహేళనంపై అధిక్షేపణపత్రం పంపుతూ కావ్యదోషాలు పండిత పరిషత్తులో నిరూపించమని డిండిమునికి సవాలు చేస్తాడు. శ్రీదేవరాయ ప్రభువుల సమక్షంలో పండిత పరిషత్తు మానసోల్లాస కావ్యం దోషరహితమని నిర్ణయించగా, ప్రతిన ప్రకారం శ్రీనాథుడు అరుణగిరినాథుల డిండిమమును నాశనం చేయిస్తాడు.

విడిదికి చేరినంతటనే శ్రీనాథుని ఆజ్ఞ గొని కొండవీటి కరణము మాచప్ప శ్రీనాథవిద్యావిజయవార్త పత్రికపై లిఖించి సర్వజ్ఞ సార్వభౌమ పెదకోమటి వేమారెడ్డి భూపాలునకును సింగన ప్రధానికిని అంచెగుర్రముల మీద కొండవీటికి చేర్చుటకు స్థానాపతి కప్పగించెను. అట్లు పంపిన వార్త పదవనాటికి చేరగలదు.

అంతట శ్రీనాథుడు లేచి భక్తిప్రపత్తులతో ఈశ్వరారాధన మొనర్చి మహేశ్వరనివేదితములైన పంచభక్ష్యపరమాన్నములతో మిత్రులతో గలసి విందారగించెను. లక్కనసూరిని రానాడు అనిదంపూర్వముగా వాచాలమయ్యెను. భోజనానంతరమున శ్రీనాథుడు సుఖముగా కొన్ని నెలల నిద్ర తీసెను.

అతఁడా సాయంకాలమున శ్రీదేవితోకలసి శ్రీపీఠమునకుబోయి, శ్రీ శంకరానంద భారతీ స్వాముల శ్రీ చక్రరాజార్చనము దర్శించి, శ్రీదేవీతీర్థ ప్రసాదములు గ్రహించి, పూజావసానమున వ్యవధానములో శ్రీగురువులకు వారి యమోఘాశీర్వచన వాక్కు ఫలవంతమైనదని విన్నవించెను. ఆ పిమ్మట వారు శ్రీ విరూపాక్ష స్వామిని గూడ దర్శించి తీర్థప్రసాదములు గ్రహించి వచ్చిరి.

వారు విడిదికి చేరునప్పటికి ప్రొద్దు పోయినది. విడిదికి ముందు భాగమున గల విశాల ప్రదేశములో తీవ్రముగా వివాద పడుచున్న దుగ్గన, పోతనల కంఠములు వారికి దూరము నుండి విన వచ్చినవి. దుగ్గన తన బావ డిండిము విజయమును బహు విధముల నగ్గించు చుండెను. పోతన దానిని నిర్లక్ష్యముగా నీసడించుచుండెను.

"బావ దీనితో సాధించిన ఘనవిజయమేమిటి ? ఎన్ని నెలల శ్రమ ! ఎన్నివిధాల డిండిములను పావము, మోసగించి తప్పుదారి త్రొక్కించినాడు! విన్న బావ పడిన యమయాతనయేనా ?— ఈ పరిశ్రమ ఏ మహాకావ్యము వ్రాయడానికో వినియోగిస్తే ఎంత బాగుండేది !"

అది విని శ్రీనాథుడు శ్రీదేవితో "విన్నావా, మీ తమ్ము లిద్దరి వివాదము ?— నీవు ఏ తమ్ముని పక్షము ఇందులో ?" అనెను.

—46వ పేజీ చూడండి





పాత్రపోషణలో మంచిచెడ్డల ఉమ్మడి
నేత్రపర్వంగా రచిస్తాడు శ్రీ గుమ్మడి
నానాటికీ తనకు తానే వరవడి
నటనలో దిద్దుకుంటున్నాడు ఒక్కుమ్మడి



జరిగినకథ

హాంబుర్గ్ నగర నివాసి ప్రొఫెసర్ లిడెన్‌బ్రోక్ ఒక పాత గ్రంథం సంపాదిస్తాడు. దానిలో ఒకత్వక్పత్రం దొరుకుతుంది.

'ఆర్నిసాక్నుస్సెమ్' అనే ప్రాచీన శాస్త్రజ్ఞుడు, ఐస్‌లాండ్‌లో ఆరిపోయిన ఒక అగ్నిపర్వతం ముఖద్వారంలోనుంచి భూగర్భంలోనికివెళ్లినట్లు అందులో వ్రాసి ఉంటుంది. తమ్ముడు కొడుకు ఆక్సెల్‌తో కలిసి ప్రొ॥ లిడెన్‌బ్రోక్ అక్కడికి ప్రయాణంకడ్తాడు. స్నాఫెల్స్ పర్వతంవద్దకు దారి చూపేందుకు వారు హాన్స్ అనే గైడ్ ను కుదుర్చుకుంటారు.

స్కార్టారిస్ శిఖరం దిగువన వారికి మూడు రంధ్రాలు కనిపిస్తాయి. మధ్య రంధ్రంమీద స్కార్టారిస్ నీడ పడేవరకు కనిపెటుకొనిఉండి, నీడపడిన రోజున ఆరంభంగా లోనికి దిగుతారు. కొంత దూరం వెళ్లేసరికి వారికి రెండుదార్లు కనిపిస్తాయి. తూర్పువైపు సొరంగం లోంచి పోగాపోగా ఆదారి ఒకచోట ఆగిపోతుంది. పొరపాటు తెలుసుకుని వారు మళ్లీ రెండుదార్లు చీలినచోటకు తిరిగివెళ్లి, రెండవ సొరంగంలో ప్రయాణం కొనసాగిస్తారు. అలసిపోయిన ఆక్సెల్ దప్పికతో మూర్ఛపోతాడు. హాన్స భూగర్భజల ప్రవాహాన్ని కనుగొని అతని దప్పిక తీరుస్తాడు. అంతా మళ్లీ ముందుకు నడుస్తారు.

24


మర్నాడు ఉదయానికి అంతదాకా పడ్డ కష్టాలు మరచిపోయాము. ఒక్కక్షణం దాహం ఎందుకు వెయ్యటంలేదా అని ఆశ్చర్యపోయాను. నా పాదాల వద్ద పారుతున్న ఏరు కావలసిన సమాధానం ఇచ్చింది.

భోజనం కానిచ్చాము. ఇనుము కలిసిన ఆ నీరు త్రాగాము. ఉత్సాహం తిరిగి వచ్చి, ఎంత దూరమయినా నడవటానికి సిద్ధంగా ఉన్నాను. మా పెదనాన్న నమ్మకమూ, మా గైడ్ చాతుర్యమూ, నా నిశ్చయమూ ఉన్న తర్వాత విజయము సంభవించక ఏమి అవగలదు ? ఈ దక్కటి వ్యూహాలు నా తలలో మెదిలాయి. స్నాఫెల్స్ పర్వతం మీదకి ఎక్కి వెళ్లిపోదామని ఉంటే కోపంతో త్రోసివేసేవాడిని.

కాని అదృష్టవశాత్తు దిగడం మాత్రమే అవసరం అయింది.

"పోదాం పదండి!" అని అరిచాను. నా ఉత్సా

44—వ పేజీ చూడండి



ఇల్లు కిరాయికి

యం. యస్. పతి

ఆరోజు ఆదివారం కాబట్టి మామ ఇంట్లోనే ఉన్నడు. అప్పుడే పేపరు పిలగాడు తెచ్చిన "ఆంధ్ర పత్రిక" చదువుకుంట వరండల కూసున్నడు.

నేనుమామకుకొంచెం దూరంగున్న ఒకకుర్చీల కూసొని నాజిందగీనిగురించి సోచాయించుతున్న.

ఇంతట్లనే ఒకాయిన కంపౌండుగేటు తీసుకుని లోపలికొచ్చిండు. లోపటికొస్తూనే మామను చూసి "నమస్కారమండి, రమణయ్యగారూ!" అని అన్నడు. మామ పేపరు మీదున్న నజర్ (దృష్టి) ఆయన మీదికి తిప్పి "హోహ్హో, మీరా! రండి రండి," అంటూ వరండలకు ఆహ్వానించిండు. ఆయి నొచ్చి మామపక్కకున్న కుర్చీల కూసున్నడు.

"ఏంపనిమీ దొచ్చింద్రు?" అడిగిండు మామ.

ఆయన జర్రసేపు నీళ్లుమింగినంక మామదిక్కు చూస్తూ ఇట్లన్నడు: "నేనుహైద్రాబాద్‌సిటీకి రావడం ఇదే మొదటిసారి. ఇక్కడ నాకు బంధువులు గానీ, తెలిసినవాళ్లుగానీ ఎవరూలేరు. ప్రస్తుతం హొటల్లో ఉంటున్నాను ......" అని కొంచెం సేపాగి మళ్లీ శురువుచేసిండు. ...... "మీకు ఈసిటీతో చాలా పరిచయమున్నవారు కాబట్టి కాస్త శ్రమనుకోకుండా మీరు మన ఆఫీసుప్రాంతంలో ఏ రెండు రూముల పోర్షను అద్దెకు చూసి పెస్తే ఫామిలీని తీసుకురావాలనుకుంటున్నాను."

మామ జర్రసేపు సోచాయించి "ఇప్పటికైతే ఖాళీ లెక్కడున్నవో నాకు తెలువదు. కాని రేపటి వరకు తెలుసుకొని చెప్త" నని అన్నడు. వచ్చినాయన పరేషన్నడు.

ఇంక జర్రసేపటికిదాక వాళ్ల ఆఫీసుమాటలు మాట్లాడుకున్నంక ఆయన వెళ్లిపోయిండు.

ఆయన పోంగనే మామ నాదిక్కుతిరిగి "పుల్లయ్యా!" అని పిలిచిండు.

"ఏంది, మామా!" అన్న.

"నీకు హైద్రాబాద్ సిటీతోటి మంచి ములాఖాతున్నదిగదా ......"

"ఊఁ!"

"మరయితే ఒక పని చేసిపెడ్తవా?"

"తెలిసింది చెయ్యి అదేందనో!"

"ఏందనో చెప్పు చూస్త."

"అదే ఇప్పుడొచ్చినాయినకు ఒక ఇల్లు కిరాయికి దొరుకుత దన్కుంటవ్?"

"అంతే! చెప్పకముందే తెలుసుకున్నవ్. పిల్లగాండ్లంటే ఇట్లుకారుండాలె." మామ నన్ను ఉబ్బిస్తుండని తెలుసుకున్న.

"ఇప్పు డొచ్చినాయిన పావం హొత్తి అమాయకుడు. మొన్ననే కొత్తగా బదిలై వొచ్చిండు. ఆయనకు ఇల్లు కిరాయికి చూసిపెడ్తె నీమదత్ మరిచిపోడు."

మామ చెప్పక చెప్పక చెప్పిన ఈ చిన్నపని నాకో లెక్కా, అనుకున్న. "సరే మామ! పొద్దూకేవరకు ఏడెనిమిది ఇండ్లు చూసొస్త" అని అన్న.

"అయితే ఎప్పుడు పోతవు మరి?"

"ఇప్పుడే పోత."

"అయితే జర్రంత అన్నం తిని పో. ఆకలైతది"

"ఇల్లు చూసొచ్చేటంతవరకు మంచినీళ్లుకూడ తాగ" అని అన్ననేను పట్టిన పట్టు విడవనన్నట్టు.

"శబ్బాష్ ! పట్టుపడ్తె ఇట్ల పట్టాలె" అని మెచ్చుకున్నడు. నాకు చాన ఖుషీ అయింది.

"మరి ఇళ్లెటుదిక్కు చూడాలె?" అని అడిగిన.

"అటు మా ఆఫీసుదిక్కే చూడు. మోజంజాయి మార్కెట్టూ, నాంపల్లి, గోశామహల్, ఉస్మాన్ గంజ్‌ల దిక్కు చూస్తె చాలు". అన్నడు.

నేను సరేనని మామసైకిలు తీసుకొని బయల్దేరిన.

* * *

నా సైకిలు (అంటే మామది) ఎసొంటి ఒడిదుడుకులు లేకుంట, ఎవ్వరికి టక్కరియ్యకుంట ఎన్నో హజార్ల మనుషులనూ, దుకాణాలనూ దాటుకుంటొచ్చి గోశామహల్ చేరుకుంది. అడ ఎడమ దిక్కున్న పోలీస్‌ఠాన పక్కకున్న సందిలకెలి నా సైకిల్ను పోనిచ్చి కొంతదూరం పోయినంక సైకిల్ దిగిన. అక్కడినుంచి ఒక్కొక్క ఇంటిని ఉశారుగ పరీక్ష చేసుకుంట పోయిన.

ఆ బస్తీలున్న ఇండ్లన్ని ఆకాశాన్ని అంటుకుంటున్న యా అన్నంత ఎత్తుకట్టి దగ్గరదగ్గరున్నై. ఒక బంగ్లగోడ కంటుకొనే ఇంకోటుంది కాని రెండింటి నడుమ సందంటు లేదు. గింతంత జాగకూడ ఖాళీగ వదిలిపెట్టక బంగ్లలమీద బంగ్లలు కట్టింద్రు బోలెడంత కిరాయిసొమ్ము సంపాయించాలని. అన్నిబంగ్లలూ,అన్ని కమ్రలున్నగాని ఏ ఒక్కటీకూడ ఖాళీ కున్నట్టు కనిపించలేదు. ఏ ఇంట్లచూసినగాని గంపెడుమంది పోరగాండ్లు. ఉన్న బెత్తెడంత కమ్రలల్లనే గంపల కొద్ది సామాన్లు ఇరికిచ్చి పెట్టుకున్నరు. గసొంటిచాల్లి చాలని కమ్రలల్ల పెండ్లాం, మొగడూ, వాళ, పిలగాండ్లు ఎట్ల వుంటరో నాకు తెలువలేదు.

అయితే ఈ గంజ్‌ల ఇల్లు కిరాయికి దొరుకుడు చాన ముష్కిలనుకొని గోశామహల్‌స్టేడియం వెనుకదిక్కున్న మంగల్ ఘాటుకు పోయిన. అక్కడమాత్రం ఉండేడ్సినయా! అదిగోశామహల్ లాతున్నట్టుంది అనుకుంటూ పోతుంటే ఒకచోట ఇంటిముందట "ఇల్లు కిరాయికి" అన్న బోర్డు కనిపించింది. అది చూడంగనేమాపూరిదొర మామిడితోట మాసిన ట్లనిపించింది. నేను సైకిలు దిగిన. కాని ఎవ్వల్నడుగాల్నో తెలువక అక్కడనిలబడి చూస్తున్నంతల ఆ కమ్ర పక్కకు జర్రదూరాన ఉన్న దర్వాజలకెలి ఒకాయిన బైటికొచ్చిండు. అట్లొస్తునే నన్నుచూసి "ఏంకావాలె?" అని అడిగిండు.

"ఈ క్రమ కిరాయికిచ్చేదా?" అనడిగిన.

"ఆ, కిరాయికిచ్చేదే. మీకు కావాల్నా ?" అని అన్నడాయిన.

"మా మామకు కావాలెనట! రెండురూముల పోర్షన్" అని అన్న.

"దీంట్ల రెండు రూములున్నై"

"అయితే జర్ర చూపిస్తరా?"

"సరే, తాళంచేతులు తెస్తమండు" అనుకుంటూ ఇంట్లకుపోయిండు.

తాళంచేతులగుత్తి తీసుకొచ్చి తాళం తీసిండు. ఇద్దరం లోపటికి పోయినం. సున్నంలేని గోడల్తోటి, తుక్కుతుక్కు పలిగిన శాబాద్ రాళ్లతోటి, గాడిదల కొట్ట తీరున్న ఆ పోర్షన్ ముందటిగది దేడ్ (ఒకటిన్నర) గజ్ వెడల్పూ ఆడై (రెండున్నర) గజ్ పొడుగూ; రెండోదిదో గజ్ వెడల్పూ,అడై గజ్ పొడుగూ ఉన్నై. నల్ల (నీటిపంపు) లేదు. పాయఖానలేదు. కరంటు లేదు.

"మరి నల్ల, పాయఖాన, కరంటు లెవ్వుగదా!" అన్న.

"నల్ల, పాయఖాన మా యింట్లది వాడుకోవాలె. కరంటుమాత్రం లేదు."

"దీనికి కిరాయెంత?"



"ముప్పై రూపాయలు"

చంపినవ్‌రా నాయినా! ముప్పై రూపాయలే!! అడ్డం పొడుగు కలుపుతే నాలుగు గజాలు లేదుగాని ముప్పై రూపాయలట ! ! !

"సరే, నేను పొద్మకి మా మామను తీసుకొనొస్త. ఆయనతోటి మాట్లాడుకోండ్రి," అని అంటే ఆయిన సరేనన్నడు.

ఇక ఆసంది విడిచిపెట్టి ఇంకోసందిలకు నా సైకిల్‌ను పోనిచ్చిన. ఆసందిల తిరుగంగ తిరుగంగ ఒకచోట "ఇల్లు కిరాయికి" బోర్డు కనిపించింది. ఆ ఇంటి కాంపౌండుకు అంటివున్న ఒక సైకిల్ షొక్కి ఆయినను ఆబోర్డునుగురించి అడుగుతే గేటు తీసుకొని లోపటికిపోతే ఎడమచెయ్యి దిక్కున ఇంట్లడుగుతే తెలుస్తదన్నడు. నేను నా సైకిల్‌ను ఆయన దుకాణం ముందట్నే పెట్టి గేటు తీసుకొని లోపటికి పోయిన. ఒకాయిన ఒక పిలగానికి పతంగి (గాలిపటం) ఎట్లెగిరెయ్యాల్నో నేర్పుతున్నడు. ఆయినను ఇల్లు కిరాయి గురించి అడిగిన. అప్పు డాయిన పతంగిదారం ఆపిలగానికిచ్చి నన్ను తనతోటి తీసుకపొయ్యి కిరాయికిచ్చే క్రములు చూపిచ్చిండు. ఆ క్ర మ రే కు ల షెడ్డు కిందిది. వాళ్ళ కాంపౌండుగోడనే ఆధ్రవత్తు కట్టి ఆగోడకు రేకులషెడ్డేసిండ్రు. అసలవి పశువులశాలకోసం కట్టినట్టుంది. కాని కుక్కను కొడితే రూపాయలు రాలేటట్టున్న ఈ జమానల పశువులకని గింతపెద్ద షెడ్డెందుకు వదిలిపెట్టాలె ననుకొని పావుభాగం చొప్పున అడ్డం గోడకట్టి నాలుగు క్రములు చేసిండ్రు. ఒకదాన్లనేమో పశువులున్నై. మిగిలిన మూడింటిని కిరాయికిస్తమని బోర్డు పెట్టిండ్రు. ఆమూడింటికి ముందట గోడేలేదు. తలుపు లసలే లేవు. రాఫ్టర్ బద్దల్తోటి ముందట గోడ తీరుగ కొట్టిండ్రు. తలుపుకూడా ఆబద్దల్దే. ఆ అడ్డం, నిలువు కొట్టిన బద్దల సందులకెలి కుక్కలు, పిల్లులు ఏసొంటి ఖత్రా (ప్రమాదం) లేకుంట రావొచ్చు, పోవొచ్చు. నడిబజార్ల పండుకుంటే ఏకెంత చలుంటదో ఆ రూముల్ల పండుకుంటే అంతే ఉంటంది. ఎండకాలమొస్తే మీద రేకులన్నైకాబట్టి ఎట్లుంటదో మీరే సోంచాయించి కోండ్రి.

"దీనికి కిరాయెంత?" అనడిగిన

"ఆ, ఎంతలే చాల తక్కువ. ముప్పై రూపాయలు."

ముప్పై రూపాయలే ఈ షీటే కిరాయి



తోళ్ళకు తక్కువలు తక్కువ ఉన్నట్టుంది. నాలుగు గోడలుంటే చాలు, అది క్రమకానియ్యి కాకపోనియ్యి ముప్పైరూపాయలు నికాలో అనేటట్టున్నరు అనుకున్న.

ఆయనకు నేను క్రమ పసండ్ చేసిన ట్టనిపించిందో ఏమో కాని నాతోటి "మరి మీరెప్పుడొస్తరు ?" అని అన్నడు.

"పొద్మకి మా మామను తీసుకొస్త. ఆయనొచ్చి ఖరారు చేస్తడు"

"ఆ, చెప్పుడు మరిచిపోయిన. కరంటు రెండు రూపాయలు బిల్లు మీరే కట్టుకోవాలె. పాయఖానకు మనిషొక్కంటికి చారాన ఇస్తె చాలు."

ఇంకేమన్న ఉన్నయా. వెనుకా ముందట, అని అందా మనుకొన్న ఆయిన చాల్ చూసి. కాని అనలేదు పోనీ పాపమని.

"సరే, అవ్వన్ని నేను మామతోటిచెప్పి పొద్మకి తీసుకొస్త" ననుకుంటూ మల్ల సైకిలెక్కిన.

ఇక గోశామహల్, మంగల్ ఘాట్ వదిలిపెట్టి మొజ్జంజాయి మార్కెటు చేరుకున్న. ఈ మార్కెటు తాన తురుకరాజు జమానల కట్టించిన బంగ్లలు బోలెడున్నై. "మేము మునలోళ్లమైనం రేపో, ఎల్లుండో గుటుక్కుమంటం. అయినా మేము బతికున్నంతకాలం మా ఖదర్‌ను పోనియ్యం" అని అంటున్నట్లున్నై ఆ బంగ్లలు. ఆబంగ్లలల్ల చాలావాటికి కాంపౌండులున్నై. కాంపౌండుగోడల నంటుకునే మురికికాలువలు పోతున్నై. వాటిమీద కప్పు లేదు. ఆ కాలువలల్ల మురికినీళ్లకు బదులు పాయఖాన పారుతుంది.రడగబ్బువాసన! మరి ఆబంగ్లలల్ల

—41 వ పేజీ చూడండి



ఆంధ్రసచిత్ర వారపత్రిక వారఫలాలు

దైవజ్ఞపాతూరి శ్రీరామమూర్తి

16-2-1962 శుక్రవారము మొదలు
22-2-1962 గురువారము వరకు

మేషం :

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా.)

అన్ని విషయాలలోనూ మీ శక్తి సామర్థ్యాలను చక్కగా వినియోగించగలుగుతారు. మామూలు మాటలలో కలహ సూచనలు వచ్చినా వాటిని లెక్కపెట్టుకొనవలసిన అవసరం ఉండదు. కుటుంబ కార్యక్రమాలలో ఖర్చులు ఎక్కువ. అన్ని విధాలా గౌరవము, సుఖము పొందగలుగుతారు. సాహసకార్యాలలో ప్రవేశిస్తారు. ఇంతకుముందు కలిగిన ఆందోళన తగ్గిపోతుంది. వ్యాపార రంగంలో పెట్టుబడిపెట్టి ఆడంబరంతో వ్యవహరించ గలుగుతారు. పుణ్యస్థలాలకు ప్రయాణం చేయగల్లరు. ఇతరుల మాటలను నమ్మి వ్యవహార కార్యాలలో దిగవద్దు. అధికారులు అనుకూలిస్తారు. దుబారా ఖర్చులు తగ్గిపోతవి. 21, 22 తేదులలో అనారోగ్యము, వస్తు నష్టము.

* * *

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా.)

ఆర్థికంగా పెద్ద మార్పులు రాకపోయినా గౌరవము, మీ వృత్తి వ్యాపారాలలో క్రొత్తవారి సంబంధము, శ్రమకు తగిన ఫలితము పొందగలుగుతారు. మీచేత పని చేయించుకుని నిర్మొహమాటంగా మాట్లాడేవా రుంటారు. వారం మధ్యలో ఉష్ణాధిక్యంవల్ల అనారోగ్యం చేస్తుంది. మీ ప్రసంగాలలో పొరపాట్లు రాకుండా చూచుకొనండి. విశ్రాంతి అనేది లేకుండా ఏదో ఒక పని చేస్తూ ఉంటారు. బంధువులవల్ల కార్యానుకూలత ఉంటుంది. సంఘ కార్యాలలో మీ బాధ్యత పెరుగుతుంది. గౌరవానికి లోటు ఉండదు. చిన్న చిన్న పనులు కదా అని అనుకుని ప్రవేశిస్తారు. కాని తీరా చూస్తే అసాధ్యమనే విషయం తెలుస్తుంది. అధికారులవద్ద మాట రాకుండా చూచుకొనండి. విలాస, వినోద కార్యక్రమాలకు ప్రతిబంధకాలు వస్తవి. 20, 21 తేదులలో ఆస్తి వృద్ధి ప్రయత్నాలు, మిత్రలాభం, విశేష ఖర్చులు.

* * *

> **గ్రహ స్థితి**
>
> కర్కాటకంలో రాహువు, మకరంలో అంగారక బుధ, గురు, శని, కేతువులు, కుంభంలో సూర్య, శుక్రులు, మిధున, కర్కాటక, సింహ కన్యలలో చంద్రుడు.

మిధునం :

(మృగశిర 3, 4 పా, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

మీ మంచితనాన్ని అవతలివారు చులకనగా చూస్తారు. వృత్తిలో పని పెరుగుతూ ఉంటుంది. కాని చురుకుగా నెరవేర్చి బాధ్యతలను తొలగించుకుందామనే ఉత్సాహం కనుపించదు. స్నేహితులవల్ల కొంతవరకు సహాయం లభిస్తుంది. ఎదురుచూస్తున్న శుభవార్తలు సమయంలో అందుతవి. మధ్య మధ్య ఆటంకాలు, ఆలస్యము కనిపిస్తున్నా మొత్తంమీద ఆదాయం బాగానే ఉంటుంది. స్నేహితులకు ఆలోచన చెప్పటం, భారం వహించి కార్యసాధనకు పూనుకొనటం వంటి బాధ్యతలు పైన పడుతవి. తలవని తలంపుగా కలహప్రసంగాలు వచ్చి వెంటనే సమసిపోతవి. పిల్లలకు అనారోగ్యం చేస్తుంది. సంబంధం లేని పనులలో తగుల్కొని మాట పడవలసి వస్తుంది. వృత్తిలో గౌరవప్రదమైన మార్పులు రాగల అవకాశా లున్నవి. 19, 20 తేదులలో విశేషంగా ఆలోచనలు, ధర్మకార్యాలు, తొందరపడి చేసిన పనులవల్ల ధన నష్టము.

* *

కర్కాటకం :

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష)

మామూలుకన్నా శ్రమ విశేషంగా తోచినా వృత్తిలో అభివృద్ధిని సాధించగలిగినామనే సంతృప్తి కలిగిస్తుంది. ఉన్నతస్థితియం దుండేవారితో సహవాసం చేస్తారు. మీ మాట నేర్పువల్ల చిక్కు సమస్యలను పరిష్కరించ గలుగుతారు. మీ ఆరోగ్యం గతవారం కన్నా మేలుగా ఉంటుంది. యంత్ర సంబంధమైన పనులలో జాగ్రత్తగా ఉండండి. అతి శ్రమతో కూడిన పనులు తరుచు చేయవలసి రావడంవల్ల మనశ్శాంతి తగ్గుతుంది. బంధుమిత్రుల మూలంగా అన్ని విషయాలలో ఆదరణ, ధన సహాయము లభిస్తవి. అధికారులతో సంప్రతించటం వంటి పనులలో అనుకూల లక్షణాలు తక్కువ. పిల్లల మూలంగా ఆనందం లభిస్తుంది. భూములు, యంత్రాలు మొదలైన వాటిమీద పెట్టుబడి పెట్టతగిన సమయంకాదు. తాత్కాలికంగా నిరుత్సాహంతోచవచ్చు. 17, 18 తేదులలో నిరుత్సాహము, బలహీనత, ఆదాయ భంగము—శుభవార్తలు.

* * *

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

అవతలివారు ఏమి మాట్లాడినా చల్లగా సమాధానం చెప్పగల ఓర్పు అవసరం. అనవసరంగా మీమీద తప్పులు నిరూపించటానికి ప్రయత్నించేవారుంటారు. దైవానుగ్రహం వల్ల మీ వృత్తి ఉద్యోగాలలో ప్రధానమైన చిక్కులు ఏమీ ఉండవు. కుటుంబంలో కూడా సుఖంగా ఉంటుంది.

దక్షిణదిక్కునుంచి అనుకూలవార్తలు తెలుస్తవి. మిత్రవర్గంలో చెలరేగిన కీచులాటలు మిమ్మలను కూడా కొంతవరకు ఆందోళన పరచగలవు. సంఘ కార్యాలలో గౌరవ ప్రతిష్ఠలు బాగుంటవి. వృత్తిలో ఏర్పడిన శత్రుత్వము, పోటీలు తొలగిపోతవి. పుణ్య కార్యాలలో పాల్గొంటారు. గుణ స్వభావాలను తెలుసుకొనకుండా క్రొత్తవారితో వ్యవహారాలు ఆరంభించవద్దు. వారాంతంలో పై అధికారులవల్ల కార్య భారము, నిష్ఠూరాలు ఏర్పడగల అవకాశా లున్నవి. 16, 17 తేదులలో శుభ సంబంధమైన ఖర్చులు, అకస్మాద్ధనలాభము, సంచారము.

* * *

కన్య:

(ఉత్తర 2,3,4 పా, హస్త, చిత్త 1, 2 పా.)

దైవబలం బాగున్నది. మొదట్లో భయంకరంగా కనుపించిన వ్యవహారాలు ఆలోచించినకొద్దీ అసలు చిక్కు ఏమీ లేదనే విషయం తెలుస్తుంది. మీ శ్రమ సులభంగా ఫలిస్తుంది. విలువగల వస్తువులు కొంటారు. వ్యవహార రంగంలో పదిమంది ప్రోత్సాహము, సహాయము లభిస్తవి. శుభకార్య ప్రయత్నములు అనుకూలిస్తవి. వ్యాపార సంబంధమైన పనులలో మీ చేయిజారిపోయిం దనుకున్న ఫలితం తిరిగి మీకు లభిస్తుంది. బాహ్య విషయాలలో కార్యభారం అధికం కావటంవల్ల కుటుంబ వ్యవహారాలలో శ్రద్ధ చూపలేకపోతారు. క్రమక్రమంగా ధనాదాయం పెరుగుతుంది. పాత స్నేహితులతో విరోధం రాగల సూచన లున్నవి. వారాంతంలో ధననష్టం కనుపిస్తుంది. విద్యార్థులకు ప్రోత్సాహకరమైన సమయం కాదు. 17, 18 తేదులలో కారణంలేని కలహాలు, సంచారము, కార్యభంగం.

* * *

తుల:

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు)

ముఖ్యంగా మీ ఆర్థిక స్థితి బాగుంటుంది. ప్రయాణాలు అనుకూలిస్తవి. పెద్ద పెద్ద వ్యాపార కార్యకలాపాలు ఆరంభించగలుగుతారు. కోర్టు కచేరీలలో గౌరవం లభిస్తుంది. ధన విషయంలో మిమ్మలను మోసం చేయటానికి ప్రయత్నాలు జరుగుతవి. కాని గ్రహబలం బాగుండటం వల్ల ముందుగా జాగ్రత్తపడగలుగుతారు. వారం మధ్యలో పిల్లలకు అనారోగ్యం చేసి ఖర్చులు పెరుగుతవి. మానసికంగా శ్రమ అధికం అవుతుంది. ఆహార విహారాలలో జాగ్రత్తగా ఉండటం అవసరం. స్నేహితుల వద్ద నుంచి కష్టవార్తలు తెలుస్తవి. వారాంతంలో దుర్మార్గులతో కలహాలు రాగల సూచన లున్నవి. ఈ వారంలో ముందు మీరు నిర్ణయించుకొన్న పనులు సమయానుకూలంగా మానుకొనవలసి వస్తుంది. 18, 19 తేదులలో శుభ కార్యాలు, వ్యవహార అనుకూలత.

* * *

వృశ్చికం:

(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ.)

ఎన్ని ఆలోచనలు చేసినా క్రియలో ప్రవేశించే సమయంలో ఆందోళన కలుగుతుంది. అయితే ఏవిధంగానూ అపకారం జరుగ తగిన సమయం కాదు. కార్య నిర్ణయం చేసుకోవలసిన భారం మీమీద పడుతుంది. మీ ఆరోగ్య స్థితి మాత్రం ముందుకన్నా మేలుగా ఉంటుంది. ఈ సమయంలో మీకు అన్నివిధాలా హంగులు, అధికారము ఉన్నా రక రకాల వ్యక్తులతోనూ నేర్పుగా వ్యవహరించి మీ పనిని సాధించుకోవలసి ఉంటుంది. ప్రయాణ సూచనలు ఉన్నవి. కుటుంబంలో శుభ కార్యాలు అనుకూలిస్తవి. వృత్తిలో వచ్చే మార్పులు ప్రస్తుతం కొంత అసంతృప్తికరంగా తోచినా ముందు ముందు చాలా అనుకూలిస్తవి. మీ మాటలలో పొరపాట్లను, రహస్యాలను కనిపెట్టటానికి ప్రయత్నించేవా రుంటారు. జాగ్రత్తగా ఉండండి. 19, 20 తేదులలో గౌరవము, ఆర్థికంగా ఉన్నత స్థితి, దైవ కార్యాలు.

* * *

ధనుస్సు:

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)

గ్రహబలం క్రమముగా అనుకూలిస్తుంది. సంఘంలో మీమీద మంచి అభిప్రాయం ఏర్పడుతుంది. ఋణబాధలు తగ్గిపోతవి. మీ ముందు యోచనవల్ల ఇతరుల మాటమీద ఆధారపడి ఉండవలసిన అవసరాన్ని తప్పించుకొంటారు. స్వల్పంగా అనారోగ్యం చేస్తుంది. ఉత్తర దిక్కునుంచి లాభవార్తలు తెలుస్తవి. నౌకరులతో చిన్న చిన్న కీచులాటలు ఆరంభం అవుతవి. తలవని తలంపుగా అశాంతిని కలిగించే వార్తలు వింటారు. ఇంతకుముందు ఆరంభించిన పనులు నిలుపుకొనవలసి వస్తుంది. కాని, అందువల్ల మీ ఆదాయం లోపించదు. పెద్దగా పెట్టుబడి పెట్టవలసిన పనులలో ప్రవేశించతగినసమయంకాదు. ఆయుధాలు, యంత్రాలు మొదలయినవి ఉపయోగించటంలో జాగ్రత్త. 20, 21 తేదులలో ధనలాభం, దేహ శ్రమ అధికం, అధికారులతో కలహాలు.

* * *

మకరం:

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా)

మీరు చెప్పిన మాటను మీరే చల్లగా తప్పించవలసిన అవసరం కలుగుతుంది. మీకు రావలసిన ఫలితం ఎదురుగా కన్పిస్తున్నా అందుకొనటానికి అభ్యంతరాలు వస్తూ ఉంటవి. పట్టుదలతో కార్యం సాధిస్తారు. వ్యవహార రంగంలో అనుకూలమైన కాలం. కుటుంబంలో కార్య బాధ్యతలు నెరవేరుతవి. బంధువుల వద్ద నుంచి వచ్చే వార్తలు ప్రోత్సాహకరంగా ఉండవు. గౌరవంతో ఆర్థిక చిక్కుల నుండి బయటపడ గలుగుతారు. వృత్తి వ్యాపారాలలో ఎదటివారికి అసంతృప్తి కలుగకుండా మీ బాధ్యతలను నెరవేర్చుకొంటారు. దుబారా ఖర్చులు తెలిసి చేయవలసి వస్తుంది. ఈ వారం మొత్తం మీద తిరుబాటు తక్కువ. సందేహాలు, పనులలో ఆలస్యము కూడా ఉంటవి. ఇతరులకు సహాయం చేయవలసిన పనులలో వినుగుదల తోస్తుంది. 21, 22 తేదులలో దైవ కార్యాలు, మిత్రులతో అభిప్రాయ భేదాలు.

* * *

ఈ వారము ధరలు

ఈ వారము బంగారు ధరలో మందీ లక్షణాలు కనుపిస్తవి. వెండి ధరలో క్రమంగా పెరుగుదలవచ్చి వారాంతంలో తగ్గుతుంది. పసుపు ధర తేజీలో నిలుస్తుంది. నూవుల ధర కొద్దిగా తగ్గుతుంది. నూవుల నూనె ధర మామూలుగానే ఉంటుంది. వేరుశనగ పప్పు ధరలో తరచు హెచ్చు తగ్గులు వస్తూ ఉంటవి. చింతపండు ధర తాత్కాలికంగా తగ్గినా వారాంతంలో యధాప్రకారంగా నిలుస్తుంది. మిర్చి ధర భాగా తగ్గగల సూచన లున్నవి. కందులు, శనగలు వీటికి కొద్దిగా గిరాకి తగులుతుంది.

కుంభం:

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)

మీ మంచితనము, శక్తి సామర్థ్యాలు ఈ సమయంలో అంతగా ఉపయోగించవు. మంచి చెప్పినా కలహాలు వస్తవి. మీకు రావలసింది రాకపోగా మీరే ఇతరులకు సహాయం చేయవలసి వస్తుంది. ఏ విషయంలోను చురుకుగా యోచించలేకపోతారు. ప్రతి వ్యవహారము నిదానంగా జరుగుతూ ఉంటుంది. స్నేహితులమీద ఆధారపడిన పనులలో అవకతవకలు ఏర్పడగలవు. వాహనాలు, పెద్ద పెద్ద యంత్రాలు మొదలైనవాటి విషయంలో జాగ్రత్తగా ఉండటం అవసరం. విద్యా వినోద విషయాలలో ప్రోత్సాహం తక్కువ. సాధ్యమైనంతవరకు "అప్పుచేసి పప్పు కూడు తినటం" వంటి సాహసాలకు దిగవద్దు. బంధువులతో విరోధం వస్తుంది. 19, 20 తేదులలో శుభకార్యాలు, ప్రయాణ సూచనలు.

మీనం:

(పూ. భాద్ర 4 పా, ఉ. భాద్ర, రేవతి.)


మీ అంతస్తుకు తగ్గట్టు వ్యవహరించ గలుగుతారు. ఒకటి, రెండు సమయాలలో ధన కష్టం తోచినా కార్యభంగం కలుగదు. మాటకు విలువ లభిస్తుంది. ప్రయాణాలు చేస్తారు. మీ ఆరోగ్యం అంత తృప్తికరంగా కనుపించదు. కాని, యధాప్రకారం పనులు జరుగుతూనే ఉంటవి. పిల్లల మూలంగా ఆనందము, సుఖము లభిస్తవి. వృత్తిలో అదనపు బాధ్యతలు వచ్చిపడుతవి. స్నేహితులవద్ద మొహమాటంతో ఒప్పుకున్న పనులు ఈ సమయంలో మిమ్ములను బాధిస్తవి. వారం చివరలో అనవసరంగా ఖర్చులు, వ్యవహార కార్యాలలో శ్రమ తోచగలవు. సంఘకార్యాలలో గౌరవప్రదమైనకాలం. ధర్మకార్యాలకు ఆటంకాలు రాగలవు. 17,18 తేదులలో అధికారులవల్ల కార్యసిద్ధి, మిత్రలాభము. ★


డాక్టర్ రాజు

బొమ్మల కథ

దేవిక

12





హోటల్

ఎన్నాళ్లుంటావే యీ హోటల్లో
కొన్నాళ్ళేకద నరుడా
పోయేనాడు వెంబడిరాదు
పూరీ కూరైనా
మాడిపోయిన దోశె ఒకటే
కడకి హోటల్లో మిగిలేదీ.

బండి నారాయణ (చిత్తూరు)

*　*　*

ఎన్నికల కోతలు

నేను సైతం ఎన్నికల్లో
నిశ్చయంగా నిలువదలచా
నాకుమాత్రం ఏమి తక్కువ?
పదవి అంటే బలే మక్కువ!
నాకు సైతం మీకులాగా
మైకు ముందర టాకుటాచ్చు!
వ్రాతకోతలు రాకపోయిన
కూతకోతలు చేతనవును
అందరల్లే కలవు నాకు
బ్లాకులోని, వైటులోని,
కాస్త కూస్తో, ఆస్తిపాస్తులు.
నేను సైతం దానధర్మాల్
ఘనంగానే చేసినాను!
కలక టేరు కొడుకుపెళ్లికి
అన్నదానం నేను చేశా!
ఏడుకొండలవాడి మెడలో
జోడికాసుల గొలుసు వేశా!
నేనుసైతం ఎన్నికల్లో
వోటుకోసం జోత పెడతా!
గీటువుండి సీటుకొడితే!
నేను మాత్రం బాగుపడతా.

కె. జి. రావు, (తాడేపల్లి)


*　*　*


భార్య సేవా పంచకం

కూజంతం చీర చీరేతి పరుషం పరుషాతురం
ఆరుహ్య బడ్ జెట్ శాఖాం వందే అర్ధాంగి కోకిలం

యత్ర యత్ర తన భార్య కంఠమో
నచ్చుటచ్చుట గజగజ లాడడం
భర్తగారి కృత మస్తకాంజలి
సద్గుణంబు భయభీత లోచనం
కాళీరూప సంపన్నా
కోపసాగర భామినీ
కారణం సినీప్రోగ్రాము
చేకడం పతిలేటుగాన్
లేవగానె బెడ్ కాఫీ తేవడం
స్నానపానముకు నీరు తోడడం
భార్యగారి మనసెరిగి మసలడం
భర్తగారి అతి సౌఖ్య కారణం
భార్యగారి చరణాబ్జ వాసనం
భార్యగారి శత నామకీర్తనం
భార్యగారి ప్రతి యాజ్ఞపాలనం
భర్తగారి అతి సౌఖ్య కారణం
ఈభార్యసేవా పంచకం
ప్రదోషేయః పఠేన్నిత్యం
అతని భార్య సుముఖీ నారీ
తస్య భార్యాభయం నాస్తి
'వాల్మీకి మహర్షి ని తుమాపణకోరుచూ'

శంకర సుబ్రహ్మణ్యం (కర్నూలు)







ఆదివిష్ణు

చలపతి చాలా సంతోషించాడు. అంత సంతోషం గత రెండుసంవత్సరాల్లోనూ చవిచూచి ఎరుగడు. చెల్లాయి పెళ్లిరోజున కలిగిన సంతోషాని కంటె ఎక్కువగా సంతోషించాడు. ఒక్కసారిగా రెక్కలు కట్టుకుని స్వంత ఊళ్ళోకి ఎగిరిపడి నట్టూ, ముసలి తల్లికి కబుర్లు చెప్తున్నట్టూ, తమ్ముడికీ, చిట్టి చెల్లాయికీ పాఠాలు చెప్తూ న్నట్టూ, చిన్ననాటి మిత్రులందరితోనూ తనివి తీరా బాతాఖానీ వేస్తున్నట్టూ వూహించేశాడు.

ఎక్కడి బందరు ? ఎక్కడ విశాఖపట్నం ? ఎన్నాళ్లనుంచో, ఉద్యోగంలో కాలుపెట్టి విశాఖ పట్నం వచ్చిందగ్గర్నుంచీ అనుకుంటాడు — ఎప్పుడు స్వంత ఊళ్ళో ఉద్యోగంచేసే అదృష్టం కలుగుతుందాని.

అది నేటికి నిజమయినట్టు సంతోషించాడు.

సహపాఠి, సహృదయుడు, ఆదర్శవాది అయిన శంకరం తనకి ఆఫీసరుగా వస్తూన్నాడంటే అంతకు మించిన సదవకాశమింకేముంది ? ఇన్నాళ్ళూ కనిన కలలకి ఒక రూప మివ్వబోతున్నాడు శంకరం.

ఆఫీసరు హోదాలో ఉన్న శంకరానికి తన మనవి చెప్పుకోవాలి. ఏవిధంగానైనా తన స్వంత ఊరికి బదిలీచేసే ఏర్పాటు శంకరం చేతుల మీదుగానే జరిపించాలి. ఒక స్నేహితుడు ఈనాడు తనకి ఆఫీసరై ఇంత సహాయం చెయ్యబోతున్నా డంటే అంతకంటే గర్వించదగ్గవిషయం ఇంకే ముంటుంది ?

ఇన్నాళ్ళూ చలపతి తనవాళ్ళందరికీ దూరంగా ఉద్యోగంచేస్తూ ఆ వచ్చే నాలుగురాళ్ళూ — తన కింద కొంత ఖర్చుపెట్టుకొని ఎలాగోలా కొంత మిగిల్చి పంపుతూండేవాడు. ఆర్థికంగా చాలా ఇబ్బంది పడ్డాడు ఇన్నాళ్ళు.

ఇంక తనకి సుఖం దగ్గరయ్యే సూచనలు కను పిస్తున్నాయి. స్వంత ఊళ్ళో ఉద్యోగం చేస్తూ, సంసారాన్ని ఏ వడిదుడుకూ లేకుండా జరుపుకో వచ్చు. ఆరోజు చలపతికి కనపడ్డ ప్రతి పరిచ యస్థుడితోనూ పనిగా చెప్పుకున్నాడు — శంకరం తనకి ఆఫీసరుగా వస్తూన్నాడని. ఆఫీసులో తోటి గుమాస్తాలు చాలామంది సంతోషించారు. మరి కొందరు చాటుగా చలపతికి పట్టబోయే అదృష్టా నికి ఈర్ష్యచెందారు.

ఏది ఏమైనా చలపతి ఆనందాని కారోజు పట్ట పగ్గాల్లేకుండా పోయాయి.

హోటల్లో వేసిన విస్తరిముందు కూర్చుని దాన్లో వడ్డించిన పదార్థాలవైపు కసిగా చూశాడు. అమ్మ తనకోసం చేసే వంటకాలు పేరుపేరునా మననంచేసుకున్నాడు. మళ్లీ అంత అదృష్టం అతి త్వరలో కలుగబోతున్నందుకు సంతోషించాడు.

తను ఉద్దేకుంటూన్న గది అనబడే కారా గారంవంక తీక్షణంగా చూచి తనలో తాను అనుకున్నాడిలా — 'ఇంతవరకూ గదిలో ఒంటరిగా ఏం తోచక, నా వాళ్ల నందరినీ తల్చుకుని కుమిలి పోయాను. యమయాతన అనుభవించాను. మా శంకరం దయవల్ల మళ్లీ మా ఇంట్లో అందరి మధ్యా రాజాలాగా ఉండటానికి నోచుకోబోతు న్నాను. ఇదే చాలు నాకు !'

రాత్రి తొమ్మిదిగంటలకి లోజూ మాదిరి గప్‌చిప్‌గా నిద్రపోవాలనిపించలేదు చలపతికి.

ఎండమావులు

రేవు సాయంత్రం కొత్త ఆఫీసరు శంకరం వస్తున్నాడు. 'రేవు సాయంత్రం' కనుపించటానికి ఎలా లేదన్నా ఇరవై గంటలపాటు వేచి ఉండాలి గాబోలు ఖర్మం. చలపతికి చిరాకు కలిగింది.

ఆరాత్రి ఎంత త్వరగా తెల్లవారితే అంత బావుం డనిపించింది అతనికి. ఒక్కో గంట ఒక్కో రోజులా గడుస్తున్న ట్లనిపించింది. పన్నెండయినా అతను నిద్రపోలేదు.

సిగరెట్టు ముట్టించి కాలేజీరోజులు గుర్తు చేసుకోడం మొదలెట్టాడు.

శంకరం ఇప్పు డెలా ఉంటాడోగాని, చదువు కుంటూన్న రోజుల్లో సన్నగా, పచ్చగా, ఎత్తుగా ఉండేవాడు. శంకరం చాలా అందంగా ఉంటాడు.

అత నెంత అందంగా ఉంటాడో, అంత అందం గానే ఉంటుంది అతని హృదయం! కాలేజీలో అతను అందరు విద్యార్థులకీ మార్గదర్శిగా ఉండే వాడు. తనకున్న అభిరుచుల్ని నిర్భయంగా అంద రికీ చెప్పుకునేవాడు. ఆదర్శం అతనికి మరో ప్రాణం.

డిబేట్సులో అత నెప్పుడూ నెగ్గుతూండేవాడు. వరకట్నాలు, ప్రేమ వివాహాలూ, ఒక్క టేమిటి —అతను చెప్తూన్న ప్రతివిషయమూ నిజానికి చాలా దగ్గర్లో ఉండేది. పైగా — ప్రతి సమస్యకీ అతను తెలివిగా, 'విరుగుడు' చెప్పేవాడు. దారులు చూపేవాడు. అతని ఆదర్శం కేవలం డిబేట్సు నిమిత్తమే అన్నట్టుండేది కాదు — చేతల్లోనూ చూపించేవాడు.

రాధతో శంకరం పెళ్ళవటానికి అతనికున్న ఈ అర్హతే ముఖ్యకారణం.

రాధకి శంకరమంటే సదభిప్రాయం. శంకరం మంచి వక్త, మనసులు చదవగల నేర్పరి. తన చుట్టూ ఉన్నవాళ్ల శ్రేయస్సు కోసం శ్రమించే యువకుడు. ఒక మంచి కథలో సకలగుణసంపన్ను డగు కథానాయకుడ్ని నిజజీవితంలో చూచిన ట్టవుతుంది, శంకరాన్ని, అతని ఆశయాల్ని గమ నిస్తూంటె. అందుకే రాధకి శంకరమంటే మనసు.

రాధలాటి లక్షాధికారిబిడ్డకి, శంకరంలాటి ఆదర్శయువకుడు భర్తగా లభించడం ఏనాటి పుణ్యమో మరి!

నిజానికి రాధపెళ్లి చలపతితో జరగాల్సింది. కాని విధి ఆమె అదృష్టాన్ని వమ్ముచెయ్యలేక పోయింది. బలేచిత్రంగా రాధ పెళ్లి శంకరంతో జరిగింది. ఆ సంఘటన లన్నీ తలుచుకుంటూంటే నితం తన కళ్లముందు కదుల్తున్నట్టుంది.

చలపతి చదువుకుంటూన్న రోజుల్లోనే అతని తండ్రి పోయాడు. తల్లి మానసికంగా గాయ పడింది. ఇద్దరు చెల్లాయిలూ, తమ్ముడు, తను —వీళ్లందర్నీ దృష్టిలో పెట్టుకుని ఆమె ధైర్యాన్ని వహించింది. కాని లోలోపల ఆమె కుళ్లిపోని రోజు లేదు.

చదువు మానేద్దామనే నిశ్చయానికి వచ్చాడు చలపతి. దానికొంత కారణం ఆర్థిక దుస్థితి. తండ్రిలేని లోటేమిటో అతనికి బాగా తెలిసింది. తన చదువు తన కుటుంబానికి బాధకలిగిం చటం మినహా కించిత్తు మేలుచెయ్యలేదు.

ఈ నిశ్చయంతోనే అతను నెలరోజులపాటు కాలేజీకి వెళ్లలేదు. ఈ విషయం రాధ సీతా రామయ్యగారికి చెప్పింది. కూతురు చెప్పింది విని ఆయన నిశ్చేష్టులయ్యారు. సీతారామయ్యగారికి వ్యాపారంలో బాగా కలిసి వచ్చింది. ఆయన ఆప్త మిత్రుడూ, అతి సన్నిహితుడూ ఎవరైనా ఉంటే వారు చలపతితండ్రి ఒక్కరే!

సీతారామయ్యగా రొకసారి చలపతియింటికి వచ్చారు. అతని చదువుగురించి అడిగారు. రాధ చెప్పినట్టే అతనూ చెప్పాడు. సీతారామయ్య గారతని పరిస్థితులు అర్థంచేసుకున్నారు. చల పతికి ధైర్యం చెప్పారు. మిగిలిన ఈ కాస్త చదువూ పూర్తిచెయ్యటానికి తను చేతనయి నంతవరకూ సహాయంచేస్తాననీ, ఇది కేవలం

ఒక ఖైదీపైన పెద్ద నేరం ఆరోపించబడింది. అతని తరఫున వాదించేందుకు న్యాయవాది లేడు.

"నీ మీద వచ్చిన ఆరోపణ తీవ్రమైనది. నువ్వు న్యాయవాదిని ఎందుకు పెట్టుకోలేదు?" అని జడ్జి అతడ్ని అడిగాడు.

"నిజమేనండీ!" అంటూ ఖైదీ జడ్జి వైపు వంగి, "కాని జూరీ సభ్యులలో కొందరు నా మిత్రులు" అని రహస్యంగా అన్నాడు.

వి. రాజగోపాల్ (గుడివాడ)

ఒక ఆప్తమిత్రుడి కుటుంబానికి చేయవలసిన కనీస ధర్మంగా భావించమని చలపతితో చెప్పా రాయన.

సీతారామయ్యగారి అండనే అతని చదువు సాగింది!

రాధంటే చలపతికి గౌరవమైన భావ ముంది. ఆమె ఏమాటనీ దాచుకునేది కాదు. అలా అని ఎడా పెడా అర్థంలేకుండా వాగేసేదీ కాదు. తను మాటాడే ప్రతిమాటకీ విలువకడుతుంది. ఏది మాటాడినా తర్జనభర్జన చేసుకోనిదే మాటా డేది కాదు.

సీతారామయ్యగారి ఉదారస్వభావం, విశాల దృక్పథం — ఈ రెండూ రాధని మూర్తీభ వించాయి. ఆమెకి తండ్రిగారి పోలికలబ్బినాయి. అందుకే రాధని గౌరవంగా చిత్రించుకునేవాడు చలపతి.

సీతారామయ్యగారి ప్రోద్బలంవల్ల రాధతోపాటే చలపతి వా రింట్లోనే చదువుకునేవాడు. రాధ చదువువిషయంలో చలపతికంటె ఓ మెట్టు పైనే ఉండేది. తనకి అర్థంకాని పాఠాన్ని చాలా చక్కగా చెప్తుండేది ఆమె. ఒకవిధంగా చూస్తే —క్లాసులో లెక్చరర్లు చెప్పే పాఠాలకన్నా, ఇంటి దగ్గర రాధ చెప్తుంటేనే బాగా అర్థమయిన ట్టుండేది అతనికి.

చదువులో రాధని ఎదుర్కొనేవారు బహు అరుదు. వారిలో ముఖ్యుడు శంకరం. అటు శంకరం, ఇటు రాధా — ఇద్దరూ కాలేజీకి రెండు కళ్లలా ఉండేవాళ్ళు. అందరికీ అభినంద నీయులైనారు. లెక్చరర్ల మొదలు విద్యార్థుల వరకూ — అందరికీ ఈ ఇద్దరిపైనా గౌరవ భావం కలిగింది.

ఒకనాడు — చలపతి చదువుకునేందుకు సీతా రామయ్యగారింటికి వచ్చాడు. అప్పటికి రాధ యింకా రాలేదు. ఇద్దరిమధ్యా లోకాభిరామాయణం కదిలింది. ఆ రామాయణానికి వక్త సీతారామయ్య గారు, శ్రోత చలపతీను. తన తండ్రితో ఆయన కున్న స్నేహంతో ప్రారంభించి రాధపెళ్లి విషయంవరకూ మాటాడారు సీతారామయ్య.

"నాకో కోరిక ఎన్నాళ్ల నుంచో ఉంది చలపతీ! దానికి నువ్వు 'ఆదర్శం' అని పేరుపెడితే అది పొరపాటవుతుంది. నాకున్న స్నేహితులు బహు కొద్దిమంది. వాళ్లందరిలోనూ మీ నాన్నంటేనే నాకు ప్రాణం. ఇద్దరమూ ఒక్క క్షణమైనా వదిలి ఉండేవాళ్లం కాము మొన్న మొన్నటివరకూ. ఇప్పుడు వాడు నాకు దూరమయ్యాడు. చెప్పా నుగా మీ నాన్నంటే నాకు ప్రాణమని. అలాంటి వాప్రాణం కోసం నే నేంచేసినా తక్కువే అవుతుం దనుకుంటాను. అదృష్టవశాత్తూ కలిసివచ్చిన ఈ అంతస్థుకి దాసుడనై మా స్నేహాన్ని తెంచుకోలేదు నేను. ఈ గర్వం నా కెప్పట్కీ ఉంటుంది.

నాకో కోరిక ఉంది—నువ్వైనా, మీ నాన్నైనా నాకు ఒక్కటే. మీబాగే నాకు కావలసింది. రాధ ఒక్కర్తే నాకు సంతానం. ఈ సంగతి నాకు బాగా తెలుసు. ముఖస్తుతి అప్రస్తుతమనుకుం టాను. మా రాధకి తగిన వరుడివి నువ్వే చలపతీ!"

చలపతి ఉలిక్కిపడ్డాడు!

"ముందే అన్నాను యిదంతా ఆదర్శం పేరుతో నేను చెయ్యడంలేదని. నా ప్రాణంలాటి మిత్రుడి కుటుంబాన్ని తరతరాలపాటుగా నాకు దగ్గర చేసుకోవడమే నా అభిమతం. ఈ వాంఛని మా స్నేహానికున్న ప్రతిబింబంగా గమనించు. నేను లక్షాధికారినన్నమాట మరచిపో. నా కోరిక తీర్చేందుకు అవకాశమివ్వు చలపతీ!"

చలపతి ఏం మాటాడలేకపోయాడు. ఈ మౌనాన్నే ఆయన అంగీకారంగా భావించారు.

"నాకు తెలుసు. నామాట కాదనలేవు నువ్వు. చాలా సంతోషం నాయనా" అని ఆయ నంటూం డగానే రాధ ఇంట్లో అడుగుపెట్టింది నవ్వు కుంటూ.

"రాధా! చలపతి వచ్చి చాలాసేపయింది. పరీ క్షలయినా దగ్గరపడుతున్నాయి. ఇంకా నువ్విలా

షికార్లు చేస్తూంటే గస్టెక్కడం చాలా కష్టం. చలపతిని చూచైనా నేర్చుకో. త్వరగా భోంచేసి చదువుకో'' అని ఆమెని చిన్నగా మందలించి ఆయన పడకగదివైపు వెళ్లిపోయారు.

రాధ చలపతివైపు చూచింది క్షమించమన్నట్టు.

''నీకోసం లాస్టవరయింతర్వాత వెదికాను. కాని యువ్వసలు కనిపించనేలేదు.'' అన్నదామె.

''చెల్లాయికి సుస్తీగా ఉందంటే మందుకోసం వెళ్లాను.''

''మన కాలేజీడేకి నాటకం వేస్తున్నాం. ఆ నాటకాన్ని శంకరం స్వయంగా రాశాడు. నేనూ ఏక్టు చేస్తున్నా.''

చలపతిఅర్థంకానట్టు ఆమెవైపు చూశాడు.

''ఎంచక్కగా ఉందనుకున్నావ్ నాటకం. హబ్బ .... చెప్పలేనంత బావుంది. శంకరం హీరో—నేను హీరోయిన్ని. నీకూ ఒక రోల్ యివ్వా లనుకుని నీకోసం వెదికాం.''

చలపతిగుండెల్లో ఎవరో చెయ్యిపెట్టి కెలికినట్టయింది.

''నువ్వూ వెయ్యాలి.''

''నాకు నాటకాలెయ్యడం చాతకాదు.''

''ఇందులో చేతొచ్చే దేముందీ ? నేను మాత్రం యింతకుముందు వేశానేవిటీ మరీను.''

''అదికాదు రాధా ! మీ రిద్దరూ నాటకాల ద్వారా కాకపోయినా, మరోవిధంగానైనా స్టేజీ ఎక్కి పదిమందిలో నిర్భయంగా మాటాడడం అలవాటుచేసుకున్నారు. నాలాటివాడు స్టేజి ఎక్కితే నవ్వులపాలవడం తథ్యం.''

''కొత్తలో అలాగే అనిపిస్తుంది. నాలుగు రిహార్సల్సు జరిగితే అదే పోతుందిలెద్దూ.''

''అయినా నావల్లకాదు రాధా ! స్టేటి ఎక్కడమంటేనే నా కాళ్ళు గజగజలాడతాయి.''

''సరే .... నీ యిష్టం.'' చివరికి అన్నది రాధ. రెండు క్షణాల తర్వాత ''మేడమీదకెళ్ళు .... యిప్పుడే క్షణంలో వచ్చేస్తా'' నంటూ ఆమె తన గదిలోకి వెళ్లిపోయింది.

చలపతి పుస్తకాలు తీసుకుని మేడమీద గదిలోకి వెళ్లాడు. పుస్తకం తెరిచాడు చదువుకునేందుకు. కాని చదవ బుద్ధిపుట్టలేదు.

శంకరంతోపాటు రాధ నాటకం వేస్తోంది. అతను హీరో, రాధ హీరోయినూను. ఈ సంగతి సీతారామయ్యగారికి తెలుస్తే ? ఆయ నేమనుకుంటారు ? అయినా రాధ నాటకా లెయ్యడ మేమిటీ!

సీతారామయ్యగారి ఉద్దేశాన్ని యింతకుముందే విన్నాడు చలపతి. ఆయన అభిప్రాయాన్ని వినకముందు చలపతి కలలోనైనా వూహించలేదు రాధని తనకిచ్చి పెళ్లిచెయ్యటానికి ఆయన యిష్టపడుతున్నారని. ఇప్పుడేమో రాధ మరో కుర్రాడితో కలిసి కాలేజీ ఆడిటోరియంలో అందరిముందూ నాటకం వెయ్యబోతోందని తెలిస్తే ఆయనమనస్సు కష్టపడదూ ?

ఆయనకున్న అభిప్రాయాన్ని తనతో యిప్పుడు చెప్పకపోయినా బావుండే దనుకున్నాడు చలపతి. ఈ విషయమ్మై యింత ఆలోచించే అవసరం కలిగేది కాదు.

రాధ వస్తూన్నట్టు మేడ మెట్లమీద శబ్దమయ్యింది. పుస్తకంలో తల దూర్చి శ్రద్ధగా చదువుకుంటున్నట్టు నటించాడు చలపతి. ఆమె లోపలికొచ్చి కుర్చీని టేబిలుకి దగ్గరగా లాక్కుని కూర్చుంది.

''ఏం చదువుదాం ?''

''ఎకనామిక్సు చదువుదాం. ఒకసారి 'రెంటు' గురించి చెప్పు. క్లాసులో సరిగ్గా అర్థంకాలేదు.''

''నీ కెప్పుడు అర్థమయిందనీ యిప్పుడు అర్థమవటానికీ ! సరె .... కానివ్వు.'' అని ఆమెకూడా ఎకనామిక్సు తీసింది. పాఠం చెప్పటానికి ముందుగా ఆమె యిలా అన్నది.

''శంకరం మీ మగవాళ్ళందరిలోనూ బాగా చదువుతాడు.''

అవునన్నట్టు తలూపాడు చలపతి.

''నువ్వెందు కలా చదవకూడదూ ?''

''అతను బ్రిలియంటు.''

''సుమారు 30 సార్లు జైలు కెళ్ళినా నీ వింకా దొంగతనాలు మానలేదే!'' ఆశ్చర్యం ప్రకటించాడు న్యాయమూర్తి మళ్ళీ అంజిగాడిని బోనులో చూచి.

''మీరు చెప్పింది అబద్ధం కాదండీ. అయినా పొరపాట్లు ఎవరికి రావు కనక!'' అన్నాడు అంజిగాడు అమాయకంగా.

టి. వి. ప్రసాద్ (బందరు)

''ఏం కాదు. కృషి. ప్రతిదానికీ అతను కృషి చేస్తాడు. అందుకే అతనలా షైనవుతున్నాడు.''

చలపతి పుస్తకంలో చూపు నిలిపాడు.

''శంకరంగురించి నీ అభిప్రాయ మేమిటి చలపతీ ?''

హఠాత్తుగా ఆమె అడిగినదానికి వెంటనే జవాబివ్వలేకపోయాడు.

''అతనెలాంటివాడని అడుగుతున్నాను.''

''చాలా మంచివాడు.''

''అది అందరికీ తెలిసిందేగదా.''

ఇంకేం చెప్పనూ అన్నట్టు చూశాడు చలపతి.

''అతనిలో ఒక గొప్పతనం గమనించతగ్గది. అత నెవరికీ భయపడడు. అతని ఆశయాలని నెరవేర్చుకునేందుకు స్వయంగా మార్గాలు సృష్టించుకొంటాడు. అవాంతరాలకు లొంగిపోని దిట్ట. కదూ.''

'అవును.''

''మరో గమ్మత్తేవిటంటే, నేనేది కావాలని అనుకుంటానో, సరిగ్గా అతనూ అదే కావా లనుకుంటాడు. చాలా విషయాల్లో మే మిద్దరమూ ఏకీభవిస్తూంటాం. అందుకే అతనంటే నా అభిమానం.''

''రాధా ! యిప్పుడు మనం ఎకనామిక్సు చదవాలి.

''ఎప్పుడూ చదువు, చదువు, చదువూ ! ! రెంత చదివినా అతన్ని మించలేరు.''

''కావచ్చు.''

''వచ్చేవిటి మధ్య ! పైగా అతనంటే మీలో కొందరికి ఈర్ష్య కూడాను.''

''ఎవరన్నా రా మాట ?''

''ఒకరనా లేవిటే ? అతనిమీద మీరెంత అవమానం మోలకబోస్తున్నా, వో మూల అక్కసు రగులుస్తూనే ఉంటుంది.''

''అతను నాకు మంచి స్నేహితుడు.''

''నీ ఒక్కడిగురించి కాదు నే చెప్తూంట ఇందాక ఎవడో ఒక కూత కూశాడులే. మేం ప్రదర్శించబోయే నాటకంలో ఎవరెవర్ని తీసుకుందామా మాటాడుకుంటూంటే, మనక్లాసువాడే, ఎప్పుడూ ఆ వెనకబెంచీల్లో నిద్రపోతూంటాడు చూడు మెల్లకన్నూ వాడూను .... వాడు. మేమట ప్రేమైకజీవులంట, త్వరలో కాబోతూన్న వధూవరులంట.''

చలపతి ఆశ్చర్యపోయాడు.

''నాకు తెలుసు చలపతీ ! ఎవరైనా అభివృద్ధిలోకి వస్తున్నారంటే వాళ్లని చూచి ఏడ్చేవాళ్ళు చాలామంది ఉంటారని.''

క్షణం ఆగి, తిరిగి ఆమే అన్నది.

''మే మొకవేళ పెళ్లి చేసుకోబోతూన్నా ఈ వెధవాయిల ముచ్చట చెల్లించాలనిమాత్రం కాదు.''

''అంటే నీ ఉద్దేశ్యం ?''

ఆమె పుస్తకంలోకి చూస్తూ అన్నది.

''ఇంతలో ఏ ఉద్దేశానికీ రాలేదుగానీ, ఏమో .... ఎవరు చెప్పగలరూ! మేము నిజంగా పెళ్లి చేసుకోబోతామేమో !''

చలపతికి సీతారామయ్యగారి మాటలు గుర్తుకొచ్చాయి. అతను లోలోపల కొంచెం భయపడిన మాట వాస్తవం.

''శంకరం ఈనాటి యువకుల్లో మణిపూస! అలాంటివారు ఎక్కడో కోటికీ, నూటికీ ఒక్కరుంటారు.''

ఆరోజు ఎకనామిక్సు ఏమీ చదవలేదనే చెప్పాలి. శంకరంగురించే ఆమె ఎక్కువగా మాటాడింది. చలపతి మౌనంగా వినడం మినహా మరేం చెయ్యలేక పోయాడు.

వారం రోజులు గడిచాయి. ఆనాడు చలపతి సీతారామయ్యగారింటికెళ్లేసరికి రాధని సీతారామయ్యగా రిలా కేకలు వేస్తున్నారు. గుమ్మంలో నిలబడి అంతా విన్నాడు చలపతి.

''అయినా నిన్ను నాటకాలు వెయ్యమని ఎవరు చెప్పారు. ఎవరిచ్చా రా అధికారం ?'' ఆయనంత గట్టిగా మాట్లాడ్డం అదే మొదటిసారిగా విన్నాడు చలపతి.

''అధికారమివ్వవలసిన అవసరం దాన్లో ఏముంది గనుక. కాలేజీ వార్షికోత్సవంలో మా అందరికీ బాధ్యత ఉంటుంది. తప్పేముంది ?''

''వయసుకొచ్చిన పిల్లవు, పరాయి కుర్రాడితో నాటకాలు వెయ్యటం ఏమైనా సబబా ?''

''అతనేం పరాయివాడు కాడే.'' రాధకి అంత

ధైర్యం ఎలా కలిగిందా అని ఆశ్చర్యపోయాడు చలపతి.

"అంటే నీ అభిప్రాయం ?"

"అతన్ని పెళ్లిచేసుకోబోతున్నాను."

తండ్రీ కూతుళ్లమధ్య దుమారం రేగింది. ఇలాంటి సమయంలో వాళ్లకంటపడటం అతని కిష్టంలేదు. అందుకనే వెనుతిరిగి గబగబా యింటి కొచ్చేశాడు చలపతి.

మరునటిరోజు సీతారామయ్యగారే స్వయంగా చలపతిని కలుసుకున్నారు. పార్కులోకి తీసుకెళ్లి మాటాడారు.

"ఒక పక్కన వాత్సల్యం, మరో పక్కన స్నేహం—ఈ రెండూ నన్ను చిత్రవధ చేస్తున్నాయి చలపతి !" అన్నా రాయన గాద్గదికంగా.

"రాధ తెలివిగలది సీతారామయ్యగారూ ! ఆమె చేసుకున్న నిర్ణయాలమీద ఆమెకు నమ్మక ముంది." చలపతి ఇలా మాటాడ్డం చూసి ఆయన గతుక్కుమన్నారు.

"కాని ఆ శంకరం గురించి....."

"అతను అన్నివిధాలా యోగ్యుడు. ఆదర్శ వాది. ఆశయాలు చాలా ఉన్నాయతనికి. జీవితంలో వాటిని సాధించగలడనే నమ్మకమూ ఉంది. రాధ ఇష్టాన్ని కాదనకండి."

"నీకు అన్నివిషయాలు తెలిశా యనుకుంటా"

"చాలావరకూ తెలిశాయి."

"నువ్వు రాధని ....."

"వద్దు. ఆమె అభిరుచికి ఆటంకం కలిగించకండి. ఎదురుచెప్పినందుకు మన్నించండి సీతారామయ్యగారూ !"

ఆయనకళ్లల్లో నీళ్లు నిలిచాయి. లాలనగా అన్నా రాయన.

"నీకు దేవుడు మేలు చేస్తాడు చలపతి ! మీ వాళ్ళని మరిపిస్తున్నావు. నిన్ను నా అల్లుడిగా చేసుకునేపాటి అదృష్టం నాకు లేదు. మమకారం నన్ను గెలిచింది. ఫలితం ఎలా ఉంటుందో మరి ?'

వేసవిసెలవుల్లో శంకరానికీ, రాధకీ పెళ్లి జరిగింది. ఆ పెళ్లికి అభినందనలు చాలా వచ్చాయి. ఆదర్శవివాహమని ఎంతోమంది పొగిడారు. ఆశీర్వదించారు. ముఖ్యంగా చలపతి ఆ పెళ్లికి సంతోషించాడు.

కాని—

కూతురుకాపురం పట్టుమని సంవత్సరమైనా కాకముందే సీతారామయ్యగారు గుండెజబ్బుతో స్వర్గస్థులయ్యారు. అప్పట్నుంచి చలపతి ఆ యింటికి కొంతవరకు రాకపోకలు తగ్గించుకున్నాడు. ఆ తర్వాతనే అనేక ప్రయత్నాల ఫలితంవల్ల విశాఖ పట్టణంలో ఉద్యోగం లభించింది.

ఈ మధ్యకాలంలో -చెప్పుకోదగ్గది—శంకరం పై చదువులు చదువుకోవడం, హోదా గల ఉద్యోగం సంపాయించడమూను.

చివరిదాకా కాలిన సిగరెట్టు అతని వేలిని కాల్చింది కసిగా. గతస్మృతులనుంచి అతను మేలుకున్నాడు. అయితే ఆ రాత్రంతా నిద్ర లేకుండా తెల్లవారడంగురించి ఎదురుచూస్తూనే గడిపాడు.

చలపతి ఆరోజు ఆఫీసుకి చాలా ఠీవిగా

ఎండమావులు

వెళ్లాడు. ఆఫీసంటే తేలికభావం కలగటం అతనికదే మొదటిసారి. ప్రతిరోజూ అనుకునేవాడు—ఊరుకానిఊళ్లో, అందర్నీ వదలిపెట్టుకుని ఎన్నాళ్లిలా వెట్టిచాకిరీ చెయ్యాలోగదాని. కాని ఈరోజు అదే ఆఫీసుమీద అతనికి జాలి పుట్టుకొచ్చింది. 'నువ్వు వాడిపోయేరోజు దాపున పడ్డదిలే' అని ఆఫీసునీ, దానితాలూకు గాలి పీల్చుకోడానికైనా వీలుదిక్కని వాతావరణాన్నీ గేలి చేశాడు లోలోన.

సీట్లో కూర్చుండబోతూండగా శేషగిరి తమాషాగా పలకరించాడు కళ్లతో తన సీటుదగ్గరికి వస్తూ. చలపతి పెదాల్లో నవ్వు నిలిచింది ఆనంద సూచకంగా.

"ఎన్నాళ్లకి చూచాంరా నీ చిరునవ్వు .... నీ చిన్ననాటిమిత్రుడు ఆఫీసరుగా వస్తున్నాడంటే ఆనందించవలసిన విషయమే కానీ ...."

"ఏమిటిది!" అంటూ బిత్తరపోయాడు తలుపు తీసుకువచ్చిన మఠాధికారి, ఎదురుగా రివాల్వర్ గురిపెట్టి నుంచుని ఉన్న యువకుణ్ణి చూచి.

"అబ్బే ఏమీలేదు! నేను ఈ వేళే పోలీసు దళంలో చేరాను. నా రివాల్వర్ని ఆశీర్వదిస్తారని ఇటువచ్చాను." అన్నా డా యువకుడు వచ్చే నవ్వు ఆపుకుంటూ.

బి. సోమసుందరం (అనంతపురం)

"కానీ ఏమిటోయ్ మధ్య ?"

"ఈరోజులు మనమనుకున్నంత మంచివి కావురా చలపతీ ! మనిషిని పూసరివెళ్లిగా చిత్రించింది తరతరాలనుంచీ నడుస్తూన్న చరిత్ర ! కాబట్టి—అనుకోకూడదుగానీ — మన క్కాబోయే ఆఫీసరు నిన్ను చూసీ చూడనట్టు—"

"ఆపవోయ్ నీ మెట్టవేదాంతం. శంకరం సంగతి నాకంటే నీకేం తెలును. ఏం తెలుసునని నీకింత ధీమా ?"

"ఇన్నాళ్ళూ నువ్వనుభవించిన నరకం కళ్లారా చూచానుకాబట్టి నీకు మంచే జరగాలని కోరుకుంటాను. అన్నట్టు ఆయన యివ్వాళ సాయంత్రమే కదూ వస్తూంట."

"అవును."

"స్టేషనుకు వెడతావా ?"

"వెళ్లాలి మరి."

"మంచిది. ఈ వెధవ హస్కుతో నీ పని పాడు చెయ్యడం నా కిష్టమున్నా లేకపోయినా అవతల హెడ్క్లార్కు మండిపడగలడు. వస్తా" నంటూ అతని సీటులోకి వెళ్లిపోయాడు శేషగిరి.

చలపతి ఒకసారి ఆఫీసునంతా కలియజూశాడు. ప్రతి గుమాస్తా తనవంక కొత్తగా చూట్నం గమనించాడు. వాళ్లందరిలోనూ తను గొప్ప అదృష్టవంతుడిగా ఊహించాడు. కాస్త గర్వించాడు గూడాను.

ఆరోజు చలపతికి పనిచేసినట్టనిపించలేదు. ఇక్ష్వాకులవంశంనాటి ఆఫీసు గడియారం 'అయిదూ' అన్నది. చలపతి సీటులోంచి లేచాడు ఉషారుగా. ఫైళ్లు సర్దుకున్నాడు. గబగబా బయటకు నడిచాడు.

స్టేషనుకి వెళ్లేసరికి అయిదున్నరయింది. రైలు వచ్చేవేళ గూడా దాదాపు దగ్గర పడింది. ఒక్కో నిముషం గడుస్తూంటే అతడు శంకరం ఒక్కోఅడుగు దగ్గరవడుతున్నట్టు ఫీలవుతున్నాడు.

ఒకసారి ప్లాటుఫారమ్ని యీ కొసనుంచి ఆ కొసవరకూ గాలించాడు. మళ్లీ యింకోసారి అదేప్రయత్నానికి సిద్ధమవ్వబోతూండగా—మధ్యలో తక్కున బ్రేకు వేసినట్టు ఆగిపోయాడు.

అతనికొక్కస్త దూరంలో హెడ్క్లార్కూ, మరో పదిమంది పెద్దమనుషులూ గుమిగూడటం గమనించాడు. వాళ్లల్లో చాలామంది స్థానికంగా పేరున్నవారూ, వ్యాపారాల్లో కొద్దో గొప్పో సంపాయిస్తూన్న వారూను. బహుశా వాళ్ళుగూడా శంకరానికి స్వాగతంచెప్పటానికే వచ్చిఉంటారని తలిచాడు.

అక్కడ చేరిన వ్యక్తులందరికీ, అలాంటి చాలామందికీ—శంకరంలాటి ఆఫీసర్లతో పనులు చాలా ఉంటాయి. కొత్త ఆఫీసరనగానే వాళ్ల గుండెల్లో రైళ్లు పరుగెట్టడం మొదలెడ్తాయి. ఆయనకు స్వాగతంచెప్పటానికని చెప్పి, ఆ కాసేపట్లోనే సాధ్యమైనంతవరకూ ఆఫీసరుగారి 'మంచీ—చెడ్డా' తెలుసుకోడానికి ప్రయత్నిస్తారు. ఆయన కరుణకటాక్షవీక్షణాల వరప్రసాదానికిది నాంది ముందు ముందు వీటితో పనులుంటాయి.

హెడ్క్లార్కు లౌక్యుడు. ఎత్తూ పల్లమూ తెలిసిన వ్యక్తి. పదిమందికీ తలలో నాలుకలాటివాడు. అందరి జాతకాలూ ముఖం చూడగానే చెప్పగల సమర్థుడు. రిటైరు కావడానికి సిద్ధంగా ఉన్న హెడ్క్లార్కుకి యిలాంటి వర్తకాగ్రేసరులతోనూ—రాబోయే శంకరంలాటి కొత్త ఆఫీసర్లతోనూ పరిచయం జాస్తి. ఈ రెండు పార్టీలకీ మధ్యవర్తిగా ఆయన అనుభవం శ్లాఘనీయం!

వీళ్లందరూ చలపతికి కాస్త దూరంలో నిలబడి ఉన్నారు. వాళ్ల చేతుల్లో పూలమాలలున్నాయి, వాళ్ల ముఖాల్లో ఆందోళనలు కనుపిస్తున్నాయి.

ఏమిలేని చలపతి మనసు చివుక్కుమంది. ఆఫీసరుగా కాకపోయినా ఒక స్నేహితుణ్ని రిసీవ్ చేసుకోడానికి వట్టి చేతుల్తో వచ్చినందుకు అతనికి నామోషి అనిపించింది.

ఏం చెయ్యగలడు ? చాలీ చాలని జీతంలో కుస్తీ పట్టడం నేర్చుకున్నాడు యిన్నాళ్లు. అదొక్కటే అతనికి చేతనయింది. ఇంటిదగ్గర తనవాళ్ల నందర్నీ గుర్తు తెచ్చుకున్న మీదట గానీ తాన్న ఖర్చుపెట్టుకో గూడదు. అంతేగాని 'నా చిన్న

పెట్టకు శ్రీరామరక్ష' అంటె అది ద్రోహ మవుతుంది. పైగా తనమీద ఆశలు పెట్టుకుని స్వర్గంలో ఉన్న తండ్రి ఆత్మ క్షోభిస్తుంది.

అలాంటప్పుడు తన దగ్గర మిగుల్చుకున్న డబ్బేముంటుంది, మిత్రుడికీ, యీనాటి ఆఫీసరుకీ కానుకగా, ప్రేమ చిహ్నంగా సమర్పించుకునేందుకు"

రైలు ప్లాటుఫారం మీదికి వచ్చి ఆగింది.

హెడ్ గుమాస్తా, ఆయన అనుచరులూ, జనంతో కలియబడి తోసుకుంటూ వెళ్లారు. ప్రతి కంపార్టుమెంటునీ అతి శ్రద్ధగా వెతకటం ప్రారంభించారు. చలపతి కూడా వెళ్లటానికి సంసిద్ధుడయ్యాడు గానీ, ఆ ముఠా ఎదుట తనకీ, శంకరానికీ గల స్నేహాన్ని తెలియపరచకూడదని అక్కడే ఆగిపోయాడు. పైగా హెడ్‌క్లార్కుకి తనమీద వల్లమాలిన ప్రేమలాటి ద్వేషం! చలపతి ఆయన కంటికో నలుసు!

గబగబా నడుస్తున్న హెడ్‌క్లార్కు ఒక కంపార్టుమెంటు ముందు ఆగిపోయాడు. వంది మాగధులూ ఆగిపోయారు. హెడ్‌క్లార్కు నవ్వు ముఖం నిండా కప్పుకుని చేతులు జోడించాడు వినయంగా. మిగిలినవారూ తూ. చ. తప్పకుండా హెడ్‌క్లార్కుని అనుసరించారు.

కంపార్టుమెంటు ఫుట్‌బోర్డుమీద శంకరం నిలబడ్డాడు హుందాగా. చలపతి కళ్లింతవి చేసుకుని తనివితీరా అతన్ని చూస్తుండిపోయాడు.

శంకరం యిప్పుడు ఎత్తుకి తగ్గ లావయ్యాడు. అతనికి సూటు బాగా నప్పింది. చేతిలోని సిగరెట్టు పొగలు కక్కుతుంది. కొత్త అలంకారమైన కళ్లజోడు అతని అందాన్ని మరింతచేసి చాటుతోంది

హెడ్‌క్లార్కు చేతిలోని దండ శంకరం మెడలో అలంకరింపబడింది. తదితరుల తాలూకు దండలు కూడా అదే స్థానాన్ని అలంకరించాయి. తరాత్వ అందరూ కలిసి గబగబా చప్పట్లు చరిచారు.

హెడ్‌క్లార్కు బృందం నుంచి మళ్లీ నమస్కారాలు ప్రయోగింపబడ్డాయి. అవి రాధకి చెందుతాయి. శంకరం పక్కన కుందనబ్బొమ్మలా నిలబడ్డ రాధ అందరికీ నవ్వుతూ ప్రతి నమస్కారం చేసింది.

ఆతర్వాత అక్కడ చేరిన 'తలల' ను గురించి హెడ్‌క్లార్కు పరిచయ వాక్యాలు ప్రారంభించాడు. వారి వ్యాపారాలను అతి క్లుప్తంగా, అర్థమయ్యేలా ఆఫీసరుకు విన్నవించుకున్నాడు.

ఈ తతంగమంతా ముగిసింతర్వాత హెడ్‌క్లార్కు శంకరం దంపతులకు దారి చూపిస్తూ తీసుకు వెడుతున్నాడు బయటికి. బృందం వాళ్లననుసరించింది.

చలపతి వాళ్లని చేరుకోవాలని గబగబా నడిచాడు జనాన్ని పక్కకు తోసుకుంటూ. కాని—వాళ్లందరూ కార్లెక్కి, కార్లు కదిలిం తర్వాత గాని తన ప్రయత్నం నేరవేరలేదు. శంకరాన్ని పేరుపెట్టి పిలవాలా వద్దా అని సందిగ్ధంలో ఉండగానే కారులు కదిలాయి.

హతాశుడై రూంకి తిరిగి వెళ్లేడు.

—తెల్లవారింది. ఆదివారం.

స్నానం ముగించుకుని శంకరానికి కేటాయించిన బంగళావైపు నడక ప్రారంభించాడు చలపతి. దార్లో తన పాత ఆఫీసరుగారి కారు ఎదురుపడింది. బహుశా ఆయన శంకరాన్ని పరామర్శించి వస్తున్నారు కాబోలనుకున్నాడు చలపతి.

శంకరం గురించీ, రాధ గురించీ ఆలోచించుకుంటూనే చలపతి బంగళా చేరుకున్నాడు. ఆ గేటును దాటారు నవ్వుకుంటూ హెడ్‌క్లార్కూ, పానకాలూను. చలపతిని అక్కడ చూడగానే హెడ్‌క్లార్కు ముఖం పాలిపోయింది. అయినా తమాయించుకున్నాడు. ఆయనే చలపతిని అడిగారు.

"ఏం నాయనా! ఇంత ఉదయమే దయ చేశావ్ ?"

"ఆఫీసరుగారి కోసం."

"తెలుస్తూనే ఉంది. కాని ఆయ నిప్పుడు బయట కెళ్లబోతున్నారు."

"పర్వాలేదు నన్ను చూస్తే ఆగిపోతారు."

"నువ్వంటే నీ భర్తకు విసుగు కలిగిందని ఎందుకనుకుంటున్నావు? అనునయంగా అడిగాడు జడ్జీ విడాకులు కోరుతూ దరఖాస్తు పెట్టుకున్న ఒక అమ్మాయిని.

"ఏడు ఏళ్లనుంచీ ఆయన ఇంటికే రావటంలేదు" కళ్లుతుడుచుకుంటూ ఆమె సమాధానం చెప్పింది.

ఎస్. మంగతాయారు (ఏలూరు)

"అలాగా .... సారి .... వెళ్లిరా" అన్నాడు. హెడ్‌క్లార్కు ముఖం చించుకుంటూ.

చలపతి రెండడుగులు ముందుకు వేయగా పానకాలు లోపాయికారీగా హెడ్‌క్లార్కుతో ఏదో గొణిగాడు.

"ఇతగాడికి ఆఫీసరు చిన్ననాటి మిత్రుడట. ఇతగాడు కుచేలుడు. ఆయనగారు శ్రీకృష్ణ పరమాత్మాను. సరిపోయిందిలేండి జత." కసిగా అన్నాడు హెడ్‌క్లార్కు.

పానకాలు వెకిలిగా నవ్వాడు.

హెడ్‌క్లార్కు సహృదయతను యీ రెండే ళ్లలో బాగా అర్థం చేసుకున్న చలపతి—అతని వ్యంగ్యాన్ని దులుపుకున్నాడు. ఇక పోతే యీ పానకాలనబడే వ్యక్తికి నాలుగైదు హోల్‌సేల్ పచారీ దుకాణా లున్నాయి. వ్యాపారంలో టిటుకూ, లాంఛనాలూ వగైరాలు బాగా వంట పట్టించుకుని తన జాతి పదిమంది పెద్ద మనుషులలోనూ 'భళీ' అనిపించుకున్నాడు.

ఇలాంటి వ్యక్తులంటె చలపతికి చిరాకు. వాళ్ల మాట అసలు పట్టించుకోలే దతను.

వరండా మెట్లెక్కి ఆగిపోయాడు చలపతి.

ఇప్పుడు శంకరాన్నేమని పిలవాలి ? ఇప్పుడిదొక సమస్యైపోయిందతనికి. అటూ యిటూ పరకాయించి చూశాడు. ఆవరణంతా నిశ్శబ్దంగా ఉంది. రేడియో సంగీతం చిన్నగా వినిపిస్తోంది. అత నలాగే మౌనంగా నిలబడిపోయి ఉన్నాడు. ఇంతలో అక్కడ ఖంగున ఎవరో దగ్గినట్టు గమనించాడు. అటువైపు చూశాడు. ఆఫీసు జవాను రాజన్న వస్తున్నాడు. చలపతిని రాజన్న చూశాడు.

"ఆఫీసరున్నారా రాజన్నా ?"

"వుండారు బాబూ. మేడమీ దున్నారు."

"ఆహా .... "

"మీ రొచ్చారని చెప్పమంటారా ?"

"ఆ .... వద్దు .... పర్వాలేదు .... "

చలపతి గుమ్మంలోకి అడుగు పెట్టాడు. లోపికి తొంగిచూశాడు. చేతిలో ఏదో నవల పెట్టుకుని రాధ పక్క గదిలోంచి వచ్చింది.. చలపతిని చూసి అలాగే నిలబడిపోయింది. నోటి నుంచి మాట పెగిలి బయటకు రాలేదు. చలపతికి ఆమెలో పెద్ద మార్పు వచ్చినట్టు కనిపించలేదు. అప్పటిలాగానే యిప్పటిగ్గూడా రాధకి సాదారంగు చీరలంటె యిష్టం కాబోలు. మెడలో అందమైన వంటిపేట గొలుసున్నది. రాధ కిదివరకు రెండు జడలుండేవి. ఒక జడ ఎప్పుడూ ముందు భాగంలో ఉండేది. కాని యిప్పుడా అలంకరణ మారిపోయింది. ఇదే ఆమెలో కనుపించిన కొత్తదనం.

"చలపతిని రాధా !" అతను నిశ్శబ్దాన్ని భరించలేక అన్నాడు.

ఈ వింత సంబోధన రాజన్నని ఆశ్చర్యంలో ముంచేసింది. అతను యీ యిద్దరివైపూ కొన్ని క్షణాలు చిత్రంగా చూశాడు. తర్వాత నెమ్మదిగా బయట కెళ్లిపోయాడు.

"శంకరం మాకు ఆఫీసరుగా వచ్చాడు."

"ముందు ఆ సోఫాలో కూర్చో చలపతీ !" ఆమె అన్నది. తన ముందున్న సోఫాని చూపిస్తూ.

చలపతి కాస్త సిగ్గుతో కూర్చున్నాడు. రాధ కూడా కూర్చుంటూ చలపతితో అన్నది.

"ఇప్పుడు చెప్పు అన్ని విషయాలూ."

"రెండు సంవత్సరాల క్రితం యీ ఊళ్లో ఉద్యోగం దొరికింది నాకు. అమ్మావాళ్లంతా ఆ ఊళ్లోనే ఉన్నారు."

ఎందుకనిట ?"

"అమ్మని రమ్మన్నాను. కాని ఉన్న వూరుని వదిలిరావా లనిపించటం లేదన్నది. చివర్రోజులు ఆ గడ్డమీదనే గడపా లన్నది. పైగా పిల్లల చదువులు చెడిపోతాయని ఆమె నమ్మకం. వీటితో ఆమెదంతా ఒక పిచ్చి."

"బాగా మారిపోయావు చలపతీ !"

ఉన్నట్టుండి రాధ యిలా మాటాడేసరికి, అతను తనవైపు తనే చూచుకున్నాడు.

"ఇదివరకు కాస్త లావుగా ఉండేవాడివి అన్నట్టు బొజ్జ కూడా ఉండే దనుకుంటాను వినాయకుడిలా" అని చిన్నగా నవ్విం దామె.

చలపతి ఆమె నవ్వుకి శృతి కలుపుతూ.
"హోటలు భోజనం ధర్మమా" ని అన్నాడు.
"అంటే నువ్వింకా పెళ్లి చేసుకోలేదా ?"
"లేదు. అయినా నాలాటి దౌర్భాగ్యుడ్ని పెళ్లి చేసుకున్నవాళ్లు సుఖపడే దేముంది రాధా ! వచ్చే నాలుగు రాళ్లూ మాకే చాలీ చాలనట్టుందాయె."
"మొదట్నుంచీ నువ్వు 'పెసిమిస్టు'వే."
"బాగా చెప్పావు రాధా ! మనిషి ఆశతోనే బ్రతకాలి. కాదనను. కాని అవకాశం కూడా కలిసి రావాలి గదా !"
"చాల్లే ఈ సంగతులకేం గాని — ఇంకేమైనా మంచి కబుర్లుంటే చెప్పు."
"చెప్పదగ్గ శుభవార్త నా దగ్గర ఒక్కటే ఉంది."
"ఏమిటది ?"
"శంకరం మాకు ఆఫీసరుగా రావటమే పెద్ద శుభవార్త. శంకరం దయవల్ల మావూరు చూస్తానే ఆశ నన్ను మళ్లీ మనిషిగా తయారుచేసింది రాధా !"
రాధ పేలవంగా నవ్వింది !
"ఇంతకుమునుపు ఆఫీసరు నాపై పెద్ద శ్రద్ధ తీసుకోలేదు. ఆయన పనేవిటో ఆయనేవిటో గాని నా బదిలీ గురించి ఆలోచించనేలే దసలు."
"ఊ బాగానే ఉంది. అందరం ఒక్కచోట చేరామన్నమాట."
"నిన్న మిమ్మల్ని కలుసుకోటానికి స్టేషన్‌కి వచ్చాను. కాని శంకరం చాలా బిజీగా ఉండిపోయాడు."
"అవును. పాపం చాలామందికి శ్రమ కలిగించారు. అప్పటి స్వాగతం యిప్పటివరకూ సాగుతూనే ఉంది. చాలామంది వచ్చారు, ఆయన్ను చూట్టానికి" ఆమె వ్యంగ్యాన్ని అర్థం చేసుకోలేక తత్తరపాటు చెందాడు చలపతి.
"అంటే?"
"నీకు తెలియందేముంది చలపతి ! వాళ్లందరికీ ఏవో కొన్ని 'పనులుం' టూ ఉంటాయి కదా! వచ్చినాయన కొత్త ఆఫీసరాయె. ఏ సమయం ఎలా ఉంటుందో నని కాస్త ముందుగానే వచ్చి పరామర్శించి వెళ్లారు.
"కాని రాధా ! నా విషయం అలా కాదు. స్నేహితుడ్ని ...."
"ప్రతి చిన్నవిషయానికీ అలా ఉలిక్కిపడతావే చలపతీ ! నీ సంగతి నాకు తెలియంది కాదుగా" ఆమె నవ్వుతూ అన్నది.
అదే సమయంలో శంకరం సిగరెట్టు కాల్చుకుంటూ అందంగా, హుందాగా మేడ మెట్లు దిగుతూ 'రాధా' అని పిలిచాడు.
చలపతి శంకరాన్ని చూస్తూ లేచి నిలబడ్డాడు. కళ్లల్లో ఆనందం నింపుకుని శంకరాన్ని నఖశిఖపర్యంతం తనివితీరా చూస్తూ నిలబడ్డాడు.
"ఇక్కడే ఉన్నాను. చలపతి యింతకుముందే వచ్చాడు మీకోసం. ఇద్దరం బాతాఖానీ వేసుకున్నాం" అంది భర్తతో.
"చలపతా ?" తన పేరు తెలియనట్టు ముఖం చిట్లించి అడిగాడు శంకరం.
"అవును" అన్నది రాధ.

ఎండమావులు

"అంటె ...."
చలపతి ముఖంలో కత్తివాటుకు నెత్తురు చుక్క లేదు. ముఖం వివర్ణమైపోయింది. ఇంతకుముందున్న నవ్వు స్థానాన్ని ఆశ్చర్యం ఆక్రమించింది. అతని నవనాడులూ అవమాన భారంతో కుంగిపోయాయి. ఏం మాటాడలేక తల దించేసుకున్నాడు.
"చలపతండీ .... మన చలపతి ...." రాధ ప్రయాస కూడా వృధా అయింది.
శంకరం నిర్లక్ష్యంగా చలపతిని చూశాడు. చలపతి సంబాళించుకుని అన్నాడు.
"మీ ఆఫీసులో గుమాస్తాగా పనిచేస్తున్నాను."
"ఐ .... సీ .... ఊఁ అయితే ?" అని అడిగాడు సిగరెట్టు పొగవయ్యారంగా వదులుతూ.
"మిమ్మల్ని చూద్దామని వచ్చాను."

"నీవు నిజంగా నిర్దోషివని తోస్తే, నీ తరఫున నేను తప్పకుండా వాదిస్తాను. ఇంతకూ నీవు అన్ని విషయాలు దాచకుండా చెప్పినట్లేనా" అని అడిగాడు న్యాయవాది తన వద్దకు వచ్చిన తిప్పణ్ణి.
"డబ్బు దాచిపెట్టిన చోటు, తప్ప మిగతా అన్ని విషయాలు చెప్పాను బాబు" తిప్పడుఅమాయకంగా ఒప్పుకున్నాడు.
కె. లక్ష్మీపతి (భీమవరం)

"సారీ .... నాకు అర్జెంటుగా మరో ఎంగేజిమెంటున్నది. రే పెలాగైనా ఆఫీసులో అందర్నీ కలుసుకుంటాగా" అంటూ శంకరం బూట్ల శబ్దంతో గబగబా బయటి కెళ్లిపోయాడు.
చలపతి అచేతనుడై నిలబడిపోయాడు అతను వెళ్లిన వైపే చూస్తూ.
"చలపతీ!"
అతను రాధవైపు తిరిగాడు.
"బాధపడ్డావా ?" జాలిగా అడిగింది రాధ.
అతనేం చెప్పలేదు. ఆమె నిర్జీవంగా నవ్వింది.
"అతనిగురించి యింకా ముందు ముందు బాగా తెలుసుకుంటావ్ !"
"వస్తాను రాధా !"
చలపతి అక్కడ్నుంచి వెంటనే కదిలి, వేగంగా, పిచ్చిగా నడుచుకుంటూ వెళ్లిపోయాడు.
గదిలో చాపమీద కుప్పలా కూలిపోయాడు.
ఇంతవరకూ శంకరం చలపతి మనోవీధిలో ఉదాత్తమైన రంగు పూసుకుని — ఆదర్శ యువకుడుగా నిలిచిపోయాడు. అతన్నలా చిత్రించుకోడంలో చలపతి చేసిన పొరపాటుకి కుమిలిపోయాడు. కాలేజీ రోజులూ, చలపతీ — శంకరానికి గుర్తు లేదంటే నవ్వాలో, ఏడవాలో గూడా అర్థంకాలేదు చలపతికి.
'మనిషి మూసరవెల్లి' అన్న శేషగిరి మాటలో నిజం యిప్పుడు బోధపడింది. అంతస్తూ — అధికారం మనిషిని లోకువ చేసుకుంటాయనే వాడుక ఎన్నో ప్రయోగాలు జరిగిన మీదటనే నిజమయి ఉంటుంది. ఆ క్షణంలో చలపతికి శంకరంపైన ఏహ్యాభావం పుట్టుకొచ్చింది.
రాధలో మార్పు ఏమీ కనిపించలేదు గాని, ఆమె మానసికంగా కుమిలిపోతున్నట్టు ఆమె మాటాడిన కొద్ది సేపట్లోనే గ్రహించాడు చలపతి.
కొత్త ఆఫీసరుకు స్వాగతం, పాత ఆఫీసరుకి వీడ్కోలు యిచ్చారు ఆఫీసు బృందం. శంకరం డ్యూటీలో జాయినయ్యిన వారం రోజుల వరకూ యీ క్రొత్త ప్రభుత్వం ఎలా ఉంటుందో తలకో విధంగా వూహించిన మీదట — చివరికి అంతా ఒక నిశ్చయానికి వచ్చినట్టు కనిపించింది.
శంకరం లాంఛనాలు తూ. చ. తప్పని ఆఫీసరు !
చలపతి తన పనిని మవునంగా చేసుకుపోడం ఆఫీసు నంతటినీ కలవర పెట్టింది. అతను శంకరం గురించి చాలా చెప్పాడు. ఇప్పుడేమో ఏదీ పట్టించుకోనట్టు సంచరిస్తున్నాడు. దాన్లో ఉన్న రహస్యం తెలుసుకోవాలనే కోరిక ప్రతి గుమాస్తాని ఆవరించింది. కాని వాళ్లకి చూచాయిగా నైనా కారణం చెప్పేవాడు కాదు చలపతి.
హెడ్‌క్లార్కు యింత ముక్కుపొడుం దట్టించి చేతులు దులుపుకుంటూ, ముక్కు తుడుచుకుంటూ చలపతి సీటుకి వచ్చాడు. వెకిలిగా నవ్వుతూ అడిగాడు.
"ఆఫీసరు భార్య కూడా నీకు బాగా తెలుసునట. మన రాజన్న చెప్పాడులే !" చలపతి మవునంగా ఉండిపోయాడు.
"నీకూ, ఆఫీసరు కుటుంబానికీ ఉన్న స్నేహం మెచ్చుకోవచ్చు. కానీ—ఆఫీసరు నువ్వంటే బొత్తిగా యిష్టం లేనట్టు కనిపిస్తున్నా డేమిటోయ్ !"
చలపతి పేలవంగా నవ్వాడు.
"దాచకోయ్ చలపతి ! నా కంతా తెలుసు. పెద్దవాళ్ల దగ్గర స్నేహాలూ, హృదయాలూ అని భాష వాడకు. చెడిపోతావ్. కుర్రవాడివి. జీవితం యింకా వంట పట్టలేదు నీకు !" ఆయన వ్యంగ్యంగా నవ్వాడు.
చలపతి తల దించుకున్నాడు.
హెడ్‌క్లార్కు అంటూన్న ప్రతి మాటనీ ఆలకిస్తున్నారు ఆఫీసు బృందం. కాని చలపతి నోటి నుంచి జవాబు రాకపోవటంతో హతాశులయ్యారు.
ఇంతలో పానకాలు రావటం పసిగట్టిన హెడ్‌క్లార్కు, నవ్వుని కొని తెచ్చిపెట్టుకుని బిగ్గరగా అన్నాడు.
"రండి. రండి. ఇప్పుడే అడిగారు ఆఫీసరు మీ గురించి. నేనూ ఎదురు చూస్తున్నా. పదండి

వెడదాం" అంటూ పానకాలుని వెంట బెట్టుకుని ఆఫీసరు గదివైపు వెళ్లిపోయాడు.

"వడ్డించేవాడు మనవాడైతే కడపంక్తిని కూర్చున్నా పర్వాలేదంటారు. ఇందుకే కాబోలు." చలపతి వెనుకసీటుని ఆక్రమించిన దామోదరం అన్నాడు. "చలపతి చెపితే నిజం కాబో లను కున్నాం. ఆఫీసరు లాంఛనాలు తప్పని సరుకని మనకేం తెలుసు" అన్నాడు మరొకాయన ఆఫీసంతటికీ వినిపించేలా. అలా అతను గొంతు చించుకోడం చూచి దామోదరం భయపడ్తూ నెమ్మదిగా అతన్ని దండించాడు.

"ఉష్! గట్టిగా అరవకురా పీనుగా! అక్కడికి నువ్వేదో మడికట్టుకున్నట్టు వాగుతున్నావ్. నీ సంగతంతా ఆ వెంకటస్వామిగారి వల్ల బయటపడిందిలే. ఖుదాయి పలక్కు.

"ఏడిశావు లేవోయ్ .... రాజే కక్కుర్తి పడుతున్నప్పుడు యిక మన మొహా లెఖ్ఖా! జమా! .... హి .... హి .... హి ...."

ఈ ధోరణి వింటూ చలపతి లోలోన విసుక్కున్నాడు. శంకరం యింత నీచస్థితికి దిగజారిపోవడం అతనికి బాధనిపించింది.

—నెల రోజులు గిర్రున తిరిగేసరికి శంకరం గురించి యింకా దారుణంగా వినాల్సి వచ్చింది. ఇంత త్వరగా శంకరం మారిపోగలడని చలపతి వూహించనైనా లేదు.

ఇప్పుడు చలపతిలో నిస్పృహ గూడు కట్టుకుని ఉంది. అతను అధికంగా ఎవర్తోనూ మాట్లాడడు. శంకరం రాకముందే చలపతి యింకాస్త వుషారుగా ఉండేవాడు. మాట్లాడిన కొద్దిసేపూ నవ్వుతూ మాట్లాడేవాడు. అలాంటి చలపతిలో యిప్పుడు నవ్వు దూరమయింది. ఎప్పుడూ దేని గురించో ఆలోచిస్తూ ఉంటాడు.

ఒకరోజు శేషగిరి చలపతి గది కొచ్చాడు. మాటా మంచీ ముగిసిం తర్వాత అతనే శంకరం విషయం తీసుకొచ్చాడు.

"నువ్వసలు యీ కాలానికి సమ్మంధించిన వ్యక్తివి కావురా చలపతీ! మనిషికి విలువనివ్వు. కాని దాన్ని దాచిపెట్టుకో! మొదట్లో నువ్వు శంకరంగురించి చెప్తుంటే నా కనిపించింది—ఎప్పటికైనా నువ్వు అవమానం చెందుతావని! కాబట్టి మనుషుల్నందర్నీ అతిగా నమ్మటం మంచిదికాదు. నమ్మితే నీ మనస్సులో పెట్టుకో. ఇప్పుడు చూడు ఆఫీసంతా నువ్వంటే చులకనగా చూస్తున్నారు. నువ్వసలు శంకరం గురించి చెప్పుకోకపోతే ఎంత బావుండేదో వూహించు."

"నా గురించి ఎవరే మనుకున్నా పర్వాలేదు గిరీ! కాని శంకరం యింత దౌర్భాగ్యానికి దిగజారడం మాత్రం నన్ను కలవర పెడ్తోంది. చెప్పానుగా కాలేజీ రోజుల్లో అతన్ని మేమంతా ఎంత గౌరవించేవాళ్లమో—అతనూ మమ్మల్ని అంతగా గౌరవిస్తూండేవాడు."

"ఇప్పుడేమయ్యాడు. ధంకా పలాస్ప్రియుడయ్యాడు, తాగుడు నేర్చాడు—ఒక్కటేవిటి అన్నీ నేర్చుకున్నాడు. ఇలా మారతాడని నువ్వానాడు అనుకోపోవడంలో ఆశ్చర్యంలేదు. ఆశయాలూ గట్రా కావలిసిందే. అయితే జీవితాంతం నిలబెట్టుకోగల మనోబలం మనిషికి కావాలి. అది యీనాడు చాలామందిలో లేదు. గమ్మత్తేవిటంటే—మనలో కొంద రుంటారు— వాళ్లు 'ఇది నా ఆదర్శం' అని చెప్పుకోకుండానే ఆదర్శంతో బ్రతుకుతుంటారు. అలాంటివాళ్లు పదిమందిలో ప్రచారం ఆశించరు."

శేషగిరి మాటలు వింటూంటే చలపతికి సీతారామయ్యగారు గుర్తుకొచ్చారు.

"వద్దురా గిరీ! మనకి పెద్ద మాటల్తో పని లేదు. ఇలాగే బ్రతుకుదాం! మళ్లీ నా వూరు చూచే భాగ్యం కరువయినా ఒక సత్యాన్ని తెలుసుకున్నాను. చాలిది నాకు."

శేషగిరి చలపతి స్థితిని అర్థం చేసుకున్న వాళ్లల్లో ముఖ్యుడు. అందుకే అతనికి చలపతంటే జాలి.

* * *

ఆఫీసులో తలవంచుకు పనిచేసుకుపోతూన్న చలపతిని ఆఫీసుబవాను రాజన్న పలకరించాడు. చెవిలో చెప్పినట్టు చాలా నెమ్మదిగా గొణిగాడు.

మొగుడు కొడుతున్నాడని రత్తాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

"ఏరా అది చెబుతున్నది నిజమేనా" గద్దించి అడిగాడు మల్లిగాడిని పోలీసు అధికారి.

"శుద్ధ అబద్ధం బాబు! నేను కొట్టింది దాన్ని కాదు. అది తాగి అట్లా చెబుతోంది" మల్లిగాడు బుకాయించాడు.

వి. హనుమంతరావు (హైదరాబాదు)

"ఆఫీ సయింతర్వాత మిమ్మల్నొకసారి అమ్మగారు రమ్మన్నారు బాబూ!"

ఎందుకన్నట్టు అతని వైపు చూచాడు చలపతి.

"మీతో చాలా విషయాలు మాటాడాలంట.'

ఈ రెండు ముక్కలూ చెప్పి రాజన్న గబగబా బయటకు వెళ్లిపోయాడు ఏదో పని ఉన్నవాడిలా. రాజన్న చలపతికి చెప్పిం దేవిటో తెలుసుకోవాలన్న ఉబలాటంకొద్దీ — గుమాస్తా లందరూ చలపతి వైపు కళ్లప్పగించి చూస్తున్నారు. వాళ్ల దుస్థితికి చలపతి విచారించాడు.

రాధ అకస్మాత్తుగా చలపతికి గుర్తు వచ్చింది. తండ్రి ఎంత చెప్పినా వినలేదు. శంకరాన్నీ, అతని ఆశయాల్నీ నమ్మింది. మనసిచ్చింది. పెళ్లి చేసుకుంది. ఈనాటి శంకరాన్ని, ఆనాటి శంకరంతో పోల్చి చూసుకుని కుమిలిపోతూంటుంది బహుశా.

ఈ ఊళ్లో తొలిగా రాధని చలపతి చూచినప్పుడు ఆమెలో ఏదో అవ్యక్తమైన బాధ గమనించాడు. అందు క్కారణం శంకరం ప్రవర్తనే ననే నమ్మకం చలపతికి ధృవపడింది.

ఆ సాయంత్రం రాధని చూచి రావాలని నిశ్చయించుకున్నాడు చలపతి.

ఆఫీసరు గదిలో పానకాలు రాలుగాయి కంఠం గట్టిగా నవ్వింది! హెడ్‌క్లార్కు వళ్లంతా కదుపుకుంటూ ఆ గదిలోంచి బయట కొచ్చాడు. తన సీట్లో కూర్చుంటూ చలపతిని పిలిచాడు. చలపతి ఆయన సీటు దగ్గరికి వెడుతూ అనుకున్నాడు ఏదో విడ్డూరం జరిగిం దనుకుంటూ.

"అదికాదు చలపతీ! నీ కెన్నిసార్లు చెప్పాలి? పానకాలుగారి కాగితాలేవో చూడమని పదిసార్లయినా చెప్పానా? నువ్వసలు వినిపించుకున్నపాపాన పోతేనా? ఇప్పుడు చూడు. ఆఫీసరు నామీద ఫైరవుతున్నాడు. అబ్బెబ్బే, నీ పద్ధతేం బాగోలేదోయ్."

చలపతి నిశ్చేష్టు డయ్యాడు. పానకాలు కాగితాల గురించి తన కింతవరకూ చెప్పనేలేదు. ఇదంతా చూస్తుంటే చిన్నప్పుడు చదివిన "మేకపిల్లా—తోడేలు" కథ గుర్తు కొచ్చింది చలపతికి!

"నువ్వు రేపట్నుంచి గుర్నాధంగారి సీటు పని చూచుకోవాలిట. ఇది ఆఫీసరుగారి ఆజ్ఞ. మారాజా, మంచివారు గాబట్టి నిన్నేమనలేక సీటు మాత్రం మార్చారు. మరొకళ్లయితే .... ఇవన్నీ నా కెందుగ్గానీ రేపట్నుంచి గుర్నాధంగారి పని చూసుకో. వెళ్ళు" అన్నారు హెడ్‌క్లార్కు.

చలపతి బిత్తరపోయాడు. కొద్ది కొద్దిగా తన సీటు మార్పిడికి కారణాలు అవగత మవుతున్నాయి. కొన్ని కొన్ని 'పనులు' కొందరి వ్యక్తుల వరకే పరిమితమై ఉంటాయి. ఇదంతా రాచరికం తీసుకున్న రాజుగారి అభిప్రాయాల కనుగుణంగా మార్చుకోబడుతాయి.

శంకరం చేస్తూన్న నిర్ణయాలు నీచంగా కనుపించాయి చలపతికి. ఆఫీ సయిం తర్వాత శేషగిరి చలపతితో అన్నాడు: "నువ్వు వట్టి అమాయకుడివిరా చలపతీ! అందరూ నిన్ను చులకన చేస్తున్నారు."

చలపతి గది చేరుకున్నాడు నీరసంగా. శంకరం పైన కోపం ముంచుకొచ్చింది. హెడ్‌క్లార్కు నక్కజిత్తులకి అసహ్యించుకున్నాడు.

"వీళ్లందరూ మనుషులేనా?" అని అనుకున్నాడు. అప్పటి కప్పుడే తల్లికి ఉత్తరం రాశాడు.

అమ్మకి,

నా స్నేహితుడే నాకు ఆఫీసరుగా వస్తున్నాడంటే సంతోషించాను. మీకు దగ్గర్లో ఉండి ఉద్యోగం చేసుకునేపాటి అదృష్టం కలుగబోతూందని మురిసిపోయాను. నే ననుకున్నదంతా వట్టిదయింది. దారుణమైన ఫలితాలు నన్ను ఆవరించాయి. ఇంతలో మీ పాదాలదగ్గరగా పనిచేసుకునే భాగ్యం నాకు లేదు. చెల్లాయినీ, తమ్ముణ్నీ బాగా చదువుకోమని చెప్పు. ఎప్పటిలాగానే మీకు డబ్బు పంపుతూంటాను. ఆ ధైర్యం యింకా చావలేదు.

నమస్కారములతో
చలపతి.

ఎండమావులు

ఉత్తరం పోస్టు చెయ్యడానికని బయటకొచ్చిన చలపతిని రాజన్న అంతదూరం నుంచే పిలిచాడు. చలపతి ఆగిపోయాడు.

"అమ్మగారు మిమ్మల్ని అర్జంటుగా రమ్మంటున్నారు."

"ఎందుకు ?"

"ఏమోనండీ ! ఇప్పటిదాకా మీ కోసం ఎదురు చూచారు. మీ రాకపోతే మళ్లీ పిలుచుకురమ్మని పంపారు. వెంటనే ఉన్నపళంగా రమ్మన్నారు."

చలపతి కాదనలేక రాజన్న వెంట వెళ్లాడు.

బంగళా ఆవరణలో చలపతిని చూచిన రాధ, గబగబా ఎదురుగా వచ్చి అతన్ని ఆహ్వానించింది. లోపలికి వెడుతూ అంది.

"బొత్తిగా నల్లపూసవై పోయావేం చలపతీ ?"

".... ...."

"అలా కూర్చో కాఫీ తీసుకొస్తాను" అంటూ ఆమె కాఫీ తీసుకురావడానికి వెళ్లింది. చలపతి సోఫాలో బెరుగ్గా కూర్చున్నాడు. ఏదో మాగజైను తీసుకుని పేజీలు తిప్పడం మొదలుపెట్టాడు. మనసు మాత్రం రాధ చెప్పబోయే విషయాలను వూహిస్తూంది.

రాధ కాఫీ అతని కిస్తూ అంది.

"నామీద కోపం వచ్చిందా ?"

"అబ్బే నా కెందుకూ కోపం ?"

"మనం కొన్ని పొరపాట్లు చేజేతులా చేసుకుని ఫలితానికి విచారించటం వివేకమంటావా చలపతీ ?"

అతడా ప్రశ్నకు జవాబు యివ్వలేదు.

"నా చిన్నతనం గురించి ఆలోచిస్తూంటే కాలేజీ రోజులు నాకు బహుసుందరంగా కనిపిస్తాయి. అప్పుడే పొరపాటు చేశాను" ఆమె గాద్గదికంగా అన్నది.

"నిజంగా పొరపాటు జరిగిపోయింది చలపతీ ! నాన్న నీ గురించి చెప్పారు. నువ్వంటే నాకు అభిమానమే — కాని—శంకరం నన్ను ఆకర్షించాడు. అతని ప్రవర్తన నా కళ్లు కప్పింది."

"ఇప్పు డివన్నీ ఎందుకు "

"స్వర్గాన ఉన్న నాన్న నాకు అనుక్షణం గుర్తుకొస్తూంటారు. నేను ఓడిపోయానని హెచ్చరిస్తూంటారు. ప్రేమించి పెళ్లిచేసుకోడం మంచిదే. దానికి యోచన కావాలి చలపతీ ! శంకరంలో తప్పు ఆనాడు కనిపించలేదు. పైగా మనం అభిమానిస్తున్న వ్యక్తిలో తప్పు వెదకటం అంత తెలివైనపని కాదు.

"మా నాన్న బ్రతికుంటె ఆయన పాదాలు తాకి మనసులో గూడు కట్టుకున్న బరువంతా తీరిపోయేలా వలవలా ఏడవా లనిపిస్తుంది. ఆయన లేరు. సన్నిహితులైన వాళ్లల్లో నువ్వు ఒక్కడివే కనుపిస్తున్నావ్. నా బాధంతా నీతో చెప్పుకోవా లని ఉంటుంది. కాని .... ఆరోజు .... నాముందే అవమానం చెందిన నువ్వు మళ్లీ నాకోసం వస్తావనుకోలేదు.

"పదిమంది మధ్యనా శంకరం నన్ను గౌరవిస్తాడు. మేము ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆదర్శ దంపతులమనీ, మా మధ్య పొరపొచ్చా లసలు లేవని అందర్నీ నమ్మిస్తాడు. అందరిముందూ వలకబోస్తున్న అనురాగం నాకీ యింట్లో ఆయన ముందు లభించడంలేదు. ఆయన వ్యవహారాల్లో నేను జోక్యం కల్పించుకోకూడదు. నన్ను బానిసలా చూడటం నేర్చుకున్నాడు. ఇదీ చలపతి ! మా పెళ్లికి జరుగుతున్న ప్రతిఫలం !"

చలపతి హృదయం ద్రవించింది. టీపాయ్ మీద కాఫీ అలాగే ఉండిపోయింది.

"పాపిష్టిదాన్ని .... నా గొడవ చెప్పుకోవటమే సరిపోయింది. ముందు , కాఫీ తాగు చల్లారి పోతుంది" అన్నది.

అతను కాఫీ తీసుకున్నాడు.

"నీలాంటి స్నేహితులతో మనసు విప్పుకు మాటాడాలని ఉంటుంది. కాని నాకు ఆయన అందుకు అవకాశ మివ్వరు. కాలేజీ రోజుల్లో నాకున్న స్వేచ్ఛ యిప్పుడు లేదు. నే నెవరితోనైనా మాటాడటం ఆయన చూస్తే ఏదో 'గిల్టీ'గా ఫీలవుతాడు. నన్ను ప్రేమించి పెళ్లి చేసుకొనక ముందు, యిదే ప్రవర్తన అభినందనల పాలయింది.

"మీ ఇల్లు దోచుకున్నవా రెవరో మీకు తెలుసా?" పోలీసులు నారాయణమ్మగారిని అడిగారు.

"మహాచక్కగా తెలుసు! అయినా మీ అంతట మీరే కనుక్కోండి చూద్దాం" నారాయణమ్మగారు సవాలువిసిరారు.

బి. సి. పద్మనాభశర్మ (గుంతకల్లు)

"తను చేసేది తప్పని తెలిసి గూడా దిద్దుకోలేని మనస్తత్వం ఆయినది. మనోబలం రానురాను క్షీణిస్తుంది. శంకరాన్ని దేవుడు కూడా క్షమించలేడు చలపతీ .... నువ్విక్కడికి వచ్చిన రోజున నావల్ల నీ మనసు బాధపడితే క్షమించు."

"ఛ .... అవేం మాటలు రాధా !—— నేనా నాడే గ్రహించాను మీ మధ్య అఘాతం .....మరింక వస్తాను" అంటూ చలపతి లేచాడు.

త్యాగం చేసింది నువ్వు — ఆశయమని మభ్య పెట్టింది శంకరం" ఆమె [illegible] యీ మాటకి అతను ఆశ్చర్యపోయాడు.

"నిజం చలపతీ ! ఒక లక్షాధికారి బిడ్డని, అవకాశమేర్పడినా, ఆమె సుఖాన్ని ఆశించి పెళ్లి చేసుకోలేనని చెప్పిన మనిషి దేవుడు."

చలపతి ముఖాన్ని పక్కకి తిప్పుకున్నాడు.

"ఎప్పుడైనా వీలు చిక్కితే యిటువైపురా. మన రెండు కుటుంబాల మధ్య ఉన్న స్నేహం మనం అంత త్వరగా మరచిపోకూడదని ఆశిస్తాను" ఆమె లేచి నిలబడుతూ అన్నది.

చలపతితోపాటు వరండా మెట్ల వరకూ రాధ వచ్చింది. అదే సమయంలో శంకరం యింటికొచ్చాడు. చలపతి వైపు కోపంగా చూస్తూ అడిగాడు.

"నీ కిక్కడేం పని ?"

".... ...."

"చెప్పవేం జవాబు."

"నేనే రమ్మని కబురంపాను." రాధ నెమ్మదిగా జవాబు చెప్పింది.

"కబురంపుతావ్. అన్నీ తెలుసు నాకు. ఆఫీసంతా మీ గురించే అనుకొంటున్నారు. ఛీ .... సిగ్గులేకపోతే సరి. ముందు నువ్వు లోపలికి వెళ్లు" అన్నాడు రాధని విసుక్కుంటూ.

చలపతి మనసు చివుక్కుమంది. అతను మెట్లు దిగి గబగబా వెళ్లబోయాడు. కాని శంకరం అంటూన్న మాటలు వింటూ ఆగిపోయాడు.

"అసలీ గుమ్మం తొక్కటానికి నీ కెవ డిచ్చాడు అధికారం ? వెళ్లిక్కడ్నుంచి. మర్యాద బొత్తిగా తెలియని బ్రూట్స్. మరోకసారి యీ యింటి పరిసరాల్లో కనుపిస్తే నే సహించేదిలేదు. ఎంతలో ఉండాలో అంతలోనే ఉండు." ఒక పురుగుని చూచినట్టు, చలపతివైపు చూస్తూ అన్నాడు శంకరం.

"బాగా మారిపోయావు శంకరం ! ఈమాట లనిపించేది నీ అంతస్థు. కాని .... ఈ అంతస్థు నీకు సుఖాన్ని యివ్వదు. ఇదిమాత్రం మరిచిపోకు" చలపతికి ఆ క్షణాన్ని ధైర్యం కలిగింది. ఇన్నాళ్లనుంచీ తను శంకరానికి హెచ్చరించా లనుకున్న రెండు మాటల్నీ, పరిసరాలనీ, తునీ మరిచిపోయి అన్నాడు.

శంకరం అహం దెబ్బతింది. చలపతి చెంప చెళ్లుమంది !

"యూ స్కౌండ్రల్ .... గెటవుట్ .... " బిగ్గరగా అరిచాడు శంకరం. రాధ చలపతి వైపు చూడలేక కళ్లు మూసుకుంది.

రెండు క్షణాలు దీనంగా, నిశ్శబ్దంగా గడిచాయి. చలపతి రెండు మెట్లు దిగాడు. వెళ్లబోతూ గంభీరంగా అన్నాడు—

"ఇంత చక్కటి సంస్కారం నేర్చుకున్నందుకు నాకు చాలా విచారంగా ఉంది. నిన్ను చుట్టూ ఆవరించిన అంధకారం త్వరలో తొలగిపోవాలని ఆశిస్తున్నా."

చలపతి వెళ్లిపోయాడు.

* * *

సరిగ్గా యిది జరిగిన రెండోనాటి సాయంత్రం ఆఫీసంతా అనుకున్న దిది : చలపతిని శ్రీకాకుళం జిల్లాకు ట్రాన్స్ఫర్ చెయ్యటానికి కొత్త ఆఫీసరైన మాజీ ఆదర్శ యువకుడు శంకరం ప్రయత్నాల్లో ఉన్నాడుట. ★

ఇల్లు కిరాయికి

27-వ పేజీ తరువాయి

ఉండెటోల్లు ఎట్లుంటరో మరి. వాళ్లు అవాననకు అలవాటుపడ్డట్లున్నరు అందుకని వాళ్లకు గబ్బు వాసనున్నా ఏమనిపించదు.

మోజంజాయి మార్కెట్ల ఎక్కువమంది తురకోల్ల బంగ్లలున్నై. నేను ఒక్కొక్క బంగ్ల ఎత్మినాన్ (నిదానం)తోటి చూసుకుంటపోవుడు మొదలుపెట్టిన ఎండ్లనన్న ఖాలి కమ్రలు కనిపిస్తయోనని.

ఇట్ల చూసుకుంట పోంగ ఒక బంగ్లలోపట కొన్ని కమ్రలు తాళాలేసి కనిపించినై. అవి కిరాయికిస్తరో ఏమోననిపించింది. అందుకని సైకిల్ గేట్‌కాడుంచి లోపటికి పోయిన. మల్ల చటుక్కున నేనున్నది హైద్రాబాద్ పట్నంఅని యాదిచేసుకొని బయిటికురికొచ్చి నా సైకిల్ తీసుకొని లోపటికి పోయిన. కాని బైట ఎవ్వరు లేరు. ఎవ్వరన్నొస్తరో నని చూస్తుండంగనే వోయాబై యేండ్ల ముసలమ్మ బైటికొచ్చింది. ఆమె నన్ను చూడంగనే ఒక పెద్దదయ్యాన్ని చూసినట్లు భయపడి జర్‌వ బుర్క మొఖంమీదికి కప్పుకొని లోపటి కురికింది. ఈ బుర్కసిస్టంతోటి ఈ స్త్రీలకు అజాద్ (స్వతంత్రం) లేకుంట పోతుంది. వాళ్లకు రిక్షలల్ల, పొయ్యేటప్పుడు బుర్ఖలే! సీన్మలకు పొయ్యేటప్పుడు బుర్ఖలే! పెండ్లిల్లకు పొయ్యేటప్పుడు బుర్కలే! ఇస్కూల్లకు పొయ్యే కొంద రాడిపిల్లలకుకూడ బుర్కలే!

ఇట్లనేను బుర్ఖలగురించి సోంచాయించు, తుండంగనే ఒక కలియుగ రాక్షసుడు బైటికొచ్చిండు జీడికాయరంగుతోటి, చింతమొద్దుశరీరంతోటి. దొంగసన్నాసుల గడ్డంతోటి, బుడ్డర్‌ఖాన్ (జోకర్) తురుకటోపీతోటి ఉండి కండ్లనిండ సుర్మా (కాటుక) పూసుకొని, ఎర్రషేర్వాని తొడుక్కున్న సాయెబు బైటికొచ్చేవారకు నేను పరేశానై పోయిన.

"క్యారే భే! అందర్ క్యోఁ ఆయే!"

నేను తడబడుకుంట అన్న: "ఇల్లు కిరాయికి..."

"ఇల్లుకిరాయి కని చెప్పకుంటొచ్చి ఆడోల్లను చూస్తున్నావ్‌రా! మీ రాజ్యమొస్తే మా ఖదర్ పోయిం దనుకున్నావ్‌రా! ఆగు నీపెండ్లిచేస్త" అని తురకంల తిట్టుకుంట నాదగ్గరికొచ్చి నా రెండు చెవ్వులు మెలిపెట్టి నా చెంపలమీద చెడేల్, చెడేల్ మని కొట్టిండు.

"ఏయ్, ఇల్లు కిరాయికియ్యకపోతె నోటితోటి చెప్పాలెగాని కొట్టుడెందుకు! నీ అయ్య సొమ్మేమన్న నాకు పెట్టినవా?" అని అన్న కోపంతోటి. నాకు హైద్రాబాద్‌చాల్ జర్ర తెలిసిందికాబట్టి వాడు కొట్టంగనే అట్ల జోష్ పుట్టుకొచ్చింది.

"అట్లనా. నీకు అయ్యసొమ్ము కావాల్నా? ఇస్తదా," అని తురకంల అనుకుంట నాసైకిల్ నాచేతులకేలి గుంజిపారేసి యాభై అయిదు శేర్లున్న నన్ను వాని రెండుచేతులతోటి అమాంతం మీదికి లేపి, అట్లనే తీసుకపోయి ఎడమచెయ్యి దిక్కు పూలచెట్లు నడుమున్న ఒకనీళ్ల హౌజుల నన్ను ఎత్తేసిండు. ఆ నీల్లల్ల దబేల్‌మని పడ్డప్పుడు నా తల హౌజుగోడకు కొట్టుకొని నెత్తురుకారుడు శురువైలది. బట్టలన్ని ముద్దైయిపోయినై. నేను కారుతున్న నెత్తురును తుడుచుకుంటు ఆ నీలలల్ల కేలి బైటికి రావాలని నిలబడ పోయిన. కాని జర్రున కాల్లుజారి దబేల్‌మని మల్ల నీల్లల్లపడ్డ. ఎందుకంటె హౌజు అడుగున బాగ పాకుడు పట్టింది. అందుకనే కాల్లు జారినై. నేను మల్లనిలవడవోయి మల్లపడ్డ. అట్ల నాలుగైదు సార్లు కోశిశ్ చేసినగాని ఫాయిదలేకుంట పోయింది. అట్ల నేను లేస్తూ, పడుతూ నీల్లల్ల నరకయాతన పడుతుంటే ఆ చింతమొద్దుగాడూ, ఇంకిద్దరు పోరగాండ్లూ, బంగ్లమీదికేలి నలుగురైదుగురు బుర్కలోల్లు కిచకిచ నవ్వుతున్నరు.

ఎట్లైతేంది, కోశిశ్ చేసీచేసీ ఆనీళ్ల హౌజుల కేలి బైటికెల్లిన.

అప్పుడా క్రూరి తురుకోడు మల్ల నాతానికొచ్చి "ఇంకోసారి ఇటురాకు. తెలిసిందా మా తడాఖా!" అని తురుకంల బెదిరించుకుంటు నాసైకిల్‌ను కాంపౌండు ఔతలికి బాలేసినట్లు విసిరేసిండు. నేను నెత్తురుకారుతున్న నొసలుతోటి, నీళ్ళు కారుతున్న బట్టలతోటి, చీమిడికారతున్న ముక్కుతోటి (నీల్లల్ల మునుగుతే సర్దిచేసింది) బైటికొచ్చేవారకు నా సైకిలు "పుల్లయ్యా, నీతో టొస్తే నాకు తన్నులు తప్పుతలెవ్వు. ఇన్ని రోజులు మామతోటి మర్యాదగ బతికినదాన్ని" అని ఏడ్పుడు శురువు చేసింది. అప్పుడు దానికి చాక్లెట్లు కొనిస్త, ఏడ్వకని ఊకోబెట్టి, తడిసిన నా బట్టలను పిండుకొని, వంకరతిరిగిన సైకిల్‌గాని మెడను సక్కగచేసిన.

ఇక చాలురా నాయినా, ఇల్లుకిరాయికి పోతే వీపు సాఫయింది. ఈ ఇల్లుకిరాయిగొడువవద్దు, పెంటబొద్దవద్దు. చాతనైతే మామే తనదోస్తులకు ఇల్లు కిరాయికి చూపెడ్తడు. నాకెందుకీ తక్లీఫ్ అనుకుంట ఇంటిదారిపట్టిన.

నేను జర్ర దూరం పోంగనే వెనుకకేలి "ఎటోయ్, పుల్లయ్యా" అన్నపిలుపు వినొచ్చింది.

నన్నెవ్రలా ఈ సిటీల పిలిచేది అనుకుంట వెనుకకుతిరిగి చూడంగనే మా యింటిపక్కాయన కనిపించిండు.

యాడికి వోయినవ్?" అడిగిండు నన్ను.

"మా మామ వాళ్ల దోస్తుకు ఇల్లు కిరాయికి కావాలంటె చూస్తున్న యాడనన్న దొరుకుతదోనని' అని అన్న.

"గట్ల నువ్వేం దొరుకవడ్తవోయ్, పిచ్చి పుల్లయ్యవు, నేనో తర్కీబ్‌చెప్త, అట్లచెయ్యి" అని అన్నడు.

"ఏందో చెప్పు మరి"

"గోషామహల్ స్టేడియమెనుక రంగమ్మని ఒకామె ఉంటది. ఆమెవని ఇండ్లు కిరాయిలకు చూపెట్టుడే. ఆమె తానికి వోయి రెండు రూపాయ లిస్తే నువ్వు కోరినసోంటి ఇల్లు చూపెడ్తది"

నాకు ఆపని మంచిగనిపించింది. ఇల్లిల్లు తిరిగి తిట్లూ, తన్నులు తింటానికంటే తెలిసినామెను పట్టుకొని ఇల్లు సంపాయించుడే మంచిదని ఆమె ఇంటి నంబరు రాసియ్యమన్న. ఆయన రాసిచ్చిండు.

నేనాయినకు శుక్రియా చెప్పి మల్ల గోశామహల్ దిక్కు తిరిగిన. ఆ ఇంటినంబర్‌కోసం సందులల్ల గొందులల్ల తిరిగీతిరిగీ ఆఖరుకు దొరకపట్టిన. కాని ఇంటికి తాళమేసుకుంది—ఒకవేళ ఎవ్వరికన్న ఇల్లు చూపెట్టటానికి పొయ్యుండొచ్చు, వస్తదికావొచ్చు అనుకొని ఆ ఇంటిముందట్నే నిలవడ్డ.

జర్రసేపటికి ఓవలుబైయేండ్లున్న ఒకామె వస్తూ "ఏంకావాలె నాయినా!" అనడిగింది.



ఇల్లు కిరాయికి

ఎర్రచీర, ఆకుపచ్చ రవికె తొడుక్కుంది. మొఖానికి స్నోలూ, పౌడర్లూ పూసింది. కండ్లకు సుర్మా పెట్టింది. కాళ్లకు హవాయిచెప్పులు తొడిగింది. పెదవులకు ఎర్రటిరంగు పూసుకుంది. నల్లగ, తెల్లగున్న తలవెంటికలొత్తి ఒదులుజడేసుకుంది. ఇంతకు ఈమె ఇండ్లు కిరాయికి చూపెట్టేటామెనా, లేక రంగసానా అన్న అనుమానమొచ్చింది.

"ఇల్లు కిరాయికి కావాల్నా, నాయినా!" అని అంది. ఎంత తియ్యగుంది ఆమె కంఠస్వరం అనిపించింది.

"రెండు రూములున్న ఒక భాగం కావాలె!"

"ఎన్నిరూపాయలలోపట్ల కావాలె!"

"ఓ ఇరువై — అయిదు, ముప్పైలోపట కావాలె."

"గంత తక్కువకు ఏడ దొరుకుతై నాయినా, ఈ పట్నంల"

"ఎట్లన్న కోశిశ్ చెయ్యి"

"సరే, కోశిస్‌చేస్త రెండు రూపాయలియ్యి"

నేను జేబులకెలి రెండు రూపాయలు తీసిచ్చిన.

అప్పుడామె ఒక సందిలకు దారితీసూ నన్ను తనెనుక రమ్మన్నట్టు ఇశార (సైగ) చేసింది. నేను ఆమె వెనుకెనుకనే పోయిన. అట్ల మేము సందులూ, గొందులూ తిరిగితిరిగి ఒకబంగ్ల చేరుకున్నం ఆబంగ్ల-చుట్టు కాంపోండు లేదు. కాని అది బడేపెద్ద బంగ్ల! దాంట్ల లెక్కలేనన్ని కమ్రలున్నట్టు బైటికికనిపిస్తుంది. ఆ బంగ్లలున్న దర్వాజలన్నిటికి తాళాలేసున్నై.

ఆమె బంగ్లకాడికి పొయ్యి పెద్దదర్వాజ తాళం తీసి నన్ను రమ్మన్నది. నేనులోపటికి పోయిన. ఆమె ఎదురుంగున్న చిడీలు ఎక్కుకుంట మీదికిపోతుంటె ఆమెవెనుకనే నేను కూడా ఎక్కిన. అట్ల మీదికి పొంగనే ఎడమచెయ్యి దిక్కురెండు కమ్రలున్నపోర్షనొకటి కనిపించింది. ఆ కమ్రలల్ల నల్లంది. కరంటుంది. గోడలు తెల్లగనే ఉన్నై. కాని మొలలు కొట్టి పీకినట్లున్నందున పొక్కలు వడ్డై.

"ఎట్లుంది?" అనడిగిం దామె.

"మంచిగనే ఉంది" అన్న నేను.

"దీనికి ముప్పైరూపాయల కంటె ఒక్కపైస తక్కువకు కూడా ఇవ్వనన్నడు ఇంటాయిన," అని అంది.

"అది సరేగాని, ఈబంగ్లల మిగిలిన కమ్రలల్ల ఎవరు లేరుగదా!" అనడిగిన.

"ఇండ్లకు ఇంక వారంరోజులకు ఒక దొరొచ్చేదుంది. ఆయిన ఈ మొత్తం బంగ్ల ఈరెండు రూములు తప్పిచ్చి నూటయాభై రూపాయలకు కిరాయికి తీసుకున్నడు." అని అంటూ, మాట బద్లాయించి "అయితేమరి ముప్పై రూపాయిలియ్యి. ఈరూములు మీకు ఖరారు చేపిస్త" అని అంది.

"ఆసంగతి మామామతోటి మాట్లాడు. నేను వత్తిగ చూసి పోవుటాని కొచ్చిన"

"అట్లయితే ఈరూపాయలు మీకుదొరుకై. పొద్దుగాల్నే ఒకాయిన వీటిని చూసిపైసలు తెస్తనని పోయిండు. ఇంక ఆదగంటలవచ్చి వీటిని ఖబ్జచేసు కుంటడు. మీ యిద్దరిలల్ల ఎవ్వరు ముందు పైస లిస్తే వాల్లకే ఇప్పిస్త" అనిఅంది.

"అట్లని ఎరుకుంటె తెచ్చేటోన్నే. కాని ఎరుక లేదాయె. ఇప్పుడేం చెయ్యాలె, మరి" అని అన్న.

"అట్లంటె ఫాయిదలేదు. నీదగ్గర ఎంతుంటె అంతిచ్చి బయానకింద జమకట్టిస్తే పొద్దీకేదాక దూస్త. అప్పుడు మిగిలినయి తెచ్చిస్తె మీకు క్రమా తాళపుచేతు లిప్పిస్త," నని అంది.

"మా మామ కరంటుబిల్లు, నీల్లబిల్లు కట్టుమ ని ఇచ్చిన పదిరూపాయలున్నై" అని అన్న

"అవినాకిచ్చి జల్ది ఇంటికిపోయ్యి మిగిలిన ఇరువై ఐదుక్కరా. నేను ఇంటాయిన తానికిపోయి ఈ రూపాయలు బయానకింద జమకట్టిస్త" నని అంది.

"సరే, నేనిప్పుడే పొయ్యి మామను తీసు కొస్త. మరి నువ్వునాకు యాడ కలుస్తవ్?"

"మా యింటికిరా. బయానిచ్చొచ్చి ఇంట్లనే ఇంతెజార్ (నిరీక్షణ) లుంట," అని అంది.

నేను వెంటనే జేబులకెలి పదిరూపాయలు తీసిచ్చి మిగిలినయి తెస్తనని చెప్పి కిందికి దిగొచ్చిన.

నేను ఇల్లు చేరేవారకు మామ ఇంక పేపరు చదువుకుంటనే వరండల కూసొనిఉన్నడు. నన్ను చూడంగనే "ఏమైందిర?" అని అడిగిండు.

"గోశామహల్ల ఒక పెద్ద బంగ్లల రెండు కమ్రల పోర్షన్ చూసొచ్చిన. బయాన పదిరూపాయలిచ్చి మనకు ఖాయం చేపించిన" అని అన్న.

"శబ్బాష్, పుల్లయ్యా! మనిషంటే ఇట్లుం డాలె" అనిమెచ్చుకున్నడు.

నాకు చక్కలి గులిగుల చేసినట్లైంది.

"మరి మనమిప్పుడే పోవాలె! లేకపోతే ఆయిల్లు మనకు దొరుకది. లేక్పొతే ఉంకోల్ల కిచ్చేస్తదట"

"మరిప్పుడే పోదా మంటవా?"

"ఆ, ఇప్పుడే పోవాలె. ఆమె మనకోసం వేరే పనులు విడిచిపెట్టి ఇంతెజార్ చేస్తనన్నది."

"అయితే పో, మరి" అనుకుంటు మామలేచి ప్యాంట్లకు పోయి కమీజు, కోటూ తొడుక్కొని బయటి కొచ్చిండు.

ఇద్దరం కలిసి సైకిల్ ఎక్కి దాక నడుచుకుంట పోయి ఆడ వో సైకిల్ కిరాయికి తీసుకొని బయలు దేరినం.

మేము గోశామహల్ చేరుకునేవారకు ఒంటి గంటైంది. నేను మామను పక్కగ రంగమ్మింటికి తీసుకపోయి. ఇండిటికి తాళమేసిలేదు. కాని తలుపులు దగ్గరికేసునై.

నేను పేరు పెట్టి పిలిచిన.

ఒకామె బయటికొచ్చింది. కాని పొద్దుగాల నాకిల్లు చూపెట్టినామెకాదు. బహుశా ఆమెచెల్లె ఐవచ్చునన్న.

"లోపట రంగమ్ముందా?" అనడిగినా నేను.

"రంగమ్మను నేనే బాబూ, నీం కావాలె? ఇల్లు కిరాయికి కావాల్నా?"

చచ్చినంఫో! అప్పుడేమో ఎర్రగ, బక్కగున్న రంగమ్మ, ఇప్పుడేమో కర్రెగ, దొడ్డుగైంది. ఈమె దగ్గరేమన్న మంతర్ జంతరున్నదా? లేకపోతే ఆమే, ఈమె వేరు, వేరా? నేను ఎటూ తెలువక పిచ్చోనైపోయిన.

మామనాదిక్కు ఆశ్చర్యంగ చూసుడు మొదలు పెట్టిండు.

నేను మామ నజర్ కెలి తప్పించుకొని ఆమెతోటి "పొద్దుగాల ఈ ఇంట్లనే ఉండే ఉంకో ఆమె నాకు ఇల్లుచూపెట్టి పదిరూపాయలు బయాన తీసుకున్నది. మిగిలిన రూపాయలు తీసుకరమ్మని, ఈ ఇంట్లనే ఉంటనని చెప్పింది" అని అన్న ఏడ్పుమొఖం పెట్టుకొని.

ఆమె రెండు కంటిపాపలు మీది కెక్కిచ్చి నన్ను కొండెంగను చూసినట్టు చూసుకుంటు ఆమె ఈ ఇంట్లనే ఉండంగ నువ్వు చూసినవా? ఈ ఇంటి తాళమేసే నీతోటివొచ్చిందా?" అని అడిగింది కుచ్చికుచ్చి మాట్లాడుకుంటూ.

"ఈ ఇంటికి తాళమేసుంటె, నేను మువ్వొడు ఒస్తవోనని ఎదిరి చూసుకుంట నిల్చున్న. ఇంతట్లనే కుడిచెయ్యిదిక్కు సందిలకెలి ఆమెవొస్తూ 'ఇల్లు కిరాయికి కావాల్నా' అనడిగింది. ఔనంటే నన్ను తనతోటి తీసుకపోయింది" అని అన్న లోపట ఎక్కెక్కి ఏడుస్తూ.

"అట్లయితే ఆమె ఇంటికే పొయ్యి అడుగు. ఆమెనే అడుగు. నేను కాదుగదా, నీదగ్గర బయాన తీసుకున్నది" అని అంది.

అప్పుడు మామ నాతోటి "తెలిసింది కథంత" అని అంటూ దారితీసిండు ఇంటిదిక్కు. నేను ఆ కథేందో తెలువక మామను పీ ఛా జే సి న (వెంబడించుట).

జర్రదూరం పొంగనే మామ చెప్పుడు షురువు చేసిండు.

"ఈ పట్నంల దోఖా బాజోల్లుంటరు. జర వాల్లను నమ్మాలంటే యించుకోవాలని ఇదువారకే చెప్పిన. మన మొకరికోసం చూస్తుంటే ఉంకోడు వాడే మనం చూసేమనిషన్నట్టు యాక్టింగ్ చేసి పదో, ఇరువయో టోపేసి పొతలవడ్తరు. అసొంటివాల్లే ఇంటికిరాయిలు చూపెట్టేటోల్లల్ల కొందరుంటరు. వాళ్లు ఖాలీగా, ఎక్కువ మనుషులు లేని జాగలల్ల ఉన్న ఇండ్ల మారుతళాలు సంపాయించి, ఇంటి కిరాయికోసం తిరిగేటోల్లను పట్టుకొని, వాళ్ళకు ఇల్లు ఇప్పించినట్టే నమ్మకం కలిగించి బగాయించ తరు. ఇచ్చిన రూపాయలందుకొని. అందుకని ఈ పట్నంల అడుగడుక్కు జాగర్త పడాలే!" అని చెప్పిండు మామ.

చూసింర్డా, చదివెటోల్లా హైదరాబాద్ ల అడోల్లు కూడ ఎంత ధోక చేస్తరో! అందుకని ఈడ మీరు ముసలమ్మలనుగాని, నడివయసమ్మలనుగాని మరిచిపొయ్యిగూడ ఇల్లు కిరాయికి చూపెట్టు మని అడుగకుండ్రి. ఇక వుంటా. మల్లపుర్స తున్నప్పుడు కల్సుకుందాం. ఖుదాహఫిజ్!!! ☆

భూగర్భంలోనికి సాహసయాత్ర

25-వ పేజీ తరువాయి

పోనికి ఈ శీతాశిలోకంలోని పురాతన ప్రతిధ్వనులు మేలుకున్నాయి.

గురువారం ప్రొద్దున ఎనిమిది గంటలకు నడక ప్రారంభించాము. గ్రానైట్ దారి వంకర వంకరలుగా తిరిగి, ఎదురుచూడని మూలలు ఎదుర్కొని ఆ వ్యూహం యొక్క విచిత్ర నిర్మాణంలో ఇరుక్కుపోయింది. అయినా మొత్తానికి ఆగ్నేయం దిక్కు పోతున్నది. మా పెదనాన్న ఊరికే దిక్సూచి చూస్తున్నాడు. మా మార్గం సరిగ్గా ఎలా వెడుతున్నదో గమనిస్తున్నాడు.

దారి ఆరు అడుగులకు రెండు అంగుళాలకు మించి దిగటంలేదు. ఇంచుమించు సమానంగానే వడుస్తున్నదన్నమాట. సెలయేరు మందంగా పారుతున్నది. భూగర్భంలో మాకు మార్గదర్శి (ని) అయిన ఒక పరిచిత శక్తిగా పరిగణించాను. మాతో పాడుతూ వస్తున్న అప్సర(స) అనుకుని వెచ్చని నీటిని చేతిలో చిలకరించేవాడిని. పురాణగాథలను గురించి ఆలోచించే స్థితిలో ఉన్నాను.

కాని లంబ వాది అయిన మా పెదనాన్న సమంగా సాగిపోతున్న ఈ మార్గంమీద విసుక్కున్నాడు. అంతులేకుండా ముందుకి వెడుతూనే ఉన్నది. మా పెదనాన్న చెప్పినట్టు, భూగోళ వ్యాసార్థం మీదుగా వెళ్లే బదులు కొంచెంపరిధి మీదుగా వెడుతున్నాము. మా చేతులలో లేదు కనుక, ఎంత మెల్లిగా నయినా సరే, భూగోళ కేంద్రం వైపు ప్రయాణము చేస్తున్నంతకాలం ఫరవాలేదు. అంతే కాక, దారి అప్పుడప్పుడు బాగా క్రిందకు దిగిపోయేది.

కాని, మొత్తానికి ఆ రోజూ, పై రోజూ కూడా కలిపి నిలువుగా కంటె అడ్డంగానే ఎక్కువ దూరం ప్రయాణం చేశాము.

జూలై 10 వ తేదీ శుక్రవారం, నా అంచనా ప్రకారం రైక్ యావిక్‌కి ఏడున్నర మైళ్ల క్రింద తొంభై మైళ్ళ ఆగ్నేయంగా ఉండి ఉండాలి.

అక్కడే మా పాదాల ముందు ఒక భయంకరమైన గొయ్యి కనిపించింది. దాని వాలకం గమనించిన మా పెదనాన్న కరతాళధ్వనులు చేశాడు.

"ఇది మనని ఎక్కడికో తీసుకుపోక తప్పదు" అని అరిచాడు. "గోడలమీద నుంచి పొడుచుకు వస్తున్న రాళ్ళు మెట్లలాగే ఉన్నాయి!"

ప్రమాద మేమీ జరుగకుండా, హాన్స్ త్రాళ్ళు ముడివేశాడు. దిగడం ప్రారంభించాము. ప్రమాదకరమైన వ్యాసంగం అనను. ఎందుచేతనంటే, అప్పటికే ఈ వ్యాయామం నాకు బాగా అలవాటైపోయింది.

నిజానికి ఈ గొయ్యి, రాతి నిర్మాణంలో ఏర్పడిన ఒక చీలిక. దీనిన్నే 'లోపం' (fault) అంటాము. భూగోళం చల్లారుతున్న కాలంలో ఏర్పడిన సంకోచమే ఇటువంటి వాటికి కారణము. ఒకప్పుడు స్నెఫెల్స్ పర్వతము కక్కిన శిలాద్రవము ఈ దారి వెంబడే వెళ్లినట్లయితే దాని జాడలేకుండా ఎలా పోయినదో నేను చెప్పలేను. చుట్టే చుట్టే మెట్లవలె దిగుతున్న ఈ మార్గం మానవుడే నిర్మించినదా అనిపిస్తుంది.

పావుగంట కొకసారి మా కండరాలకు శక్తి తిరిగి వచ్చేవరకు విశ్రాంతి తీసుకోవలసి వచ్చింది. ఒక రాతిమీద కూర్చుని, 'హాన్స్‌బాక్' నీటితో దాహం తీర్చుకుంటూ కాళ్ళు వేళ్లాడ వేసేవారము.

ఈ 'లోపం' లో హాన్స్‌బాక్ ఒక జలపాతంగా మారి ధార నష్టపడినదని వేరే చెప్పనక్కరలేదు; కాని, మా అవసరాలకు సరిపోయింది. దారి మరీ క్రిందకి వాలిపోనప్పుడు జలపాతం ఏరుగా మారేది. దానిని చూస్తే, మా పెదనాన్న గుర్తుకు వచ్చేవాడు. ఆయన అసహనం, చిరాకు, కోపం దానిలో కనిపిస్తూ ఉండేవి. సమమయిన మార్గంలో పారినప్పుడు మాత్రం మా అయిస్‌లాండిక్ వేటగాని వలె ప్రశాంతంగా ఉండేది.

ఈ వేళ ప్రొద్దున్నే నా సైకిల్ ఎవరో పట్టుకు పోయారు." అన్నాడు రాజారావు తన వెంట నడిచివస్తున్న రంగారావుతో.

రంగా:-మరైతే పోలీసులకు రిపోర్టు ఇవ్వలేక పోయావా?

రాజా:-- అన్నట్టు మర్చే పోయా. పక్క ఇంట్లో ఉన్న పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టరే సైకిల్ తీసుకువెళ్లాడు.

కె. సుబ్రహ్మణ్యం (మద్రాసు)

జూలై 11, 12 వ తేదీలు ఈ 'లోపం' చుట్టు వెంబడి వెళ్లాము. మొత్తంమీద భూతలం క్రింద ఇంచుమించు పదిహేను మైళ్ల వరకు దిగాము. కాని పదమూడవ తేదీ నాటికి మిట్ట మధ్యాహ్నం అవుతున్న దనగా 'లోపం' ఏటవాలుగా తయారయింది. ఇంకా ఆగ్నేయం వైపుకే వెడుతున్నది.

ఇప్పుడు మార్గం సులభంగా ఒకే విధంగా ఉన్నది. ఈ ప్రయాణంలో ఇలా కాక మరే విధంగా ఉండగలదు ? ఎక్కువ మార్పులకు అవకాశం లేదు కదా!

ఎలాగయితే నేమి, బుధవారం, పదిహేనవ తారీకు నాటికి భూమిక్రింద ఇరవై ఒక్క మైళ్ల లోతులో, స్నెఫెల్స్ పర్వతం నుంచి నూటయాభై మైళ్ల దూరంలో ఉన్నాము. కొంచెం అలసినా మా ఆరోగ్యం మంచి పరిస్థితిలోనే ఉండి, మేము తీసుకు వెడుతున్న మందుల పెట్టె తెరవనే లేదు.

గంటగంటకూ మా పెదనాన్న దిక్సూచి వివరాలు వ్రాసుకునేవాడు. గడియారం, బరోమీటర్, 'మానో మీటర్', థర్మో మీటర్‌లు చూసేవాడు—వాటి 'రీడింగ్' (reading) లు ఈ యాత్రమీద 'రిపోర్ట్' (r port) లో ప్రచురించారు. ఈవిధంగా మా పరిసరాలు ఏవో తేలికగా కనిపెట్ట గలిగాడు. అడ్డంగా నూటయాభై మైళ్ళ దూరం నడిచామంటే ఆశ్చర్యపడ్డాను.

"ఏమిటి ?" అని అడిగాడు ఆయన.

"ఏమీలేదు. కాని నా కొకటి తోచింది."

"అదేమిటోయ్, అబ్బాయ్ ?"

"నీ లెక్కలు సరైతే మనం ఐస్‌లాండ్ కింద లేము."

"అంతే నంటావా ?"

"ఇదుగో, లెక్కవేసి చెప్తాను."

దిక్సూచి, మాప్‌లతో తనఖీచేసి చూశాను.

"నే ననుకొన్నది సరిగ్గానే ఉంది" అన్నాను. "పోర్ట్‌లాండ్ కేప్ (Portland cape) దాటి సముద్రం క్రింద ఏభై మైళ్ల దూరంలో ఉన్నాం."

"సముద్రం కింద" అన్నాడు మా పెదనాన్న, చేతులు నలుపుకుంటూ

"అంటే, సముద్రం మన తలమీద ఉందన్న మాట!" అని అరిచాను.

"అంతేగదా ! దాని కింత ఆవేశ మెందుకు ? 'న్యూకాసిల్' (New castle)బొగ్గుగనులు కొన్ని నీటి కిందకు ఉండవూ ?"

ప్రొఫెసర్‌గారికి మా స్థితిలో అసమాన్య మయినది ఏదీ కనిపించటం లేదు. నేను మాత్రం కలవర పడ్డాను. అంత జలరాశి క్రింద నడిచి వెడుతున్నామని తలుచుకుంటే భయంగా ఉండినది—మామీద గ్రానైట్ 'కప్పు' దృఢంగా ఉన్నంత సేపూ పైన జలరాశి ఉన్నా ఒకటే, నేల ఉన్నా ఒకటే అన్న సంగతి నా ఆందోళన తగ్గించలేదు.

ఎలాగయితే నేమి ఈ ఆలోచనలకు అలవాటు పడిపోయాను. ఎందుచేతనంటే, దారి నేరుగా వెళ్లినా, చుట్టు తిరిగినా, ఎంతసేపటికి ఆగ్నేయం దిశనే, క్రిందికే భూగోళకేంద్రం వైపుకేపోతున్నది.

మూడు రోజుల తర్వాత శనివారం, జులై 18 వ, మధ్యాహ్నం ఒక విశాలమయిన ప్రదేశానికి వచ్చాము. మా పెదనాన్న హాన్స్‌కు అతని వారం వేతన మయిన మూడు 'రిగ్‌స్ డాలర్' ఇచ్చాడు. పై రోజు పూర్తిగా విశ్రాంతికి వినియోగించాలని నిశ్చయించాము.

25

అందువల్ల, ఆదివారం ప్రొద్దున లేచేసరికి వెంటనే బయలుదేరాలనే ఉద్దేశం నాకు లేనేలేదు. అగాథంలో ఉన్నా సుఖంగానే ఉన్నది. నిజం చెప్పాలంటే భూగర్భంలో జీవితం అలవాటయిపోయింది. సూర్య చంద్రులు, నక్షత్రాలు, చెట్లు, ఇళ్లు, నగరాలు—వీటి సంగతి ఆలోచించటం మాని వేశాను. భూతలం క్రింద ఇవి అనవసరమైనవి. ఈ వింతలు 'భూస్థాపిత'మయిపోయిన మాకు ఉపయోగపడవు.

ఒక విశాలమైన చోటికి వచ్చామని చెప్పాను.

ఇదొక పెద్ద మందిరాన్ని పోలి ఉన్నది. మా 'విశ్వసనీయ' మయిన నీరు దాని గ్రానైట్ నేల మీద మెమ్మదిగా పారుతున్నది. పూటకి ఇంత దూరంలో ఉన్నదేమో, నీరు త్రాగటానికి సరిపోయేటంత వేడి కలిగి ఉన్నాయి.

'ఆహారం' అయిన తర్వాత ప్రొఫెసర్‌గారు తన 'నోట్స్' ని సర్దుకుందామని నిశ్చయించాడు.

"మొదట మన మెక్కడున్నామో సరిగ్గా లెక్క వేస్తాను" అన్నాడు. "తిరిగి వచ్చిన తర్వాత భూగర్భంలో మన యాత్ర మాప్" ఒకటి గియ్యాలని ఉంది."

"బాగానే ఉంది. అయితే నీ 'పరిశీలన' లు సరియైనవేనా ?"

"ఆ ! మనం వెళ్లిన దిక్కులూ, దిగిన కోణాలూ జాగ్రత్తగా పరిశీలించి రాసుకున్నాను. ఒక్క తప్పు కూడా లేదని నమ్మకం ఉంది. అందుకనే మనమెక్కడున్నదీ కనిపెడదాం. దిక్సూచి తీసుకుని హాన్స్‌బాక్ ప్రవాహం ఎటో చూడు."

దిక్సూచి చూసి చెప్పాను. "తూర్పునైపుగా ఆగ్నేయానికి."

"మంచిది" అన్నాడు ప్రొఫెసర్‌గారు, ఈ వివరం వ్రాసుకుంటూ. ఏవేవో లెక్కలు చేశాడు. "మనం మొత్తంమీద రెండు వందల యాభై అయిదు మైళ్ళు ప్రయాణం చేశాం."

"అంటే అట్లాంటిక్ మహాసముద్రం క్రింద ప్రయాణం చేస్తున్నామా ?"

"తప్పకుండా."

"ఈ క్షణంలో మన పైన ఒక తుఫాను రేగుతున్నదేమో ! నావలు గాలికి, అలలతాకిడికి పూగిపోతున్నాయేమో !"

"అవొచ్చు."

"తిమింగలాలు వాటి తోకలతో సముద్రం నేలను కొడుతున్నాయా ?"

"కంగారుపడకు ఆక్సెల్. అవేమీ చెయ్యలేవు. ఇక మన లెక్కల సంగతి. స్నెఫెల్స్ పర్వతానికి రెండువందల యాభై మైళ్ల దూరంలో, నా 'నోట్సు' ప్రకారం నలభై ఎనిమిది మైళ్ల లోతున ఉన్నాం."

"నలభై ఎనిమిది మైళ్లా !" అని కేక వేశాను.

"అంతే."

"కాని శాస్త్రం ప్రకారం భూమిపై పెచ్చు మందం కూడా అంతే."

"కాదనను."

"ఈ లోతున, మన ఉష్ణోగ్రస్థితి పదిహేను వందల డిగ్రీలుండాలి."

"ఉండాలి, అబ్బాయ్."

"ఈ 'గ్రానైట్' రాయి ఈ వేడికి కరిగిపోవాలి."

"కరిగిపోలేదు కాబట్టి, యథార్థం సిద్ధాంతానికి భిన్నంగా ఉంటుందని తెలుస్తోంది."

"ఒప్పుకుంటా గాని ఆశ్చర్యంగానే ఉంది."

"థర్మామీటర్ ఏమంటోంది ?"

"ఇరవై ఏడు డిగ్రీల చిల్లర చూపిస్తోంది."

"అంటే శాస్త్రజ్ఞులు వెయ్యినాలుగు వందల మూడు డిగ్రీల పైన తప్పారన్నమాట. లోపలికి పోయిన కొద్దీ వేడి అధికమవుతుందనే సిద్ధాంతం తప్పు. హంఫ్రీ డేవీ పొరబడలేదు. అందుచేత అతని మాట నేను వినడం తప్పు కాదు. ఏమంటావ్ ?"

"ఏమీ అనను."

నిజం చెప్పాలంటే చాలా అనివుండవలసినది. డేవీ సిద్ధాంతం నేను ఒప్పుకొనలేను. భూగర్భ కేంద్రంలో వేడి ఉన్నదనే సిద్ధాంతమే నమ్ముతున్నాను. ఇంతవరకూ దాని ప్రభావం నాకు తగలక పోయినా, ఈ ఆరిపోయిన అగ్నిపర్వతం గొట్టం చుట్టూ ఘనీభవించిన లావా వేడిలోపలకు రాకుండా అవుతున్నదని నా అభిప్రాయం.

కాని క్రొత్త వాదాలు వెతికే బదులు యదార్థం ఒప్పుకొనటమే మంచి దనిపించినది.

"పెదనాన్న" అన్నాను, "నీ లెక్కలన్నీ సరైతే ఒక నిర్ణయం అనివార్య మవుతోంది. చెప్పమంటావా ?"

"తప్పకుండా నచ్చాయ్. నీ యిష్టం వచ్చిన నిర్ణయానికి రా."

ఇంతవరకూ వెళ్లిన వేగంతో ప్రయాణం చేసినట్లయితే భూగోళకేంద్రం చేరుకొనడానికి సుమారు అయిదు సంవత్సరాల ఆరు నెలలవుతుందని లెక్కవేసి చూపాను. అంతేకాక తగుమాత్రం దిగకపోయినట్లయితే తిరిగి భూతలం మీదకే వచ్చేసే ప్రమాదం కూడా ఉన్నదని జ్ఞాపకం చేశాను.

"నీ లెక్కలు మండిపోను !" అని మాటకు అడ్డు వచ్చాడు ప్రొఫెసర్‌గారు. కోపంగా చెయ్యి వూపాడు. "నీ అనుమానాలు మండిపోనూ ! వాటికి ఆధార మేమిటి ? ఈ దారి నేరుగా మన లక్ష్యానికి పోదని ఎవరు చెప్పారు ? నాకు ముందే ఈ యాత్ర ఒకరు చేశారనే విషయం గుర్తుంచుకో. నే నిప్పుడు చేసిన పని మరొక మానవుడు చేశాడు. అతను విజయం సాధిస్తే, నేనూ సాధించగలను."

"అలాగే ఆశిద్దాం. కాని, ఎంత కాదన్నా, నేను ......"

"నువ్వు ఇటువంటి చెత్త మాట్లాడ బుద్ధి వేసినప్పుడు నోరు మూసుకో."

ప్రొఫెసర్‌గారు పెదనాన్న అవతారం ఎత్తబోతున్నాడని గ్రహించి జాగ్రత్త పడ్డాను.

"సరేగాని, 'మానోమీటర్' చూడు" అన్నాడు ఆయన.

"ఏమంటోంది ?"

"వాయుపీడనం అధికంగా ఉన్నది."

"అంతే. మెమ్మదిగా దిగినట్లయితే అంత బాధగా లేదని చూడగలుగుతున్నావా ?"

"చెవిలో కొంత బాధ తప్పిస్తే."

"అదేమీ లేదు—బాగా దీర్ఘంగా వూపిరి తీస్తే తగ్గిపోతుంది. లోపల పీడన శక్తి బయటదానితో సమానమయితే చాలు."

"నేనూ అదే కనిపెట్టాను" అన్నాను, ఈయన మాట కాదనరాదని నిశ్చయించుకుని. "ఈ చిక్కటి వాతావరణంలో మునిగి ఉంటే హాయిగా ఉంది. శబ్దం ఎంత తీక్షణంగా వినిపిస్తున్నదో గమనించావా ?"

"ఆహా ! చెవిటివానికి బాగా వినపడుతుంది."

"కాని సాంద్రత ఎక్కువవుతుం దనటానికి సందేహం లేదుకదా ?"

"ఇంకా పూర్తిగా నిర్ధారణ కాని సూత్రం ప్రకారం అయితీరాలి. కాని, దిగినకొద్దీ భూమ్యాకర్షణ శక్తి తగ్గిపోతుందని నీకు తెలుసు. భూగోళ కేంద్రంలో వస్తువులకు అసలు బరువే ఉండదు."

"అవును తెలుసు ననుకో. ఒక పరిమితి తర్వాత వాయువు నీటి సాంద్రత కలిగిఉంటుం దంటావా?"

"తప్పకుండా ! తొమ్మిది వేల తొమ్మిది వందల చిన్న పీడనశక్తి ఉంటే సరి."

"ఇంకా కింద కయితే ?"

"సాంద్రత ఇంకా అధికంగా ఉంటుంది."

"దానిలో నుంచి ఎలా వెడతాము ?"

"జేబుల్లో రాళ్ళు నింపుకుందాం."

"భగవంతుడా ! పెదనాన్నా, ఏది చెప్పినా వినేట్టు లేవే !"

నా అనుమానాలను ఇంతకుమించి బయట పెట్ట దలచలేదు. ఏదో ఒక అసాధ్యం ఎదురయి ప్రొఫెసర్‌గారికి కోపం వచ్చేది.

అయినా, కొన్ని వేల చిన్న పీడన శక్తికి, గాలి ఘనీభవించి తీరుతుందని నమ్మకం కుదిరింది. అంతదాకా ఎలాగో మా శరీరాలు తాళినా ఇక ముందుకి వెళ్లలేము. ఎంత తర్కించినా ఆగి తీర వలసినదే.

కాని నేను ఈ వాదం ఉపయోగించలేదు. మా పెదనాన్న సాక్నుస్సెమ్ పేరుచెప్పి తప్పించుకునేవాడు. అంతేకాదు. ఈ ఉదాహరణకు విలువ లేనేలేదు. ఒక్క దెబ్బతో ఆ అయిస్‌లాండ్ శాస్త్రజ్ఞుడు ప్రయాణం చేయలేదని నిరూపించవచ్చు.

'పదహారవ శతాబ్దానికి బరోమీటర్‌గాని, మానోమీటర్ గాని కనిపెట్టలేదు.' అటువంటప్పుడు సాక్నుస్సెమ్ తను. భూగోళకేంద్రం చేరుకున్నట్లు ఎలా నిర్ధారణ చేసుకున్నాడు ?

అయితే ఈ ప్రశ్న బయటకు అడగలేదు. ఏది జరిగినా సరే నని వూరుకున్నాను.

రోజంతా లెక్కలతో సరిపోయింది. ప్రొఫెసర్ లిడెన్‌బ్రోక్ అభిప్రాయంతో ఏకీభవించడం కన్నా గత్యంతరం లేకపోయింది. హాన్స్ ఉదాసీనత చూపి అసూయ పడ్డాను. కారణాంతరాలను లెక్కచెయ్యకుండా గుడ్డిగా ముందుకు సాగిపోతున్నాడు.

(సశేషం)

"అదేమిటయ్యా! అబద్ధాలు చెప్పినా అతకకుండ చెబుతావు. న్యాయవాదిని పెట్టుకో లేక పోయావ్" మందలించాడొక జడ్జి బోనులో నుంచున్న సాక్షిని.

డి. కాంతారావు (విశాఖపట్టణం)

శ్రీదేవి నవ్వుచు "నేనా ? నేనా ?——మీకు కోపము రాకుంటే, పెంపుడుతమ్ముని పక్షమే. మరి మీరో ?" అనెను.

శ్రీనాథుడును నవ్వుచు, "నేనా ? నేనా ? ఈవేళ ప్రొద్దుటివరకు నీ సొంత తమ్ముని పక్షము. మధ్యాహ్నమునుండి నీవలెనే నీ పెంపుడు తమ్ముని పక్షము. మరల రేపటినుండి దుగ్గన పైపే. ఆ పోతన పట్టె సన్యాసి !" అనెను.

విద్యా వినోదసభ కున్న వ్యవధి రోజులలో శ్రీనాథుని విడిదికి శ్రీవిద్యానగరములోని పండితులు కవులునేగాక, గొప్ప రాజోద్యోగులును వచ్చి, ప్రీతిపూర్వకముగా సంభాషించి ప్రశంసచేసి పోవుచుండిరి. సాయంకాలము మూడుజాములవేళ నుండి రాత్రి ప్రొద్దుపోవు వరకు వచ్చుచున్న పెద్దలను గౌరవించుటతోడనే సరిపోవుచుండెను.

విద్వాంసులలో ముందువచ్చినవాడు ముమ్మ కవి. అతడు డిండిముని వ్యాధికి చికిత్సచేసి నందుకు శ్రీనాథుని శ్లాఘించెను.

అవచిదేవయ, త్రిపురారి, పంట మైలారురెడ్డి, వినుకొండ వల్లభరాయుడు, కటకపాలుడగు తెలుగు రాయడును వచ్చి వెళ్ళిరి. ప్రసిద్ధ దండనాయకులు మంత్రులు, సామంతులుకూడ స్వయముగా వచ్చియో, వార్తాహరులను పంపియో, శ్రీ విద్యానగరము విడిచి వెళ్ళులోపల తప్పక తమ మందిరములకు వచ్చిపోవలెనని శ్రీనాథు నాహ్వానించుచుండిరి.

ఒకవంక పెద్దల మర్యాదలు సలుపుచునే, మరియొక వంక దేవరాయ లాహ్వానించిన విద్యావినోద సభ యెట్టిదై యుండునా యని శ్రీనాథు డాలోచించుచుండెను. తోడి విద్వాంసులతో సంప్రదించెను. నవ్వుచు లక్కనమూరి ఇచ్చిన సలహా యిది.

"అబ్బాయిగారండీ, శ్రీనాథయ్యగారూ, నన్ను ప్రాకృతుడనని మీ రందరు అవహేళనచేస్తున్నారు. నావాక్కు మీ వేదవాక్కు వంటిది కాకపోయినా, అథమపక్షము ద్రావిడవేదవాక్కు వంటిది. నిన్ను ఆకస్మికంగా విద్వాంసులచేతను, అవధానులచేతను, అనేక భాషాకవుల చేతను, నీ కేవేవో ప్రజ్ఞ లున్నవని పేరుపడ్డ బండారమంతా బయట పడేట్లు నిశితంగా పరీక్షిస్తారు సుమా ! ఈ వచ్చే పోయే పెద్దల మర్యాదలతో మనస్సు వికలంచేసుకోక ఉన్న బండారము కాస్త పదిల పెట్టుకో !"

సుబ్రహ్మణ్యశ్రౌతి కల్పించుకొని "అప్రాకృతుడైన మా వేదపురుషుడుకూడ ఈ ప్రాకృతుని మాటలనే ఓంకారము చేయుచున్నాడు" అనెను.

శ్రీనాథు డిద్దరి మాటలును తనయూహనే బలపరచినందున నిశిత విద్యాపరీక్షకు సన్నద్ధుడగుచుండెను. వేదవిదులతో పన్నములను శాస్త్రవేత్తలతో విద్యాసూక్ష్మములను ప్రస్తావించి కంఠస్థములును, బుద్ధిస్థములును చేసికొనుచు, ఆత్మను బ్రహ్మశక్తి కర్పించి చిత్తము నేకాగ్రముగా నిల్పుకొనుచుండెను.

ఐదవనాటి రాత్రి అతడు నిద్రించుటకు ముందు ప్రాగన్నతో నున్న తరి, నావల పోతన దుగ్గనలు ఉత్కంఠితులై చేయుచున్న సంభాషణ

కవిసార్వభౌముడు

23-వ పేజీ తరువాయి

మాతని చెవుల బడెను. పోతన తాను వ్రాయదలచిన మహాభాగవతములో అభిమాన ఘట్టములకు పద్యములు చెప్పుచుంటినని వామనవిజృంభణము వర్ణించు రెండు పద్యములు దుగ్గనకు వినిపించెను. అవి వినుచునే శ్రీనాథుడు పోతన ప్రతిభకు విస్తుపోవుచుండెను. హృదయ మానందముతో పొంగిపోయెను.

ఆ వామనస్తుతితోపాటు తన ప్రాణమిత్రము వామనభట్టబాణుడు జ్ఞప్తికి వచ్చెను. ఇప్పటికి కొండవీటికి తన విజయవార్త చేరియుండును. దానికి వామను డెంత సంతోషించుచుండునోగదా యను తృప్తి కలిగెను. తన

"కుడిచేత్తో ఆ పుస్తకం తీసుకుని అబద్ధం చెప్పనని ప్రమాణం చెయ్యి" అని ఆజ్ఞాపించాడు ఒక ముద్దాయిని న్యాయమూర్తి.

ముద్దాయి బదులు చెప్పకుండా ఎడమచెయ్యి చూపాడు. "కుడిచేత్తో తీసుకోమని నీకు కదూ చెప్పేది" న్యాయమూర్తి హుంకరించాడు.

"అయ్యా! నాకు నిజంగా ఎడమచెయ్యి వాటం అండీ" అని ముద్దాయి తడుముకోకుండా సమాధానం చెప్పాడు.

టి. ఎస్. ఎస్. మణి (మద్రాసు)

విజయమునకు ప్రధానకారణులు వామనభట్టబాణుడును చమత్కారచంద్రిక పంపిన విశ్వేశ్వరుడును. రావకొండకుకూడ ఈ వార్త త్వరలో చేర్పవలెనని యాతడనుకొనెను. నామసామ్యముచేత వామనవిశ్వేశ్వరులతోపాటుగా త్రిభువనములు తన పదములచే నాక్రమించిన త్రివిక్రముని, సకలవిశ్వములకు నీశ్వరుడైన విశ్వేశ్వరుని ధ్యానముచేయుచు నాతడు నిదురించెను.

నిర్ణీతమైన దినమున శ్రీనాథుడు దేవరాయల విద్యావినోదగోష్ఠికి తోడి పండితులతో బయలుదేరెను. ఈనా డందరు శ్రోత్రియవైభవము గల వేషములు దాల్చిరి. కూర్పాసములు లేవు. కోకలు లేవు. కుల్లాయులు లేవు. పట్టుధోవతులు, పైన రంగురంగుల కాశ్మీరశాలువలు, ఫాలము మొదలుగా పంచావయవములను పంచబ్రహ్మమంత్రపూత విభూతిరేఖలు, చెవులకు కుండలములు, కరముల కంకణములు, కంఠములలో బంగారు పొదివిన స్ఫాటికమాలలో, రుద్రాక్షమాలలో ధరించిరి. చేతులలో కమండలువులు పూనిరి. శ్రీనాథుడుమాత్ర మీనా డుపైని శాలువవేసికొనక, శ్రీ గురుపూజనాడు జగద్గురువు లనుగ్రహించిన పట్టుశాటి వేసికొనెను. అందరును వేదపురుషుని ధ్యానించుచు పాదచారులై సభాస్థానము చేరికొనిరి.

దేవరాయప్రభువు రాకముందే ఆనాడు సభామందిరములో అపూర్వవిధముగా నాసనములు వేయబడియున్నవి. సింహాసనమున కెదురుగా పదివిండ్ల దూరమున స్వలంకృతమైన ప్రత్యేక సుఖాసన మొకటి యున్నది. సింహపీఠికి దిగువను రెండుప్రక్కల రెండున్నత కుశాసనములును, వానికిని ఆవలి ప్రత్యేకాసనమునకును మధ్య కొంత ఖాళీ వదలి, రెండు ప్రక్కలను మూడు మూడు వరుసలుగా నూట యెనిమిది యాసనము లున్నవి. సభామధ్యమున నున్న యా నూటపదునొకండగు నాసనములను ఖాళీగానుంచి, భటులు వచ్చుచున్న పెద్దలను వారి వారి మర్యాదల ప్రకారము ఇతరాసనములపై నాసీనులు గావించుచుండిరి.

యథావైభవముగా దేవరాయలు సింహాసనమలంకరించిన వెంటనే సభకు శ్రీనాథభట్టు వచ్చినారా యని యడిగి వచ్చినట్లు తెలిసికొనిరి. అంతట సభాపతి శ్రీనాథభట్టు నుద్దేశించి రాయలవారి యిచ్ఛ నీవిధముగా ప్రకటించెను.

"శ్రీనాథభట్టా, మీ బహుముఖవిద్వత్తు కవితాప్రతిభ ధారణాపటిమ ఎందరెందరో చెప్పగా రాయలవారు వినియున్నారు. ఈమధ్య మీకు విజయపత్రిక ప్రసాదింపబడిన వ్యవహారములో మీరు పన్నాగమువన్ని భ్రమపెట్టి సులభముగా విజయము సాధించితిరేకాని అందులో మీ విద్వదతిశయము ప్రకటము కాలేదను సత్ప్రథకూడ కొంత శ్రుతమైనది.

"మీరు వేదవిదులని, శ్రౌతస్మార్తకర్మ నిపుణు లనియు, యోగ న్యాయ వైశేషిక సాంఖ్య వ్యాకరణ సాహిత్యశాస్త్ర నిధులని, సంస్కృత ప్రాకృతాంధ్రకవిత్వ విశారదులు నద్భుత ధారణాశక్తి కలవారునని, సంగీతము, ఆయుర్వేదము, మల్లవిద్య, ఖడ్గవిద్య, గజశాస్త్రము, అశ్వశాస్త్రము, హస్తలాఘవము, ఇంద్రజాలము మొదలగు చతుష్షష్టి కళలలో ప్రవేశము కలవారనియు, రాయలవారు విని యానందించి యున్నారు. మీరి గోష్ఠి నలంకరించు మహద్భాగ్యము ప్రాప్తించినందున, మా విద్యానగరములో గల తత్తచ్ఛాస్త్ర విద్యాకోవిదులతో మిమ్ముసు ప్రసంగింపజేసి, వినోదింపవలెనని రాయలవారు కుతూహలాయత్తచిత్తులై యున్నారు. ఇప్పటికి ఏబదిసంవత్సరములక్రిందట మా విద్యాధికారుల పితృపాదులగు శోణాద్రినాథ కవిసార్వభౌములచేత శతావధానము చేయించి దర్శించు మహాభాగ్యము ప్రభువుల పితామహులగు శ్రీ బుక్కరాయప్రభువులకు ప్రాప్తించినదని ఐతిహ్యము పెద్దలవలన వినుటయేకాని, ప్రత్యక్షముగా

తర్కించుటకు అవకాశము కల్పింపలేదు. అట్టి శతావధాన వినోదమును ప్రదర్శించి రాయమహాచక్రవర్తులకు ఆనందింపజేయుట మీ కంగీకారమగు పక్షమున మీ రా ప్రత్యేకాసన మలంకరింపవలెనని ప్రభువులా నతిచ్చుచున్నారు."

ఆ మాటలువిని శ్రీనాథభట్టు ధీర గంభీరముగా లేచి, జగద్గురువులు ప్రసాదించిన కాటి కన్నులకద్దుకొని, శ్రీ మహాగణాధిపతిని భారతీదేవిని స్మరించి, మహేశ్వరధ్యానము కావించి, "దేవా, భవదీయానుమతంబున విద్వజ్జనంబుల యనుగ్రహంబునంజేసి నా నేర్చువిధంబున నీ శతావధానంబు నిర్వహింప బూనుకొందు'నని ఓంకారపురస్సరముగా నా ప్రత్యేకాసనమువద్దకు జని నిలిచి,

"జోటీ, భారతి, యూర్పుటి వ్వెరయుమీ !
చోద్యంబుగా నేను క
ర్ణాటాధీశ్వరు దేవరాయనృపతిన్ నాసీర
ధాటీచమూ
కోటీ ఘోటకధట్టికా ఖురపుటీ కుట్టాక
సంఘట్టన
స్ఫోటీధూతధరారజశ్ఛురికితాంభోటిన్ ప్రశంసిం
చెదన్ !"

అని ప్రార్థనా ప్రశంసలు చేసి, సభకు నమస్కరించి, ప్రత్యేకాసనమున నిష్కంపముగా నాసీనుడయ్యెను. సభ్యుల ఆశ్చర్యసంభావనా ప్రశంసారవములు బంగారు చిరుమువ్వల మంజు శింజితము వలె సభలో కలకలలాడెను.

ముందుగా దేవరాయలు తమ సమీపమున కుడి ప్రక్కనున్న యాసనమున చంద్రభూష క్రియాశక్తిని, వామభాగముననున్న యాసనమున విద్యాధికారి డిండిమభట్టారకులను ఆహ్వానించి కూర్చుండజేసెను. అంతట సభాపతి అప్పటికే నిర్ణీతమై సిద్ధముగానుంచిన పట్టిక చదివి పండితులను సభలోనుండి పిలిచి, ఖాళీగా ఉంచిన మూటఎనిమిది యాసనములపై కూర్చుండజేసెను. అందులో కొండవీటిపండితులకును పోతన దుగ్గనలకునుగూడ స్థానము తీయుబడెను.

వారిలో వేదవిదులు పదిమంది: శ్రౌత స్మార్త విదులు పదిమంది; వైయాకరణులు ఉద్భట శాస్త్రకోవిదులు చెరిపదిమంది; యోగ న్యాయ వైశేషిక సాంఖ్యవేత్తలు చెరి యైదుగురు; పౌరాణికు లైదుగురు; శైవ వైష్ణవాగమప్రవీణులు పదుగురు; సంస్కృతప్రాకృతాంధ్రకవులు చెరి పదిమంది; తక్కినవారు ద్రావిడ, కర్ణాట, మళయాళ, ఉత్కళ, ఘూర్జర, మహారాష్ట్ర, అరబీ, పారశీక తురుష్కభాషికవులు భాష కొక్కొక్కరు—ఈవిధంగా నా యాసనము లలంకరించిరి.

'సభ సందడితగ్గి సావధానముగా నున్నంతట, 'ఈ శతావధానగోష్ఠిని చంద్రభూషక్రియా శక్తిని డిండిమభట్టును నడిపింప శ్రీ దేవరాయప్రభువు లర్థించుచున్నారు' అని సభాపతి విరమించెను. చంద్రభూషక్రియాశక్తి ప్రారంభించుచు 'ఈ శతావధానము నేడే పూర్తికావలె గనుక పృచ్ఛకులను పొడుగుపాటి ప్రశ్నలు వేయవద్దని మనవి వేయుచున్నాను. ముందు వేదవిదులు ప్రశ్నింతురు గాక !' అనెను.

వేదవిదు లొకరొకరే వారికి తోచిన భాగములలో మొదటిముక్క అందించి, ఆమంత్రములు చెప్పుమనిరి. శ్రీనాథుడు శ్రావ్యమైన కంఠముతో సుష్ఠుగా చెప్పెను. అంతట శ్రౌత స్మార్త వేత్తలు శ్రౌతస్మార్త కర్మకలాపములు సూక్ష్మముగా ప్రశ్నించి, కొన్నిమంత్రము లందించి, అవి యేయే కర్మలలో నెక్కడ వినియోగమగునో అడుగగా, శ్రీనాథుడు శాంతముగా చక్కని సమాధానము లిచ్చెను. అంతట విద్యాధికారిపురస్సరముగా వ్యాకరణశాస్త్రపరీక్ష ప్రారంభమయ్యెను. వారు తిరుగని సూత్రములతో భాష్య విచారణములతో వైయాకరణులను శ్రీనాథు డానందింపజేసెను. ఆతరువాత సూక్ష్మభేదములు గల

ఉత్తర ఆఫ్రికాలో అరబ్ స్త్రీలు వందలాది సంవత్సరాలుగా దైన్యాన్ని అనుభవిస్తున్నారు. అరబ్ కుటుంబాలు ఒకచోట నుంచి మరొకచోటకు వెళ్లేప్పుడు, మగవారు గాడిద ఎక్కి ముందు వెళ్లేవారు. మూటా ముల్లె నెత్తిన పెట్టుకుని ఆడవాళ్లు నడిచి వెనక వెళ్లేవారు. రెండవ ప్రపంచ యుద్ధం రావడంతో అక్కడ పరిస్థితులు మారిపోయాయి. మగవారు గాడిదల మీదే వెళ్ళినా, ఇది వరకు వాటి వెనక నడచిన ఆడవారు ఇప్పుడు ముందు నడుస్తున్నారు!

డి. వి. సూర్యప్రభ (కాకినాడ)

అలంకారవిచారణలు జరిగినవి. ఆపిమ్మట సాంఖ్య న్యాయ వైశేషిక యోగదర్శనములలో వరుసగా పరీక్ష జరిగెను. యోగశాస్త్ర ప్రశ్నలు సమాధానములు నీవిధముగా నుండెను. ఒక్కొక్కరు ఒక్కొక్క ప్రశ్న వేసిరి.

ప్రశ్న : కిం నామ మహావ్రతమ్ ?

శ్రీనాథుడు : అహింసాదయః పంచయమాః తే జాతి దేశకాల సమయ అనవచ్ఛిన్నాః సార్వభౌమాః. యమవ్రత మేవ మహావ్రత మితి కథ్యతే.

ప్రశ్న : ఆసనవిధిః తత్ప్రయోజనం చ కథ్యతామ్ !

శ్రీనాథుడు : స్థిర సుఖ మాసనమ్. యదేవ స్థిరం సుఖకరం చ తదేవాసనం కార్యమ్. సిద్ధాసన భద్రాసన పద్మాసన సింహాసనా న్యుత్తమత్వేన పరిగణితాన్యాసనాని, స్థిరత్వాత్ సుఖత్వాచ్చ. తథ కూర్మాసన కుక్కుటాసన, మయూరాసనాదీని హఠప్రయోగ ప్రసిద్ధాని, అస్థిరత్వా దసుఖత్వాచ్చ.

ప్రశ్న : సర్వరత్నలాభః కథం వా సిధ్యతి ?

శ్రీనాథుడు : అస్తేయ ప్రతిష్ఠాయాం సర్వ రత్నోపస్థానం సిధ్యతి.

ప్రశ్న : కిం నామ అహింసాప్రతఫలమ్ ?

శ్రీనాథుడు : అహింసాప్రతిష్ఠాయాం తత్సన్నిధౌ వైరత్యాగః శాశ్వతిక విరోధినా మపి సర్వేషాం ప్రాణినామ్.

ప్రశ్న : కి మీశ్వర స్వరూపమ్, కిం వా తద్వాచకమ్ ?

శ్రీనాథుడు: క్లేశకర్మ విపాకాశయై రపరామృష్టః పురుష విశేష ఈశ్వరః. తస్యవాచకః ప్రణవః.

యోగులతర్వాత పౌరాణికులు ఆగమవేత్తలును ప్రశ్నలు వర్షింపజేసిరి. శ్రీనాథుని సమాధానములు పరీక్షాధికారులకు తృప్తి కలిగించినవి.

అప్పుడు మధ్యాహ్నవేళ సూచించు ఘంటారవములు శ్రవణపర్వముగా వినవచ్చినవి. సభాపతి లేచి, "దేవరాయప్రభువులు పరీక్షకులను శ్రీనాథులను ఈపూటకైనను తమ యాతిథ్యము స్వీకరింప నర్థించుచున్నారు. అందరికిని మజ్జనానంతరమున ధరించుటకు నూతన కౌశేయద్వయములు సిద్ధముగా నున్నవి. అవి గ్రహించి సుఖభోజనములు కావించి ప్రభువులను ధన్యులగావింప వేడుచున్నారు. తక్కిన సభాసదులకు గూడ వేరుగా మజ్జనభోజనాదులు సిద్ధముచేసి యుంచినారు. వారలుకూడ ప్రభువుల యాతిథ్యము స్వీకరింప నర్థించుచున్నారు.—సరిగా మూడు జాముల వేళకు ఈ సభ మరల నారంభ మగును!" అని నివేదించెను.

ప్రభువులు కొలువు చాలించిరి. భోజనశాలలో ప్రభువులచే నియుక్తులైన ఉన్నతోద్యోగులు వారి కందరికి పట్టుపుట్టములు కట్టబెట్టి, సుష్ఠుగా భుజింపజేసిరి. చిత్రముగా శ్రీనాథునకుమాత్రము అందరతో గాక ప్రత్యేకముగా నొక మందిరము చూపిరి.

మరల మూడు జాములకు దేవరాయలవారు కొలువుతీరి విద్యావినోదసభ ఆరంభింపజేసిరి. వరుసగా సంస్కృతకవులు ప్రాకృతకవులు, ఆంధ్రకవులు, సమస్యా పూరణములు, వర్ణనలు మొదలగునవి చేయించి వినోదించిరి. ఒక తెలుగు కవి 'ఏకులు వడకుట చూచితిరా ?' యని ప్రశ్నించెను.

శ్రీనాథుడు :

"ఆ కదురున చికరవమును
నా కదురున భృంగరవము నాత్మరవంబున్
ఏకీకృతముగ నేకుల
నేకులు విన వడికె ముదిర యేకుల ముదిరా!"

ఇంకొకరు 'మీ కవితాప్రౌఢి వైవిధ్యము ఎట్టిదో సీసపద్యములో వర్ణింతురా ?' అని ప్రశ్నించిరి.

శ్రీనాథుడు :

వచియింతు వేములవాడ భీమనభంగి
నుద్దండలీల నొక్కొక్కమాటు
భాషింతు నన్నయభట్టు మార్గంబున
నుభయ వాక్ప్రౌఢి నొక్కొక్కమాటు

వా(క్పుత్తు తిక్కయజ్వ(వకారము రసి
భ్యుచితబంధముగ నొక్కొక్కమాటు
పరిఢవింతు (ప్రబంధ పరమేశ్వరునిఠీవ
సూక్తివైచి(త్రి నొక్కొక్కమాటు
(ప్రౌఢి బరికింప సంస్కృతభాష యం(డు
పలుకు నుడికారమున నాం(ధభాషయందు
రెవ్వరేమన్న నం(డుగా కేమి ! అన్న
దాస్య శృంగాటి గాణి కర్ణాటవాణి !"

మరియొక యాం(ధకవి "శ్రీ విద్యానగర యా(త్రామధ్యములో చేసిన సుఖభోజనమును వర్ణించుచు (శ్రీకృష్ణుని సంబోధించి పద్యము చెప్పుడు" అనెను.

(శ్రీనాథుడు :

"ఫుల్లసరోజ నే(త, యలపూతనచన్నుల చేదు (దావి, నా
డల్ల దవాగ్ని (మింగితి నటంచును నిక్కెదవేల? తిం(త్రిణీ
పల్లవ యుక్తమౌ నుడుకు బచ్చలిశాకము జొన్నకూటితో
మెల్లన యొక్కముద్ద దిగ(మింగుము, నీ పస కాన వయ్యెడిన్."

ఆ పద్యము విని సభ యంతయు నవ్వుతో వికసించెను.

పోతన వామనవటుని విజృంభణము వర్ణింపు డనెను :

(శ్రీనాథుడు :

ఇంతింతై వటుడింతయై మరియు దా నింతై నభోవీథిపై
నంతై తోయద మండలా(గమున కల్లంతై (ప్రభారాశిపై
నంతై చం(దుని కంతయై (ధ్రువునిపై నంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతుం డగుచు (బహ్మాండాంత సంవర్ధియై."

ఈ పద్యము నాతడు రెండుచేతులతో నభిన యించుచు పఠించెను.

పోతన తన పద్యము నెట్లు చదువుచున్నాడని యాశ్చర్యముతో చూచుచుండగా, దుగ్గన లేచి "ఆనమయమున సూర్యబింబ మెట్లుండెనో వర్ణింపుడు" అనెను.

(శ్రీనాథుడు :

"రవిబింబం బుపమింప బాత మగుఛ(త్త్రంబై శిరోరత్నమై
(శ్రవణాలంకృతియై గళాభరణమై సౌవర్ణ కేయూరమై
ఛవిమత్కంకణమై కటిస్థలి నుదంచద్ఘంటయై నూపుర
(ప్రవరంబై పదపీఠమై వటుడు దా (బహ్మాండ మున్ నిండుచోన్."

పోతన, దుగ్గనలు తెల్లవోవుచు ఒకరిమొగము లొకరు చూచుకొనుచు గుసగుసలాడుట విని (ప్రక్కనున్న వల్లభరాయుడు "(శ్రీనాథభట్టా ! ఈ రెండును మీపద్యములుగా లేవే ? ఎక్కడ సం(గ హించితిరి ?" అని (ప్రశ్నించెను.

(శ్రీనాథుడు : "అవి నావని చెప్పితినా ? మొన్న రా(త్రి ని(దా సమయమున ఒక బాల(బహ్మచారి

కవిసార్వభౌముడు

కవి తన మి(త్రునికి వినిపించుచుండగా కలలోవలె నాకు (శుతమైనవి. వానివి కావచ్చును" అని పోతనను నిర్దేశించెను.

అద్భుతావిష్టులై ఒక్కసారి సభలోనివారు పెద్దలు పిన్నలు పోతనవంక మెచ్చులచూపులు (ప్రసరింపజేసిరి. పోతన ముఖము సిగ్గుతో మరింత ఎ(రనై కోకనదమువలె మురిసెము గొలిపెను.

(శ్రీనాథునికి రాని భాషల కవులవంతు రానుం డెను. ఒక్క యాం(ధ కవి (ప్రశ్న ముండెను. ఆత డుత్తమకవిగోష్ఠిని వర్ణింపగోరెను.

ఫీ మా కం పె నీ ఏజంటు కాబోయే పట్టాదారుని (ప్రశ్న లడుగుతున్నాడు. "మీరు ఆఫీసుకు కారులో వెడతారను కుంటా."

"నాకు కారులేదండీ!"

"అయితే మోటారు సైకిల్ మీదగాని, సైకిల్ మీదగాని వెడతారా?"

"లేదండీ నేను నడిచే వెడతాను."

ఏజంటు తల అడ్డంగా తిప్పి "క్షమించండి నడిచి వెళ్ళేవారి దరఖాస్తులు మా కంపెనీ అంగీక రించదు" అని అంటూ చరచరా వెళ్ళిపోయాడు.

ఎం. దక్షిణామూర్తి (కావలి)

(శ్రీనాథుడు :

"అరబీ భాష తురుష్క భాష గజ కర్ణాటాం(ధ గాంధార ఘూ
ర్జర భాషల్ మళయాళభాష శక భాషా సింధు సౌవీర బ
ర్బర భాషల్ కరహాటభాష మరియున్ భాషా విశేషంబు ల
చ్చెరువై మెచ్చులు గూర్చు ముమ్మకవి గోష్ఠీ సం(ప్రయోగంబులన్."

ఇక (శ్రీనాథునికి రాని భాషల కవులు మిగిలి పోయిరి. వారు తమ తమ భాషలలో కొంత పద్యము కొంత గద్యము చదివి, (శ్రీనాథుని అప్పగింపు మనిరి. (శ్రీనాథుడు హేలగా (దావిడము, కర్ణా టకము, మళయాళము, పారశీకము, అరబ్బీ మొద లగు భాషలు ఉచ్చరించుచుండగా సభ పొందిన ఆనందమునకు మేరలేదు.

అంతట పృచ్ఛకులస్థానములలో కూర్చుండని ఇతరులు (ప్రభువుల యానతిగొని కొంద రెదు టికి వచ్చి నిలిచి (ప్రశ్నింపసాగిరి. వైద్యు డిట్లు (ప్రశ్నించెను :

(ప్రశ్న : కామజ్వరాభి తప్తానాం వద పథ్యం కి మౌషధమ్ ?

దృఢ మాలింగనం పథ్యం క్వాథశ్చాధరచుంబనమ్.

అంతట విద్యామల్లు వచ్చి నిలిచి యిట్లు (ప్రశ్నించెను.

(ప్రశ్న : మల్లవిద్యతో జయమునకు అద్వితీయ మైన దేది ? దానికి (ప్రతి(క్రియ ఏమి ?

(శ్రీనాథుడు : (శ్రీకృష్ణభగవానుల (ప్రేరేపణచే ధర్మరాజు (క్రీడారంగములలో నిషేధించి నిష్కాసన మొనర్చినట్టియు, ఈమధ్య పారశీకమునుండి దిగుమతియైన గోపవిద్య. దాని (ప్రతి(క్రియ వ(జలేపము.

ఆ (ప్రత్యుత్తరముతో విద్యామల్లు (తుళ్లిపడి తూలుచు ఆవలి కెట్లో వెళ్లగలిగెను.

గజశా(స్త్రము, అశ్వశా(స్త్రము, ఖడ్గవిద్య గదా పరిఘల (ప్రయోగములు గృహాలంకరణము వాస్తు దండనీతి సంగీతము మొదలగువానిలో నెంద రెందరో చి(త్రచి(త్రములైన (ప్రశ్నలు వేయగా, (శ్రీనాథుడు నిత్యనూతనమైన ఉపజ్ఞ (ప్రదర్శిం చుచు (ప్రత్యుత్తరము లిచ్చెను.

హస్తలాఘవ విదుడు వచ్చి క(రముక్కవలె నున్న దానిని చేతితో (క్రిందికిపట్టి చూపి 'ఇది ఏమి' టని (ప్రశ్నించెను. (శ్రీనాథుడు "నీ హస్తము సంచి లోనికి పోనీయక, పైకెత్తుము—అది కత్తి !" అనెను. వినోదకుడట్లే చేయు పైకెత్తగా నది యందరికి కత్తిగా కనబడెను.

తుదకు ఇం(ద్రజాలికుడు వచ్చి "(శ్రీనాథ భట్టా, మీ రా యాసనముతో నుండియే అదృ శ్యులు కాగలరా ?" అనెను.

(శ్రీ దేవరాయలవా రానతిచ్చినచో తప్పదు !"

దేవరాయలవా రానతిచ్చిరని సభాపతి (ప్రకటిం చెను. (శ్రీనాథుడు సు(బహ్మణ్య (శ్రౌతికి ఏదో సంజ్ఞచేసి, 'చిత్తము!' అనుచు కన్నులు మూసెను. ఆతని దేహము మంచు (క్రమ్మిన ట్లగుచు కాని పించి కానిపించి, గట్టి తెరవేసినట్లు అదృశ్య మయ్యెను. వెంటనే సు(బహ్మణ్య (శ్రౌతి కర్పూ రపుటారతి వెలిగించి, మంగళమం(త్రములు పఠింపగా, మరల తెర పోయి, మంచు (క్రమ్మిన ట్లుయి, అది విరిసిపోయి, తుదకు (శ్రీనాథ మూర్తి (శ్రీనాథతేజస్సుతో సభవారికి వెలుగ చు దివ్యదర్శనమొసంగెను. సభ అద్భుతావిష్టయై జయజయనినాదములతో సందడించెను.

(ప్రశ్న లైపోయినవి. "పరీక్షకులు పూర్వోత్తర మీమాంసలలో (ప్రశ్నలు వేయకుండుట కొరవగా ఉన్నది" అని (శ్రీనాథుడు పలికెను. వెంటనే చం(ద భూష(క్రియాశక్తి అందుకొని "గోష్ఠీ వినోదము లలో పూర్వోత్తరమీమాంసలు (ప్రశ్నించుట (శ్రీ విద్యానగరాచారము కాదు. రాజగురువులు తురీ యా(శ్రము లైనందున, పూర్ణాధికారులు కాని గృహస్థులు ఉత్తర మీమాంస (శ్రీగురువులసన్ని

ధానమునగాని చర్చింపరాదని నిషేధించిరి. మిమ్మును తృప్తిపరచుటకై పూర్వమీమాంసలో చిన్న ప్రశ్న వేసేదను." ఇట్లనుచు ప్రశ్నవేసెను. అది భాట్ట ప్రాభాకర మతములను అన్యోన్యము వివదింప జేయునదైనందున, సూటిగా నుత్తరమిచ్చుటకు శ్రీనాథుడు చిక్కులో పడి, ఎట్లో బుద్ధి కుదుటబరచుకొని తృప్తికరముగా నుత్తరమిచ్చెను.

అంతట చంద్రభూషక్రియాశక్తి చిరునవ్వు ముఖమున దాండవించుచుండగా నిట్లనెను : "శ్రీనాథభట్టా, ఇంతవరకు మీరు ప్రదర్శించిన వైదుష్యమునకు, ప్రతిభకు ప్రభువులు సంప్రీతులైనారు. ఈ వినోద సభా నియమములలో చివరకు జరుగవలసినదానిని సభా ప్రారంభమునందే ప్రకటింపక మా సభాపతులు పరాకుపడినారు. అవధానావసానమందు పృచ్ఛకులెవరైనను, తామడిగిన ప్రశ్నయు దానికి మీ రిచ్చిన సమాధానమును చెప్పుడని యడుగుట పరిపాటి. అది లేనిది అవధానము పూర్తికాదు. ముందే మీ కా విషయము తెలుపనందున, ఇప్పు డాకస్మికముగా మిమ్మడుగుట ధర్మముగా తోచుటలేదు. కావున మీకు జ్ఞాపకమున్నవి ఏవో పదిప్రశ్నలు వానికి మీ రిచ్చిన సమాధానములు చెప్పినచో, ఈ వినోద సభకు పరిపూర్ణత చేకూరును."

వెంటనే శ్రీనాథు డిట్లు ప్రత్యుత్తర మొసగెను : "అయ్యయ్యో, ఎంతమాట ! సభాపతులు పరాకుపడినారని పెద్దలగు మీ రన్నచో అనవచ్చుగాని, మా బోంట్లము అంగీకరింపదగినది కాదు. పృచ్ఛకులు 'నా ప్రశ్న యేమి ? మీ సమాధానమేమి ?' అని యడిగినచో నేను సరిగా చెప్పవలెనుగదా ! దాని తోడనే గదా అవధాన సంపూర్తి! ముందుగా నా నియమము చెప్పలేదని వంక పెట్టి, ప్రభువుల వినోదము కొరత పెట్టుట భావ్యమా? —ఇంకొక్క మనవి ! శ్రీ పీఠాధిపతులు నాకు ప్రసాదించిన ఈ శాటిని కన్నులకు కట్టుకొందును. అది నాకు దివ్యదృష్టి ప్రసాదింపగలదు." ఇట్లనుచు నాతడు భక్తితాత్పర్యములతో నా శాటిని కన్నులకద్దుకొని కన్నులు కనబడకుండ గంతగా కట్టుకొని యిట్లనెను: "ఇప్పుడు పృచ్ఛకు లెవరైనను ఆ ప్రశ్న వేయవచ్చును. శ్రీ గురువుల యనుగ్రహమున సరిగా చెప్పుటకు యత్నింతును. దయచేసి ఎవరును కంఠము మార్చి యడుగవద్దని ప్రార్థించుచున్నాను."

ఆమాటల కందరు విభ్రాంతులైరి. దేవరాయలు పరమానందభరితుల మైతిమని సెలవిచ్చి, ఇరువదిమందిని మాత్రమే ప్రశ్నింపుడని యానతిచ్చిరి. వేదమంత్రము, శ్రౌతము, స్మార్తము, వ్యాకరణము, సాహిత్యము, న్యాయము, వైశేషికము, సాంఖ్యము, యోగము, పురాణము, శైవాగమము, వైష్ణవాగమము — వీనిలో చెరియొకటి చొప్పున పండ్రెండు ప్రశ్న లైనవి. శ్రీనాథుడు సరిగా సమాధానము లిచ్చెను.

అప్పుడు సంస్కృతకవులలో నున్న నృసింహభట్టు లేచి లక్కనసూరి కంఠ మనుకరించుచు సంస్కృత భాషలో 'నే నడిగిన ప్రశ్న యేమి ? సమాధానమేమి ?' అనెను. వెంటనే శ్రీనాథుడు "నృసింహభట్టా ! కంఠము మార్చవద్దని నియమము చేసితిని గదా! మీరు సామాన్యముగా పెద్దమనుష్యులే ! మరి లక్కనసూరి కంఠమును అనుకరించి మాట్లాడవలెనని బుద్ధి మీకే స్వయంబుద్ధమైనదా ?— ధూర్తులైన లక్కనసూరి ఉపదేశమా ? — మీకు ప్రాయశ్చిత్తముగా ముం దా ధూర్తసూరి ప్రాకృతప్రశ్న సమాధానము చెప్పి తర్వాత మీ సంస్కృతప్రశ్నకు సమాధానము చెప్పెదను." అనుచు రెండును చెప్పెను. ఆ పండితమిత్రుల ప్రేమపూర్వక సల్లాపమునకు శ్రీదేవరాయలముఖము వికసించెను. సభ్యులు పలువురు నవ్వాపుకొనకలేక పోయిరి. తక్కిన ఆరు ప్రశ్నలకును గూడ శ్రీనాథు డుత్తరము లిచ్చి అవధానపరిసమాప్తి గావించెను.

నిద్రపోతున్న పరంధామయ్య జేబులో తెలివి తక్కువ దొంగ ఒకడు చెయ్యిపెట్టాడు. ఇంతలో పరంధామయ్యగారు కదలి వెల్లకితలా పడుకున్నారు. దొంగ చెయ్యి ఆ మహాకాయం క్రింద పడి నలిగిపోతోంది. దాన్ని బయటకు తీసుకునేందుకు వాడు నానా తంటాలూపడుతున్నాడు. దారిన పోతున్న ఇద్దరుపోలీసులు ఇదిచూచి సాయం పట్టి పరంధామయ్యగారిని లేవనెత్తి అతణ్ణి విడిపించారు. డబ్బు దొరక్కపోయినా బ్రతుకు జీవుడా అని దొంగ పిక్కబలం చూపాడు.

ఎస్. వాసుదేవమూర్తి (విశాఖపట్టణం)

అప్పుడు విద్యాధికారి అరుణగిరినాథ డిండిమభట్టు శ్రీదేవరాయలవారిని మహాసభను ఉద్దేశించి ఇట్లు సెలవిచ్చిరి.

"మా పితృపాదులు శోణాద్రినాథులు అద్వితీయ మేధాసంపన్నులై, శ్రీ బుక్కరాయ ప్రభువుల సభలో ఇట్టి శతావధానవినోదమునే ప్రదర్శించి విద్వద్వరేణ్యుల నాశ్చర్యచకితుల గావించిరని విని యున్నాము. మేము అఇఉణ్ణులు ప్రారంభించిన కాలమది ! అప్పుడు ముందుగానే వినోద నిర్ణయవిషయములు నిర్ధారింపబడినవి. ఈనాటి వలె ప్రశ్నోత్తరములు చెప్పవలెనని సభాంతమం దాకస్మికముగా ప్రకటింపలేదు. ఆనాడు పృచ్ఛకుల ముఖములు చూచుకునే గుర్తించి మా పితృపాదులు చెప్పియుండిరి. ఈనాడు శ్రీనాథభట్టు ఆకస్మికముగా తుదకు తెలిపిన నియమ మంగీకరించుటయేకాక, పృచ్ఛకులను చూడకుండ నేత్రపట్టముతో కంఠధ్వని గుర్తును బట్టి చెప్పి ద్విగుణముగా ప్రతిభను ప్రదర్శించిరి. అంతేకాక మా పితృపాదులు వేదము శ్రౌతస్మార్తములలో పరీక్ష యిచ్చియుండలేదు. అందుచే మా యూహకందని మా పితృపాదుల మహత్త్వముకంటె శ్రీనాథభట్టు ఈనాడు శతగుణముగా మహత్వము ప్రదర్శించి మనకు కలిగించిన ఈ విద్యావినోదము అశ్రుతపూర్వము— నభూతో న భవిష్యతి ! వారు ముందే సెలవిచ్చినట్లు సర్వవిద్యా స్వరూపులైన శ్రీ శంకరానందభారతీస్వాముల కటాక్షమును ఆ వేదపురుషుని అనుగ్రహమునే ఇందుకు కారణము. ఇకముందు కూడ నిట్లే వారల యనుగ్రహమునకు పాత్రులై వర్ధిల్లుదురుగాత !"

ఇంత నిర్నిబంధముగా డిండిమభట్టారకు లితరుల శ్లాఘించుట వినియెరుగని విద్యానగర పండితులందరు నాతనిలో వచ్చిన మార్పునకు సంతోషించిరి.

దేవరాయలు ఆనందముపట్టలేక ఈరీతిగా సెలవిచ్చిరి : "శ్రీనాథభట్టా, ఇంతటి సర్వతోముఖ ప్రతిభాశాలిని తమ విద్యాధికారిగా లభించిన సర్వజ్ఞ సార్వభౌమ పెదకోమటి వేమభూపాలుర యాస్థానమే ధన్యమైనది. ఈ మా ప్రశంస మీ స్థానాపతి మీ ప్రభువువారికి తెలివిడిచేయుదు గాక ! — ఇక మీరు మాకు కలిగించిన ఈ అప్రతిద్వంద్వమైన విద్యావినోదమునకు మిమ్మెట్లు గౌరవింప నిచ్చగింతురో సెలవిత్తురుగాక !"

శ్రీనాథుడు వినయముతో నిట్లు విన్నవించెను:


"జననాథోత్తమ, దేవరాయనృపతీ, చక్రేశ, శ్రీవత్సలాం
ఛనసంకాశ, మహాప్రభావ, హరి రక్షాదక్ష, నాబోటికిన్
కు నృపస్తోత్రసముద్భవంబయిన వాగ్దోషంబు శాంతంబుగా
కనకస్నానము చేసి కాక పొగడంగా శక్యమే దేవరన్!'

వెంటనే దేవరాయ లంగీకరించి ఆస్థాన దైవజ్ఞులను శుభలగ్నము నిర్ణయింపుడన ఆ నాల్గవనాటి యుదయమునకు లగ్నము పెట్టిరి.

అప్పుడు దేవరాయలు బంగారుపొదిగిన స్ఫటికాక్షమాల యొకటి తెప్పించి, వామనమూర్తిని వర్ణించిన బాలవటుకకవికి సభాపతిముఖమున కర్పూరతాంబూల పురస్సరముగా నర్పింపజేసెను. సభాపతిమెడలో నలంకరింపగా పోతన దానితో రవిబింబము గళాభరణమైనప్పటి వామనరూపమునే తలపించెను. పోతన భక్తితో సభకు నమస్కరింపగా, సభ్యులు 'నీ కవితాతిశయమును త్రివిక్రమావతారమువలెనే ప్రవర్ధిల్లుగాక !" అని యాశీర్వదించిరి.

సభ చాలించుటకు ముందు సభాపతి శ్రీ దేవరాయప్రభువుల నూతన శాసనమొకటి ప్రకటించెను.

"ఇకముందు శ్రీ విద్యానగరాస్థానములో ఆంధ్రభాషాకవులకు కర్ణాటభాషాకవులతోపాటు సమాన గౌరవాదరములు లభింపగలవని శ్రీ దేవరాయ ప్రభువులు ప్రకటించుచున్నారు!" (సశేషం)



ఏడుకొండలు

21–వ పేజీ తరువాయి

శ్యామ్‌బాబుమీద ఎంతో గౌరవం కలిగింది. ఇంత విజ్ఞానం కలిగిన మనిషి ఈలాంటి పల్లెటూరు ఎందుకు వచ్చాడా! అని ఆశ్చర్యపోయాడు. శంకర్ యొక్క బి. యస్‌సీ. విజ్ఞానం శ్యామ్‌బాబు చెప్పే వైజ్ఞానికవిషయాల్ని కొంతవరకే అర్థం చేసుకోవడానికి పనికొచ్చింది. మిగతావిషయాలు శ్యామ్‌బాబు విపులంగా చెప్పాక శంకర్‌కు అర్థమైంది. ఇంత విజ్ఞానం కలిగిన మనిషియొక్క డిగ్రీలేమిటో, ఏ యూనివర్శిటీలో చదివాడో అడుగుదామనుకుంటూండగానే, శంకర్‌కు, తను ఈ విషయాలన్నీ మద్రాసులో కొన్ని కొన్ని పరిశ్రమలలో పనిచేస్తూ తెలుసుకున్నాననీ, పెద్దచదువేమీ చదువుకోలేదనీ శ్యామ్‌బాబు చెప్పి, వ్యక్తిగతమైన విషయాలడిగేందుకు తావివ్వలేదు.

శంకర్ మేనమామ ఇంట్లో రెండురోజు లున్నాడు. ఈ రెండురోజుల్లోనూ లలితా, శ్యామ్‌బాబూ ఇద్దరూ అతని మనస్సునూ, కాలాన్నీ ఆక్రమించుకొన్నారు. వయస్సులో శంకర్‌కన్నా చాలా పెద్దవాడైనా, శ్యామ్‌బాబు శంకర్‌కు ఆసక్తిగల విషయాలన్నిటిలోనూ ఆసక్తి చూపిస్తూ, సహజవాత్సల్యంతో ఆత్మబంధువులాగా శంకర్‌ని చూస్తూ, అతని హృదయంమీద చెరగనిముద్ర వేశాడు. ఇద్దరికీ ఏదో అనుబంధం ఏర్పడింది. శంకర్ యొక్క నిష్కల్మషహృదయం, తలితండ్రుల్లాకాక, బీదవారైన మేనమామ కుటుంబంయందు గల అభిమానం, ముఖ్యంగా లలితయందు అతనికిగల ప్రేమా, శ్యామ్‌బాబును అతనంటే చాలా అభిమానించేటట్లు చేశాయి. ఆ కొద్దికాలంలోనే వారిద్దరి మధ్యా ఏర్పడిన మైత్రి ప్రభావంవల్ల శంకర్ తన మనస్సులోవున్న విషయాలన్నీ శ్యామ్‌బాబుతో చెప్పేశాడు. లలితంటే తనకు చాలా ఇష్టమనీ, తన తలితండ్రులు ఈ సంబంధానికి ఒప్పుకోరనీ, అయినా తనకు లలితనే వివాహంచేసుకోవాలని వుందనీ చెప్పాడు. శ్యామ్‌బాబు అతనితో లలితను తప్పక వివాహంచేసుకోమని చెప్పాడు. అందుకు వీలైతే, తలితండ్రులను ఒప్పించడానికి ప్రయత్నించమనీ, లేకపోతే స్వతంత్రించి ప్రవర్తించమనీ చెప్పాడు. శంకర్ తను అందుకు సిద్ధంగానే వున్నానన్నాడు.

మూడవరోజు మధ్యాహ్నం శంకర్, వెళ్ళిపోడానికి బయల్దేరాడు. తనకు ఇష్టంలేకపోయినా, వెళ్ళక తప్పదనీ, మళ్ళీ, కాలేజీలో చేరి, దసరా సెలవలకు వస్తాననీ మేనమామతోనూ, అత్తతోను చెప్పాడు. అతనూ, ధర్మసూరిగారూ వీధులోకి వెళిపోతూంటే లలిత వీధరుగుమీద నుల్చొని, వాళ్ళు కనుమరుగయ్యేదాకా చూస్తూనే వుంది. శంకర్‌కూడా వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ, భారంగా కదిలిపోయేడు.

కళ్ళతోనూ, మొహంలోని బాధతోకూడిన భావంతోనూ, వీడ్కోలిస్తూ, నిశ్చలంగా నిల్చున్న ఆమె మూర్తినే తల్చుకుంటూ, శంకర్ సాగిపోయేడు. ధర్మసూరిగారు అతన్ని బండి ఎక్కిస్తూ, తన స్థితిగతులనుగురించీ చికాకులగురించీ చెప్పారు. లలిత పెళ్ళయితే తనకు కొంత మనశ్శాంతి లభి

స్తుందన్నారు. తను వచ్చి అడిగితే తన చెల్లెలు కాదనే మనిషి కాదనీ, విశాఖపట్నంవచ్చి వాళ్ళ నడగడం అవగానే రామవరం తిరిగివచ్చి ముహూర్తం పెట్టి స్తాననీ చెప్పారు. శంకర్ ఏమీ అనలేదు. అతనెక్కిన రైలు కదిలిపోగానే ధర్మసూరిగారు ఇంటికి తిరిగి వచ్చేశారు. ఆయనమనస్సు చాలా సంతోషంగా వుంది. తన మేనల్లుడు సుముఖంగా వున్నట్లే, సత్యవతీ కేశవరావులు తనయందు సుముఖంగా వున్నారనుకొన్నారు.

ధర్మసూరిగారి కుటుంబమంతా, శంకర్ వచ్చి వెళ్ళడంతో ఎంతో సంతోషా న్ననుభవించారు. అప్పుడే లలితపెళ్ళి జరిగిపోయినట్లూ, ఆమె అత్త వారింటికి వెళిపోతున్నట్లూ ఊహించుకోసాగారు. అమాయకయైన లలితకూడా బావ ఈసారి వచ్చి నప్పుడు తనని తీసుకువెళ్ళడానికే వస్తాడనుకుంది. శంకర్ యొక్క మాటలూ, అతని చేష్టలూ, అతని మంచితనం, ఇంటిల్లిపాదీ రెండురోజులదాకా చెప్పుకు చెప్పుకు మురిసిపోయారు. లలితమనస్సులో బావ చేసిన చిన్నచిన్న పనులుకూడా జ్ఞాపకముండి పోయాయి. బావకు పెట్టె సర్దుకోవడం అశ్రద్ధ. తనే బావపెట్టె సర్దింది. బావకు పరధ్యానం ఎక్కువ. ప్రొద్దున్న గడ్డం గీసుకోవడానికి అరుగు మీద కూర్చున్నాడేగాని, అతని దృష్టంతా నీళ్ళు తోడుతున్న తనమీదే వుంది. వాకిట్లోవున్న నూతి దగ్గర తను నీళ్లు తోడుకుంటూంటే, బావ, "అబ్బ!" అనడం వినిపించి, తను "ఏమిటా?" అని అతని వేపు చూసింది. బావ గడ్డందగ్గర రక్తం కారు తోంది. తను గబగబా వెళ్ళి పౌడరుడబ్బా ఇచ్చి పౌడరు అద్దుకోమంది. గడ్డం గీసుకొనేవాడు పరధ్యానంగా వుంటే రేజరు వూరుకొంటుందా? అయినా అంత పరధ్యానమని పైతే ఎలాగబ్బా! ఆ పరధ్యానం అంతా ఎందుకో తనకు తెలుసు......అలా అనుకో గానే లలితకు నవ్వొచ్చింది. చిన్న నవ్వు తనలో తను నవ్వుకుంది.

శంకర్ వచ్చివెళ్ళిన పదిరోజులకి ధర్మసూరిగారు విశాఖపట్నం వెళ్లాలని బయల్దేరారు. తన యజమాని సత్యనారాయణగారితో విషయమంతా చెప్పి, కూతురి పెళ్లివిషయం మాట్లాడడానికి విశాఖపట్నం వెళ్లాలనీ, అందుకోసం రెండురోజులు సెలవకావాలనీ అడిగారు. సత్యనారాయణగారు సరేనన్నారు.

బావగారు చాలా మంచిస్థితిలో వున్నాడుకదా, ఎంత హీనంగా చూసినా వెయ్యి రూపాయలైనా లేందే పెళ్లి ఎలా చేస్తామా? అని భార్యాభర్తలు బాధపడుతూండేవారు. కట్నకానుకలు తాము ఎలాగా ఇవ్వలేరు. న్యాయానికి వాళ్ళ తాహతుకూ, శంకర్‌కు చదువూ రూపమూ వున్నందుకూ, తగిన సంబంధం రావాలంటే అధమం పదివేల రూపాయలైనా కట్న మివ్వగలిగిన సంబంధం రావాలి. కేవలం అభిమానించి బంధుప్రేమతో తమ పిల్లను వాళ్ళు చేసుకో వలసిందేగాని, ఆఖరికి పిల్లకు బంగారంగానీ, పిల్ల వాడికి విలువైన కానుకగానీ ఇవ్వగల తాహతు తమకు లేదు. ఈ ప్రపంచంలో కట్నకానుకలకూ, బంగారానికీ వున్న విలువ, మనుషుల హృదయాలకు ఏదీ? పిల్ల చాలా సద్గుణవంతురాలుకావచ్చు. అంద మైనదికావచ్చు. రక్తసంబంధకురాలు కావచ్చు. అయితేనేం? ఆమె తెచ్చిన కట్నకానుకలనుబట్టే ఆమెకు విలువ. ఆ బంగారమూ, డబ్బూ, కట్న లకూ ఇచ్చే విలువలో వందోవంతైనా ఆమె నిర్మల ప్రేమకూ, సచ్ఛీలానికి ఎవరైనా ఇస్తారా? డబ్బు వుంటే అవేమీ అక్కరలేదు. 'కట్నం' అనే తెర తప్పులన్నీ కప్పేసి లక్షణంగా పెళ్ళి జరిపించేస్తుంది. పెద్ద కట్నం తీసుకొచ్చిందంటే అందరూ ఆమెలాంటి గుణవంతురాలైన కోడలు, అత్తవారి అదృష్టంకొద్దీ దొరికిందంటారు.

ధర్మసూరిగారు ఎంత యిబ్బందిపడ్తూ సంసారాన్ని నెట్టుకువస్తున్నాడో భగవంతుడికే తెలియాలి. ఆయన జీతం ఏభై రూపాయలు. పైన నెలకు యిరవై రూపాయలదాకా దొరుకుతుంది. అంతా కలిసి బియ్యంఖర్చుకు సరిపోతుంది. రెండు మూడు కొట్లలో నూరేసి రూపాయలదాకా అప్పుంది. ఇంట్లో ఎవరికీ రెండుజతల బట్టలు కన్నా ఎక్కువ లేవు. మగపిల్లల చదువులూ, ఇతర ఖర్చులూ అన్నీ ఆ రాబడిలోనే జరగాలి. నలుగురు పిల్లలూ, ఇద్దరు పెద్దలూ పేరుకేగాని, అంతా పెద్దలక్రిందే లెక్కపెట్టచ్చు. పైగా ఒకప్పుడు బాగా బ్రతికిన కుటుంబం. నెలకు నాలుగైదు రోజులు విధిగా పస్తుండందే గడిచేదికాదు. అయినా గుట్టుగా సంసారాన్ని వెళ్ళదీసుకువస్తున్నారు. పైగా వాళ్లస్థితి అందరికీ తెలుసుకాబట్టి ఎవరూ వాళ్లకు అప్పుకూడా ఇవ్వరు.

విశాఖపట్నం వెళ్లడానికి సెలవైతే దొరికింది గాని డబ్బు దొరకడం కష్టమైంది. రైలుఛార్జీలకు పదిరూపాయలైనా వుండాలి. అవి ఎవరిస్తారు? సత్యనారాయణగారివద్ద జీతంకాక నూరు రూపాయలదాకా వాడుకున్నారు. ఇంక ఆయన్నడిగి లాభం లేదు. శ్యామ్‌బాబు నడుగుదామనుకున్నారుగాని, శ్యామ్‌బాబు కూడా సత్యనారాయణగారివద్ద డబ్బు ఎక్కువ వాడెయ్యడం ఆయన నెలదాకా అతని కేమీ ఇవ్వవద్దనడం తనకు తెలుసు. పైగా బాబు నడగటం మొహమాటంగా వుంటుంది. అందుకని అడగలేదు. చివరకు తనకు సామానిచ్చే సెట్టిని రూపాయకు నెలకు బేడచొప్పున వడ్డీ మీద, బ్రతిమాలగా అతనిస్తే, పుచ్చుకొన్నారు పదిరూపాయలు. అంతవడ్డీకి ఇస్తూ కూడా సెట్టి ఆయనను బోలెడు ఎత్తిపొడుపుమాట లన్నాడు. అవన్నీ భరించి ఆయన ఎలాగో రైలెక్కారు. మొత్తానికి సొమ్ము దొరికిందికదా అని తృప్తి పడ్డాడు. లలిత అదృష్టం మంచిదనుకున్నారు. తన డబ్బుచికాకులూ, సెట్టి ఎత్తిపొడుపుమాటలూ కూడా, కూతురు భవిష్యత్తులో సుఖపడుతుంది కదా అన్న ఆలోచన కలిగించిన తృప్తీ, సంతోషాల వల్ల ఆయన నేమీ బాధించలేకపోయాయి.

ఆవాళ మధ్యాహ్నం బయల్దేరివెళ్లిన ధర్మసూరిగారు, మర్నాడు తెల్లవారేటప్పటికల్లా తిరిగి వచ్చేశారు. ఆయన రెండురోజులతర్వాతగాని తిరిగి రారేమో అనుకొన్న, వారి కుటుంబానికి, ఆయనను చూడగానే ఆశ్చర్యం వేసింది. ఆయన మొహం కూడా అంత ఉత్సాహంగాలేదు.

మొహం కడుక్కొని కాఫీ త్రాగుతూ భార్యతో, సత్యవతీ కేశవరావుగారు కూడా లలితను తమపిల్ల వాడికి చేసుకోమని అన్నారని చెప్పారు. జగదాంబ నిర్ఘాంతపోయింది. లలితకు షాక్ తిన్నట్లయింది.

ఏడుకొండలు

తను వింటున్నది నిజమేనా? అనిపించింది.

ధర్మసూరిగారు, తను విశాఖపట్నం వెళ్ళిన దగ్గర్నుంచీ జరిగినసంగతులు చెప్పడం మొద లెట్టారు. "నేను సాయంకాలం ఆరుగంటలకు వెళ్ళాను. నన్ను చూడగానే 'చిట్టి' (సత్యవతిని ఆయన చిట్టి అని పిలుస్తారు) మొహం అదోకలా అయింది. నేను వాళ్ళింటికి రావడం వాళ్ళకంత ఇష్టంలేదని గ్రహించాను. కాస్సేపు అవీ, ఇవీ మాట్లాడాం. ఇంతలో కేశవరావు వచ్చాడు. నేనే పలకరించాను. చాలా ముభావంగా మాట్లాడాడు. వాళ్ళిద్దరూ అలా మాట్లాడుతూంటే నాకు ఎక్కువసేపు అక్కడ వుండ బుద్ధయ్యలేదు. నేను వెళ్ళిన పనే మిటో వాళ్ళతో వెంటనే చెప్పేశాను. లలితను శంకర్‌కు చేసుకోమని అన్నాను. సత్యవతి, శంకర్‌కు ఇప్పుడప్పుడే పెళ్ళిచెయ్యదల్చుకోలేదనీ, బహుశా నాలుగైదేళ్ళపైమాటే అనీ, ఈలోపున లలితకు వేరొక సంబంధం చేసుకోమనీ చెప్పింది. కేశవరావు, శంకర్‌కు చాలా పెద్దసంబంధాలు, పదేసివేలూ, పదిహేనేసివేలూ కట్నం ఇస్తామని వస్తున్నాయనీ, అయినా తా మిప్పుడప్పుడే చెయ్యదల్చుకోలేదనీ చెప్పాడు. అంతేకాకుండా, లలితను శంకర్‌మీద ఆశతో పెళ్ళిచెయ్యకుండా వుంచవద్దనీ, ఎదైనా తగినసంబంధం చూసి పెళ్ళిచెయ్యమని చెప్పాడు. ఎవరైనా బుద్ధిమంతుడైన బీదకుర్రాడికిచ్చి పెళ్ళి చెయ్యమన్నాడు. దానితో, నాకు వళ్ళుమండి పోయింది. తన గతజీవితం ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకోమన్నాను. 'నీలాంటి గతిలేనివాడికి నా చెల్లెల్నిచ్చి చదువు చెప్పించి నిర్వాకం చేసినందుకు, నీబుద్ధి చూపించావు' అని మరి అక్కడ ఒక నిమిష మైన వుండకుండా వచ్చేశాను. ఇంకా చాలా మాటలు అందామనుకున్నానుగాని, మన స్థితిని జ్ఞాపకం తెచ్చుకొని, ఇంకేమన్నా ప్రయోజనంలేదని వచ్చేశాను. ఆ ఊళ్లో హొటల్లో భోజనంచేసి, రాత్రి బండిలో బయల్దేరి వచ్చేశాను."

జగదాంబకళ్లల్లో నీళ్లు తిరిగాయి. లలిత ఏడవసాగింది. జగదాంబ లలితను దగ్గరకు తీసుకొని, "ఊరుకో తల్లీ! నాకు మొదటినుంచీ ఇలాగవు తుందేమోనని అనుమానంగానేవుంది. శంకర్ మాటలు చూసి మోసపోయాము. అనవసరంగా మనలో ఆశలు రేకెత్తించాడు. తలితండ్రులకు అతనుకూడా జడిసిపోయివుంటాడు. మన అదృష్టం! అన్నీ ఒకలాగే వున్నాయి" అంది. రామూ, శీనూ, పద్మా నిర్ఘాంతపోయి అక్కనీ, తల్లినీ చూడ సాగారు.

లలిత, తను కట్టుకున్న ఆశాసౌధాలన్నీ కూలి పోయాయనుకుంది. బావ తనని మోసం చేస్తాడని కలలోకూడా తను అనుకోలేదు! ఎంత మోసం చేశాడు! తనవల్ల తన తలితండ్రులు ఎన్ని అవ మానాలూ, కష్టాలూ భరిస్తున్నారు. తను బ్రతికి ఏం ప్రయోజనం? ఎందులోనైనా దూకి ఛస్తే బాగుండుననుకొంది.

"ధర్మసూరిగారూ!" అంటూ లోపలికి వచ్చిన శ్యామ్‌బాబు, వారి కుటుంబంలో అందరూ ఏదో పెద్ద ఆపద సంభవించినట్లు దీనంగా, విచారంగా

వుండడంచూసి, "ఏం? ఏమయింది?" అని అడి గారు. ధర్మసూరిగారు జరిగినదంతా చెప్పారు.

శ్యామ్‌బాబు అంతా విని, "అరె! దీనికి ఇంత బాధపడుతున్నారా? ఇది ఎలాగా మనం అనుకుంటున్న విషయమేకదా! శంకర్ మాటల్నిబట్టి అతని తలి తండ్రుల కిష్టంలేదని మునుపే తెలుసుగదా!" అన్నాడు.

ధర్మసూరి, శ్యామ్‌బాబు వైపుచూసి, "వాళ్లంతా ఒకటేగదా! వాడి మాటల్ని వాళ్లు లెక్కచేసేట్టు లేరు" అన్నారు.

"శంకర్, మీరు వెళ్ళేటప్పటికి ఇంట్లో వున్నాడా?"

"లేడు."

"మరి అతని వుద్దేశం మీకెలా తెలుసు?" అని శ్యామ్‌బాబు ప్రశ్నవేశాడు. అది విని లలిత తలెత్తి ఆయనవేపు చూసింది. నిజమే! శంకర్‌బావ ఏమీ అనలేదు.

"వాడు వూరిలో లేనట్లున్నాడు. వాడు మన వూరు వచ్చినట్లుకూడా వాళ్లతో చెప్పినట్లు లేదు" అన్నారు ధర్మసూరిగారు ఆలోచిస్తూ.

"మీరు అనవసరంగా ఖంగారుపడుతున్నారు. తన తలితండ్రులకు ఈ సంబంధం ఇష్టంలేదనీ, అయినా తను లలితనే వివాహమాడ్తాననీ, నాతో స్పష్టంగా శంకర్ వెళ్ళేముందు చెప్పాడు." అని శ్యామ్‌బాబు చెప్పాడు. లలితమొహం వికసించింది.

"వా డిష్టపడితే ఏం లాభం? పెద్దవాళ్లు ఒప్పుకోకపోయినప్పుడు అనుకున్నది ఎలా జరుగుతుంది?" అన్నారు ధర్మసూరిగారు.

"ఎందుకు జరగదు? అతని ఇష్టంప్రకారం అతను వివాహం చేసుకుంటాడు. మధ్య వాళ్ళేవరు? అతని నడగటానికి" అన్నాడు శ్యామ్‌బాబు. అలా కుదరదన్నట్లు ధర్మసూరిగారు తలూపారు. జగదాంబ, "మీరు చెప్పింది నిజమే బాబుగారు (శ్యామ్‌బాబు నుద్దేశించి) తలితండ్రులకు ఇష్టంలేదని అతనికే తెలుసు. అయినా శంకర్ తనకు ఇష్టముందని అతను చెప్తున్నాడు. వాళ్లు అంత విముఖతతో వున్నప్పుడు మనం పెళ్ళేలా చేస్తాం?" అని అడిగింది.

"ఆవిషయం శంకరే ఏర్పాటు చేస్తాడు. మీరేమీ దిగులుపడద్దు. మొన్న అతను ఇక్కడకు రావడం కూడా తలితండ్రులతో చెప్పి రాలేదు. అత నీ విషయంలో స్వతంత్రించి ప్రవర్తించదల్చుకున్నాడు. మూడునెలల తరువాత దసరాకు ఎలాగా వస్తానని చెప్పాడుకదా! అప్పుడు, అతని సలహా తీసుకొని ఏం చెయ్యాలో ఆలోచిద్దాం. ఈలోపల మీరేమీ ఖంగారు పడకండి" అన్నాడు శ్యామ్‌బాబు.

ఈమాటలు విని అందరి మనస్సులూ కొంత వరకూ తేలికయ్యాయి. లలితముఖం చాలావరకూ వికసించింది. బాబాయి అన్నమాటలు నిజం. శంకర్, పరిస్థితంతా తెలుసుండీకూడా ప్రత్యేకం తమ వూరి కెందుకొచ్చాడు? అతనికి పూర్తిగా తనమీద ఇష్టం వుంది. ఆ చూపులూ, ఆ మాటలే తెలుస్తున్నాయి.

శ్యామ్‌బాబుకు పాలు తీసుకొచ్చి ఇచ్చింది లలిత. ఆయన ధైర్యం చెప్పడంతో జగదాంబా, ధర్మసూరిగారుకూడా తమ విచారాన్ని మర్చిపోయారు. తాము శంకర్‌ని అనవసరంగా శంకించామనుకున్నారు. అతను ఇంట్లోవుండివుంటే ఏమయ్యేదో? కాని అతను లేకపోవడంవల్ల ఇలా జరిగింది. దానికి అతను ఎలా బాధ్యుడౌతాడు. అసలు ముఖ్యంగా కావలిసింది, శంకర్ ఇష్టమే. అతను బుద్ధిమంతుడు. స్వంత చెల్లెలయివుండి, సత్యవతి ఇలా ప్రవర్తించినందుకు ధర్మసూరిగారు మనసులో చాలా నొచ్చుకున్నారు. తను ఎన్ని కష్టాలనుభవించినా ఏనాడూ ఆమెను ఏ సాయమూ అడగలేదే? అయినా తనయం దామె నిర్లక్ష్యభావం చూపించింది. దానికికూడా ఆయన లెక్కచెయ్యలేదు. లలిత చిన్నప్పటినుంచీ, వాళ్లనోటితోటే అనేకసార్లు 'శంకర్‌కు లలితను చేసుకుంటాము' అన్నారు. వారి మాటనే వారు నిలబెట్టుకోలేకపోయారు. డబ్బు కోసం ఎటువంటి రక్తబంధుత్వమైనా త్యజిస్తారు లోకంలో. అటువంటప్పుడు ఈ బాంధవ్యాలు అనుకోవడం ఎందుకు? శుద్ధ దండుగ! శంకర్ మళ్ళీ వచ్చేవరకూ లలిత పెళ్లివిషయం తలపెట్టవద్దనుకున్నారు ధర్మసూరిగారు. కష్టాలు వాటంతట అవి కలిగించే బాధకన్నా, కష్టస్థితిలో వున్నవారియెడల ఇతరులుచూపే ఉదాసీనత మనుష్యుల్ని మరీ బాధిస్తుంది. ధర్మసూరిగారు, తానెన్ని చికాకులుపడినా, ఎక్కువ బాధపడలేదు. కాని తోబుట్టువు తనను నిరసనగా చూసిందనీ, తన యింట్లో తన సాయం వల్ల చదువుకొని పైకివచ్చిన కేశవరావు తన నవమానించాడనీ ఆయన బాధపడ్డాడు. కాని, భగవంతుని నమ్మినవ్యక్తి కాబట్టీ, ఆధ్యాత్మికబలం కలిగిన వారుకాబట్టీ మరుక్షణంలో ఆయన ఆబాధను మర్చిపోయారు.

కష్టాలలో వున్నవాడికి ముఖ్యంగా కావలసినది ఇతరుల సానుభూతి. శ్యామ్‌బాబు, ధర్మసూరిగారి కుటుంబంయెడల ఎంతో సానుభూతి చూపిస్తున్నాడు. వాళ్ల చికాకులూ, డబ్బు ఇబ్బందులూ, అప్పులూ అన్నీ అతనికి తెలుసు. ఎక్కువగా తను వారికేమీ సహాయం చెయ్యలేకపోయినా, వారి కష్టాలను తనకష్టాలుగా భావించుకొని మాట్లాడేవాడు. అతనికికూడా, అతని జీతం సరిపోయేదికాదు. డాక్టరుకోసం కొంతడబ్బు ఖర్చుపెట్టెయ్యడం వల్లా, తన బట్టలకూ సామానుకు కొంత వాడడం వల్లా సత్యనారాయణగారికి అతనే బాకీపడివున్నాడు. అతను డబ్బు చేతులోవుంటే మంచినీళ్లప్రాయంగా ఖర్చుపెడతాడు. లేనప్పుడు, మౌనంగా వస్తువడుకుంటాడు.

లలితకు శ్యామ్‌బాబుసంగతి తెలుసు. ఏనాడైనా అతను వంటచెయ్యకపోతే ఇట్టే పసిగట్టేది. తమ యింట్లోంచి అన్నీ తీసుకువచ్చి భోజనం చెయ్యమనేది. ఆమె మాటకు తిరుగులేదు. శ్యామ్‌బాబు ఆమె చెప్పినట్లల్లా చెయ్యాలిసిందే. అదే విధంగా ధర్మసూరిగారి ఇంటి పరిస్థితి, శీనూ, పద్మా వాళ్ల ముఖకవళికల్నిబట్టి శ్యామ్‌బాబు కనిపెట్టేవాడు. వెంటనే తన ఇంట్లోవున్న బియ్యం, పప్పులూ వాళ్లకు పంపించేసేవాడు. ఒకొక్కసారి డాక్టరు రెండురోజులు తనని భోజనానికి పిల్చాడని చెప్పి, వంటసామానంతా లలితకు ఇచ్చేసేవాడు. డాక్టర్ మిశ్రకు శ్యామ్‌బాబు ఇబ్బందులేమీ తెలి



GP

ఏడుకొండలు

యువు. అతను, శ్యామ్‌బాబుకు వస్తున్న ఎనభై రూపాయల జీతంతో శ్యామ్‌బాబు దర్జాగా వుంటున్నా డనుకొనేవాడు. అందుకని శ్యామ్‌బాబును తనవద్ద భోజనం చెయ్యమని అతను అనేవాడుకాదు. శ్యామ్‌బాబుమాత్రం భోజనంలేకుండా గడపవలసివచ్చేది.

శ్యామ్‌బాబుకు తోటిమానవులకు సహాయపడగల్గుతున్నాననే తృప్తి ఎంతో ప్రశాంతతనూ, ఆనందాన్నీ ఇచ్చేది. ఒక్క వ్యక్తిని, కష్టాలలోనున్నవాడిని, కడుపునిండా తిననిచ్చి, మనకు లేకుండా చేసుకున్నప్పుడు, ఆ త్యాగం మనిషికెంత తృప్తినిస్తుందో అనుభవంమీదగాని తెలియదు. కలిమికలవాడు తనకు కావలసినది వుంచుకొని, మిగిలింది దానం చేస్తాడు. కాని, లేనివాడు తనకు ఏదోవిధంగా లభించిన కొద్దివస్తువూ తనకే చాలకపోతే అందులో దానమేం చెయ్యగలడు? అటువంటప్పుడు, తనకు లేకుండా చేసుకుని, ఎదుటివాడికిస్తే, దానివల్ల ఎంతో ఆనందం పొందగలడు. ఆ యిచ్చే తెగింపే వుండాలి. కాని, యిచ్చినదానివల్ల ఎంతో తృప్తి కల్గుతుంది. అటువంటి అనుభవం కలుగుతున్న కొద్దీ శ్యామ్‌బాబు, తను ఎన్నో కొత్తవిషయాలు నేర్చుకుంటున్నా ననుకునేవాడు.

డాక్టరు మిశ్రాను కొంతవరకూ మంచిమార్గంలోకి తీసుకురాగలిగాననికూడా శ్యామ్‌బాబు సంతోషిస్తూండేవాడు. ఒకనెలరోజులు, సారాజోలికే మిశ్ర పోలేదుని, నారాయణి శ్యామ్‌బాబుతో చెప్పింది. కాని, చాటుగా ఒకటి రెండుసారులు కొద్ది మోతాదుల్లో తాగాడని చెప్పింది. శ్యామ్‌బాబుకూడా, పాత అలవాట్లు ఒక్కసారి మానెయ్యడం కష్టమనీ, చాలా ప్రయత్నంమీదగాని మానలేమనీ మిశ్రతో అనేవాడు. నారాయణి, డాక్టరు పూర్తిగా తాగడం మానేస్తే అతన్ని పెళ్లాడుతానంది.

(సశేషం)



"శ్రీశైల మాహాత్మ్యం"లో ఒక నృత్యభంగిమ

చిత్రసమీక్ష

శ్రీశైల మాహాత్మ్యం

"శివుడు, శివంకరుడు, భోలా శంకరుడు, ఆర్త త్రాణ పరాయణుడు, అర్ధనారీశ్వరుడూ" — ఈ మాటలన్నీ అబద్ధాలే. కోరి కట్టుకున్న భార్యకు శాపమిచ్చిన స్థాణువు. (సెట్టు) సూర్య ప్రభాభాసమానమైన ఒకానొక ఉషోదయంలో విషాదగీతిక నాలాపిస్తూ తనను గోరిన చిన్నది తలమోదుకుంటేనే గాని వినిపించుకోని 'చెవిటిమల్లయ్య.' అందుకే ఆయన్ను చూడాలని వచ్చినవాళ్ళు కూడా ఆ ప్రదేశంలో చెవిటి మల్లయ్య అన్నంతగా అరిస్తేనేగాని కరుణించడట. అదే శ్రీశైలక్షేత్రం. ఆ దేవుడే మల్లికార్జునస్వామి. ఆ ప్రదేశ స్థానిక పురాణకథను ఆధారంగా అలంకార్ ఫిలిమ్స్‌వారు నిర్మించిన 'శ్రీశైల మాహాత్మ్యం' చిత్రాన్ని ఇటీవల ప్రత్యేకంగా ప్రదర్శించారు.

బ్రహ్మగిరినిపాలించే చంద్రగుప్త మహారాజుకు అనుగ్రహవశాత్తు పార్వతీదేవే కూతురుగా జన్మించటం, కుమార్తె జన్మించిన దాది పధ్నాలుగేళ్ళకు పైగా యుద్ధాల్లో మునిగి తేలి రాజధానికి వచ్చిన మహారాజు యుక్త వయస్కురాలైన కుమార్తెనే కామించటం, అక్రమమని ఎవరు చెప్పినా వినకపోవటంవల్ల రాకుమార్తె శ్రీశైలక్షేత్రం చేరటం, ఆమెను వెంబడించిన మహారాజు కుమార్తె శాపంవల్ల శిలగా మారిపోవటం, రాకుమార్తె శ్రీశైలస్వామిని మెప్పించి ఆయనలో లీనమైపోవటం—జరుగుతుంది. స్థానికంగా ప్రచారంలోఉన్న ఈ కథలో అనౌచిత్యాలుగా కనిపించే కొన్ని సంఘటనలకు మార్పులు చేర్పులు చేశారు. దూర్వాసుని శపించిన కారణంగా పరమ శివుని కోపానికి గురియైన పార్వతీదేవి శిశువుగా చంద్రగుప్త మహారాజుకు దొరకటం, యక్షిణిశాపం వల్ల చంద్రగుప్త మహారాజు తనకు దొరికిన వ్యక్తే గాని కన్నబిడ్డ కాదనే వాదంతో తను పెంచిన కూతురు భ్రమరను కామించటం, లాంటివి సయుక్తిక సన్నివేశాల కల్పనలవల్ల ఆ పాత్రలకు, కథకు ఎంతో బలం కల్గింది. సన్నివేశాల నూహించటంలోఉన్న చాకచక్యం దర్శకత్వంలో అంతగా కన్పించకపోయినా, చంద్రగుప్తుడుగా రాజకుమార్, భ్రమరగా కృష్ణకుమారి, పట్టపుదేవిగా సంధ్య పాత్రలనర్థం చేసుకు నటించారు.

చిత్రం తెనుగు సేతలో తోడ్పడిన శ్రీ మల్లాది రామకృష్ణశాస్త్రి ఇది తర్జుమా చిత్రంకాదనేభావం కలిగించేందుకు చేసిన కృషి చిత్రంలో కన్పిస్తోంది. ముఖ్యంగా పాటలు పాడుతున్నప్పుడు—సిసలు తెలుగు చిత్రాన్ని చూస్తున్నామనే భ్రాంతి కల్గించేట్లు తయారైనకొద్ది చిత్రాల్లో ఇది ఒకటి. శ్రీ మల్లాది పాటలన్నీ బాగానేవున్నా పాహి మహేశా అనుపమ భాగ్యమిదే, ధ్యానావేద అన్నపాటలు, పామర్తి పసందైన సంగీతంలో మేళవించి విన సొంపుగా తయారయ్యాయి.

చిత్రం మనదైనా కాకున్నా ఆంధ్ర పుణ్యక్షేత్రపు కథకు పూర్వాపరంగావున్న కొన్ని చారిత్రక సన్నివేశాలు జోడించి ఒక శ్రీశైలానికి ఒక దృశ్య చరిత్ర రూపొందించిన అలంకార్ ఫిలింస్‌వారి కృషి అభినందనీయం. తెలుగుసేత నిర్మాత: శ్రీ బి. యస్. స్వామి.

★

నాగరాజ్



"సిరిసంపదలు"లో నాగేశ్వరరావు, సావిత్రి.

తెర వెనుక

9-వ పేజీ తరువాయి

తీరుతుందనే నమ్మకం నాకు ఉందని చెప్పాను. సీతాపతిగారు నేనన్నమాట లన్నీ ఓపికగా విన్నారు. చివరికి, కొంచెంసేపు ఆలోచించిన తరువాత, ఆ ఆఫీసరు తను చెప్పిన మాట వింటాడు గాని, లంచం యివ్వందే లాభం ఉండదని చెప్పారు. ఆ సంగతి అంతకుముందే నాకు తెలుసు కాబట్టి, లంచం యివ్వడానికి తయారుగా ఉన్నాననీ చెప్పాను. ఆయన మరునాడు డబ్బు తీసుకుని రమ్మని చెప్పాడు. ఆయన చెప్పిన విధంగా నేను, డబ్బు పట్టుకొని సీతాపతిగా రింటికి వెళ్ళాను. ఆయనా నేనూ ఆఫీసరుగా రింటికి కలిసే వెళ్ళాము. ఆఫీసరు గారితో సీతాపతిగారు చాలాసేపు రహస్యంగా మాట్లాడారు. నేను దూరంగా వీధిలో నుల్చొన్నాను. మధ్యలో సీతాపతిగారు నా వద్దకు వచ్చి నా పేరూ మొదలైన వివరాలు కనుక్కొని నా దగ్గర డబ్బున్న కవరు తీసుకొని ఆఫీసరుగారి వద్దకు వెళ్ళారు. ఆఫీసరుగారు ఇంట్లోకి వెళ్ళిపోయారు. ఆయన వెనకాలే సీతాపతిగారు కూడా లోపలికి వెళ్ళడం, వీధిలో నుల్చున్న నేను చూస్తూనే ఉన్నాను. పది నిముషాలు పోయాక సీతాపతిగారు తిరిగి నా వద్దకు వచ్చారు. 'పద వోయ్ వెళ్దాం. మన పని పూర్తయింది' అన్నారు నాకు తప్పక ఆ ఉద్యోగం వస్తుందని చెప్పారు."

"రెండు రోజుల తర్వాత ఇంటర్వ్యూ కూడా జరిగిపోయింది. నేను ఆ ఉద్యోగం నాకు వస్తుందని చాలా ధీమాతో ఉన్నాను. నెలరోజులు గడవగానే, ఆ ఉద్యోగానికి నేను సెలక్టు కాలేదనీ, మరొక రెవరో సెలక్టయ్యారని తెలిసింది. సీతాపతిగార్ని కలుసుకుని అడిగాను. ఆయన ఆ ఆఫీసరు కొన్ని కారణాంతరాలవల్ల అలా ప్రవర్తించాడనీ, కొద్ది రోజులలో అటువంటి ఖాళీ మరొకటి ఏర్పడుతుందనీ దానికి తప్పక నన్ను సెలక్టు చేస్తారని చెప్పాడు. తరువాత తెలిసిన విషయ మేమిటంటే, ఆ ఉద్యోగానికి సెలక్టయిన వ్యక్తి సీతాపతిగారి చుట్టమే నట. నా డబ్బుతో తన పని జరిగేట్టు చూసుకున్నాడేమో—ఆయన ! అని నాకు అనుమానం. మొత్తంమీద, మధ్యవర్తిని నమ్మకోడంవల్ల డబ్బూ పోయింది, ఉద్యోగమూ రాలేదు" అన్నాడు శ్యామలరావు.

మేనల్లుడి విఫలమనోరథ గాథ విని కైలాసరావు "నువ్వు చేసిన పొరపాటల్లా సరియైన మధ్యవర్తిని ఎన్నుకోలేక పోవడమే. దానికి చాలా తెలివితేటలు అవసరం. ఆమాట కొస్తే, మగ మధ్యవర్తులకన్నా ఆడ మధ్యవర్తులు నయం." అన్నాడు.

"అంటే ?" అని అర్థంకానట్టడిగాడు శ్యామలరావు.

"పెద్ద పెద్ద ఆఫీసర్లు వాళ్ల భార్యల నెంతో గౌరవంగా చూస్తుంటారు. మనం వీలు చూసుకొని ఆ — ఆఫీసరుగారి భార్యకు బత్తాయిలూ, ఆపిల్సూ, పువ్వులూ, పాలకోవా, ఐస్ క్రీమ్ మొదలైనవి అడపా తడపా యివ్వడం, సమయాలనుకూలంగా మన పని జరిగితే మంచి కుట్టు మిషనో, ట్రాన్సిస్టరు రేడియోనో, లేకపోతే (నగలు) రిస్టువాచియో బహుమాన మిస్తామనీ ఆశ పెట్టడం ద్వారా ఆమె అభిమానం సంపాదించి ఆమెచేత సదరు భర్తకు గట్టి రికమెండేషన్ చేయిస్తే ...."

"లాభంలేదు మామయ్యా, ఆ అయిడియా కూడా ఫెయిల్ ప్రూపు కాదు. కొండొకచో బహు ప్రమాదకరం."

"ఎందుచేత ?" అని కోపంగా బల్లగుద్దాడు కైలాసరావు.

"చెప్తా విను" అని మొదలెట్టాడు శ్యామలరావు. మా ఊళ్లో ఒక పెద్ద కంపెనీలో ఒక మంచి ఉద్యోగం ఖాళీ వచ్చింది. ఆ ఉద్యోగానికి మనిషిని నియమించే ఆఫీసరుకి పెద్ద బంగళా మంచి కారుతో సహా ఒక చక్కని అందమైన భార్య కూడా ఉంది. ఆమె వయసులో చిన్నదీ, చాలా సరదా అయినదీ. ఆమెద్వారా ప్రయత్నం చేస్తే తప్పక ఆ ఉద్యోగం లభిస్తుందని నాకు తోచింది. వాళ్లింట్లో ఉన్న నౌకర్నొకణ్ణి పట్టుకొని ఆమెకు గులాబీ పువ్వులూ, జీడిపప్పూ, చాలా యిష్టమనీ తెలుసుకున్నాను. వెంటనే పలాసానుంచి రెండు టిన్నుల నిండా జీడిపప్పు తెప్పించాను. ఒక బుట్టెడు గులాబీపూలు కొన్నాను.. మరొక బుట్ట నిండా రకరకాల పళ్ళు కొన్నాను. ఖరీదైన బిస్కట్ల టిన్ను కూడా పట్టుకున్నాను. అయ్యగారు లేని సమయం చూసి, ఆమెకే ప్రెజంట్లన్నీ సమర్పించాను. ఆవిడ అది చూసి చాలా సంతోషించింది. నా ఉద్యోగ విషయం ఆవిడతో చెప్పాను. నాగురించి తన భర్తతో తప్పక 'రికమెండు' చేస్తానంది. అసలా ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్న వాళ్లెవరికీ ఇటువంటి బ్రహ్మాండమైన అయిడియా తట్టివుండదనీ, నా ఒక్కడికే తట్టిందనీ, కాబట్టి తప్పకుండా నాకా ఉద్యోగం వచ్చేస్తుందనీ అనుకున్నాను." అని ఆగాడు శ్యామలరావు.

"కొంపతీసి, జీడిపప్పంతా తినేసి 'రికమెండు' చెయ్యడం మానేసిందా, ఏమిటి ?" అని అడిగాడు కైలాసరావు.

"అబ్బే ! పాపం ఆవిడలో ఏమేమీ లేదు. జీడిపప్పు తింటున్నప్పుడల్లా నాగురించి పొగిడి చెప్పిందట, బట్లరు ద్వారా తరువాత తెలిసింది. "పాపం ఆ నొక్కు నొక్కుల జుట్టూ, అందమైన మొహమూ, ఆ మొహంలో చిరునవ్వుతో ఆ అబ్బాయిని చూస్తుంటే జాలేస్తోందండీ. ఆ ఉద్యోగం అతని కిద్దురూ' అని గోముగా, ప్రేమగా, అనడం బట్లరు విన్నాడట. 'అలా అనడమే మీ కొంప ముంచింది సార్ !' అన్నాడు బట్లరు. ఎందుచేత ? అని అడిగాను. వాడు నన్ను సిగరెట్టంటే ఇమ్మన్నాడు. గోల్డ్ఫ్లేకు సిగరెట్టు ఒకటి వాడి మొహాన్న పారేశాను. అది కాలుస్తూ 'మా అయ్యగారు, నొక్కు నొక్కుల జుట్టా ! (అంటూ తమ బట్టతల తడుముకొన్నారు లెండి), అందమైన మొహమా ? (అద్దంలో ఒకసారి తమ మొహం చూసుకున్నారు), ఆమొహంలో చిరునవ్వా ! — హుం ! అని నౌకర్ని పిలిచి, రౌడీ కుర్రాళ్ల నెవ్వర్నీ బంగళా లోపలికి రానివ్వద్దంటే ఎందుకు రానిచ్చావు ? అని కేకలేశారండి" అని చెప్పాడు. ఆ తరువాత వాడిద్వారానే, ఆ ఆఫీసరుగారికి, వయస్సులో తమకన్నా చిన్నదైన

భార్యమీద చాలా అనుమానం అనీ, తన భార్య ఏ యువకుడినైనా మెచ్చుకుందంటే ఆ యువకుడిమీద ఈర్ష్యకొద్దీ తప్పకుండా ఆ యువకుడికేదైన అపకారం తలపెట్టాడనీ, ఆవిడ రికమెండు చెయ్యకపోతే నాకేమైనా లాభించి ఉండేదట కానీ, ఆవిడ రికమెండు చెయ్యడంవల్ల ఎంతమాత్రమూ ఆ ఉద్యోగానికి నేను 'సెలక్టు' అయ్యే అవకాశం లేదనీ, తెలుసుకున్నాను. కాబట్టి ఆడ మధ్యవర్తులు మరీ ప్రమాదకరం."

"ఈ రెండూ రకాల ప్రయత్నాలు 'ఫే' లయితే, తిన్నగా అసలు అధికారిని కలుసుకోవడమే మంచిదిరా" అన్నాడు కైలాసరావు దీర్ఘంగా ఆలోచిస్తూ.

"ఒక ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూ ఆపనీ చేశాను మామయ్యా! ఆయన వెంటనే, అప్లికేషనుఫారములో ఉన్న 'ఏవిధమైన ఒత్తిడినైనా తెచ్చి, సెలక్టుచేసే అధికారులను వశపర్చుకొనుటకు ప్రయత్నించువారీ ఉద్యోగార్హతను పోగొట్టుకొందురు' అన్న 'క్లాజు' చూపించి నా కళ్ళ ఎదుటే నా అప్లికేషన్ ఫారం తెప్పించి, నేనా ఉద్యోగానికి అనర్హుణ్ణి అని రాశేశాడు" అని శ్యామలరావు దీర్ఘమైన నిట్టూర్పు విడిచాడు.

కైలాసరావు కొత్త సిగరెట్టు వెలిగించాడు. మేనల్లుడు ఉద్యోగరంగంలో ఇన్ని పరాజయాలు పొందాడని తెలుసుకొన్న తరువాత, ఆయన తను ఎటువంటి సలహా నిస్తే అది శ్యామలరావుకి పనికి వస్తుందా? అని రెండు నిమిషాలు ఆలోచించక తప్పలేదు. ఆ రెండు నిమిషాలూ శ్యామలరావు ఆత్రుతగా మేనమామ మొహంకేసి చూశాడు.

"ఈసారి ఎటువంటి ప్రయత్నం చెయ్యాలా అని తెగ ఆలోచిస్తున్నాను మామయ్యా. ఎందుకంటే ప్రస్తుతం నేను ఇంటర్వ్యూకి వెళ్తున్న ఉద్యోగం చాలా మంచిది. ఆ ఉద్యోగానికి అభ్యర్థుల నెన్నుకొనేది — 'సర్వీసు కమీషన్ లాంటి బోర్డు. వాళ్ళు రికమెండు చేసి పంపినవాళ్ళకి దేశవ్యాప్తంగా ఉన్న — వాళ్ళ కంపెనీలలో — ఎక్కడైనా పెద్ద ఉద్యోగం ఇస్తారు, ఈ కంపెనీ వాళ్ళు. ఆ బోర్డులో, ఆ కంపెనీ జనరల్ మేనేజరుతో సహా ముగ్గురు సభ్యు లుంటారు. అందులో ఏ ఒకడికైనా ఒక చిన్న రికమెండేషను తీసుకువెళ్తే బాగుండును" అన్నాడు శ్యామలరావు.


"సరే ప్రయత్నిద్దాం. ముందు నువ్వు ఇంటర్వ్యూకి బయల్దేరు" అన్నాడు కైలాసరావు. అతని మాటలపై నమ్మకంతో శ్యామలరావు, కైలాసరావుకి మద్రాసులో తెలిసిన పెద్దవాళ్లెవరైనా ఉన్నారేమో, వాళ్లకి ఏదైనా రికమేండేషను లెట రిస్తాడేమో అనుకున్నాడు. మామయ్య తల్చుకుంటే ఎటువంటి పనైనా చెయ్యగలడనే నమ్మకం శ్యామలరావుకి ఉంది.

మర్నాడు ప్రొద్దున్న మద్రాసు మెయిలుకి బయలుదేరినశ్యామలరావుతో బాటు, కైలాసరావు కూడా, నెల్లూరులో తనకొక పని ఉందనీ, అందుకోరకు తను నెల్లూరు వరకూ ప్రయాణం చెయ్యదల్చుకున్నాననీ చెప్పి బయల్దేరాడు. మామా, అల్లుళ్లిద్దరూ మెయిల్లో సెకండు క్లాసు కంపార్టుమెంటు ఎక్కారు.

రాజమండ్రినుంచి బెజవాడ వెళ్ళేదాకా కైలాసరావు ఏదో డిటెక్టివ్ పుస్తకం చదువుకుంటూ కూర్చున్నాడు. రాత్రి అవడంవల్ల, శ్యామలరావు రైలు కిటికీలోంచి చీకట్లోకి చూస్తూ తన భవిష్యత్తును ఆ అంధకారంతో పోల్చుకున్నాడు. తను కాలేజీలో బి. ఎ. పాసవగానే, పెద్ద ఉద్యోగమేదో తనకోసం సిద్ధంగా ఉంటుందనీ, అది అంగీకరించి, నెలనెలా జీతం పుచ్చుకోవడమే, తను చెయ్యవలసిన పని అనుకున్నాడు. అతన్ని ఒక ధనవంతురాలైన విధవ పెంచుకొంది. ఆమె ఆస్తిమీద వచ్చే ఆదాయం అన్నోదకాలకు సరిపోతుంది కాని, తను ఉద్యోగమేదైనా సంపాదించేవరకూ వివాహం చేసుకోవడానికి వీలులేదని, తన కాబోయే మామగారు ఒక షరతుపెట్టాడు. ఆయన కూతుర్ని నిలువునా ప్రేమించెయ్యడంవల్ల, శ్యామలరావు త్వరలోనే ఉద్యోగం సంపాదిస్తానని శపథం పట్టాడు. ఇప్పుడు శ్యామలరావుకి ఉద్యోగం దొరికేదాకా, హృదయం భగభగ మండిపోతోంది. ఆ మంట చల్లారాలంటే, ప్రేమసఫల మవ్వాలి. ప్రేమ సఫల మవ్వాలంటే ఉద్యోగం దొరకాలి — అంటే ఆ అంధకారంలో వెలుగు కన్పించాలి..... అలా — అలా — ఆలోచిస్తున్న శ్యామలరావుకి ఆ అంధకారంలో చాలా వెలుగులు ఒక్కసారి కన్పించాయి. అవి బెజవాడ స్టేషను లైట్లు!

బెజవాడ స్టేషనులో, వీళ్ల కంపార్టుమెంటులోకి నలుగు రైదుగురు ఎక్కారు. శ్యామలరావు ప్లాటుఫారం మీదకి దిగి మెయిలు, ఈ చివరనుంచి ఆ చివరదాకా నాలుగుసార్లు పచార్లు చేశాడు. అన్ని కంపార్టుమెంటులలోనూ ఉన్న రకరకాల అమ్మాయిల్ని చూపుల్తో పరామర్శ చేశాడు.

మనస్సు పూరికే బాధపడిపోతున్నప్పుడు, కాస్త అందమైన అమ్మాయి ఎవరైనా, నాలుగుసార్లు తనవేపు చూస్తే శ్యామలరావు కది, స్ట్రాంగ్ కాఫీలా పనిచేస్తుంది. ఫస్టుక్లాసు కంపార్టుమెంటులో, ద్వారంవద్ద నిల్చున్న ఒక పద్దెనిమిదేళ్ళ అమ్మాయి తనవైపు తదేక దీక్షగా చూడడం గమనించాడు శ్యామలరావు. ఒకసారి తన నొక్కునొక్కుల జుట్టు చెదరిపోకుండా ఉందా లేదా — అని అనుమానం వేసి చేత్తో జుట్టు తడుముకున్నాడు. ఆ అమ్మాయికి బాగా స్పష్టంగా కన్పించేట్టు, దగ్గరలో ఉన్న ఎలక్ట్రిక్ లైటుకి మరింత దగ్గరగా జరిగాడు. మధ్య మధ్య స్టేషన్‌వైపు చూస్తున్నా, విధిగా ఆ అమ్మాయి మళ్ళీ శ్యామలరావు వేపు చూస్తోంది. ఆ చూపులుచూస్తూంటే శ్యామలరావుకి 'మనవులుగా అమాయక చూపుల మనసును లాగిన దెవరో?' అన్న పాట జ్ఞాపకమొచ్చింది. తనలో తను చిన్నచిరునవ్వు నవ్వుకున్నాడు. ఇంతలో రైలు కూసింది. ఆ అమ్మాయికి చూపుల్తోనే 'టా! టా!' చెప్పి, పరుగెత్తి వెళ్లి తన కంపార్టుమెంటులో పడ్డాడు. రైలు కదిలిపోతున్నా, శ్యామలరావు మనస్సులోంచి ఆ అమ్మాయి రూపం కదల్లేదు. ఈ ఇంటర్వ్యూ వచ్చిపడింది. లేకపోతే, టికెట్టు మార్పించేసి తనూ ఫస్టు క్లాసులోనే ఎక్కేసేవాడు. అంటే ....



తెర వెనుక

మరెందుకూ కాదు, వూరికే 'కంపెనీ' కోసం. ఆ అమ్మాయి చాలా సరదా మనిషిలాగుంది ఆ యింటర్వ్యూ బోర్డులో ఇలాటి అమ్మాయిలున్నా బాగుండును! తను గ్యారంటీగా సెలక్టయ్యేవాడు!

"వీడు మా మేనల్లుడు. బి. ఏ. పాసయి రెండేళ్ల నుంచీ చచ్చీ చెడీ తిరుగుతున్నాడు — ఉద్యోగం కోసం. అబ్బే! ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఒక్కటీ కలిసి రాలేదు. ఇంతకీ అదృష్టం కలిసిరావాలి" అన్న కైలాసరావు మాటలు విని ఈ లోకంలో పడ్డాడు —, శ్యామలరావు.

ఆ మాటలు ఎవరి నుద్దేశించి కైలాసరావు అన్నాడో, ఆ వ్యక్తికి సుమారు అరవై ఏళ్లుంటాయి. చాలా దర్జాగా, ట్వీడ్ సూటు వేసుకొని, పైపు కాలుస్తూ మాట్లాడుతున్నాడు. తెల్లని శరీరచ్ఛాయ ఆయనది. ఆయన బెజవాడలో ఎక్కి ఉండవచ్చు. కైలాసరావుకీ ఆయనకీ సంభాషణ ప్రారంభమై అరగంటయింది. అసలు వాళ్ల సంభాషణ ప్రారంభమై అరగం టయింది. అసలు వాళ్ల సంభాషణ, కైలాసరావు చదువుకున్న మర్డర్ ఈజెనైన్ జాబ్' అనే డిటెక్టివ్ పుస్తకం మీద ప్రారంభమైంది. వయస్సులో ఇద్దరూ పెద్దవాళ్లయినా, డిటెక్టివ్ పుస్తకాల మీద వాళ్లకున్న సరదా, కుర్రవాళ్లను మించిపోయింది. ఆ పరస్పర ఏకీభావంవల్ల వాళ్లిద్దరూ చాలా స్నేహితులై పోయారు. ఆ కొద్ది సేపటిలోనే! అసలు కైలాసరావుకి ఎవరితోనైనా ఇట్టే స్నేహం చెయ్యగల చాకచక్యం ఉంది. వాళ్ల సంభాషణ ఉద్యోగాల మీదకు మళ్లింది.

"అదృష్టమూ కలిసిరావాలి. మనుష్య ప్రయత్నం కూడా వుండాలి." అన్నాడా వ్యక్తి.

"ఏ మనుష్యప్రయత్నం లేద్సురూ. ఎంత కష్టపడి చదువుకు వెళ్లినా, ఆ ఇంటర్వ్యూ బోర్డు మెంబర్లు వీళ్లని ఇట్టే బోల్తా కొట్టించేస్తారు. అదే ఒక చిన్న రికమెండేషనుతో వెళ్తే, సులభమైన ప్రశ్న లడిగి, ఇట్టే సెలక్టు చేసేస్తారు."

"నిజమే మామయ్యా. ఒక ఇంటర్వ్యూలో నన్ను 'ఫామిలీ ప్లానింగు' గురించి బోలెడు ప్రశ్నలు వేశారు. నేను బ్రహ్మచారిని. నాకా విషయాలేమీ తెలియవంటే, ఈ రోజుల్లో బ్రహ్మచారులకే ఈ విషయాలు బాగా తెలుసు, నువ్వు వట్టి చాతకానివాడవు. ఈ ఉద్యోగానికి పనికిరావు పొమ్మన్నారు. నా తరువాత వెళ్లిన వాణ్ణి — ఇంగ్లీషు భాషకు ఎన్ని అక్కరాలని అడిగితే, వాడు 'ముప్పైరెండు!' అని జవాబివ్వగానే వాణ్ణి 'నువ్వు జీనియస్‌వి. నీకు వెంటనే ఉద్యోగం ఇస్తున్నా' మన్నారు. తరువాత తెలిసింది. అతనికి పెద్ద రికమెండేషను ఉందని" అన్నాడు శ్యామలరావు.

అతని మాటలకు, పెద్దవాళ్లిద్దరూ నవ్వారు. కొత్త వ్యక్తి పైపు కాలుస్తూ కొద్దిసేపు మవునంగా ఉన్నాడు. కైలాసరావు, ఇంటర్వ్యూల గురించీ, రికమెండేషన్ల గురించీ ఉపన్యాస మిచ్చేస్తున్నాడు. అది వింటూ ఆలోచిస్తున్న కొత్త వ్యక్తి, తన జీవితంలోనే జరిగిన ఒక విచిత్ర సంఘటనగురించి చెప్తానని, ప్రారంభించారు.

"నేను జి. టి. సి. కంపెనీలో డిప్యూటీ జనరల్ మేనేజరుగా పనిచేసి రిటైరయ్యాను. మీకు తెలిసే ఉంటుంది. జి. టి. సి. కంపెనీకి పదహారు సిగరెట్ ఫ్యాక్టరీ లున్నాయని. హిందువులకిచ్చే పెద్దపోస్టు నాదే. దీని తరువాత జనరల్ మేనేజరు పోస్టే పెద్దది. అది ఎప్పుడూ దొరల చేతుల్లోనే ఉంటుంది. ఇరవై ఏళ్ల క్రిందట, ఈ కంపెనీ ఇంత పెద్దది కాదు. కానీ, ఈ కంపెనీలో ఉద్యోగమంటే ఎంతో గౌరవ ముండేది, అందరికీ. ఆ రోజుల్లో, ఈ కంపెనీ కొంతమంది 'ఎగ్జిక్యూటివ్‌సు' కోసం దరఖాస్తుల్ని కోరింది. సుమారు ఏభైమంది బాగా చదువుకున్నవాళ్లు దరఖాస్తులు పడేశారు." అని ఆగారు.

కైలాసరావు, "నిజమే జి. టి. సీ. కంపెనీలో ఉద్యోగమంటే మాటలుకాదు. అప్పటికీ, ఇప్పటికీకూడా ఆ కంపెనీ ఉద్యోగమంటే అందరికీ గౌరవమే. పెద్ద జీతం, మంచి ఇల్లూ, కారూ, నౌకరూ, అన్నీ ఇస్తారు. ఎక్కడికి వెళ్లినా ఫస్టుక్లాసు ట్రావెలింగు." అని తలూచాడు.

కొత్తవ్యక్తి మళ్లీ ప్రారంభించాడు. "దరఖాస్తులు పెట్టిన ఏభైమందిలో నే నొకణ్ణి. ఇంటర్వ్యూలో, వాళ్లు ముగ్గుర్ని సెలక్టుచేసి, వారిపేర్లు అతిరహస్యంగా ఉంచారు. అప్పటి జనరల్ మేనేజరు, తన 'స్టెనో' ని పిల్చి ఈ మూడు పేర్లూ చెప్పి, (మరునాడు ఇంగ్లండు వెళ్లిపోయాడు) తను ఇంగ్లాండు వెళ్లాక, ఆముగ్గురిపేర్లూ బయటపెట్టమని చెప్పాడు. అంటే సుమారు నెల రోజుల దాకా ఇంటర్వ్యూ ఫలితమేమైనదీ, ఎవరికీ తెలియదు. ఒక్క స్టెనోకి తప్ప! అంతవరకూ ఈ ఏభయిమందీ తమకి ఆర్డరు వస్తుందని ఎదురుచూస్తూనే ఉన్నారు. నాకుమాత్రం ఇంటర్వ్యూలో సెలక్టవుతానని ధైర్యం లేదు. అందుకని, రోజూ ప్రొద్దున్న సాయంకాలం ఆ స్టెనోచుట్టూ తిరిగి అతన్ని, ఏం జరిగిందో చెప్పమని ప్రాధేయపడుతూండేవాణ్ణి. అతను రోజూ, తనకేమీ తెలియదని అంటున్నా అతన్ని వదలిపెట్టేవాణ్ణి కాదు. చివరికి, ఇక రెండురోజులలో ఆర్డర్సు పంపుతారనగా, ఒకనాటిరాత్రి అతను నాతో, నేను సెలక్టుకాలేదనీ, నా పేరుగల మరొకతను సెలక్టయ్యాడనీ చెప్పి, ఆ విషయం రహస్యంగా ఉంచమని చెప్పాడు."

"ఆ! ఏమిటీ?" అంటూ శ్యామలరావూ, కైలాసరావూ ఇద్దరూ తెల్లబోయారు.

"అవును. నా పేరు ఆర్. కైలాసనాథ్! సెలక్టయిన వ్యక్తిపేరు కె. కైలాసనాథ్! ఆయన ఆవిషయం చెప్పగానే నాకు చాలా దుఃఖం వచ్చింది. నే నప్పుడు చాలా చికాకుల్లో ఉన్నాను. నా తండ్రి చనిపోయాడు. నలుగురు తమ్ముళ్లూ, ముగ్గురు చెల్లెళ్లూ, తల్లీ, నా సంపాదనమీద బ్రతకాలి. ఒక చిన్న యిల్లు ఉండేదికాని, అప్పటికి, మేం చేసిన అప్పులు తీర్చెయ్యడానికి ఆయిల్లు అమ్మేశాం, అంతకు నాల్గు రోజుల

క్రితమే. నేను ఆయనమాటలు విని ఆయన ముందరే ఏడ్చేశాను. ఆయనకు నామీద చాలా జాలికలిగింది. పైగా ఈనెల రోజుల్నుంచీ ఆయనచుట్టూ తిరగడంవల్ల మా యిద్దరి మధ్యా కొంత చనువు ఏర్పడింది. తనవల్ల నేమైనా సాయం కావాలంటే తను సిద్ధంగా ఉన్నాననీ, కానీ తను చేసేదేమీ లేదనీ అన్నాడు. మళ్లీ నేను ఎంతో బాధపడడంచూసి, ఆయనే,'కె. కైలాస నాథ్' లో 'కె' ని 'ఆర్' క్రింద దిద్దవచ్చునుగాని, ఆ కాగితాలు మరి ఇద్దరు గుమస్తాల చేతుల్లోంచి వెళ్తాయికాబట్టి వా ళ్లనుమానపడవచ్చు నన్నాడు. ఆయన అలా అనగానే నాకు కొంత ధైర్యం వచ్చింది. నేను ఆయనను నా దగ్గర కొద్దిగా డబ్బు ఉందనీ, అది ఆ గుమాస్తాలకు ఇచ్చి పని జరిపించమనీ ప్రార్థించాను. ఆయన కొద్దిసేపు ఆలోచించి సరేనన్నాడు. వెంటనే ఇంటికి పరు గెత్తుకు వెళ్లి, మా యిల్లు అమ్మిన తాలూకు మూడువందల రూపాయ లుంటే, తీసికెళ్లి ఆయన కిచ్చాను. మూడోరోజున నా చేతికి ఆర్డ రొచ్చింది'' అన్నాడు.

''అది విని, ''అబ్బ ! భలేపని చేశారు !'' అన్నాడు శ్యామలరావు. కైలాసరావుమట్టుకు, ఎక్కడో శూన్యంలో చూస్తున్నట్టు చూస్తూ, విచారంగా మొహంపెట్టాడు. ఆ కొత్త వ్యక్తి, కైలాసరావు అలా ఉండడం చూసి, ''నే చేసినది తప్పంటారా ?'' అని అడిగాడు.

''అబ్బే ! అది నా దురదృష్టం !'' అన్నాడు కైలాసరావు దీనంగా.

ఎప్పుడూ హుషారుగా ఉండే, తన మేనమామ మొహం ఇంత దీనంగా వుందేమా ! అని ఆశ్చర్య పడ్డాడు. శ్యామలరావు. కొత్తవ్యక్తి కూడా కైలాసరావువైపు వింతగా చూశాడు.

కైలాసరావు, ఆ కొత్త వ్యక్తితో ''మీ రెప్పు డైనా, మీకోసం బలికాబడిన కె. కైలాసనాథ్ ని కలుసుకున్నారా ?'' అన్నాడు.

''లేదు.''

''అయితే ఇప్పుడు కలుసుకుంటున్నారు. నేనే ఆ కె. కైలాసనాథ్ ని'' అన్నాడు కైలాసరావు. అది విని ఆ కొత్తవ్యక్తి నీరుకారిపోయి ''క్షమించండి. అప్పట్లో నా పరిస్థితి .... '' అంటూంటే, కైలాసరావు ''మీరు బాధపడ నక్కరలేదు. నా దురదృష్టంవల్ల నా కది రాలేదు. ఒక్క జి. టి. సీ. కంపెనీయేకాదు, అనేక చోట్ల ప్రయత్నంచేశాను. ఏదీ కలిసిరాలేదు. చివరికి ఈ ప్లీడరీవృత్తిలో కాలక్షేపం చేస్తు న్నాను. ఇందులోకూడా నే నంత పైకి రాలేక పోయానంటే కారణం నా దురదృష్టమే'' అన్నాడు.

శ్యామలరావు, ''మామయ్యా, నీపేరు కైలాస రావుకదా ?'' అని తన సందేహం బయట పెట్టాడు. కొత్తవ్యక్తి కూడా, వింతగా కైలాస రావువేపు చూశాడు.

''అవును. అనేక ఉద్యోగ ప్రయత్నాలు విఫల మయ్యాక నాకు, నా జాతకంలోనే ఏదో లోప ముందనే అనుమానం కొద్దీ ఒక జ్యోతిష్కుడికి నా జాతకం చూపించాను. అతను, నాకు కైలాస నాథ్ అనే పేరు అచ్చిరాదనీ, 'కైలాసరావు' అని మార్చుకోమని సలహా యిచ్చాడు. అప్పటినుంచీ కైలాసరావు నయ్యాను'' అన్నాడు కైలాసరావు అల్లుడివైపు చూస్తూ, విచారంగా.

శ్యామలరావూ, కొత్త వ్యక్తీ కూడా తృప్తి పడ్డారు.

కొత్త వ్యక్తి, కైలాసరావుని చాలాసార్లు క్షమాపణ కోరుకొన్నాడు. మాటలసందర్భంలో కైలాసరావు తన మేనల్లుడైన శ్యామలరావు మద్రాసుకు ఉద్యోగానికై వెళ్తున్నాడనీ, అతని ప్రయత్నమైనా సఫలమైతే బాగుండుననీ అన్నాడు. కొత్తవ్యక్తి, శ్యామలరావుని, అతను వెళ్లబోయే ఇంటర్వ్యూ గురించి అనేక ప్రశ్న లడిగాడు. శ్యామలరావు, బి. ఎం. ఎస్. అనే ఒక పెద్ద కంపె నీలో సేల్సుమాన్ ఉద్యోగానికై వెళ్తున్నాడు.

''మీ కభ్యంతరం లేకపోతే, జి. టి. సి. కంపె నీలో నాకున్న పలుకుబడిని వినియోగించి మీ మేనల్లుడికి ఒక మంచి ఉద్యోగం వేయించాలని ఉంది. తద్వారా, నావల్ల మీకు జరిగిన అన్యా యానికి కొంత ప్రతికృతి చేసినట్లు భావిస్తాను'' అన్నాడు ఆ కొత్త వ్యక్తి. అందుకు శ్యామలరావూ, కైలాసరావూకూడా అంగీకరించారు. శ్యామల రావుని, ఆ కొత్తవ్యక్తికి అప్పగించి, కైలాస రావు నెల్లూరులో దిగిపోయాడు. ఆ వ్యక్తి తను కూడా మద్రాసే వెళ్తూండడంవల్ల, శ్యామల రావుకి, మద్రాసు వెళ్లిన వెంటనే ఉద్యోగ మిప్పి స్తానని కైలాసరావుకి హామీ ఇచ్చాడు.

శ్యామలరావు, మద్రాసు చేరిన దగ్గర్నుంచీ, ఏమీ శ్రమపడనక్కరలేకుండా అన్ని పనులూ చకచకా జరిగిపో నారంభించాయి. కైలాసనాథ్ గారు, శ్యామలరావుని తిన్నగా జి. టి. సి. కంపెనీ జనరల్ మానేజరువద్దకు తీసికెళ్లి పరిచయం చేసి, తనకు చాలా కావలసిన యువకుడనీ, మంచి ఉద్యోగ మిప్పించమనీ, సిఫార్సు చేశాడు. శ్యామల రావుకి ప్రత్యేకంగా ఒక చిన్న ఇంటర్వ్యూ ఏర్పా టయింది. వారంరోజులలో, మెడికల్ ఎగ్జామి నేషన్ వగైరా పూర్తిచేసి, ఆర్డరు కొద్దిరోజు లలో పంపిస్తామని చెప్పారు కంపెనీవారు. పది రోజుల తరువాత 'జూనియర్ ఎక్జిక్యూటివ్' ఆర్డరు పట్టుకొని, రాజమండ్రిలో దిగి శ్యామల రావు, మేనమామతో జరిగినదంతా చెప్పాడు. కైలాసరావు చాలా సంతోషించాడు.

''కాని మామయ్యా ! నువ్వు జి. టి. సి. కంపె నీకి ఇరవైఏళ్ల క్రిందట ప్రయత్నించడం, నీకు రాకుండా నీ పేరుగల మరొకడికి ఉద్యోగం రావడం మొదలైన విషయాలు నాకు తెలియవు సుమా !'' అన్నాడు శ్యామలరావు.

''నాకుకూడా తెలియదురా. ఆయన తను చేసిన గొప్పపనిని బయటపెట్టాక, ఆయ న్నొక చిన్న ఆట ఆడిద్దామని సరదావేసింది. మధ్యలో నువ్వు వేసిన అడ్డు ప్రశ్నతో, దానికి మరింత రంగుపులమాలిసి వచ్చింది. చివరకు ...'' అని కైలాసరావు అంటూంటే, శ్యామలరావు


''వ్హాట్! అదంతా నటనే నన్నమాట. బలేగా ఉంది మామయ్యా ! బలే ! బలే !'' అంటూ పొట్ట ఉబ్బేటట్లు నవ్వ నారంభించాడు.

''కానీ ఒకందుకు అది బాగా కలిసివచ్చింది'' అన్నాడు కైలాసరావు. శ్యామలరావు అవునన్నాడు. తన ఉద్యోగానికి మంచి రికమండేషను సంపాదించి పెట్టిందని ఒప్పుకున్నాడు.

''మొత్తానికి ఉద్యోగం సంపాదించాలంటే, నువ్వన్నట్లు, తెరవెనుక ప్రయత్నమే ముఖ్యం'' మామయ్యా అన్నాడు శ్యామలరావు.

''ఉద్యోగం దొరికింతరువాత కూడా, తెర వెనుకే ఉండిపోయి, తెరమీదకు రావడం మర్చి పోకు సుమా !'' అన్నాడు కైలాసరావు నవ్వుతూ.

★



విరిగిన ఆరడజను సూదులతో కలిపి మీ మొత్తం బిల్లు తీసుకొండి.

మనమూ మనరాష్ట్రం

11-వ పేజీ తరువాయి

పద్ధతి. చాలా ప్రయోజనకరమైనట్టిది కూడా. ఏ పార్టీ ఎంతమంది కార్యకర్తలను ఇలా సమీకరించి సంచారానికి పంపగలదో ఆ పార్టీకి అంత బలం. అయితే కేవలం కార్యకర్తల సంఖ్యాబలం ఒక్కటే సరిపోదు. ప్రతి కార్యకర్తకు, తన పార్టీ కార్యక్రమాల విశిష్టత ఎదుటి పార్టీల కార్యక్రమాలలో గల లోపాలు కుణ్ణంగా తెలియాలి. తనకు తెలిసిన సంగతులు ఓటర్లకు తెలియజెప్ప తెలివితేటలుండాలి. ముఖ్యంగా దైనందిన జీవితంలో జనసామాన్యం ఎదుర్కొనే సమస్యల పరిష్కారావకాశాలు వివరించగల స్థితిలో ఉండాలి.

ఓటర్ను మూడురకాలు : స్థితి గలవారు, మధ్య తరగతి ప్రజలు, పాటకజనం. ఇందులో పై తరగతి వోటర్లకు కాంగ్రెసు సోషలిజమన్నా, కమ్యూనిస్టుల విప్లవమన్నా భయం. కనుక స్వతంత్ర పార్టీవైపు మొగ్గడం సహజం. దేశంలో ధనికులు అట్టే మంది లేరు గనుక కాంగ్రెస్ భయపడాల్సిన పని లేదు. పోతే రెండవ రకం మధ్య తరగతి ప్రజలు. గత రెండు ప్రణాళికలలోనూ, నిరుద్యోగ సమస్య తీరకపోవడంవల్ల, పైపెచ్చు ధరలు పెరిగి జీవిత పరిస్థితులు క్లిష్టంగా తయారవడంవల్ల కాంగ్రెస్ అంటే వీరిలో చాలా మందికి అభిమానం సన్నగిల్లినమాట నిజం. అయితే అటు స్వతంత్రపార్టీ కార్యక్రమం గానీ, ఇటు కమ్యూనిస్టు సంఘా గాని వీరికి సరిపడదు. అందువల్ల ఏ పార్టీకి ఓటు చేయకుండా నిరాసక్తంగా ఉండిపోయే ప్రమాదం ఉంది. కాంగ్రెస్‌కు తగిలితే ఈ వర్గంవల్లే దెబ్బతగుల్తుంది. మూడో రకం : కార్మిక కర్షక వర్గాలకు చెందిన పాటక జనం. వీరిలో కాంగ్రెస్ లేదా కమ్యూనిస్టు అభిమానులు తప్ప మరో పార్టీని అనుసరించేవారు అట్టే తక్కువ. గత పది, పదిహేనేళ్లలోనూ, వ్యవసాయకూలీలకు కనీస వేతనాలు నిర్ణయించి, నిరుపేదలకు బంజర్లు పంచి, ఫ్యాక్టరీ కార్మికులకు అనేక సదుపాయాలు కల్పించి, కాంగ్రెస్ ఏదో కొంత చేసింది గనుక కాంగ్రెస్‌పై ఈ వర్గం ప్రజల అభిమానం సన్నగిల్లవలసిన అవసరం కన్పించదు.

ఈ వివిధ వర్గాల ప్రజలను కూడగట్టుకుని రావడంలోనే ఆయా పార్టీల తెలివితేటలు కనపడాలి. ఆంధ్రలో వోటర్ల సంఖ్య 190 లక్షలు. ఇందులో ఎక్కువ భాగం గ్రామీణులు. ఏ పార్టీ గెలుపు ఓటములైనా కేవలం గ్రామీణుల మనస్తత్వంపై ఆధారపడి ఉంటుంది. ఎన్ని పార్టీలు రంగంలోకి దిగినా, ఎంత ప్రచారం చేసినా, ఈనాటికింకా గ్రామాలలో గ్రామ పెద్దలు ఎటు చెబితే, అటు జనం మొగ్గే ధోరణి పోలేదు. ఆ పెద్దలలో గల ముఠాలు, కులాభిమానాలు వారి పలుకుబడిని బట్టి ఆ పార్టీలకు లభించే ఓటింగ్ బలం ఆధారపడి ఉంటుంది. ★

హరివంశం

14వ పేజీ తరువాయి

క్షిణ ఇంతటి అందమును తనలో నింతవరకును దాచుకొన్నది. పాములవాడు వచ్చి నాగస్వరము నూదగా, నా కుగర్భమునుండి వెలువడు గోధుమ వన్నెత్రాచువలె, ఈ యాదవుడు వచ్చి, ఒక్క మందహాసమును ఊదినంతనే, ఈ అందము ఆమెలో నుండి బహిర్గతమైనది. వీడు దుష్టుడు. ధూర్తుడు. అనంతశయనుడు. కన్నెల మానధనంబు దుల్చెడువాడు. "అహో ! నా ఈ అలోచనలేమి ! నేను ఏమైపోవుచున్నాను. సుదక్షిణే ! సుదక్షిణే ! నీవు నా ప్రాణమవు. నీనికి ఎందరో మనస్సు నిచ్చినారు. నీవును అట్టులే నీ మనస్సును వీని కిచ్చెదవా ! అది జరుగదు. జరుగుటకు వీలులేదు" అనుకొన్నంతలో వాని ముఖము వెలవెలపోయినది. అంతలో క్రోధముతో నిండి పోయినది. సుదక్షిణ దగ్గరకు రాగా నతడు ఆమె వంక నతి తీక్ష్ణముగా చూచినాడు. వికటముగ నవ్వినాడు.

"సుదక్షిణే"

సుదక్షిణ అప్పుడు అతనిని చూచినది.

"స్వామి ! తమరుగూడ వచ్చినారు. ఇంత వరకును తమరు ఇంకను రాలేదేమి అనుకొనుచున్నాను. ఇప్పుడు నా హృదయమున ఆనందము సమగ్రమైనది. శ్రీకృష్ణదేవునకు, బలరామదేవునకు బిక్షయిడువేళకుగూడ తాము రారేమో అనుకొని తహతహ చెందినాను. నాన్నా ! అంతయు సిద్ధముగనున్నది. బిక్ష యిడుటయే యిక ఆలస్యము."

మహారాజా మాటాడలేదు. ఆయనమనస్సు పౌండ్రకుని మాటలతో మరల ఆమయుజుష్టమై పోయినది. ఏదో కీడు రానున్నదని ఆయనకు అనిపించినది. ఆయన ఆ స్థితిని చూచి పౌండ్రకుడు మరల గల్లున నవ్వినాడు. మరల వికటముగా నట్టహాసము చేసినాడు.

"మాతుల ! కుమార్తె నల్ప్యరించుచున్నది. కాశికలో అన్నపూర్ణ నీ యింట వెలసినది. నేను గూడ నున్నగాని తన యానందము నిండినట్లు కాదట. ఏదీ ! ఈ తిరిపపు వటువులకు బిక్ష యిడరాదో ! ఓరి ! ఆభీర ! ఇట రమ్మురా ? పౌండ్రకుని అర్థాంగి, ఈవేషముతో వచ్చినదనిగూడ సిగ్గులేదా ? ఊరక తడవుచేయుచున్నావు ?"

సుదక్షిణ "స్వామి !" అన్నది. కళవళపడినది. అంతలో సంబాళించుకొన్నది. తండ్రిని సంబోధించి "నాన్నా !" అన్నది. ఆయన అప్పటికి తేరుకొనినాడు. పౌండ్రకుని మాటలు వినవలయు దౌర్గత్యము తనకుమార్తెకు పట్టలేదు. అందులకే ఆయన అప్పుడు సంతోషించినాడు.

"తల్లీ ! ఇటు రా ! వాసుదేవుడు కక్షపాలను పట్టుచున్నాడు. బలరామదేవా ! ఇటు రారయ్యా తల్లీ ! ఇటు ! ఇటు !" అనినాడు.

పౌండ్రకునకు నేమియో ఆవేశించినట్లైనది. అతడు నిలిచినచోటున నిల్వలేకపోయినాడు. తన్ను తాను సంబాళించుకొనలేకపోయినాడు.

"సుదక్షిణే."

సుదక్షిణ భయపడినది. మహారాజు "తల్లీ ! ఇటు ! ఇటు!" అనుచున్నాడు. శ్రీకృష్ణబలరాములు కక్షపాలలను బిక్షను స్వీకరించుటకుగా పట్టుకొన్నారు. పౌండ్రకుడు మదించిన అడవి ఏనుగువలె ఫీంకరించి, దాని తొండమువంటి హస్తముతో సుదక్షిణహస్తములలోని వంటకములను చెదరగొట్టినాడు. మహారాజు "అహో హత !" అని కుప్పకూలిపోయినాడు.

సుదక్షిణ "అయ్యో" అని ఆక్రోశించినది.

శ్రీకృష్ణ బలరామదేవుల నేత్రములు ఎఱ్ఱ తామరపూవులవలె కోపములు విరిసినవో ! సుదక్షిణ శ్రీకృష్ణదేవుని పాదములపై పడినది.

"భగవన్ ! నేను అస్వతంత్రురాలను. దీనను. నన్ను రక్షించునదిగా వేడుచున్నాను. అని తన అశ్రువులచేత శ్రీకృష్ణదేవుని పాదముల నభిషేకించినది.

భగవంతుడు ఆమెను చేతులలోనికి తీసుకొనినాడు.

పౌండ్రకుడు మరియు వికటముగా అట్టహాసము చేసినాడు.

"మహారాజ ! ఈమె నీ కుమార్తె ! నాకు కాబోవు భార్య ! వీడో ఆభీరుడు. ఆమెను స్పృశించుచున్నాడు." అనినాడు.

భగవంతుడు సుదక్షిణ స్వస్థముగ నిలుచుండునట్లుగా చేసినాడు. పౌండ్రకునిదిక్కు మరల హాసము చేసినాడు. పౌండ్రకు డనుకొనినాడు: "ఇతనికి ఎన్ని యన్నను కోపము రాదువలె ఉన్నది. ఎప్పుడు మందహాసమునే చేయును. మరియు నా మందహాసము సురకత్తిని విసరినట్లుండును."

భగవంతుడు సుదక్షిణదిక్కయినాడు.


"భగినీ."

"భగవన్."

"నీవు దుఃఖించకు. నీ ముఖమును చూచి వీనిని వదిలినాను. మరియు నేను బ్రహ్మచర్యవ్రతదీక్షితుడను. వటువును. అందుచేతగూడ వీనిని వదలినాను. ఇతడు ఏ దినమున నన్ను నా వేషముతో యుద్ధమున కాహ్వానించునో, ఆ దినమున అతడు అతడుకాదు. అంతదనుక, నీ మంగళసూత్రమునకు జరుగు నపకారము లేదు."

అని శ్రీకృష్ణదేవుడు బలరామదేవుడు వెంటరా రాజమందిరమును విడిచి చనెను.

అందరును ఆ చనిన దిక్కే ఆశ్చర్య దృక్కుల చూచుచు నుండిపోయిరి. (సశేషం




గళ్లనుడికట్టు - 91

అడ్డం

1. శత్రువు అరికాలు మంటకి మూడవ భాగం!
3. ప్రయోగమా ? వాడు కల గంటున్నాడా ?
5. నై ఖరి, వాలక మునుపే కనిపెట్టాలి.
8. ఉప్పు !
9. స్త్రీ.
11. పిడత ముందు వాడే ఒక పదం.
12. తిరగబడిన గీతము.
15. మత్తు.
17. పిండికి ఇది అవసరం ! ముందు శ్రీ శబ్దం కూడా ఉన్నది.
18. ముదుసలి.
19. 13 నిలువులో వర్ణశాల.
20. తండ్రి తండ్రి తల్లి తండ్రి వంటి వాడే !
21. పెనంమీద వేసి తీసేది కాని తిరగబడి ఉంది !
23. కృష్ణాజిల్లాలోకల్లా పెద్ద వూరు, పాత పేరు.
24. తలక్రిందులయిన వాద్యవిశేషం.
26. బరువు.
28. నాలుగు చక్రాల బండి తిరగబడింది ! పొగరా ?
29. —వరక, అంటారు.
31. ఒకరకం పొలం. ఎవరిచేత నున్నది ? వెతికి చూడండి.
33. కొలనులు.
34. దూరంకాదు !
35. పతనమవు !

90-వ గళ్లనుడికట్టుకు జవాబు



నిలువు

1. ఒడలిక.
2. 31 అడ్డంలో సగం, ధాన్యం.
3. ఇందులో కావలసినంత గడ్డి !
4. స్వప్నమే !
5. వర్షము.
6. ఉన్న శబ్దం పావురం, నెమలి, కోకిలకూడా !
7. ఖండము.
10. గురి.
13. ఇరవై అయిదు.
14. చెక్క పరికరం.
16. ఈ సంచిక 31 పేజీలో శీర్షికలో సగం తలక్రిందు లవటంలో ఆశ్చర్యం లేదేమో !
19. గడ్డపార పిడిలలో జాగ్రత్తగా చూస్తే మేఘము.
20. సుత్తి ! (తాడనము ఘనమని వెతికి చూడండి)
22. అల, మారని వానిలో వస్తువులు దాచ వచ్చుట !
23. గౌరవము. వాడుకలో మాత్రం ఇస్తే వద్దనటం.
25. వీరపురుషుడు కాడు. వ్యక్తిత్వం తీసేస్తే వియ్యంకుడు మాత్రమే !
27. పుత్రుడు.
28. సుగ్రీవుని భార్య !
29. ఎన్నో !
30. కదలము; ముందు కథ కావాలి!
31. వరిలో సగం మార్చినా సస్య విశేషం వచ్చి తీరుతుంది !
32. మత్స్యము.

★

"నిన్ను నమ్మిన జనాన్ని నీవు ఎట్లా మోసగించగలిగావు" ఒక నాయకుణ్ణి న్యాయమూర్తి ప్రశ్నించాడు.

"నమ్మనివారిని మోసగించ లేముకదండీ!" నాయకుడు తొణకకుండా సమాధానం చెప్పాడు.

ఎస్. ఆర్. గోపాలం (నంద్యాల)

న్యూఢిల్లీ లేఖ

7-వ పేజీ తరువాయి

మీదకు వచ్చి వక్తతో కలసి—అతడు మంత్రి అయితే చెప్ప నవసరమే లేదు—ఫొటో తీయించుకో వాలని ఉబలాట పడతారు.''

ఈ పరిస్థితికి చాలావరకు పత్రికలే కారణమని చెప్పవలసివస్తున్నందుకు విచారంగా ఉన్నది. భారతదేశంలో గత ఐదు సంవత్సరాలుగా మాట వరుసకు ఏ సహాయ మంత్రి—పార్లమెంటులోను, బయట కూడా—చేసిన ప్రసంగాలన్నైనా సరే పుస్తక రూపంలో ప్రచురిస్తే దానినిండా పరస్పర విరుద్ధమైన ప్రకటనలు కనబడుతాయి! ఈ సంగతి ఎలా ఉన్నా మంత్రులకు ఏ ప్రజాస్వామిక దేశంలోనూ భారతదేశంలో లభిస్తున్నంత ప్రచారం లభించదు. ఈ జాడ్యం ఎంతగా ప్రబలిపోయిందంటే, ఆఖరికి కోర్టు విచారణలో ఉన్న కేసులను గూర్చి వ్రాసినా, విలేఖరులు మేజిస్ట్రేట్‌కు సాధ్యమైనంత ఎక్కువ ప్రచారం చేసిపెడుతున్నారు.

శ్రీ టి. టి. కృష్ణమాచారి లోక్‌సభకు పోటీ లేకుండా ఎన్నికయ్యారని తెలిసిన తరువాత కొన్ని బొంబాయి పత్రికలు అనుసరించిన వైఖరిని పరిశీలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. అసలు శ్రీ కృష్ణమాచారి అభ్యర్థి పత్రం దాఖలు చేయగానే ''షేర్ మార్కెట్'' లో కొద్దిగా మాంద్యం వచ్చిందని ఈ పత్రికలు వక్కాణించాయి. ఆయన ఎన్నికయ్యారని తెలిసేసరికి ఆ మాంద్యం ఎక్కువైందట. ఈ లెక్కన టి. టి. కె. మంత్రి అయ్యేనాటికి షేర్ మార్కెట్ మూతపడవచ్చునేమో కూడా తెలియదు! పత్రికలు ''వ్యాపార రంగంలో ఉండిపోయాయి'' ని ప్రధాన మంత్రి చేసిన వ్యాఖ్య సవ్యమైనదే నని ఈ పత్రికల వైఖరి ధృవపరుస్తున్నది. కేంద్ర మంత్రివర్గంలో వ్యాపార రంగానికి శ్రీ టి. టి. కె. కంటె ఎన్నో రెట్లు ప్రమాదకరమైన మంత్రులు ఉన్నారు. ఆయన మంత్రిగా రాకపోతే భారతదేశంలో పారిశ్రామికాభివృద్ధే సాధ్యమయ్యేది కాదనటం అసంగతంగా కనిపిస్తుంది. విదేశీ ద్రవ్యం లోటు ప్రప్రథమంగా ఆయన వల్లనే ఏర్పడింది.

* * *

కాశ్మీర్ సమస్యపై మళ్ళీ సమితిలో చర్చ లేవదీయాలని పాకిస్తాన్ ప్రయత్నిస్తున్నది. భారతదేశం ఈ ప్రయత్నాన్ని ప్రతిఘటిస్తోంది. ఈ పొరుగు రాజ్యాలు రెండూ ఏదోవిధంగా ఒక అంగీకారానికి రావాలని పాశ్చాత్యదేశాలు ఆశిస్తున్నాయి. అందుకనే శ్రీ కెన్నెడీ, భారత — పాకిస్తాన్‌కాలువ నీటి వివాద పరిష్కారానికి తోడ్పడిన శ్రీ యూజీన్ బ్లాక్ సహాయం ఈ సందర్భంలో కూడా పొందవలసిందని ఉభయదేశాలకు సూచించారు. ఈ సూచనను భారతదేశం తిరస్కరించింది.

కాలువ నీటివివాదం ఎలా పరిష్కారమైందో పరిశీలిస్తే శ్రీ కెన్నెడీ సూచన ఉచితానుచితాలు తెలుస్తాయి. పాకిస్తాన్‌లోని కాలువలను ఒక దానితో ఒకటి కలిపేందుకు పాశ్చాత్యరాజ్యాలు ధనసహాయం చేశాయికాబట్టే ఆ వివాదం పరిష్కారం అయింది. అదేవిధంగా ఈ వివాదంలోకూడా ఆ దేశాలు పాకిస్తాన్‌కు తోడ్పడాలంటే, కాశ్మీర్‌కు బదులు ఇతర్రా భూభాగాన్ని ఇవ్వలేవుకదా! ఒకవేళ ఉభయదేశాలు శ్రీ బ్లాక్ మధ్యవర్తిత్వానికి అంగీకరించటం అంటూ జరిగితే, తమతమ అధీనంలో ఉన్న కాశ్మీర్ భూభాగాల సరిహద్దులను తిరిగి సవరించుకొనవలసిందని రెండు దేశాలను ఆయన కోరుతాడు. ఇప్పుడీ భూభాగాలకు నిర్యుద్ధరేఖ ఎల్లగా ఉన్నది. పై సర్దుబాట్లు చేసుకునేందుకు ఉభయదేశాల ప్రతినిధులు ముఖాముఖి చర్చలకు పూనుకోవాలన్నా, లేక శ్రీ బ్లాక్ మధ్యవర్తిత్వం క్రింద చర్చలకు సిద్ధం కావాలన్నా ఎవరి ఆధీనంలో ఉన్న భూభాగం వారికే చెందుతుందనీ, కాశ్మీర్‌లోయ ప్రతిపత్తిని యధాతధంగా ఉంచుతామని ముందుగా అంగీకరించాలి. ఏదోవిధంగా కాశ్మీర్ లోయను కైవసం చేసుకోవాలనే ఉద్దేశంతోనే పాకిస్తాన్ ఈ సమస్యను ఇప్పుడు తిరగతోడుతున్నది కాబట్టి పై షరతులకు అంగీకరించదు.

ఇకపోతే ''జనవాక్యం'' గురించి పూకదంపుడు ప్రసంగాలు చాలా వినవస్తున్నాయి. సమితి తీర్మానం ''జనవాక్యం'' తెలుసుకునేందుకు మూడు ప్రధానమైన షరతులు విధించింది. పాకిస్తాన్ తన దురాక్రమణను ఉపసంహరించుకోవాలనీ, కాశ్మీర్‌లో పాకిస్తానీ దండయాత్రకు పూర్వం ఉన్న పరిస్థితులను పునరుద్ధరించి ఒకసంవత్సరం వేచిఉండాలనీ, ఆతరువాత అత్యవసరపరిస్థితిని ఎదుర్కొనేందుకు మాత్రమే తగినంత సైన్యాన్ని ఉంచి, మిగతాసైన్యాన్ని భారతదేశం ఉపసంహరించుకోవాలనీ సమితి స్పష్టంచేసింది. అంతేకాక జనవాక్య సేకరణకు ముందుగా ఉభయదేశాలలో ఏదీకూడా మతప్రచారంకాని, తదితరమైన ప్రచారంకాని చేయకూడదనికూడా ఆదేశించింది.

ఈ మూడు షరతులలో మొదటి రెండింటినీ అమలు చేయకుండానే పాకిస్తాన్ జనవాక్యం సేకరించలేదని భారతదేశంమీద అభాండం వేస్తున్నది.

* * *

శీతాకాలం ప్రారంభమైనప్పటినుండి విదేశీ అధినేతలు ఒకరి తరువాత ఒకరు భారత రాజధాని నగరాన్ని సందర్శించడానికి వస్తున్నారు. ఈ అధినేతలకోసం ఇప్పుడొక కార్యక్రమం ఏర్పాటైంది. ఎప్పటికప్పుడు ఆయా దేశాల జెండాలు ఎగురవేసేందుకు కేంద్ర పబ్లిక్‌వర్క్సుశాఖలో ప్రత్యేక విభాగం ఒకటి ఉన్నది. వచ్చిన విదేశీ అధినేతకు విమానాశ్రయంలో స్వాగతం చెప్పి, మోటారు కారులో వూరేగిస్తూ రాష్ట్రపతిభవనానికి తీసుకువస్తారు. ఆమర్నాడు ఆయన గాంధీజీ సమాధిమీద పుష్పగుచ్ఛం ఉంచుతాడు. అటుతరువాత రాష్ట్రపతిని, ఉపరాష్ట్రపతిని, ప్రధానమంత్రిని కలుసుకొని చర్చలు జరుపుతాడు. ఈలోగా ఆయన గౌరవార్థం రాష్ట్రపతిభవనంలో విందుజరుగుతుంది. పౌరసన్మానంతో అధినేత కార్యక్రమం సమాప్తమవుతుంది. ఈ సన్మానసభలో నగరపాలక సంఘాధ్యక్షుడు ఆయనకేదో ఒక కానుక ఇచ్చి గౌరవిస్తాడు.

విదేశీ అధినేతల రాకవల్ల యాత్రిక సదుపాయాల శాఖ డైరెక్టరు జనరల్, ప్రభుత్వోద్యోగులు అధికంగా లాభం పొందుతున్నారు. అంతర్జాతీయ సంప్రదాయాన్ని అనుసరించి భారతదేశంలో మూడురోజులకు మించిఉన్నవారందరూ యాత్రికుల లెక్కలోనే చేరుతారు. ఈ కొలమానాన్ని బట్టి చూస్తే గతసంవత్సరం మనదేశానికి వచ్చిన బ్రిటిష్ రాణిని, న్యూఢిల్లీలో జరిగిన వివిధ అంతర్జాతీయ సభలకు హాజరైన వందలాది ప్రతినిధులను యాత్రికుల జాబితాలోనే చేర్చవలసి ఉంటుంది. నిజానికి ఈఏడు యాత్రిక సదుపాయాలశాఖ అదృష్టం పండిందనే చెప్పాలి. ప్రవాహంలాగ విదేశీఅధినేతల ఆగమనం, సభలు, సమావేశాలు, పారిశ్రామిక ప్రదర్శనం ఇందుకుతోడ్పడ్డాయి. యాత్రికులను విరివిగా ఆకర్షించడానికని చెప్పిపెద్దకార్లు దిగుమతి చేసుకొనడంలో జరిగిన కుంభకోణం ఇంకా బయటపడలేదు. రైళ్ళలో ప్రయాణంచేసే యాత్రికులు ఖద్దరుశాలువాలే కప్పుకోవాలనీ, గోమాంసం మద్యం ముట్టుకోరాదనీ ప్రభుత్వం నియమ నిబంధనలు విధించినా, హిందూస్తాన్ ఎంబాసిడర్ కార్లలో తిరగవలసి వస్తుందంటే మన దేశానికి యాత్రికు లెవ్వరూ రారని వాదించి యాత్రికుల సదుపాయాలశాఖ అమెరికానుంచి పెద్ద కార్లు దిగుమతి చేసుకోగలుగుతున్నది!

యాత్రికుల సదుపాయాలశాఖ డైరెక్టర్ జనరల్ ఏదోవిధంగా తంటాలుపడి ఏటా ఒకసారైనా విదేశాలకు వెళ్ళివస్తున్నాడు. 1961లో ఆశాఖ మంత్రి ఈయన చలాకీతనాన్ని గుర్తించి యూరప్ ప్రయాణం మాన్పించారు. ఆవెంటనే డైరెక్టర్ జనరల్ పుట్టకురుపుతో బాధపడుతున్నట్లు ఆయన అభిమానులైన వైద్యులకు అనుమానం కలిగింది. ఇకనేమి! హుటాహుటిని ఆయనను యూరప్‌కు పంపేశారు. కాని భారతదేశం అదృష్టం బాగుండబట్టి బ్రిటిష్ వైద్యులు ఆయనకొచ్చిన ప్రమాదమేమీ లేదని ధృవపరిచారు. ఒకప్పుడు ఆలిండియా రేడియోలో అనామకుడుగా ఉన్న ఈ పెద్దమనిషి రవాణాశాఖలో సంయుక్త కార్యదర్శి పదవికి ఎలా ఎగబ్రాకాడో పరిశీలిస్తే, త్వరలోనే ఈయన మంత్రికావచ్చునని ఆశించినా తప్పులేదు. శ్రీ హుమయూన్ కబీర్‌కూడా ఇలావచ్చినవారేకదా!

సచివాలయం ఉద్యోగులు పొందే లాభం మరొక రకమైనది. విదేశీ అధినేతలు వచ్చినప్పుడల్లా వీరిలో చాలా మందికి సగంరోజు సెలవు లభిస్తుంది. అంతా ఊరేగింపు చూడటానికి వెడతారు. జనాన్ని పోగుచేసుకువచ్చి, ఆ అధినేతలకు స్వాగతం చెప్పవలసిన బెడద ప్రభుత్వానికి తప్పుతుంది. దారిపొడుగునా బారులుతీరి జనం ఫలానా అధినేతకు స్వాగతం చెప్పారనివార్తా పత్రికలు ప్రముఖంగా ప్రచురిస్తాయి. అంతా సవ్యంగానే జరిగిపోతుంది. ఎటూ నష్టపోయేది పన్నుచెల్లింపుదారుడుమాత్రమే. ★

యువ ప్రపంచం

కాలేజీ చదువులు : కొన్ని అపవాదులు

ఈ రోజులలో కాలేజీ కుర్రాళ్ళంటే సంఘంలో ఓ నిరసనభావం బయలుదేరింది. పత్రికల్లోనూ కథల్లోనూ సినిమాల్లోనూ కాలేజీలో చదివే కుర్రాడంటే రాలుగాయి తిరుగుబోతూ వదరుబోతుగా చిత్రిస్తున్నారు. కాలేజీలో చదువుతూవున్నంత మాత్రాన అసభ్య ప్రవర్తన గలవాణ్ని గానో లేక రౌడీ గానో దృష్టిలో వుంచుకుని చూస్తారు. అలా అయితే అందరూ ఒక్కలాగే ఉంటారా? కుర్రకారంటే కాస్త హుషారుగావుండాలి. సాధారణంగా విద్యార్థిదశలో చీకూ చింతా లేకుండా కాలం గడుపవలసిన సమయం. అలా అంటే చదువుసంధ్యలు వదిలేసి మరీ తిరగటం అనికాదు. ఎప్పుడూ ముఖం మాడ్చుకొనో లేక దేన్నో పోగొట్టుకున్న వాడల్లేనో కూర్చోటం పనికిరావు. అలావుంటే అందరు అతన్ని ముచ్చు అనో సన్యాసనో అనేస్తూ వేళాకోళం పట్టిస్తారు. ఇలాంటివాళ్లు బహుశ పెద్దల మన్ననలను పొందవచ్చునేమో !

"ఎంచక్క చదువుకొంటున్నాడు, ఎవరి జోలీ లేకుండా" అని కొందరు మెచ్చుకోవచ్చు. కాని అలావుండీ కృతార్థులు కాలేకపోయినవారు చాలమందున్నారు ఉల్లాసంగా తిరుగుతూ పుస్తకం ముఖం చూడకుండా వున్న వాళ్లెందరో పాసవుతూ ఉన్నారు.

ఈ వయసులో కాకపోతే ఎప్పుడు ఉల్లాసంగా ఉండాలనో వీళ్ళ అభిప్రాయం? అలా అని విచ్చలవిడిగా తిరుగుతూ చదువు చట్టుబండలుచేసి డబ్బు ఖర్చుపెడుతూ తిరగటం మాత్రం తగదు.

ఉత్సాహంగా ఉంటూ, తింటూ, తిరుగుతూ "విద్యార్థి" అనే పదానికి పూర్తి న్యాయం కలుగజేసినప్పుడే విద్యార్థి బాధ్యత పూర్తవుతుంది.

కాలేజీలంటే ప్రేమపక్షుల గూళ్ళు అని ఈ రోజుల్లో అందరూ అభిప్రాయపడుతున్నారు. ఇంటిదగ్గర్నుంచి బాగా డబ్బు తెప్పించుకొని ధారాళంగా ఖర్చుపెడుతూ సిగరెట్లు తగలేస్తూ ప్రేమాయణంలో పడి గిలగిల్లాడుతున్నారనీ కలియుగం అన్న పేరు ఇప్పుడే సార్థకమవుతున్నదనీ, ఇలా వుంటే ప్రళయం రాకేం జేస్తుందనీ వేదాంతులు చెప్పే ముసలివారు చాలా మందున్నారు. వాళ్ళ వయస్సులో అనుభవాల్ని గురించి నెమరు వేసుకుంటూ తాము చెరువుగట్టుమీద నుంచుని చెరువుకు వచ్చే ఆడవాళ్ళను ఎలా తిప్పలు పెట్టారో చెబుతూ ఉంటారు. అప్పుడు వాళ్ళు చేసిందేమీ అల్లరి కాదు. ఇప్పుడు కుర్రాళ్ళు కాలర్లు పైకి లేపుకుని విజిల్సు వేస్తూ బజార్లంట కోరచూపులు చూస్తూ తిరుగుతున్నారనీ పిదప కాలపుబుద్ధులనీ వారు కడతేరే మార్గం అసలు లేదనీ వాదిస్తూ ఉంటారు.

కాబట్టి ఈ అపవాదు తప్పించవలసిన బాధ్యత విద్యార్థులుగా ఉన్న మనమీదనే ఉంది. అందరూ ప్రయత్నించి జాగ్రత్తగా నడుచుకుంటే కొంతవరకైనా ఈ అపవాదు నుంచి తప్పుకునే అవకాశం ఉంది. ఎంతమంది ఈ అవకాశాన్ని వినియోగించుకుంటారో చూద్దాం!

"శ్రీకుమార్"

(అరగొండ)

* * *

విద్యార్థులకు శాస్తి

శ్రీ పాంచజన్యంగారి అభిప్రాయాలతో నేను పూర్తిగా ఏకీభవిస్తాను. (నేనూ వారి స్థితిలోనే ఉన్నాను.)

వారు చెప్పినట్లుగా సప్లి అంటె ప్రతి విద్యార్థికి చాలా "చీప్" అయిపోయింది. విశ్వవిద్యాలయాల్లో, కాలేజీల్లో రూల్సు విధానాలు అన్నీ ఎప్పటినుంచో అమలులో ఉన్నయ్యి. ఇంతవరకు ఎంతమంది చదువుకోలేదు? అట్లాంటివి యిప్పుడు కష్టమైపోయినయ్యా? బాధ్యతలు తెలిసిన పెద్దవారు, తండ్రులుకూడ విద్యార్థులనే సమర్థించటం చాల శోచనీయం. ఇదంతా చూస్తూఉంటె ప్రతి విషయంలో నియంతృత్వ పరిపాలన వస్తేనే బాగుండేట్టుంది. విశ్వవిద్యాలయాలకి సర్వాధికారాలు యిస్తే విద్యార్థులు యిహ కిక్కురుమనరు.

కస్తూరి రాధాకృష్ణమూర్తి, (గుంటూరు.)

* * *

పత్రికల బాధ్యత

శ్రీ పాంచజన్యంగారు "సంఘానికి ఏమైనా సహాయం చెయ్యదల్చుకుంటే తప్పయినా ఒప్పయినా విశ్వవిద్యాలయ అధికారుల తరఫున మాట్లాడాల"ని శ్రీ కౌండిన్య గార్కి సలహా ఇచ్చారు. ఈ సలహా నాకు చాలా ఆశ్చర్యాన్ని కల్గించింది. సంఘంలో ప్రతివ్యక్తికి తన కష్టాల్ని పై అధికారులకు చెప్పుకుని దాని నుండి విముక్తిపొందే అధికారం ఉంది ఆ వ్యక్తి 'విద్యార్థి' అయినా "ఉపాధ్యాయుడు" అయినా ఇద్దరూ సమానమే. ఇటువంటి విషయాల్లో 'పత్రికలు' నిష్పక్షపాతంగా వ్యవహరించి 'తప్పును తప్పుగా' చూపటం ఎంతైనా అవసరం.

"మనదేశం బాగుపడాలంటే అసలు విద్యార్థులు ఒకసారి తప్పితే మరల పరీక్షలకు కూర్చోనివ్వరాదు" అనే సలహాను కూడా పాంచజన్యంగారు తమ వ్యాసంలో పేర్కొన్నారు. ఇప్పటకే నూటికి పదిమందైనా చదువుకున్న వారు లేని మనదేశంలో పై సలహా పాటిస్తే దేశం ఎంత బాగుపడుతుందో వేరే చెప్పనక్కర్లేదు. 35 మార్కులైనా తెచ్చుకోలేని విద్యార్థుల్ని చదువు మానుకోమని సలహా ఇచ్చేకన్న '35 మార్కులుకూడా తెచ్చుకోలేని విద్యార్థుల్ని' తయారుచేస్తూన్న విశ్వవిద్యాలయాల కృషి చాలదని చెప్పటం సమంజసంగా ఉంటుంది.

ఐదు సంవత్సరాల క్రితంవరకూ "విద్యార్థి"గా ఉండి, ఇంకా చదువుకోవాలనే వాంఛకూడా కలిగిఉన్న "వ్యక్తి"కి తమపట్ల సానుభూతి లేనందుకు నిజంగా విద్యార్థులు "సిగ్గు" పడవలిసిందే.

ఏది ఏలా ఉన్నా 'ప్రభుత్వం' మధ్యవర్తిత్వం జరిపి ఏదోవిధంగా త్వరలో ఈ సమస్యను పరిష్కరిస్తారని నా నమ్మకం.

ద్వి. నా. మూర్తి (హైదరాబాదు.)

కవరుపైన 'యువ పపంచం' శీర్షికకు అని స్పష్టంగా వ్రాయాలి

సహనశీలి

ఒక ప్రొఫెసరుగారు శాంతం, సహనం అలవరుచుకోవలసిన అవసరాన్ని విద్యార్థులకు బోధ పరుస్తున్నాడు. "శాంతం సహనం అనేవి మన మనస్థితిపై ఆధారపడి ఉంటాయి. ప్రతి చిన్న విషయానికి కోపం తెచ్చుకోటం మంచిది కాదు. ఉదాహరణకు నన్నే తీసుకోండి! ఇప్పుడు నా ముక్కుమీద ఒక ఈగవాలింది. వాలిందికదా అని ఆవేశపడి దాన్ని నలిపివేస్తున్నానా? పట్టించుకోకుండా వూరుకుంటే దానంతట అదే వెళ్ళిపోతుంది"–

ఈ మాటలు చెబుతూనే ప్రొఫెసరుగారు ఎగిరి గంతేసి "అయ్యో బాబోయ్ చచ్చాన్రా! ఇది మామూలు ఈగకాదు తేనెటీగరా" అంటూ పొలికేకలు పెట్టాడు.

బి. బి. సుందరరామయ్య (హైదరాబాదు)

*   *   *

చమత్కారం

సాంబయ్యగారు ఆ సభలో గుక్కతిప్పకోకుండా ఉపన్యాసం చెబుతుంటే శ్రోతలు గుడ్లప్పగించి వింటున్నారు. వెనక కూర్చున్న ఒక యువకుడు మాత్రం మధ్యమధ్య కుక్కల్ని, పిల్లుల్ని స్ఫురింపజేస్తూ గల్లంతు చేస్తున్నాడు. ఇది గమనించిన సాంబయ్యగారు ముఖం చిట్లించి ఇలా అన్నారు: "నా చిన్నతనంలో మా నాన్నగారు నాకో కుక్కను బహుమతిగా ఇచ్చి, జాగ్రత్తగా చూసుకోమని మరీ మరీ చెప్పారు. నాకూ అదంటే సరదాగా ఉండేది. రోజూ దానితో ఆడుకుని సాయంత్రం పూట ఒక చోట కట్టేసేవాణ్ణి. ఒక రోజున అది ఎలా తప్పించుకుపోయిందోగాని, వెళ్ళి ఒక కారు క్రిందపడి చచ్చిపోయింది. మా నాన్నగారు చాలా విచారపడి, "దాని చావుకు నువ్వే కారణం; నువ్వు బ్రతికివున్నంతవరకు పిశాచమై నిన్ను వేధిస్తుంది" అని నన్ను మందలించారు. ఆయన చెప్పింది నిజమేనని ఇప్పుడు నాకు తెలిసివచ్చింది."

సాంబయ్యగారు ఈ కథ చెబుతూ "చూడండి ఆ పిశాచం మీ వెనకే కూర్చున్నది" అని చూపించి ముగించారు.

ఎస్. మాధవరావు, (బొంబాయి).

*   *   *

సానుభూతి

ఇద్దరు ఇంగ్లీషు బాలురు ఒకేసారి ఈటన్ స్కూల్‌లో చేరారు. చూచీ చూడటంతోటే ఒకరిపొడగు ఒకరికి గిట్టలేదు. పెరిగి పెద్దవాళ్ళయిం తరువాత కూడా వారిలో ఆ ద్వేషం అట్లాగే నిలిచిపోయింది.


ఏళ్లు గడిచాయి. వాళ్ళలో ఒకడు నౌకాదళాధికారి అయ్యాడు. రెండవవాడు చర్చికి అధికారి అయ్యాడు. ఒకరోజున ఇద్దరూ ఒక రైల్వేస్టేషన్‌లో కలుసుకున్నారు.

నౌకాదళాధికారికోటునిండా పతకాలు ధరించి ఠీవిగా నుంచున్నాడు. చర్చి అధికారి అతడి దగ్గరగా వచ్చి "స్టేషన్‌మాస్టరుగారూ! ఇప్పుడు వచ్చే రైలు లండన్ ఎన్ని గంటలకు చేరుతుందంటారు?" అని కొంటెగా ప్రశ్నించాడు.

"ఇరవైనిమిషాలలో చేరవచ్చునమ్మా! అయినా మీ రీస్థితిలో ప్రయాణం చేయడమేమిటి?" అని మర్యాద ఒలకబోస్తూ నౌకాదళాధికారి తడుముకోకుండా సమాధానం చెప్పాడు.

కె. వి. ఎస్. (మద్రాసు)

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press 6 & 7 Thambuchetty Stree Madras-1. Chief Editor: S. Sambhu Prasad,



మైసూరు రాష్ట్ర శాసన సభాభవనం

Regd No. M 4479 ANDHRA SACHITRA VĀRA PATRIKA